ఆదివారం
ఆంధ్రజ్యోతి

4 మార్చి 2012


• హ్యాపీడేస్ : వీరభద్రమ్  • ఈ వారం కథ : 'గలుబె'

# ఇది మా ఊరు..













## రానా 'ఇష్టం'

రానా, జెనీలియా జంటగా నటిస్తున్న చిత్రం 'నా ఇష్టం'. రానాని ఓ కొత్త లుక్‌తో పరిచయం చేస్తున్నాడు దర్శకుడు తోలేటి ప్రకాష్. రానాకి ఇది ఫస్ట్ లవ్‌స్టోరీ. జెనీలియా పెళ్లి తర్వాత విడుదలౌతున్న తొలి చిత్రం కనుక జెనీలియా ఈ చిత్రంపై భారీ ఆశలే పెట్టుకుంది. లెక్కల మాస్టారినించి దర్శకుడిగా మారిన సుకుమార్ దగ్గర పనిచేసిన తోలేటి ప్రకాష్ కూడా మాథ్స్ లెక్చరరే. ఈయన లెక్క తప్పకపోతే జెనీలియాకు ఇది పెళ్లి బహుమతి, రానాకు సక్సెస్‌ఫుల్ లవ్‌స్టోరీ అవుతుంది.



ఆదివారం ఆంధ్రజ్యోతి
4 మార్చి 2012

## ఇన్‌డెక్స్


బ్లాగోతం ................ 6
నా తర్రై

చరిత్ర పర్యాటకం ......... 9
'లాంకో'లో రామాలయం

సలాడ్ ................ 14
రియాలిటీ పాఠాలు

వంటశాల .............. 22
బ్రొకోలి

ఈ వారం కథ ........... 23
'గ లు బె'

కేరింత ............... 30
వేలిముద్రల తుపాకి



కవర్ స్టోరీ ............. 17
ఇది మా ఊరు



జ్ఞాపకాలు .............. 32
కుచలకుమారి


'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారం లోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.comకి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

## నోరూరించే టూనా

టూనా చేప గురించి చదువుతుంటేనే నోరూరింది. మన వాళ్ళకు దాని రుచి గురించి బాగా తెలియకపోవడం వల్లనే జపాన్ వాళ్ళు ఎగరేసుకుపోగలుగుతున్నారేమో. మన దేశానికి మూడువైపులా సముద్రం ఉంది కాబట్టి ఇంకా చాలాచోట్ల కూడా దొరుకుతుందేమో అన్వేషిస్తే మంచిది. తక్కువ రేట్లకి మనమందరమూ కూడా కొని తినొచ్చు.

– నాగార్జునరెడ్డి, ఒంగోలు

## బ్లాగోతాలు సూపర్

'బ్లాగోతం'లో వచ్చిన 'వైద్యం-చోద్యం' చాలా చమత్కారంగా ఉంది. నవ్వుల బాంబుల్ని పేల్చింది. నేడు మనం చూస్తున్న ఎన్నో సమస్యలపై ప్రతివారం ఇంకా మంచి మంచి బ్లాగోతాలు ప్రచురించండి.

– టి.ఎస్. కృష్ణమోహన్, శ్రీకాకుళం

## నిజ జీవిత కథే



'తూర్పు మండపం' కథలో పక్కీరప్ప పాత్ర బాగా నచ్చింది. సాన మిషన్ గురించి అందరూ మరిచిపోయిన కాలంలో ఆ వృత్తిని గుర్తు చేస్తూ దాని కష్టాల గురించి కూడా రాశారు. అది కథలా కాకుండా నిజ జీవితంలా అనిపించింది. ఇలాంటి చిన్న చిన్న వృత్తుల వాళ్ళ మీద గంగాధర్‌గారు మరిన్ని కథలు రాయాలని కోరుతున్నాను. తప్పు చేయకపోయినా చిన్న చిన్న వాళ్ళ మీద వృత్తి ప్రభావం ఎలా పడుతుందో కళ్ళకు కట్టినట్టు చూపించారు.

– సుదీర్ఘ, కొత్తగూడెం

## నాగమ్మ @ తెలంగాణ

నాగమ్మ తెలంగాణకు చెందిన మహిళ అని తెలిసి ఆశ్చర్యపోయాం. ఆమెకు ఆరవెల్లిలో నేటికీ గుడి ఉండడం, ఓరుగల్లులో పల్నాటి వీరగాథల ఉత్సవాలు జరగడం కూడా విశేషాలే. నాయకురాలు నాగమ్మ మీద మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.

– పక్కి రాధాగోపాలకృష్ణ, పర్లాకిమిడి

రాజారాం, జగిత్యాల

## బయటా హీరో అనిపించారు



రజనీకాంత్ గురించి కెఎస్ఆర్ దాస్ చెప్పిన విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి. సినిమాలోనే కాదు బయటా ఆయన హీరో అనిపించారు.



## ఇన్‌బాక్స్

బుకింగ్ క్లర్క్‌గా జీవితం ప్రారంభించి వందకు పైగా యాక్షన్ చిత్రాలకు దర్శకత్వం వహించే స్థాయికి ఎదగడమంటే మాటలు కాదు. అయినా తెలుగు సినిమా వజ్రోత్సవాలలో ఆయనకు తగు మర్యాద లభించకపోవడం చాలా దురదృష్టకరం. పరిశ్రమ తనను తానే ఇలా ఎందుకు అవమానించుకుంటుందో అర్థం కాదు.

– సి. విజయలక్ష్మి, నెల్లూరు

## వంటల వీడియోలు



వంటల వీడియోలను యూట్యూబ్‌లో పెట్టాలనే ఆలోచన బాగుంది. పెళ్ళయ్యేంతవరకు ఆడపిల్లలెవరూ వంట జోలికి వెళ్ళనపుడు, నేర్పించడానికి తల్లి గాని, అత్తగాని దగ్గర లేనప్పుడు ఏదో ఒక తరుణోపాయం ఉండాలి కదా. పైగా అబ్బాయిలు కూడా వంట నేర్చుకోక తప్పడం లేదు. కాబట్టి వంటింట్లో లాప్‌టాప్ పెట్టుకుని ఇద్దరిలో ఎవరో ఒకరు చేసేసుకోవడం మంచిదే. తెలుగు రుచులు కూడా వెంటనే యూట్యూబ్‌కి ఎక్కించెయ్యండి. వీలైతే సెల్‌ఫోన్లో కూడా లోడ్ చేసే ఏర్పాటు చేయడం మంచిది.

– శ్రీలక్ష్మి, హైదరాబాద్



## పొరపాట్లో అలవాటు



''అదేమిటే పంకజం, నిన్న ఫంక్షన్‌లో మీ ఆయన నీ కూడా తిరుగుతూ ప్రతి ఐదు నిమిషాలకోసారి నీ నెత్తిన నీళ్లు చిలకరిస్తున్నాడు? అదేం ఆచారమే? అక్కడ అడిగితే బాగోదని ఇవ్వాళ ఫోన్ చేస్తున్నా'' అడిగింది వనజాక్షి.

''ఆయన చల్లింది నా తలమీద కాదు – నా జడలోని పూలమీద. పూల కొట్లో కదా తను పని చేసేది'' నవ్వుతూ చెప్పింది పంకజాక్షి.

## అదీ సంగతి



''నా భార్య రాత్రుళ్లు నిద్ర పోవట్లేదు డాక్టర్, ఏదైనా మందు రాయగలరా?'' అడిగాడు సుబ్బారావు.

''నిద్రపోకుండా ఏం చేస్తుంటుందో కనుక్కున్నారా?'' కూపీ లాగాడు సైక్రియాటిస్టు.

''నేను బార్‌నుండి వచ్చేదాకా ఎదురుచూస్తూ ఉంటుంది'' చెప్పేడు సుబ్బారావు.

## దొంగొచ్చాడు!



రాత్రి సెకండ్ షిఫ్ట్ నుండి వచ్చిన భర్త ఇంట్లో కన్పించిన దృశ్యం చూసి నోరు తెరిచాడు. వెంటనే తేరుకుని ''నీకసలు బుద్ధుందా? దొంగని కూర్చోబెట్టి కాఫీ ఇస్తావా?'' కయ్యిమన్నాడు.

''ఆ తొందరపాటే పనికిరాదు మీకు. వీడు దొంగతనానికి వచ్చింది మన పక్కింటికట'' తాపీగా చెప్పింది భార్య.

# మిక్చర్ పొట్లం

పాఠకులకు ప్రత్యేకం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్‌రెడ్డి

## తేడా!



''పులికీ మేకకీ తేడా చెప్పగలరా?'' అడిగింది టీచర్ అలివేలు.

''పులి క్రూర జంతువు – మేక కూర జంతువు'' ఠపీమని చెప్పేడు టింకూ.

## గుణమే మారునా!



''వాళ్ల ఆఫీసులో పని చేసే టైపిస్టు వెనకాల మీ ఆయన తిరుగుతున్నాడనే అనుమానం అసలు నీకెందుకు వచ్చిందే?'' అడిగింది జలజ.

''గతంలో ఆ పోస్టులో నేను పనిచేసి ఉన్నాను కాబట్టి'' చెప్పింది వనజ.

## తిరగబడ్డ వాదన



''మీ క్లయింట్ తప్పు చేయలేదని ఇన్నాళ్లూ వాదిస్తూ వచ్చారు కదా. మరి ఇప్పుడేంటి అతను ఖచ్చితంగా నేరం చేసి ఉంటాడని అంటున్నారు?'' ఆశ్చర్యపోయాడు జడ్జి జగన్నాథం.

''4 నెలలుగా నా ఫీజు ఇస్తానిస్తానని ఎగ్గొడుతుంటే ఏం చేయమంటారు మరి?'' అసహనంగా బదులిచ్చాడు లాయర్ విశ్వనాథం.



# హోమియోలైఫ్

# డయాబెటీస్ / మధుమేహం



Dr.A.M.Reddy, MD

నవీన యుగంలో వయస్సు, లింగ-విచక్షణ లేకుండా రానురానూ మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగిపోతుంది. భారతదేశంలో, అందులోనూ ఆంధ్రప్రదేశ్‌లో వీరి సంఖ్య నానాటికి పెరిగిపోతుంది. "మధుమేహం" లేదా "డయాబెటీస్" వ్యాధికి కారణాలు అనేకం ఉన్నాకానీ మానసిక ఒత్తిడి, ఆందోలన, మనోవ్యాధులు వంటి మానసికమైన కారణాలు ప్రధానంగా ఉండడమే గణనీయంగా పెరిగిపోతున్న వ్యాధిగ్రస్తులకు సూచనగా ఉంది. ఖచ్చితంగా చెప్పాలంటే "డయాబెటీస్" ఒక వ్యాధికాదు. ఇది ఒక మెటబాలిక్ డిసార్డర్, అంటే శరీరంలో జీవక్రియ సరిగ్గా జరగకపోవడం వలన రక్తంలో, మూత్రంలో చక్కెర శాతం పెరిగిపోవడం వలన ఏర్పడే స్థితి మాత్రమే. డయాబెటిక్ లక్షణాలైన అధిక మూత్రం, తీవ్రమైన దాహం, ఆకలి, శారీరక దౌర్బల్యం అన్నీ కూడా జీవక్రియ సరిగ్గా జరగకపోవడం వలన వచ్చేవే. దీనికి కారణం శరీరంలో "పాంక్రియాస్" అనే గ్రంధి నుండి వెలువడే "ఇన్సులిన్" అనే హార్మోన్ సరిగ్గా ఉత్పత్తి కాకపోవడం లేదా దానిని శరీరం సరిగ్గా వినియోగించుకోకపోవడమే.

ఇన్సులిన్ హార్మోన్ ఉత్పత్తి ఆధారం చేసుకొని డయాబెటీస్‌ను రెండు ప్రధాన రకాలుగా విభజిస్తారు.

1. డయాబెటీస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం లేదా పూర్తిగా ఆగిపోవడం జరుగుతుంది. దీనికి కారణం పాంక్రియాటైటిస్ వంటి ఇన్ఫెక్షన్ వలన లేదా ఆటోఇమ్యూనిటీ వలన పాంక్రియాస్ గ్రంధిలో బీటాకణాలు పూర్తిగా నాశనం అవ్వడమే. ఇన్సులిన్ ఉత్పత్తి నిలిచిపోవడం వలన శరీరంలో కార్బోహైడ్రేట్ మెటబాలిజమ్ దెబ్బతిని మనిషి స్పృహకోల్పోయి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అందువలన వీరిలోకి బయటనుండి ఇన్సులిన్‌ని ఇంజక్షన్ రూపంలో ప్రవేశపెడతారు. అందుకే ఈ రకం డయాబెటీస్‌ని "ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటీస్ మెల్లిటస్" **(IDDM)** అని అంటారు.

2. డయాబెటీస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి సరిగానే ఉన్నప్పటికి శరీరం దానిని సరిగ్గా వినియోగించుకోలేని పరిస్థితి. ఈ పరిస్థితినే ఇన్సులిన్ రెసిస్టెన్స్ అని అంటారు. ఇది సాధారణంగా ఊబకాయం ఉన్నవారిలో మద్యం సేవించేవారిలో శారీరక శ్రమలేకుండా స్థిరంగా ఉండేవారిలో ఎక్కువగా చూస్తూ ఉంటాము. వీరికి ఇన్సులిన్ బయటినుండి ఇచ్చే అవసరం ఉండదు కానీ రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రించే మందులను (యాంటీ-హైపర్ గ్లైసీమిక్ డ్రగ్స్) సూచిస్తారు. అందుకే దీనిని నాన్-ఇన్సులిన్ డిపెండెంట్ డయాబెటీస్ మెల్లిటస్ **(NIDDM)** అని అంటారు. అయితే వీరిలో కూడా షుగర్ లెవల్స్ టాబ్లెట్ల ద్వారా నియంత్రించ లేకపోతే ఇన్సులిన్ ఇంజెక్షన్ సిఫారసు చేస్తారు. స్త్రీలలో గర్భధారణ సమయంలో వచ్చి ఆ తర్వాత కూడా ఉండే డయాబెటీస్‌ని "జెస్టేషనల్ డయాబెటీస్" అని అంటారు.

డయాబెటీస్ వలన వచ్చే లక్షణాలే ఇబ్బందికరంగా ఉంటే దానివలన తలెత్తే కాంప్లికేషన్లు పేషెంట్‌ను మరింత కృంగదీస్తాయి. కొన్ని రకాల కాంప్లికేషన్లు అకస్మాత్తుగా, తీవ్రంగా వస్తాయి. షుగర్ లెవల్స్‌ని సరిగ్గా నియంత్రించకపోతే "డయాబెటిక్ కీటోఎసిడోసిస్" అనే సమస్య తలెత్తుతుంది. మందులు వేసుకొంటూ ఆహారం సరిగా తీసుకోపోతే చక్కెర స్థాయి తగ్గిపోయి "హైపోగ్లైసీమియా" తలెత్తుతుంది. శరీరమంతా చెమటలు రావడం, వణుకురావడం, విపరీతమైన నీరసానికి గురయ్యి కళ్ళుతిరిగి పడిపోవడం వంటి లక్షణాలు హైపోగ్లైసీమియాకి గురైన వ్యక్తిలో కన్పిస్తాయి. కొన్ని రకాల దుష్ప్రభావాలు దీర్ఘకాలంగా వేదిస్తుంటాయి. రక్తనాళాలలో వచ్చే మార్పుల వలన హృద్రోగాలు, కంటిచూపు మందగించడం (డయాబెటిక్ రెటినోపతి), మూత్రపిండాలు దెబ్బతినడం (డయాబెటిక్ నెఫ్రోపతి) వంటి కాంప్లికేషన్స్ దీర్ఘకాలంగా డయాబెటీస్‌తో బాధపడే వారిలో కనబడతాయి. తరచుగా కనబడే కాంప్లికేషన్స్ "న్యూరోపతి" లేదా నరాల సమస్య. దీని వలన అరికాళ్ళలో, చేతుల్లో మంటలు, తిమ్మిర్లు, చీమలు ప్రాకుతున్నట్లుండడం వంటి లక్షణాలు కన్పిస్తాయి. గాయాలు సరిగ్గా మానకపోవడం, జననేంద్రియాలలో దురదలు, లైంగిక సమస్యలు స్త్రీ-పురుషులను కృంగదీస్తాయి. సూక్ష్మనాళికలు దెబ్బతినడం వలన రక్తప్రసరణ సరిగ్గా జరగక వచ్చే గాంగ్రీన్ వంటి సమస్యల వలన కొన్నిసార్లు అవిటితనం తలెత్తే అవకాశం ఉంటుంది.

కాంప్లికేషన్స్‌ని అరికట్టడానికి రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచుకోవలసిన అవసరం ఉంది. గ్లూకోజ్ లెవెల్స్ సాధారణంగా భోజనం తర్వాత 160mg/dl కన్నా తక్కువ ఉండేలా చూసుకోవాలి. కొంతమందిలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించుకున్నా గానీ కాంప్లికేషన్స్ మొదలవుతాయి. క్రమంగా వ్యాయామం చేస్తూ, మందులు, ఆహారం సమయానికి తీసుకొంటూ, చిన్న చిన్న జాగ్రత్తలు పాటించవలసిందే. డయాబెటీస్‌తో పాటు అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలు ఉన్నవారిలో దుష్ప్రభాలు త్వరగా వస్తాయి గనుక రక్తపోటును, కొలస్ట్రాల్‌ను కూడా నియంత్రించుకోవాలి. మానసిక ఒత్తిడిని కూడా తగ్గించుకొని సాధ్యమైనంత వరకు మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి.

హోమియోపతిలో ఇచ్చే కాన్‌స్టిట్యూషనల్ చికిత్స ద్వారా రోగికి ప్రతీ సమస్యను అదుపు చేయగలమందులు ఉంటాయి. ఈ చికిత్స ద్వారా కేవలం షుగర్ లెవెల్స్ కంట్రోల్ చెయ్యడమే కాకుండా కాంప్లికేషన్స్‌ను నివారించడం, ఉన్నవారిలో కాంప్లికేషన్స్‌ని తొలగించడానికి సహాయపడుతుంది. హోమియోపతి అనగానే డయాబెటీస్‌కి యాసిడ్‌ఫాస్, యురేనియ్ నైట్ వంటి మందులే ఉన్నాయని అనుకుంటారు. ఇది సరియైన పద్ధతి కాదు. జన్యుపరమైన, మానసిక పరమైన కారణాలను పరిగణిస్తూ, వ్యక్తిగత లక్షణాలపై కేంద్రీకరిస్తూ ఇచ్చే కాన్‌స్టిట్యూషనల్ రెమెడీ ద్వారా రోగికి చక్కని ఫలితం లభిస్తుంది. సరియైన మందును, సరిపడే మోతాదులో నిర్ణీత కాలం దాకా వాడితే.

1. రోగుల్లో ఇన్సులిన్ డోసేజ్‌ని తక్కువ చేయడం.
2. రోగుల్లో యాంటీ హైపర్‌గ్లైసిమిక్ డ్రగ్స్ మోతాదుని క్రమంగా తక్కువ చేయడం, పూర్తిగా నిలిపివేసే అవకాశం కూడా ఉంది.

హోమియెపతి మందుల ద్వారా డయాబెటిక్ బాధితులు ఆరోగ్యకరమైన, ఆనందకరమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు.

*సలహాలు, సందేహాల కొరకు ఈక్రింది చిరునామాకు ఉత్తరాల ద్వారా సంప్రదించండి*

**పాజిటివ్ హోమియోపతి**

ఫ్లాట్.102, శ్రీ సాయిరామ్స్ స్వర్ణలత ఎస్టేట్, DTDC లేన్ ప్రక్కన, సారథి స్టూడియో, అమీర్‌పేట్, హైదరాబాద్.

help@positivehomeopathy.in, PHONE:92909 01010

బ్లాగోతం

**చాలా ఏళ్ళ క్రితం 'బాబాయ్ అబ్బాయ్' అని జంధ్యాల గారి సినిమా ఒకటి వచ్చింది. బాలకృష్ణ, 'సుత్తి' వీరభద్రరావు ముఖ్య తారాగణం. దాంట్లో 'సుత్తి' గారి ఊతపదం 'నా తరై'. దానికి అర్థం అప్పట్లో నాకు తెలియదు.**

# నా తరై

కాని కొన్నాళ్ళ తర్వాత కరుణానిధికి కళ్ళద్దాలు లాగా, రజనీకాంత్‌కి సౌండ్‌లాగా ఎప్పుడూ నా వెంట ఉండే దురదృష్టం నన్ను లటుక్కున లాగేసి చెన్నై అనబడు చీకటి కూపంలోకి తోసేసింది. అక్కడ ఎటు చూసినా జాంగ్రీలు, జిలేబీలు కలిపి వేసేసినట్టు ఉండే అక్షరాలు, గులకరాళ్ళని గ్లాసులో వేసి గిరగిరా తిప్పినట్టు ఉండే శబ్దాలు అలవాటయ్యాక తెలిసింది గురువుగారి చమత్కారం. అప్పటి నుంచి ఆ పదం నాకు తెగ నచ్చేసింది ('నా తరై' అంటే నేను ఇస్తాను అని అర్థం. మీకు కూడా గురువుగారి చమత్కారం అర్థం కావాలంటే మీరూ ఆ సినిమా చూడాల్సిందే.)

ఎందుకో తెలియదు గాని అరవవాళ్ళు అంటే గురువుగారికి కూసింత కచ్చి అని నా అభిప్రాయం. రెండు సంవత్సరాలు చెన్నైలో కాలాపానీ అనుభవించాక నా అభిప్రాయానికి ఊతం వచ్చింది. నాకు జీవితం అంటే విరక్తి వచ్చింది. అర్ధరాత్రి ఐదు గంటలకి చూసినా తెల్లవారుఝామున తొమ్మిది గంటలకి చూసినా సిటీబస్సుల్లో నిండా జనం, రజనీకాంత్‌కి జుట్టు మొలిస్తే చూడడానికి వెళ్తున్నట్టు, బాలకృష్ణ సినిమా ఇంటర్వెల్లో గేట్లు తీసేసినట్టు, జనం.




శివుడికి నెత్తిమీద గంగ ఉందో లేదో తెలియదు గాని అక్కడ సిటీబస్‌లో ప్రయాణం చేసిన ప్రతి ఒక్కరూ ఒక శివుడే. ప్రతి ఒక్కరూ కైలాసం నుంచి దిగి వచ్చిన ఫీలింగ్‌కి లోనవుతారు. ఇలా అనడానికి సర్వాంగాలను తడిపేసే గంగా ప్రవాహం ఒక్కటే కారణం కాదు. బస్సుల్లో ప్రయాణించే శివంగులు కూడా. అక్కడ అందరు ఆడవాళ్ళూ పొద్దున్నే లేచి పూజ చేసి, కమండలంలో నీళ్ళు నింపుకుని బస్సు ఎక్కుతారనుకుంటా. పురుష స్పర్శ కాదు కదా ప్యాంట్ నీడ పడినా శపించేస్తారు. అందుకనే అక్కడ బస్ ఎక్కగానే అందరు మగవాళ్ళు ఒక ప్రతిజ్ఞ చేస్తారు. ''ఈ బస్‌లో ప్రయాణించే ఆడవాళ్ళు అందరూ నాకు చెల్లి లేదా కూతురితో సమానం. (మీకు అభ్యంతరం లేకపోతే అక్కా లేదా తల్లి అని కూడా ఫిక్స్ అవ్వచ్చు.) వాళ్ళని నేను తాకను. తాకినా ఆనందపడను. ఆనందపడినా వాళ్ళకి తెలిసేలా ఆనందపడను. సూపర్‌గుడ్ ఫిల్మ్స్‌లో హీరోలా ఎస్.ఎ. రాజ్‌కుమార్ సంగీతానికి స్టెప్స్ వేస్తూ బస్ దిగుతాను. అందరి సానుభూతి చూరగొంటాను.''

చెన్నై గురించి చెప్పుకుంటున్నప్పుడు మనం ప్రస్తావించాల్సిన ఇంకొక గొప్ప విషయం– నీరు. బంగారం లాంటి నీరు. నేను చెప్తున్నది నీటి రంగు గురించి. ప్రతి వీధిలో ఒక గుడిని చూసి వాళ్ళ దైవభక్తికి అబ్బురపడిన నేను, వాటర్ టాంకర్ దగ్గర నీళ్ళ కోసం వాళ్ళు చేసే వయొలెన్స్ చూసి విస్మయం చెందాను. అన్ని రంగాల్లో అణగదొక్కబడ్డ స్త్రీలు ఈ విషయంలో మాత్రం అక్కడ గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. (చెన్నైలో నూటికి నూటపదిమంది వాటర్ ట్యాంకర్‌లో వచ్చే నీళ్ళ మీదే ఆధారపడతారు.) వాటర్ ట్యాంకర్ రాగానే రంగు రంగుల బిందెలతో, నోటినిండా బూతులతో లబలబమంటూ ఆడవాళ్ళూ, వాళ్ళతో పాటు కలం కాగితాలతో ఆహా ఓహో అంటూ కొంతమంది మగవాళ్ళు వచ్చేస్తారు. మొదట్లో ఈ రెండో బ్యాచ్ ఎవరో అర్థం కాలేదు. తర్వాత తెలిసింది వాళ్ళు కొత్త సినిమా పేర్ల కోసం, డైలాగ్స్‌లో పంచ్ లైన్స్ కోసం వెతుక్కునే తమిళ సినీ రైటర్స్ అని. (ఈ మధ్యనే శింబు హీరోగా రిలీజ్ అయిన 'నాటుకట్టి అడిపట్టి' అనే సినిమా టైటిల్ అక్కడ నుంచి వచ్చినదే. దీనిని తెలుగులోకి 'కపాలం కన్ను కొట్టింది' అన్న పేరుతో డబ్ చెయ్యబోతున్నారు.)

నీళ్ళ విషయంలో తమకు దేవుడు చాలా అన్యాయం చేశాడని చెన్నైవాసులకి గట్టి నమ్మకం. నాకు ఈ విషయం ఎలా తెలిసిందంటే ఒక రోజు ఎదురింటి ఆర్ముగం ప్రార్థన చేస్తుండగా విన్నాను ''దేవుడా! ఓ మంచి దేవుడా! మాకు అన్నీ ఇచ్చావ్. తాగడానికి సాంబార్ ఇచ్చావ్. తినడానికి ఇడ్లీలు ఇచ్చావ్, ఎత్తుకోవడానికి లుంగీలు ఇచ్చావ్, లోపల వేసుకున్నా బయటికి కనిపించేట్టు చారల చెడ్డీలు ఇచ్చావ్, ఎండా కాలంలో ఎండ ఇచ్చావ్, చలికాలంలో కూడా ఎండ ఇచ్చావ్, వర్షం పడినప్పుడు బురద ఇచ్చావ్, వర్షం పడనప్పుడు గబ్బు ఇచ్చావ్, అరవడానికి 'అరవం' ఇచ్చావ్ ('అరవం', 'అరవం' అంటూనే ఎందుకు అంత అరుస్తారో నాకు అర్థం కాదు), కంటి నిండా సరిపోయే హీరోయిన్లని ఇచ్చావ్, కాని దేవుడా! ఇన్ని ఇచ్చిన నువ్వు ఎందుకు కావేరిని మాత్రం కర్ణాటకకు ఇచ్చావ్?!

naatarai.blogspot.in



అంచెలంచెలుగా తారాపథంలోకి దూసుకు వస్తున్న యువ దర్శకుడు వీరభద్రమ్. అల్లరి నరేశ్ 'అహ నా పెళ్ళంట'కు కథ, స్క్రీన్‌ప్లేతో పాటు దర్శకత్వం వహించి అందరి దృష్టిలో పడ్డారు. ప్రస్తుతం విజయవంతంగా ప్రదర్శించబడుతోన్న సునీల్ 'పూలరంగడు'తో చిత్ర పరిశ్రమలో తన స్థానం సుస్థిరం చేసుకున్నారు. అసిస్టెంట్ డైరెక్టరుగా 'అక్కడ అమ్మాయి – ఇక్కడ అబ్బాయి'తో ప్రారంభించి ఇవివి, తేజ, కృష్ణ వంశీ, జయంత్, కరుణాకరణ్ లాంటి పలు దర్శకుల వద్ద పని చేశారు. తను చదివిన 'నిడదవోలు' కాలేజీ కబుర్లని ఈవారం 'హ్యాపీడేస్'లో కలబోసుకుంటున్నారు.

# ముగ్గురమ్మాయిలు.. ఒకటీ ప్రేమ కాదు

నిడదవోలు(పగోజి)కి ఏడు కి.మీ. దూరంలో ఉన్న 'కలవలపల్లి' మా ఊరు. ఏడో తరగతి వరకు అక్కడే చదివాను. తర్వాత 'ఊనగట్ల'లో టెన్త్ పూర్తి చేసి, ఇంటర్మీడియట్‌కి నిడదవోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాను.

## 'లీడర్' స్వభావం నాది

సినిమాలంటే మొదట్నించి తెగ పిచ్చి. నచ్చిన సినిమా వచ్చిందంటే కాలేజీ ఎగ్గొట్టి వెళ్లేవాడిని. అలాగని ఇంట్లో పనులు వదిలేవాణ్ణి కాదు. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో మామిడి, జీడిమామిడి తోటలుండేవి. కావలి ఉండడం దగ్గర్నుంచి కాయలు తెంపడం, లారీల్లో లోడ్ చేయించేదాక అన్ని పనులు దగ్గరుండి చేసేవాణ్ణి.

కాలేజీకి సైకిల్ పై వెళ్లేవాణ్ణి. అది నిక్కర్లకి వీడ్కోలు పలికి ప్యాంటుల్లోకి దూరబోతున్న నూనూగు మీసాల వయసు. వాచకంలో లేతదనం తగ్గుతూ స్వరం బొంగురుగా మారుతున్న కౌమార దశ. శరీరంలో వస్తున్న మార్పులకు ఒకవైపు బిడియం, మరోవైపు గర్వంగా ఉండేది. అప్పట్లో నాది బాగా ఉంగరాల తిరిగిన జుత్తు – దువ్వినా దువ్వకపోయినా ఒకేలా కన్పించేవాణ్ణి. చిన్నతనం నుండి నాది లీడర్ స్వభావం. పైగా దుడుకుతనం ఎక్కువ. గొడవల్లో ముందుండేవాణ్ణి. అయితే మేం ముగ్గురు అన్నదమ్ములం (నేను రెండోవాణ్ణి) కలిసికట్టుగా ఉండేవాళ్లం కాబట్టి మా జోలికి ఎవరూ వచ్చేవాళ్లు కాదు.




## ఆత్మావలోకనం చేసుకున్న గడియలు

ఇంటర్‌లో నాది ఎం.పి.సి. గ్రూప్. టెన్త్ ఫస్ట్ క్లాసులో ప్యాసయిన నేను ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మాథ్స్, ఫిజిక్స్‌లో తప్పేను. నాతో పాటు చదువుకునే మా ఊరమ్మాయి గంగాపార్వతి ఫస్ట్ క్లాసులో ప్యాసవడంతో కాస్త గిల్టీగా కూడా అనిపించింది. పైగా ఒకరోజు భవాని నాన్నగారు మా నాన్నతో 'చిన్నతనం నుండి మా అమ్మాయితో పోటీగా చదివేవాడు కదా. ఇలా తప్పడం ఏం బాగాలేదు. కాస్త మందలించ'మని చెప్పడం నాకు అవమానంగా అనిపించింది. అప్పుడు మాత్రం లోపం ఎక్కడుందని ఆత్మావలోకనం చేసుకున్నా. తర్వాత ఆ రెండు సబ్జెక్టులు పూర్తి చేసి ఇంటర్ ఫస్ట్ క్లాసుతో ప్యాసై నేనేమిటో నిరూపించుకుని, నిడదవోలులోనే వి.ఆర్.కె.(వెలగపూడి రామకృష్ణ) డిగ్రీ కాలేజీలో చేరాను.

## డిబార్ దాకా వెళ్లాను

డిగ్రీ మూడేళ్లూ మేం ఆడింది ఆటగా పాడింది పాటగా సాగింది. నేను డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ఉండగా శ్రీనివాస్ అని మా క్లోజ్ ఫ్రెండు ఒకడు వేరే కాలేజీలో ఇంటర్ చదివేవాడు. ఒకరోజు వాడు కాలేజీకి రాలేదని తెలిసి వాడి తరపున 'ప్రెజెంట్' పలికాను. అంతే! లెక్చరర్ నన్ను గుర్తుపట్టేసి, వెంటనే ప్యూనుకు చెప్పి ప్రిన్స్‌పాల్‌ని రప్పించి నన్ను పట్టించాడు. ఇంకేముంది? ఆయనగారు మా కాలేజీ ప్రిన్స్‌పాల్‌కి ఫోన్ చేసి నా నిర్వాకం గురించి చెప్పడంతో కథ మొదలయ్యింది. మా ప్రిన్స్‌పాల్ ఆగమేఘాలపై నన్ను డిబార్ చేస్తున్నట్లు ప్రకటించి, మా నాన్నని ఉన్నపళంగా తీసుకురమ్మని ఆర్డర్ జారీ చేశారు. నాన్నతో ఈ విషయం చెప్పడానికి సిగ్గేసి, మా ఫ్యామిలీకి బాగా తెలిసిన ఎరువుల ఫ్యాక్టరీ యజమాని గూడపాటి వెంకట్రామయ్యగార్ని తీసుకెళ్లా. 'అదేం కుదరదు, వీడు రెక్లెస్‌గా జవాబిస్తున్నాడు, వీళ్ల నాన్న రావలసిందే' అని తెగేసి చెప్పేడు ప్రిన్స్‌పాల్. కళ్లలో నీళ్లు తిరిగాయి నాకు. ఏడవటం ఒక్కటే తక్కువ. చివరకి నాన్నతో పెద్ద లెటర్ రాయించుకుని, నన్ను తిరిగి క్లాసులోకి తీసుకున్నారుగాని, అప్పట్నించి నాపైన ఓ కన్నేసి ఉంచారు.

## కాలేజీలో నా తొలి ఫైట్

డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ఉండగా కాలేజీ ఎలక్షన్స్ వచ్చాయి. మా కాలేజీలో లోకల్స్ తక్కువగా, ఔటర్స్ అంటే చుట్టుపక్కల పల్లెల్నుండి వచ్చే స్టూడెంట్స్ ఎక్కువగా ఉండేవారు. నేను ఔటర్‌ను. లోకల్ స్టూడెంట్స్ మామీద అజమాయిషీ చేయడానికి తెగ ప్రయత్నించేవారు. మేం కావాలనే ఔటర్ స్టూడెంట్ ఎల్.ఎస్.ఆర్. మోహన్‌ని

జాయింట్ సెక్రటరీగా నిలబెట్టాం ఆ ఏడాది. వాళ్ల ఓట్లు లోకల్స్‌కే వేయాలని బెదిరిస్తుంటే ఒకరోజు నాగు అనేవాడిని నా జీవితంలో మొదటిసారి కొట్టా. నాగు ఫ్రెండ్ ప్రసాద్. ఇద్దరూ కలిసి తర్వాత నన్ను కొట్టారు. ఈ విషయం తెలిసి మా ఊరి కుర్రాళ్లంతా ట్రాక్టర్లో వచ్చి వాళ్లని శుభ్రంగా చితక్కొట్టేశారు. దాంతో కాలేజీలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. తర్వాత సద్దుమణిగిందనుకోండి! ఆ దెబ్బతో మేం నిలబెట్టిన అభ్యర్థి గెలిచేవాడు.

## అది ప్రేమ కాదు ఒక 'క్రష్'

ఒకమ్మాయి రైల్వే కాలనీ నుండి వచ్చేది. తను డిగ్రీ ఫైనలియర్. ఆశ్చర్యమేమంటే వయసులో నాకంటే రెండుమూడేళ్లు పెద్దదైనా నన్ను బాగా ఇష్టపడేది. ఇద్దరం కలిసి భోంచేసేవాళ్లం. ఇద్దరం అప్పాజీగారి దగ్గర ప్రైవేట్‌కి వెళ్లేవాళ్లం. ఆమెపై నాకు చాలా ఇష్టం ఉండేది కాని అది ప్రేమని చెప్పలేను. ఏదో 'క్రష్' అంతే! తన డిగ్రీ అవగానే పెళ్లిచూపులు జరిగాయట. అదే విషయం నన్ను కలిసి చెప్పింది. ఇంకేం ఎంచక్కా పెళ్లి చేసుకో అని పెద్దమనిషిలా సలహా ఇచ్చాను. అప్పుడు తను చూసిన చూపులు ఇంకా గుర్తున్నాయి నాకు. (కొన్నేళ్ల తర్వాత అనుకోకుండా ఒకరోజు బేగంపేట విమానాశ్రయంలో భర్తతో కనిపించింది. వెంటనే గుర్తుపట్టేశా. మరి వెంటాడే చూపులు కదా! వాళ్లాయన్ని పరిచయం చేసింది. అప్పటికే తనకి ఇద్దరు పిల్లలు కూడా).

## ఆ పిల్ల సైకిల్లో గాలి తీసేవాణ్ణి

గమ్మత్తేమంటే నన్ను ఇష్టపడే అమ్మాయి తనైతే నేను డిగ్రీ సెకండియర్‌లో ఉండగా 'శ్రీదేవి' అనే అమ్మాయిని బాగా ఇష్టపడేవాణ్ణి. తను గాంధీనగర్ నుండి వచ్చేది. నేనెంత వెంటపడ్డా నన్ను అస్సలు లక్ష్యపెట్టేది కాదు. కసికొద్దీ సరిగ్గా ఇంటికి వెళ్లే సమయం చూసుకుని ఆ పిల్ల సైకిల్లోంచి గాలి తీసేసేవాణ్ణి. రోజూ ఇదే పని. 'గాలి తీసే ఇడియట్ ఎవరో' అని వినబడేలా అరిచేది. చివరికి ఒకరోజు గాలి తీస్తుండగా దొరికిపోయాను. నానా గోల చేసి, మా ప్రైవేట్ మాస్టారు అప్పాజీగార్కి చెప్పి నన్ను తిట్టించింది. ఆమె బాయ్ ఫ్రెండ్ ఒకడుండేవాడు (కాలేజీవాడు కాదు). అతనితో నాకు వార్నింగ్ కూడా ఇప్పించింది. చివరికి ఆ బాయ్ ఫ్రెండునే పెళ్లాడిందనుకోండి! ఈ జంట నేనోసారి అమెరికా వెళ్లినప్పుడు 'మేరీలాండ్'లో ఎదురై పలకరించడం మరో కొసమెరుపు.



'పూలరంగడు' వర్కింగ్ స్టిల్

మరోసారి ఇంకో అమ్మాయి హఠాత్తుగా తప్పిపోవడంతో వాళ్లింట్లో వాళ్లు మా గ్యాంగ్‌పై కంప్లైంట్ ఇచ్చారు. పోలీసు స్టేషన్‌కి వెళ్లాల్సి వచ్చింది. తీరా తెలిసిందేంటంటే ఆ అమ్మాయి మరో అబ్బాయితో (మా కాలేజీ అబ్బాయి కాదు) వెళ్లిపోయిందని తెలిసింది.

కాలేజీ లెక్చరర్స్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవాళ్లం. ఒక లేడీ లెక్చరర్ మాత్రం కాలేజీ అవగానే ఉద్యోగంలో చేరింది కాబోలు, స్టూడెంట్‌లా ఉండేది మా కళ్లకి. ముద్దుగా కన్పించేది కాబట్టి ముద్దులక్ష్మి అని పిలుచుకునేవాళ్లం. అంతే తప్ప ఇంకేం పిచ్చి వేషాలేయలేదు. లెక్చరర్లందరికీ వినాయకచవితి పండగొస్తే ప్రత్యేకంగా పత్రి తీసుకెళ్లి ఇచ్చేవాళ్లం.

## వెంటాడే వ్యధలూ ఉన్నాయి

మా కోతి బ్యాచ్‌లో దాదాపు క్రికెట్ టీమ్ మాదిరి పదకొండుమంది ఉండేవారు. మేం ఒక దగ్గర కలిశామంటే దిక్కులు పిక్కటిల్లాల్సిందే. కాలేజీ దగ్గర్లో ఉండే చెరుకుతోటల్లో, మామిడితోపుల్లో చొరబడి దొంగిలించిన గడల్ని, కాయల్ని అమ్మాయిలకు ఇవ్వడం ఒక సరదా. ఒకసారి ఆ సరదాతో మామిడిచెట్టుపైనుండి పడి, తృటిలో ఎముకలు విరక్కుండా బయటపడ్డాను.

కార్తీకమాసం వచ్చిందంటే మాతోపాటు మిగతా కొందరు స్టూడెంట్స్‌ని తీసుకుని పట్టిసీమకు స్టీమర్లో వెళ్లేవాళ్లం. వీళ్లలో సగంమంది విద్యార్థినులు కూడా ఉండేవారు. మా అందరిలో స్నేహభావం తప్పించి మరోరకమైన భావన ఉండేది కాదు. పట్టిసీమ శివాలయంలో వీరభద్రస్వామిని దర్శించుకుని తిరిగొచ్చేవాళ్లం. నేను ఫైనల్‌లో ఉండగా పట్టిసీమ దగ్గర ఒక దుర్ఘటన జరిగింది. అనుకోకుండా ఇద్దరు మిత్రులు నీళ్లలో మునిగిపోవడం నన్ను జీవితాంతం వెంటాడే విషాద సన్నివేశం. ఈ సంఘటన ఎప్పుడు గుర్తుకొచ్చినా మనసంతా వికలమైపోతుంది.

## షూటింగ్స్ తెగ చూసేవాణ్ణి

ఊర్లో వినాయకచవితి సందర్భంగా తెరలు కట్టి సినిమాలు ప్రదర్శించేవారు. అలా మాయాబజార్, పాతాళభైరవి సినిమాలు ఎన్నిసార్లు చూశానో. ఆ సినిమాల్లోని ప్రతి సన్నివేశం నాకు కంఠతా. పైగా ఎన్.టి.ఆర్.గారి అభిమానిని. మా వీధిలో వాళ్లు ఎన్‌టిఆర్‌గారి సినిమాలు ప్రదర్శిస్తే, పక్కవీధిలోని వాళ్లు పోటీగా ఏఎన్‌ఆర్‌గారి సినిమాలు వేసేవారు. నేను సవ్యసాచిలా రెండు వీధుల్లోని సినిమాల్నీ చూసేవాణ్ణి.

ఇక కొవ్వూరు, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో షూటింగ్స్ చాలా జరిగేవి. షూటింగ్ అని తెలియగానే కాలేజీ బంక్ కొట్టి పరిగెత్తేవాణ్ణి. నేను చూసినవాటిలో ఇవివిగారి 'సీతారత్నంగారబ్బాయి', 'ఏమండీ ఆవిడొచ్చింది', వంశీగారి 'కనకమాలక్ష్మి రికార్డింగ్ డాన్స్‌ట్రూప్' లాంటివి బాగా గుర్తున్నాయి. దర్శకత్వంలో వాళ్లు చూపే మెళకువల్ని బాగా గమనించేవాణ్ణి. అప్పుడనిపించేది ... జీవితంలో ఎలాగైనా సినీ ఫీల్డులో స్థిరపడి డైరెక్టరుని అవ్వాలని. ఆ కోరిక క్రమేపీ ఎంతగా బలపడిందంటే చివరికి నన్ను ఈ ఫీల్డుకి లాక్కుని వచ్చేదాకా.

డిగ్రీ అవగానే తణుకులోని ఒక షుగర్ ఫ్యాక్టరీలో ఉద్యోగం వచ్చింది కాని నా మనసంతా సినిమారంగం పైనే ఉండేది. డైరక్టర్ కావాలనే తృష్ణ నిలువెల్లా ఉండటంతో చివరికి నా ఫ్రెండ్స్ కొందరు ఎం.సి.ఏ. కోచింగ్ కోసం హైద్రాబాద్ వస్తుంటే వాళ్లతో పాటు నేను కూడా కోచింగ్ తీసుకుంటానని అబద్ధం చెప్పి వచ్చేశాను. కోచింగ్‌ని గాలి కొదిలేసి, ప్రముఖ దర్శకులను వెళ్లి కలుస్తుండేవాణ్ణి. నా కోరిక ఫలించి చివరికి ఇవివిగారి దగ్గర 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' (పవన్‌కళ్యాణ్‌గారి తొలిసినిమా) చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరిపోయా. ఆ క్రమంలో పలు దర్శకుల వద్ద పనిచేసి చివరికి డైరెక్టరుగా నాకంటూ ఒక ఇమేజ్ తెచ్చుకున్నాను.

ముఖ్యంగా గోదావరి తీర ప్రాంతంలో పుట్టడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. అక్కడి మనుషుల్లో అంతర్లీనంగా దాగిన వెటకారం, నరనరాల్లో జీర్ణించుకుపోయిన హాస్యరసం, గోదావరి గాలి, నీరు ... నిత్యం సంతోషంగా ఉంచి, ఏదైనా సాధించేందుకు దోహదపడతాయి. బహుశా ఇవే నా (మా) విజయాలకు మూలకారణమేమో.

– గొరుసు జగదీశ్వరరెడ్డి



# 'లొంక'లో రామాలయం

'లంక'లో రామాలయం ఉందంటే ఎంత వింతగా ఉంటుందో నిజామాబాద్ జిల్లా 'లొంక'లో ఉన్న రామాలయాన్ని చూస్తే కూడా అంతే వింతైన అనుభూతి కలుగుతుంది.

''ప్రపంచమంతా తిరిగొచ్చాక నా ఇంటి గడప ముందు గాలికి చలిస్తున్న గడ్డిపరక మీది నీటి బిందువును చూసి ప్రపంచపు అందమంతా ఈ బిందువులోనే ఉంది కదా అనుకున్నాను'' అని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ఒక కవితలో రాశారు. ఈ కవితను ఆయన సత్యజిత్ రేకు రాసిస్తే ఆయన కూడా గడ్డిపరకలో, నీటి బిందువులో అందాలను చూడడం నేర్చుకుని విశ్వవిఖ్యాతి గాంచిన సినిమాలు తీయగలిగాడు. లొంక రామాలయాన్ని చూశాక మాకు కూడా.. 'అరె ప్రపంచమంతా చూడాలనుకుంటాం. కాని పక్కనే ఉన్న ప్రకృతి అందాలను మాత్రం చూడలేకపోతాం, అలా ఎంతో మిస్ అవుతాం కదా' అనిపించింది.

ఈ 'లొంక' హైదరాబాద్ నుండి కామారెడ్డి, రథాల రామారెడ్డి, తూంపల్లిల మీదుగా వెళ్తే 150 కిలోమీటర్ల దూరంలో సిరికొండ మండలంలో ఉంటుంది. లొంక గురించి కొద్దిగా విని కుతూహలంతో నేను, మా మామయ్య శుభాకర్, తన ఇద్దరు ఫ్రెండ్స్ నరసింహులు, ఆంజనేయులు కలిసి కామారెడ్డి నుంచి కారులో వెళ్ళాం.

## ప్రయాణమే ఒక పరవశం

కామారెడ్డి నుంచి 23 కి.మీలు ప్రయాణించాక అడవి ప్రారంభమవుతుంది. ఆ అడవిలో ప్రయాణించడమే ఒక పరవశం. అంత అందంగా ఉంటుంది ఆ మార్గం. చుట్టూ పచ్చని చెట్లు, వాటి మధ్య వంకలు తిరిగే ఇరుకైన దారి, దారికి అటూ ఇటూ గెంతుతున్న కోతులు, కొండెంగలు. ఇంకా నెమళ్ళ సోయగాలు, పక్షుల కిలకిలలు, అటవీ ఉత్పత్తులు సేకరిస్తున్న ఆదివాసులు... వీటన్నింటినీ వీక్షిస్తూ కన్నుల పండుగగా సాగింది మా ప్రయాణం. పచ్చని అడవుల్లోని ఆ నల్లని (బ్లాక్ టాప్) రోడ్డు ఒక వంద మీటర్లు కూడా తిన్నగా సాగదు. వంకలు, ఎత్తు పల్లాలతో గమ్మత్తుగా సాగుతుంది ప్రయాణం.

మార్గమధ్యంలో దృశ్యం



తూంపల్లి క్రాస్‌రోడ్ నుంచి ఏడెనిమిది కిలోమీటర్లు ప్రయాణించాక ఆదివాసుల ఆరాధ్యదైవమైన చంద్రదేవ్ మహరాజ్ గుడి కనిపిస్తుంది. ఆ ప్రదేశం పేరు బుగ్గతాండ. గుట్టల్లో నుండి పెల్లుబుకుతున్న నీటి బుగ్గ సెలయేరుగా మారి ప్రవహించే ప్రాంతంలో ఈ తాండ-గుడి ఉన్నాయి. అక్కడి నుండి కొండపూర్ వెళ్ళాం.

## అత్యంత ఎత్తయిన గుట్ట మీద

'లొంక' కొండాపూర్ నుండి పది కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. కాని మేము ఆ పరిసరాలన్నీ తిరిగి చూడాలన్న ఉద్దేశంతో అక్కడి నుండి కుడివైపుకు తిరిగి తూంపల్లి మీదుగా పాకాల-పందిమడుగు రూట్‌లో ప్రయాణించాం. ఐదు కిలోమీటర్ల తర్వాత గొప్ప దృశ్యం చూశాం. మేము అప్పుడు ఉన్నది జిల్లాలోనే అత్యంత ఎత్తయిన 'రాతిగుట్ట' మీద. అది సముద్ర మట్టానికి 664 మీటర్ల ఎత్తున ఉండడంతో చల్లగాలులు వీచి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. తిరుపతి కొండల మీద ఉన్నట్లే అక్కడ ఎదురుకొండ వేంకటేశ్వరాలయం ఉంది.

ఎదురుకొండ ఎంత ఎత్తయినదో ఆ కొండ కొన నుంచి కిందికి చూస్తే తెలుస్తుంది. కొండ కింద విశాలమైన లోయ. ఆ లోయలో అక్కడక్కడా విసిరివేయబడ్డట్లున్న పాకలు (ఇళ్ళు), వాటి మధ్య విస్తరించిన పంట చేలల్లో పనిచేస్తున్న ఆదివాసులు, పశువుల కోలాహలం... కాశ్మీర్ లోయను తలపించింది.

లోయలో ఏడెనిమిది కిలోమీటర్లు ప్రయాణించి చిమన్‌పెల్లి నుంచి సిరికొండ వైపు తిరిగాక మళ్ళీ అడవి తగులుతుంది. ఈసారి అడవి లోయల్లో, వంకల్లో దిగుడు ప్రయాణం. చుట్టూ ఎన్ని టేకు చెట్లో, ఎన్ని సెలయేళ్ళో. ఏ వంద మీటర్లూ తిన్నగా ప్రయాణం చేయలేము. ప్రతి మూలమలుపులో, దేవతా విగ్రహం దగ్గరా, సెలయేటి దగ్గరా ఆగాలనిపిస్తుంది, ఆడాలనిపిస్తుంది, అడవి అందాలను ఆస్వాదించాలనిపిస్తుంది. స్వచ్ఛమైన గాలిని గుండెల నిండా పీల్చుకోవాలనిపిస్తుంది. సిరికొండ, హుస్సేన్‌నగర్‌లు దాటి మళ్ళీ అడవిలో కచ్చారో

డ్పై రెండు కిలోమీటర్లు ప్రయాణించాక 'లొంక' వచ్చింది.

## లొంక ఒక లంక

'లంక' అంటే చుట్టూ నీళ్ళు ఉన్న ఒక ప్రదేశం అని కదా. ఈ 'లొంక' చుట్టూ సెలయేరు మాత్రమే కాదు, గుట్టల వరుస కూడా ఉంది. రెండు గుట్టల మధ్య నుంచి వెళ్ళి సెలయేరును దాటినాకే ఈ 'లొంక' లోయను చేరుకుంటాం. వాస్తు ప్రకారం కట్టారేమో అన్నట్లుగా లొంకకు దక్షిణ, పశ్చిమాలలో చాలా ఎత్తయిన గుట్టలున్నాయి. ఉత్తరం వైపు ఇనుపరాళ్ళ గుట్టలు ఉంటే, తూర్పు వైపు మామూలు రాళ్ళగుట్టలు ఉన్నాయి. ఆ ఎత్తయిన గుట్టల్లో పుట్టి రామాలయాన్ని చుట్టి జలజలా పారుతున్న సెలయేరులో మూడు నాలుగు కిలోమీటర్లు హ్యాపీగా ట్రెక్కింగ్ చేయవచ్చు. చెట్లమీద గుడ్లగూబలు, చెట్ల కింద చిట్టి ఉడతల సయ్యాటలు, చెట్ల మధ్య కోతుల గెంతులను మన కెమెరాల్లో బంధించుకోవచ్చు. మరీ లోపలికి వెళ్తే మాత్రం ప్రమాదమట. కారణం సెలయేటి నీటిని తాగడానికి క్రూరమృగాలు కూడా వస్తుంటాయట. ఆఫ్‌కోర్స్ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు మాత్రం అడవులు, గుట్టల మీదుగానే ఇక్కడికి వస్తుంటారు. వారి అనుభవం, అవగాహనలు వేరు.

## చెట్టు ముందా, వేరు ముందా?

ఆలయానికి ఈశాన్యంలో ఉన్న విశాలమైన స్థలంలో రెండు వింత వృక్ష సమూహాలున్నాయి. ఒకటి– మట్టి చెట్టు ఏపుగా పెరిగి పెద్ద ఊడను జారేసింది. ఆ మట్టి కాండము, ఊడ ఒకే సైజులో ఉన్నాయి. ఏది ఊడో, ఏది కాండమో ఎంత గింజుకున్నా గుర్తుపట్టలేము. ఇక రెండవ వృక్షంలో మట్టి, జువ్వి, చింతచెట్లు పెనవేసుకుని ఉన్నాయి. ఏది ముందు పుట్టి రెండోదానికి ఆశ్రయమిచ్చిందో చెప్పలేము.

## గుహ గుడిగా, గుడి గుండంగా...

అన్ని దేవాలయాల్లోనూ ఈశాన్యంలో కోనేరుంటే ఇక్కడ మాత్రం అందుకు విరుద్ధంగా నైరుతిలో ఉంది కోనేరు. అయితే ఆ కోనేరుకు దేవాలయం కుడివైపు నుండి వెళ్ళి కాళ్ళు చేతులు, ముఖం కడుక్కుని ఎడమవైపు నుంచి తిరిగి రావడంతో మనకు తెలియకుండానే దేవాలయానికి ప్రదక్షిణ చేసినట్లవుతుంది. నిజానికి ఆ కోనేరు గుండం మొదట ఒక గుహ. గుట్టల్లోనుంచి వడివడిగా వస్తున్న సెలయేరు ఒక పెద్ద గుండు మీద నుంచి చిన్న వాటర్‌ఫాల్స్ లాగా దుముకగా దాని తాకిడికి గుండు కిందుగా గుహ ఏర్పడింది. ఆ గుహలో క్రీ.శ. 5వ శతాబ్దంలో విష్ణుకుండిన రాజులు తమ ఇష్టదైవమైన రాముడిని, రామలింగాన్ని (అక్కడివాళ్లు శివలింగాన్ని ఇలా పిలుస్తారు) చెక్కించి గుహ పైభాగంలో (అంటే గుండు మీద) శంఖు చక్రాలను, రామ పాదాలను, విష్ణు నామాలను చెక్కించారు. ఇప్పుడా రాముని విగ్రహాన్ని గుహ/గుండం నైరుతి మూలలో, లక్ష్మణ, సీత, రామలింగాన్ని గుండం గోడకు వాయవ్య మూలలో చూడవచ్చు. రామబంటు ఆంజనేయుని విగ్రహం గుండం మీద ఆగ్నేయ మూలలో ఉంది. గుండం ఈశాన్యపు ఒడ్డున గల ఒక రాయిపై వినాయకుని విగ్రహం చెక్కి ఉంది. ఆ విగ్రహానికి కిరీటం, జందెం ఉండడం, కింద ఎలుక లేకపోవడం బట్టి అది చాలా ప్రాచీనమైనదిగా భావించవచ్చు.



గుడిలో వ్యాసకర్త

ఆలయం ముందు





గుండు వినాయకుడు



చాళుక్యుల శిల్పాలు



సప్తమాతృకల్లో మిగిలినవి

విష్ణుకుండిన రాజులు తమ శాసనాల్లో "శ్రీపర్వత స్వామి పాదాలను, దంత ముఖస్వామిని (వినాయకుణ్ణి) ధ్యానించేవాళ్ళము'' అని చెప్పుకున్న మాటలకు నిదర్శనంగా మనం ఇక్కడ సిరికొండ (శ్రీపర్వతం) పక్కనే స్వామి పాదాలను, వినాయకుణ్ణి చూడవచ్చు. స్థానికులు ఈ ప్రాంతాన్ని రాముడు నడిచిన ప్రాంతంగా భావిస్తారు కాబట్టే అందుకు నిదర్శనంగా ప్రక్కనే రామడుగు (రామ+అడుగు) అనే గ్రామం కనిపిస్తుంది. సహజమైన రాయి మీద శేషశయనమూర్తిని చెక్కించడం విష్ణుకుండినుల ప్రత్యేకత. అలాంటి విగ్రహం సిరికొండలో ఉంది.

విష్ణుకుండినుల సాంప్రదాయాలచే ప్రభావితులైన తొలి చాళుక్యులే (క్రీ.శ. 6,8 శతాబ్దాలు) ఇక్కడి గుహాలయాన్ని గుండంగా మార్చినట్లు కనిపిస్తుంది. ఇప్పుడు కనిపిస్తున్న ఆలయంలో గర్భగృహాన్ని మొదట వారే కట్టించి లింగాన్ని ప్రతిష్ఠించి ఉండొచ్చు.

గర్భగుడి పైకప్పు లోపలి భాగాన మాత్రం జైన శైలీ ప్రభావంతో చెక్కిన పంచ వలయాల (కలశ) చిహ్నం కనిపిస్తుంది. బహుశా ఆది జైన మతానుయాయులైన బోధన్ చాళుక్యుల (క్రీ.శ. 8–10 శతాబ్దాలు) అనంతరం అధికారంలోకి వచ్చిన మలి చాళుక్యులు (క్రీ.శ. 10–12 శతాబ్దాలు) తమ పూర్వం రాజుల వాస్తుశైలి నుండి బయటపడక ముందు చెక్కించిన చిహ్నం అయ్యుంటుంది. ఈ లెక్కన ప్రస్తుతం కనిపిస్తున్న రామాలయపు గర్భగుడి చివరిసారిగా 10వ శతాబ్దంలో కట్టించబడింది అనుకోవాలి. అదే కాలంలో ఆలయంలో ప్రస్తుతమున్న శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఆలయానికి వాయవ్యంలో ఉన్న భైరవుడు, వీరభద్రుని విగ్రహం కూడా అదే కాలానిది. బహుశా అది జైన మత విధ్వంసానికి పాల్పడిన వీరశైవ మతస్థుల చేత ప్రతిష్ఠించబడినదై ఉంటుంది. కారణం, దాని ముందు జైన మత శైలిలో చెక్కిన చక్ర కలశం పడి ఉండడం. దీని నేపథ్యాన్ని తెలియజేసే ఒక దీర్ఘ శాసనాన్ని మలి చాళుక్యులు గుహ/గుండం పైన చెక్కించారు. కాని దాని ప్రాముఖ్యత తెలియక ప్రజలు దాన్ని శతాబ్దాలుగా తొక్కుతుండడంతో అరిగిపోయింది.

ఇలా వేయిన్నర సంవత్సరాల చరిత్ర కలిగి, అంతకుమించిన అటవీ సౌందర్యాన్ని సొంతం చేసుకున్న ఈ లొంక రామాలయం ఎకో టూరిజం ఇష్టపడేవారికి ఒక వరం. ఈ ప్రాధాన్యాన్ని గుర్తిస్తే రాష్ట్ర పర్యాటక శాఖ ప్రమోట్ చేస్తున్న పర్యాటక స్థలాల్లో ఇది ఒక మణిపూస కాగలదు.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
సెల్ : 94406 87250, dyavanapalli@gmail.com

# 'యాక్టివిస్టు రోల్'లో...

అమీర్ ఖాన్ కూడా యాక్టివిస్టు అవుతున్నాడు. సినిమాల ద్వారా చెప్పే సందేశాలే కాక సమస్యలపై పోరాడుతున్న ప్రజలతో మాట్లాడి ధైర్యం, ప్రోత్సాహం అందిస్తున్నాడు. పంజాబ్‌లో ప్రస్తుతం మద్యవ్యతిరేక పోరాటం ఉధృతంగా జరుగుతోంది. 72 గ్రామాల వాళ్లు తమ పొలిమేరల్లోకి మద్యం రాకుండా అడ్డుకుంటున్నారు. ఆ గ్రామాలలో చంగల్ ఒకటి. అక్కడికి తన ప్రొడక్షన్ టీమ్‌ను పంపించాడు అమీర్. వాళ్ళు గ్రామస్తులతో మాట్లాడి అన్ని విషయాలూ రికార్డు చేసుకోవడమే కాక ఒక విడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి అమీర్ చేత గ్రామస్తులతో మాట్లాడింపజేశారు. రెండేళ్ళుగా మద్యం ఊళ్ళోకి రానివ్వనందుకు గ్రామస్తులను ముఖ్యంగా స్త్రీలను అమీర్ బాగా మెచ్చుకున్నారట. 20 నిమిషాల పాటు ఆయన వారితో మాట్లాడి చాలా ప్రోత్సహించాడట. కేవలం యాక్టివిజమా లేక ఏదైనా సినిమాలో దీన్ని వాడుకుంటారో ఇంకా తెలియదు.



## ఫిల్మ్‌నగర్











# ఫ్రెండ్‌షిప్ పిచ్చి పట్టింది

'ఫ్రెండ్‌షిప్' అనే పదం ఎంతకాలమైనా పాతబడదు. అందుకే ఫ్రెండ్‌షిప్ పేరుతో బోలెడు సినిమాలు వచ్చాయి. సెంటిమెంటో ఏమో కాని ఇలా వచ్చిన సినిమాలు బాగానే ఆడాయి. ఆ మధ్య 'ప్రేమ' పేరును మొదట్లోనో, చివర్లోనో లేదంటే మధ్యలో అయినా తగిలించుకుని సినిమాలు తెగొచ్చాయి. మొన్ననే ప్రేక్షకుల ముందుకొచ్చిన శంకర్ సినిమా 'స్నేహితుడు', వేణు శ్రీరామ్ తీసిన 'ఓ మై ఫ్రెండ్' ఫ్రెండ్‌షిప్ పేరుతో వచ్చాయి. ఇంతకు మునుపు కమల్ హాసన్ '4 ఫ్రెండ్స్', పోసానికృష్ణమురళి 'ఫ్రెండ్స్ కాలనీ'లతో పాటు 'నేస్తమా', 'స్నేహం', 'అంకిత్ పల్లవి అండ్ ఫ్రెండ్స్' వంటి సినిమాలొచ్చాయి. కాలం మారేకొద్దీ స్నేహాలకు అర్థాలు మారిపోతున్నట్లే.. ఫ్రెండ్‌షిప్ స్టోరీలలో కూడా మార్పు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఇదే కోవలో 'ఇద్దరు మిత్రులు, 'ప్రాణమిత్రులు', 'స్నేహబంధం', 'స్నేహం కోసం', 'నీ స్నేహం', 'స్నేహంటే ఇదేరా', 'స్నేహితులు' వంటి సినిమాలొచ్చాయి.








# యోగాలో సన్నీ...

పోర్న్ వీడియో (శృంగార)ల్లో అన్ని దేశాల మగపుంగవుల్ని మత్తులో పడేసిన సన్నీ లియోన్.. ఇప్పుడు 'జిస్మ్-2'లో నటించేందుకు రెడీ కావడంతో వార్తల్లో హాట్ టాపిక్ అయిపోయింది. ఇదివరకు 'జిస్మ్'లో నటించిన బిపాసబసు కంటే రెట్టింపు అందంగా కనిపించేందుకు సన్నీ తెగ ప్రయత్నిస్తోందట. ''ఈ సినిమా ఏప్రిల్‌లో సెట్స్ మీదకు వెళుతుంది. ఇందులో నేను శృంగార సన్నివేశాల్లో కొత్తగా కనిపించబోతున్నాను. అందుకే తిండి పద్ధతులు మార్చుకున్నాను. బిక్రమ్ చౌదురి దగ్గర బుద్ధిగా యోగా చేస్తున్నాను'' అంటున్నది ఈ ముద్దుగుమ్మ.



# అంకేళి

నిర్వహణ : పి.రాఘవరెడ్డి

**అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 6 | 4 | | | | 9 | 1 | |
| | | | 9 | | 7 | | | |
| 5 | 9 | 7 | | | | 3 | 8 | 6 |
| | 5 | | 3 | | 1 | | 6 | |
| 3 | | | | | | | | 4 |
| | 7 | | 4 | | 8 | | 3 | |
| 1 | 4 | 9 | | | | 6 | 7 | 8 |
| | | | 6 | | 9 | | | |
| | 3 | 2 | | | | 1 | 5 | |

## గత సంచిక జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 9 | 2 | 6 | 5 | 7 | 1 | 8 | 4 |
| 5 | 8 | 7 | 1 | 9 | 4 | 2 | 3 | 6 |
| 6 | 1 | 4 | 8 | 2 | 3 | 7 | 5 | 9 |
| 2 | 6 | 5 | 7 | 1 | 8 | 4 | 9 | 3 |
| 7 | 3 | 8 | 4 | 6 | 9 | 5 | 1 | 2 |
| 1 | 4 | 9 | 2 | 3 | 5 | 6 | 7 | 8 |
| 8 | 2 | 1 | 3 | 7 | 6 | 9 | 4 | 5 |
| 4 | 5 | 6 | 9 | 8 | 1 | 3 | 2 | 7 |
| 9 | 7 | 3 | 5 | 4 | 2 | 8 | 6 | 1 |

## ఐ-పాడ్ కోసం...



యువతలో గాడ్జెట్స్ పట్ల పెరిగిన మోజుకు ఇదో ఉదాహరణ. మార్కెట్లో కొత్తగా వచ్చిన ఐ-పాడ్ కోసం చైనాలో 17 ఏళ్ళ కుర్రాడు కిడ్నీని అమ్ముకున్నాడట. ఆన్‌లైన్ ప్రకటన చూసి సుమారు రూ. 1.56 లక్షలకు తన కిడ్నీని అమ్మేశాడు. ఈ విషయం తల్లి దగ్గర ఒప్పుకున్నాడు కూడా. వస్తువుల మీద మోజు ఎంత పనైనా చేయిస్తుంది కదా! ఇతణ్ణి మాత్రం ఆదర్శంగా తీసుకోకండేం!



## ఆలోచనాత్మక నవల



**1970**ల్లో మలయాళ సాహిత్యంలో ఆధునిక నవలగా పాఠకుల ప్రశంసలు పొందిన 'పాండవపురం' ఒక సామాజిక మనోవైజ్ఞానిక నవల. ఇతర పురుషుల పట్ల ఆకర్షితురాలవుతుందనే అనుమానంతో భర్త చేత పాండవపురం నుంచి తరిమివేయబడిన దేవి అనే అందమైన స్కూల్ టీచర్ మనోప్రపంచంలోని ఊహలూ వాస్తవాలూ, కలలూ నిజాలూ, గతమూ వర్తమానమూ కలిసిపోయి తన భర్తతో, జార పురుషులతో జరిపే సంఘర్షణాపూరిత రహస్య సంభాషణే ఈ నవల ఇతివృత్తం. పురుష ప్రపంచంలో బతికే స్త్రీ లైంగికత్వం అనుభవించే వేదననూ, దాని నుంచి తప్పించుకునేందుకూ ఉపశమనం పొందేందుకూ స్త్రీ మనస్సు కల్పించే ఊహలనూ భ్రమలనూ భయాలనూ అద్భుతంగా నవలీకరించారు సేతు. ఇదో వంచిత స్త్రీ సెల్ఫ్-కాన్షియస్ స్వగతం. ప్రతి విషయమూ మగవాడి చేత కంట్రోల్ చేయబడే సమాజంలోని స్త్రీ తాలూకు బాధా సంవేదనల మానసిక తత్వఘోష పాండవపురం నవలంతా విస్తారంగా ప్రతిధ్వనించింది. దానితో పాటు 'ఆధునికత' సమాజంలో సృష్టిస్తున్న సంక్లిష్టతకు ఈ నవల మరో రూపం కూడా.

ఈ నవలలో ఉండే పాండవపురం పాండవులూ-ద్రౌపదీ బతికిన మహాభారతంలోని వ్యవస్థకు ప్రతిరూపమా? తెలియదు. ఎందుకంటే కాలం గురించి ఎటువంటి ప్రస్తావనా చెయ్యని రచన ఇది. ముఖ్యంగా తనను కోరుకున్న పురుషులకూ భర్తకూ సమాజానికీ మధ్య ఒంటరి అయిన దేవి మనోవల్మీకంలో జరిగే చింతనాత్మక సెక్సువల్ రాజకీయ మానసిక కల్లోలాన్ని ఫాంటసీ రియాలిటీ కలగలుపుతో ఒక పురుష రచయిత అత్యంత సమర్థంగా అక్షరీకరించడం ఈ నవలకున్న మరో విశేషం. పితృస్వామిక సమాజం అనుక్షణమూ నియంత్రించే స్త్రీ శరీరంలోని హృదయాంతరంగ యాంగ్జయిటీని పౌరాణిక ప్రతీకాత్మకంగా చిత్రించిన ఈ నవల తెలుగు పాఠకుల మానసిక పరిధిని కచ్చితంగా విస్తృతం చేయగలదు. అనువదించలేని మలయాళ పదాలు మినహా ఎల్.ఆర్. స్వామి అనువాదం చక్కగానే సాగింది. మళ్ళీ మళ్ళీ చదివి అర్థం చేసుకోవాల్సిన పుస్తకం ఇది.

– డి. లెనిన్

**పాండవపురం,** మలయాళ మూలం: సేతు, అనువాదం : ఎల్.ఆర్.స్వామి, వెల : రూ. 70, ప్రతులకు : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్

## కథల వాచకం



తెలుగులో అనువాద సాహిత్యానికి మొదటి నుంచి మంచి ఆదరణ ఉంది. అసలు తెలుగు కథల కంటే తెలుగులో అనువదింపబడిన కథలే బాగుంటాయి అన్న అభిప్రాయం కూడా లేకపోలేదు. దీనికి కారణం సంకోచాలను మనం అధిగమించలేకపోవడమే. వివిధ అస్థిత్వాల స్పృహ ఎంత అవసరమో వాటిని దాటుకుని రావడం కూడా అంతే అవసరం. అనువాదకుడి అభిరుచి వలన ఈ కథల వాచకంలో వస్తుశిల్పాల పరంగా విభిన్నమైన కథలు ఎంపిక చేయబడ్డాయి. రెండు మూడు పాత కథలకు బదులు సమకాలీన కథలను చేర్చి ఉంటే బాగుండేదనిపిస్తుంది. ఈ పుస్తకంలోని లాటిన్ అమెరికా, కరిబియన్ కథలు ఎప్పటిలానే తమ ప్రత్యేకతని నిలుపుకున్నాయి. కథలన్నీ చదివాక దేనికదే ప్రత్యేకంగా అనిపించక అన్ని కథలూ ఒకరే రాసినట్లు అనిపించింది. ఈ చిన్న లోపాన్ని మినహాయిస్తే ఇందులో కథలన్నీ ఆసక్తి కలిగించేవే.

– స్వప్నిల్

**కథల వాచకం** , అనువాదం : ముక్తవరం పార్థసారథి పేజీలు : 152, వెల : రూ. 100/–, ప్రతులకు : అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

## కొత్త పుస్తకాలు

సినిమా రంగంలోకి ప్రవేశించడానికి ఓ పరీక్షే గనుక ఉండి ఉంటే ఈ రెండు పుస్తకాలకు మంచి డిమాండ్ ఉండేదేమో. దర్శకత్వం, నటన గురించిన ప్రాథమిక విషయాలను పరిచయం చేయడం కోసమే రచయిత వీటిని రాశారు. సినిమా కళకు సంబంధించి ఆయన గతంలో కూడా రెండు పుస్తకాలు తీసుకొచ్చారు.

దర్శకత్వ శాఖలో రాణించాలనుకున్నవారు ప్రముఖ దర్శకుడి దగ్గర సహాయకుడిగా చేరి ఆ రంగం గురించి అవగాహన పెంచుకోవడం పరిపాటి. అయితే మెగాఫోన్ చేతబట్టాలనుకున్నవారు ఆ రంగంలో కనీస జ్ఞానాన్ని కలిగుంటే బావుంటుందన్న ఉద్దేశంతో నాగేంద్రకుమార్ వేపూరి 'సినిమా దర్శకత్వం–ప్రాథమిక సూత్రాలు' పుస్తకాన్ని రాశారు.



'జంతువులకు సమీపంలో బాంబులను పేల్చకూడదు. నెమళ్ళు, చిలుకలు, పావురాళ్ళ ఈకల్ని పీకి షూటింగ్స్‌లో వాడకూడదు... ఒకవేళ వాడితే యానిమల్ వెల్ఫేర్ బోర్డు అభ్యంతరం పెడుతుంది'... ఇలాంటి ప్రాథమిక విషయాల నుంచి దర్శకుడు జాగ్రత్త తీసుకోవాల్సిన ప్రతి చిన్న విషయాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు రచయిత. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ వారి అనుమతి పొందాలంటే ఏం చేయాలి? సెన్సార్ బోర్డ్ నియమనిబంధనలు ఏమిటి? 'ఏ', 'యు' సర్టిఫికెట్లను ఏ తరహా చిత్రాలకు కేటాయిస్తారు? చిత్ర పరిశ్రమలో 24 శాఖల ప్రాధాన్యత ఎలాంటిది? షాట్ డివిజన్ ఎలా

# రెండు సినిమా పాఠ్యపుస్తకాలు

ఉంటుంది? షెడ్యూల్స్‌ను ఎలా ప్రణాళిక చేసుకోవాలి? ఛార్ట్ లను తయారు చేసే తీరు, షూటింగ్ విధానం, సెట్‌లో షాట్‌ను ఏ సందర్భంలో ఏ యాంగిల్లో తెరకెక్కించాలి? వంటి విషయాలను, నిర్మాణానంతర కార్యక్రమాల్లో చూపాల్సిన చొరవను కూలంకుషంగా వివరించారు. సినీ దర్శకుల సంఘం వివరాలు బోనస్. అవసరమైన ప్రతిచోటా ఫోటోలను, రేఖా చిత్రాలను అందించాలన్న ఆలోచన ప్రశంసనీయం. దీనివల్ల విషయం సులువుగా బోధపడుతుంది.



### నటనా కళ

నటన ఆవిర్భావం నుంచి వికాసం వరకు ఎన్నో విషయాలున్నాయి 'నటనా కళ' పుస్తకంలో. నటనా శాస్త్రం అంటే ఏమిటి? నటన సామాజిక ప్రయోజనం ఎలా ఉంటుంది? వివిధ మాధ్యమాల్లో నటనను ప్రదర్శించే విధానం ఎట్టిది? అష్ట విధ నాయికలు, నాయకుల్లో ఉండాల్సిన లక్షణాలు, పలు విధాల అభ్యాసాలు, ఆంగిక, వాచకాంశాలను గురించి వివరించారు. దశరూపకాలు ఏమిటి? నటుడికి ఉండాల్సిన లక్షణాలు ఎలాంటివి? ఎలాంటి అడ్డంకులు ఎదురవుతాయి? అసలు నటనలో శిక్షణ ఎందుకు పొందాలి? నటన శిక్షణాలయాల ఆవశ్యకత ఎటువంటిది? డబ్బింగ్ చెప్పే విధానం ఎలా ఉండాలి? వంటి పలు అంశాలను ప్రస్తావించారు. మన దేశంలో గల కొన్ని ప్రముఖ నటశిక్షణా సంస్థలు ఎక్కడెక్కడ ఉన్నాయి? ప్రవేశార్థులకుండాల్సిన అర్హతలు ఏమిటి? నటులకు రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎలాంటి అవార్డులు లభిస్తాయి? చతుష్షష్టి కళలు ఏమేమిటి? ఆడిషన్స్ ఎలా ఉంటాయి? ఆడిషన్స్‌కి వెళ్ళేటప్పుడు నటుడు ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి? వంటి వివరాలన్నింటినీ గుదిగుచ్చిన తీరు మెచ్చుకోదగినది.

సినిమా రంగంలో అడుగుపెట్టాలనుకున్న వారు ఒక్కసారైనా చదవాల్సిన పుస్తకాలివి.

– చల్లా భాగ్యలక్ష్మి

**సినిమా దర్శకత్వం ప్రాథమిక సూత్రాలు**
పేజీలు : 164, వెల: రూ. 150
**నటనా కళ** , పేజీలు : 260, వెల: రూ.250
రచన: నాగేంద్రకుమార్ వేపూరి, ప్రతులకు: విశాలాంధ్ర

## స్వీకారం



**ఎమ్‌సెట్‌లో ఉత్తమర్యాంకు కోసం 150 టెక్నిక్‌లు**
రచన : డా.కె. కిరణ్ కుమార్, కె. సాయి దేదీప్య, పేజీలు : 153
వెల: 60

**ప్రతిభావంతుల విజయానికి 150 టెక్నిక్‌లు**
రచన : డా. కె. కిరణ్‌కుమార్
పేజీలు : 252, వెల: 100
ప్రతులకు : 040–27090541

★★★

**తేనె చినుకులు**
(సంప్రదాయాల మంచి మాటలు)
రచన : సూర్యప్రసాదరావు
పేజీలు : 180, వెల: రూ. 100
ప్రతులకు : 98851 56844

**నేటికీ పరిష్కారం కనపడని సమస్యలు**
రచన : కాకుమాను తారానాథ్
పేజీలు : 288, వెల: రూ. 150
ప్రతులకు : 040–2756 3236

★★★

**మరో కోణం లోంచి మహాత్ముడు**
రచన : కోడూరి శ్రీరామమూర్తి
పేజీలు : 110, వెల: రూ.70/–
ప్రతులకు : విశాలాంధ్ర

★★★

**సమగ్ర జీవితానికి సరికొత్త సూత్రాలు**
పేజీలు : 219, వెల: రూ.225/–

**నిర్వహణా సామర్థ్యానికి నిర్వచన సూత్రాలు**
పేజీలు : 221, వెల: రూ.225/–
అనువాదం : నిర్మలా సుందరం
ప్రతులకు : 040–2344 6841

★★★

**తెలుగు దినపత్రికల భాష ఆధునీకరణ**
(1914–1984)
రచన : పి. చంద్రశేఖర్
పేజీలు : 287,
వెల: రూ. 150
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు





## రియాలిటీ పాఠాలు

ఒక స్కూలులో పిల్లలందరూ క్లాసులో కూర్చుని ఉండగా కిటికీ దగ్గర పెద్ద చప్పుడైంది. అందరూ అటు చూశారు. ఒక పెద్దాయన ఎర్ర ఊలు విగ్ పెట్టుకుని చేతిలో తుపాకీ లాంటిదేదో పట్టుకుని స్కూలు కేర్‌టేకర్‌ను కిడ్నాప్ చేసి తన కారులోకి తోసి రయ్యిమని రోడ్డు మీదికి వెళ్ళిపోయాడు. పదేళ్ళ పిల్లలు నిశ్చేష్టులై చూస్తుండిపోయారు. ఇంతలో టీచరు వచ్చి పిల్లలూ... ఇప్పుడు మీరు చూసిన దృశ్యాన్ని వర్ణనాత్మకంగా రాయండి అని చెప్పింది. బయట జరిగిందంతా ఉత్తుత్తిదే అని, ఆ పెద్దాయన తమ హెడ్మాస్టరే అని మెల్లగా తెలిసింది వాళ్ళకి. విషయం తెలిసాక 'ఇదేం బోధనా పద్ధతి?' అని ఆ పిల్లల తల్లిదండ్రులు విసుక్కుని పోలీసులకు ఫిర్యాదు చేద్దామా అని కూడా అనుకున్నారట. సదుద్దేశంతో అయినా పిల్లల్ని అలా భయపెట్టడం బ్రిటిష్ చట్టం ప్రకారం నేరం.

సలాడ్



## చెట్లపై శిల్పాలు చెక్కినాడు

ఈ వింత చూడండి. డ్రాగన్ ఎంత బావుందో కదా..! బాంక్సీ చేతిలో ఊపిరిపోసుకున్న చిత్రమిది. ఇదే కాదు, ఇటీవల ఆయన మరో రెండు చిత్రాలను సృష్టించారు. చెట్ల మొదళ్ళు, కొమ్మలు దొరికితే చాలు.. అద్భుతమైన ఆకృతులను చెక్కేస్తాడు. ఈయనేమీ అల్లాటప్పా శిల్పకారుడు కాదు. ఫిల్మ్ డైరెక్టర్, పొలిటికల్ ఆక్టివిస్ట్, పెయింటర్. సెటైరికల్ స్ట్రీట్ ఆర్ట్‌లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన కళాకారుడు. లండన్‌లోని చెట్ల మొదళ్లతో చెక్కిన ఈ శిల్పాలను చూసేందుకు జనం ఎగబడుతున్నారట. దీంతో ఈ ప్రాంతాన్ని ఏకంగా పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నడుం కట్టింది.

## నారీలత పుష్పాలు

ఈ ఫోటోలో కనిపిస్తున్నది స్త్రీలు కాదు. స్త్రీల ఆకారంలోని పువ్వులు. నమ్మశక్యంగా లేదు కదూ. మీ అనుమానం నిజమే. అలాంటి పువ్వులు ఎక్కడా లేవు. కాని హిమాలయాలలో చూశామని కొందరు, శ్రీలంకలో పూస్తాయని కొందరు, థాయ్‌లాండ్ చెట్ల మీద కనిపించాయని మరికొందరు... ఇలా వదంతులు మాత్రం ఉన్నాయి. అంతే కాదు. ఇండియాలో వాటిని నారీలత పువ్వులంటారని, శ్రీలంకలో లియతబారా మాల అంటారని, థాయ్‌లాండ్‌లో నారీపోల్ అంటారని కూడా ప్రచారంలో ఉంది. 20 ఏళ్ళకు ఒకసారి పూస్తాయని, మునీశ్వరుల తపోభంగానికి ఇవే ప్రధాన కారణమని కూడా కొందరు కథలల్లారు. ఇదిగో తోక అంటే అదిగో పులి అనే జాతి కదా మనది.



# అంకెలతో అదృష్టం


**ఐ.బి. సాహు**

సెల్ : 95810 94208, 90142 48124


పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీ కాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియని తనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.......................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ - 500 033.

సంఖ్యా శాస్త్రాన్ని సశాస్త్రీయంగా నేర్చుకోవాలనే ఆసక్తి కలిగి ఉన్నవారికి, అన్వయ ఫలితాలతో ఖచ్చితమైన పద్ధతులతో సంఖ్యాశాస్త్రం అందుకోవాలనుకునే వారి కోసం క్లాసెస్ నిర్వహించబడుతున్నాయి. వివరాల కోసం 81255 84837 నంబర్‌లో సంప్రదించగలరు.

పాఠకులకు ఎన్నో సందేహాలు ఉంటుంటాయి. అవన్నీ ఫోన్‌లో వివరించలేమని మనవి. ఉత్తరాల ద్వారా ఎందరో ఎన్నో అంశాలలో పరిశోధనాసక్తి పెంచారు. డేటా కలెక్షన్‌గా ఉపయోగపడే ప్రతి ఉత్తరం ఒక్కో వ్యక్తి జీవితం. ఇవన్నీ పరిశీలించే సమయంలోనే సంఖ్యాశాస్త్రపు అద్భుత కోణాలు తెలిశాయి. ఒక్కో కాంబినేషన్ ఒక్కో వ్యక్తిపై ఎలా పనిచేస్తుంది అనే వివరణను ఇచ్చాయి. సంఖ్యా శాస్త్రపు ఒరిజినల్ మూల సిద్ధాంతాలలో దాగివున్న అద్భుత శక్తి అంకెలతో అన్వయం చేస్తున్నప్పుడు ఈ శాస్త్రం ఎల్లలు ఏమిటో అర్థం అయ్యాయి. ఈ పరిశోధనను అనేక ఆసక్తికర అంశాలను పుస్తక రూపంలో వెలువరించాలనే ప్రయత్నానికి ఇంకా కొంత సమయం పడుతుంది. ప్యూర్ న్యూమరాలజి వేరు. మిక్స్ న్యూమరాలజీ వేరు. 360 డిగ్రీల కోణంలో ఒక వ్యక్తి పుట్టిన తేదీని ఎక్స్‌ప్లోర్ చెయ్యడమే ప్యూర్ న్యూమరాలజీ. టారట్ కార్డ్ సహాయంతో ఒక సంఖ్య ఫలితం ఇది అని చెప్పడం లేదా ఈ సంఖ్యలో ఈ బొమ్మ ఉంది కాబట్టి మీరు ఇలాగే ఉంటారు అని చెప్పడం మిక్స్ న్యూమరాలజీ అనవచ్చేమో కాని సంఖ్యాశాస్త్రానికి చిత్రాలకు సంబంధమే లేదు. ఇటువంటి పద్ధతిలో మనం ఏదైనా చెప్పవచ్చు. ప్యూర్ న్యూమరాలజీలో సంఖ్యల తత్వాన్ని సిద్ధాంతం ద్వారానే వివరించాలి కాబట్టి కల్పితం ఉండదు. ఉదాహరణకి ఈ 48 రకాలలో ఎన్నో కంట్రోలింగ్ సంఖ్యలు. ఎన్నో రూలింగ్ సంఖ్యలు. ఇప్పటివరకు ఎవరూ ఆలోచించని కోణం ఇది. ఇటువంటి ఎన్నో అంశాలు ఎన్నో నిర్ధారణలు సంఖ్యాశాస్త్రంలో కోకొల్లలు. అదేవిధంగా ఒక వ్యక్తి పేరు 9 సంఖ్యలలో వైబ్రేట్ అవుతుందనే విషయమూ వివరించ లేదు. ఏదోలా పుట్టిన తేదీతో పేరు అడ్జస్ట్ చేసేస్తే అదే సంఖ్యాశాస్త్ర పరంగా పేరు మార్చబడినట్లే. ఇదే న్యూమరాలజీ అని సమర్థించే వారిని సరిపెట్టుకోమనవలసిందే. ఫలిత సాధన విషయంలో తామరాకుపై నీటిబొట్టులా మౌనంగా ఉండవలసిందే. కాంట్రవర్సీ కోసమో, వివాదం కోసమో ఉన్నవి లేనివి చెప్పేస్తుంటే శాస్త్రాన్ని అవహేళనకు గురి చేయడం తప్ప ముందు తరాలకు మీరు వేసే బాట ఏది? న్యూమెరికల్ ఛార్ట్, న్యుమెరికల్ కాంబినేషన్స్‌కు ఏమాత్రం ప్రాముఖ్యత ఇవ్వకుండా చేసే మార్పు పేరును ఏవిధంగా బలపరచగలదు.

ఉదాహరణకు పేరు మొత్తం విలువ 12గా కానీ, 16గా కానీ, 18గా కానీ, 13గా కానీ రాకూడదు అని కన్‌క్లూడ్ చేసే ముందు ఈ సంఖ్యలు అచ్చులుగా వస్తేనే ఈరకంగా చెప్పవలసి ఉంటుందా? అచ్చుల మొత్తం 12 అయినప్పుడు విక్టిమ్ అవుతాడు. మరి పేరు మొత్తం 12 అయినపుడు మిగిలిన అక్షర భావన ఏది? 16వ సంఖ్య చిత్ర రంగాన్ని శాసిస్తుంది. పేరులో 16 మార్చగలం. 16 ఇచ్చే డెస్టినీ మార్చే సత్తా ఎవరికుంది? 57వ సంఖ్యలో పేరు గల వ్యక్తి నాసా తరఫున పనిచేస్తున్నారు. మరి ఈ వ్యక్తి విజ్ఞానం ముందు కుటుంబ జీవనం అనేది అల్పమైన విషయం ప్రతి వ్యక్తికి ఒక పరిధి ఉంటుంది. ఒక్కో పరిధిలో ఒక్కో అంశం ప్రాముఖ్యత పొందుతుంటుంది. కాబట్టి ఏ సంఖ్యనూ జనరలైజ్ చేసి వాడేయకూడదు. 2012 అర్థం వివరించిన వారేరి? ఒకటవ సంఖ్య కలిగించే భ్రమణం 2వ సంఖ్య భ్రమణంతో పాజిటివ్ ఫలితాన్ని ఇస్తుందా? నెగెటివ్ ఫలితాన్ని ఇస్తుందా? ప్రిడిక్షన్ ఏం చెప్తారు. సౌందర్య పేరులో 16 ఉండడం వల్లనే విమాన ప్రమాదంలో చనిపోయిందని ఒక డిక్లరేషన్ చేయడం సమంజసమా? సంఖ్యాశాస్త్ర ప్రకారం ఆమె జీవితకాలం ఏ పరిధిలో ఉందో లెక్కిస్తే 16వ సంఖ్య ప్రభావం అర్థం అవుతుంది.

కాలం ఒక్కో సంవత్సరంలో తన వైబ్రేషన్‌ను మారుస్తూనే ఉంటుంది. ఏదో ఒక్క సంఖ్యలో



పేరును ఫిక్స్ చేస్తే మిగిలిన వైబ్రేషన్స్ అన్నీ కంట్రోల్ చెయ్యబడుతాయా? మినిమమ్ ఈ సిద్ధాంతం తెలియకుండా చేసే మార్పు మిమ్మల్ని అదృష్టం వైపు పరిగెత్తిస్తుందా జీవితం అంతా హాయిగా ఉండవచ్చా? నా భావ వ్యక్తీకరణను, పదజాలాన్ని చాలా సులువుగా కాపీ కొట్టేవారు ఆలోచించవలసిన అంశం ఇది. ఏకలవ్య శిష్యులందరికీ ఒకటే మనవి. ఏదో ఒక విషయాన్ని పట్టుకుని శాస్త్రం వచ్చేసింది, నాకు న్యూమరాలజీలో కొద్దిగా ప్రవేశం ఉంది అంటూ ఆగిపోకండి. నిరంతరం పరిశీలించండి. పరిశీలనే క్రొత్త విషయ ఆవిష్కరణకు ఊపిరి. ఆపై మెరుగుదిద్దడే మూల సిద్ధాంతం.

| | |
|---|---|
| 9+9=18 | 9x9=81 |
| 6+6=12 | 6x6=36 |
| 3+3=6 | 3x3=9 |

ఇవి సంఖ్యాశాస్త్రపు తొలి అడుగులు. విస్తారంగా వెళితే వ్యక్తి జీవితానికి సంఖ్యల అన్వయం అర్థం అవుతుంది. సంఖ్యల ద్వారా భవిష్యత్తును నిర్మించవచ్చు, దర్శించవచ్చు, సరిదిద్దవచ్చు.

శుభమ్.



# నెత్తుటి నిజం

అర్థం కానిదేదో చుట్టుకుంటోంది
అర్థం అయిన ప్రతిదీ ముక్కలవుతోంది

పాడాలి పాడవు
రాయాలి రాయవు
ఆడాలి ఆడవు

అర్థమయ్యీకానిదేదో కనపడిందా
కన్నూమిన్నూ కానవు
ఎదురుపడ్డ మిత్రున్ని దాటుకువెళ్లి
అనామకుని కావలించుకున్నట్లు
కావలించుకుంటావు

మనసుపడ్డ ప్రేయసికి టాటా చెప్పి
నిష్క్రియలో నిద్రపోతావు

మరిగేనెత్తుర్లో మలినాలు చూస్తావు
ఎంత మహోజ్వలమైనదైనా ఈ నెత్తురు పనికిరాదంటావు

అంతా బాగుందంటే
మురుగు కూడా బాగుంటుంది
అంతా బాగుంటుందంటే
బానిసత్వం కూడా రుచిగా ఉంటుంది

కుర్చీని కుర్చీ స్నేహిస్తుంది
డబ్బును డబ్బే ప్రేమిస్తుంది
మందిని మందే కలబోసుకుంటుంది

**2**

దేన్నైనా సిద్ధాంతం కాకముందే ప్రేమించు
ఆపై అది ముందుకొచ్చినా విదిలించు
....    ....    ....
నమ్మకం ఎంత ముసలిదో
నమ్మకద్రోహమూ అంతే ముసలిది
స్వార్థమెంత ముసలిదో
రాజ్యమూ అంతే ముసలిది
....    ....    ....
ఆమె అంతః సౌందర్యాన్ని అందరిముందూ
ట్రాఫిక్ సిగ్నల్‌లా పరిచినపుడు
వికారా? సుందరా?

**3**

దాక్కున్నాను
దాచుకున్నాను నన్ను

అయినా లాగారు పాతాళం దాగిన నను పైకి లాగారు
పైకి పైపైకి వచ్చాక తలపడక తప్పదు గదా

అయినా వీరి మొహాలు చూడలేకే కదా
ఎక్కడో దాగినది

ఇపుడు తలపడాలి వారో నేనో తేలిపోవాలి
మళ్లీ దాక్కోవాలి
మానవీయమైన ప్రేమకరమైన
సున్నితత్వం కోసం
నన్ను నేను ఎక్కడో దాచుకోవాలి

– యింద్రవెల్లి రమేష్
99854 40002

బొమ్మలు: అక్బర్

## ఈ వారం కవితలు

# ఓసి చిన్నమొక్కా!



మామూలుగానే తెల్లారింది
మామూలుగానే సూర్యుడూ కనిపించాడు
మనుషులూ మామూలే
అంతా మామూలే, అంతటా మామూలు దృశ్యాలే
మొన్నటిలాగే నిన్నా, నిన్నటిలాగే ఇవాళా
అంతేనా? అంతేనా?
కాదు ... కాదు ... అంది తలూపుతూ
గుమ్మం ముందు కుండీలో ఉన్న పూలమొక్క
ఊపుతున్న తలకేసి చూశానా...
అప్పుడప్పుడే కళ్లు తెరచిన ఓ పువ్వు
మొన్నా నిన్నా లేని రెండు లేత ఆకులు
నా కళ్లకు కప్పుకున్న 'మామూలు' తెర జారింది
కొత్తగా మెత్తగా 'ఇవాళ' చిరునవ్వుతో పలకరించింది
ఓసి చిన్నమొక్కా! నా నిరాశా హృదయంలో
ఎంత ఆశను నింపావే, నీ పాదాలకు మొక్కా!

– పి. రామకృష్ణ

కవర్ స్టోరీ




# ఇది మా ఊరు..

★ మల్లెంపూటి ఆదినారాయణ

ఇంటిని మించిన స్వర్గం లేదు. తల్లిని మించిన దైవం లేదు. సోదరప్రేమకు ఏదీ సాటి రాదు. మనిషన్న వాడు ఇంకా మాయమైపోవడం లేదంటే.. ఆ మూడే కారణమని చెప్పొచ్చు. అందుకేనేమో ఇల్లులేని, తల్లిలేని, సోదరులు లేని.. అనాథపిల్లలకు ఓ కొత్త సమాజాన్ని అందివ్వాలనుకున్నారు ఓ మహానుభావుడు. ఆస్ట్రియాలో అప్పుడెప్పుడో ఆయన నాటిన మొక్క విశ్వవ్యాప్తమై.. ఇప్పుడు 133 దేశాలకు విస్తరించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు 3.50 లక్షల మంది దిక్కులేని పిల్లలకు పెద్దదిక్కై నిలిచిన ఆ సంస్థ పేరు 'ఎస్ఓఎస్ చిల్డ్రన్స్ విలేజ్'. అన్నీ కోల్పోయి ఒట్టి చేతులతో అడుగుపెట్టిన ప్రతి చిన్నారికీ అన్నీ తానై నిలుస్తోంది ఈ సంస్థ. మంచి చదువులు చెప్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్ది.. తిరిగి సమాజానికి అప్పగిస్తోంది. మన రాష్ట్రంలో మూడు విలేజ్‌లను ఏర్పాటు చేసింది. అందులో ఒకటైన హైదరాబాదుకు సమీపంలోని వట్టినాగులపల్లి చిల్డ్రన్స్ విలేజ్ గురించే ఈ వారం కవర్ స్టోరీ..

తల్లిదండ్రులంటే ఎవరు?
దేనికీ లోటు రాకుండా పెంచేవారు.
అన్నదమ్ములు అక్కచెల్లెళ్లలంటే..?
రక్తసంబంధం తెంచుకోలేనివారు.
కుటుంబం అంటే..
భద్రతతోపాటు భరోసానిచ్చేది.

ఇవన్నీ లేనోళ్లను 'అనాథ'లు అంటుంది సమాజం. ఒకసారి 'ఎస్.ఒ.ఎస్.(సేవ్ అవర్ సోల్) చిల్డ్రన్స్ విలేజ్'కు వెళ్లి అక్కడున్న పిల్లల్ని చూస్తే.. ఆ మాట అనేందుకు నోరు రాదు. ఆ పిల్లల తల్లిదండ్రులు బతికున్నా.. ఇంతకంటే గొప్ప జీవితాన్ని పొందేవారు కాదేమో అనిపిస్తుంది. హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి రూట్‌లో యాభై కిలోమీటర్లు వెళితే.. వట్టినాగులపల్లికి పక్కనే ఉంటుంది ఈ స్వర్గధామం. చుట్టూ పచ్చటి పొలాలు. ఆహ్లాదకరమైన వాతావరణం. ఆత్మీయంగా పలకరించే పల్లె జనం. వీటన్నిటి నడుమ నాలుగున్నర ఎకరాల్లో ఎస్ఒఎస్‌ను తీర్చిదిద్దారు. గేటు దాటి లోపలికి అడుగుపెడుతూనే.. చూడముచ్చటైన ఇళ్లు, విశాలమైన గడ్డిమైదానాలు, అటూ ఇటూ కలియదిరిగే తెల్లటి బాతులతో.. ఖరీదైన గేటెడ్ కమ్యూనిటీకంటే గొప్పగా కనిపిస్తుంది. పొద్దున తొమ్మిదిలోపు వెళితే పిల్లలందరూ యూనిఫాం వేసుకుని, బూట్లు తొడుక్కుని, క్యారేజీలు పట్టుకుని స్కూలు బస్సులు ఎక్కుతుంటారు. తల్లులందరూ ఇళ్ల గుమ్మాల్లో నిలబడి.. చిరునవ్వులతో వారిని సాగనంపుతున్నారు. ఉదయాన్నే స్కూళ్లకు వెళ్లడం, తిరిగి సాయంత్రం ఇంటికి రావడం, మళ్లీ ట్యూషన్లకు వెళ్లడం.. సమయం దొరికినప్పుడల్లా ఆడుకోవడం.. అందరి పిల్లల్లాగే వీళ్లు కూడా బిజీగా కనిపిస్తారు. ఇక్కడున్న పిల్లల్లో కొందరికి అమ్మలేదు. మరికొందరికి నాన్న లేడు. చాలామందికి ఇద్దరూ లేరు. అయితే, ఈ ప్రాంగణంలోకి వచ్చాక.. పిల్లలకు ఆ లోటు తెలియదు. వారి దిగులు ముఖాల్లో వెలుగులు పూస్తాయి. పిల్లల కోసం కట్టిన ఇళ్లు, వాళ్లకు పెట్టే తిండి, వేసుకునే బట్టలు, కంటికి రెప్పలా చూసుకునే తల్లులను చూశాక.. దీన్ని అనాథాశ్రమం అంటే నమ్మబుద్ధి కాదు. మామూలు అనాథాశ్రమాలకు దీనికీ పోలికే లేదు. అందరి ఇళ్లలో పిల్లలు ఎంత హాయిగా బతుకుతారో, అనాథ పిల్లలు కూడా అంతే హాయిగా బతకాలన్నదే ఎస్ఒఎస్ లక్ష్యం. ఈ సంస్థ పునాదులే చాలా ప్రత్యేకమైనవి. ఆ పునాదుల్లోనే నాలుగు మూలస్తంభాలను ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి: తల్లి (మదర్), రెండు : అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు (బ్రదర్స్ అండ్ సిస్టర్స్), మూడు : ఇల్లు (హౌస్), నాలుగు : గ్రామం (విలేజ్). ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలో చిల్డ్రన్స్ విలేజ్ పెట్టాలనుకున్నా వాళ్లు ఇదే పద్ధతిని అనుసరిస్తారు. ఇప్పటి వరకు 130 దేశాలలో 500 చిల్డ్రన్స్ విలేజ్‌లను ఏర్పాటు చేసిన సంస్థ ఎస్ఒఎస్.



## ఇదొక భాగ్యం..



మాది విశాఖలోని భీమిలి. అప్పట్లో వరదలొచ్చి మా జీవితాలన్నీ ఛిద్రమయ్యాయి. ఏం చేయాలో దిక్కుతోచని సమయంలో మదర్స్ కావాలంటూ పత్రికలో వచ్చిన ప్రకటన చూశాను. అప్లికేషన్ పెట్టాను. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యాక ఢిల్లీలో శిక్షణ ఇచ్చారు. ఇక్కడ రెండేళ్లు అసిస్టెంట్ మదర్‌గా పనిచేశాక ఇప్పుడు మదర్‌గా పదోన్నతి పొందాను. నేను పెళ్లి చేసుకోలేదు కనక పిల్లల ఆలనాపాలన చూసే భాగ్యం లేదనుకున్నాను. ఇక్కడికొచ్చాక ఆ ముచ్చట తీరింది. మా హౌస్‌లో పన్నెండుమంది పిల్లలున్నారు. వాళ్లందరూ బాగా చదువుకుంటున్నారు. 'అమ్మా నేను పాసయ్యాను. నూటికి తొంభై అయిదు మార్కులొచ్చాయి' అంటూ చెబుతుంటే చాలా సంతృప్తిగా ఉంటోంది.

– **ఉషారాణి**, మదర్

## పుట్టుక ఆస్ట్రియాలో..

వ్యాపార సంస్థను స్థాపించేవారికి తెలివితేటలు కావాలి. పదిమందికి సేవచేసే సంస్థను ఏర్పాటు చేసేవారికి తెలివితేటలకంటే సున్నితమైన హృదయం ఉండాలి. అలాంటి మనసున్న మనిషి డాక్టర్ హెర్మన్ మీనర్. ఆస్ట్రియాలోని ఒక రైతు కుటుంబంలో పుట్టిన ఈయన చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్నారు. అప్పటి నుంచి తల్లిలేని లోటు తెలియకుండా పెంచి పెద్ద చేసింది వాళ్ల అక్క. బాగా చదువుకుని హెర్మన్ డాక్టర్ అయ్యారు. తల్లిదండ్రులు లేని తనలాంటి వాళ్ల కోసం ఏదైనా చేయాలనిపించింది ఆయనకు. తన అక్క మాదిరి ప్రేమతో చూసుకునే మనుషులు దొరికితే.. అనాథలకు ఏ దిగులూ ఉండదనుకున్నారు. అప్పటికే ఎన్నో రకాల అనాథాశ్రమాలను చూశారాయన. వాటన్నిటినీ అధ్యయనం చేసిన తర్వాత హెర్మన్‌కు.. ఒక కొత్త ఆలోచన తట్టింది. ఒక మనిషిని మానవీయ విలువలతో పెంచి పెద్దచేసేందుకు కుటుంబం కంటే గొప్ప వ్యవస్థ ఈ ప్రపంచంలో మరొకటి లేదనుకున్నాడు. ఆ కుటుంబం నమూనాలోనే అనాథాశ్రమాన్ని పెడితే ఎలా ఉంటుంది? అనుకున్నారు. ఆ ఆలోచనను మిత్రుల ముందు పెడితే అద్భుతం అన్నారు. దీంతో ఆస్ట్రియాలో తొలి ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఊపిరిపోసుకుంది. అందులో– రెండో ప్రపంచ యుద్ధంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు ఆశ్రయం కల్పించారు. కొరియా యుద్ధం తర్వాత కొరియాలో రెండో కేంద్రం వెలసింది. మిగిలిన దేశాలు కూడా హెర్మన్‌ను ఆహ్వానించడంతో.. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో చిల్డ్రన్స్ విలేజ్‌లు వెలిశాయి. హెర్మన్ మరణించాక ఆ స్థానంలో హెల్మట్ కుటిన్ బాధ్యతలు తీసుకున్నారు. ఒకప్పుడు కుటిన్‌కు కూడా ఎస్ఒఎస్ విలేజ్‌లోనే చదువుకునే భాగ్యం కలిగింది. ఎస్ఒఎస్ చిల్డ్రన్స్ విలేజ్ కాన్సెప్ట్‌కు మన తొలి ప్రధాని నెహ్రూ సైతం స్పందించారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ ప్రోత్సాహం ఇవ్వడంతో ఇండియాలో తొలి



చిల్డ్రన్స్ విలేజ్‌లో ఆడుకుంటున్న పిల్లలు



హౌస్ లోపలి దృశ్యం



ధ్యానం చేస్తూ...

చిల్డ్రన్స్ విలేజ్ ఫరీదాబాద్‌లో ఆవిర్భవించింది. ఇప్పుడు మన దేశంలో అన్ని రాష్ట్రాల్లో కలిపి 32 విలేజ్‌లు పనిచేస్తున్నాయి. మన రాష్ట్రంలో నెలకొల్పిన విలేజ్‌లలో విశాఖపట్టణంలో 283 మంది, వట్టినాగులపల్లిలో 170 మంది పిల్లలకు ఆశ్రయం లభించింది. తిరుపతిలో విలేజ్ నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. అక్కడ కూడా తాత్కాలిక వసతి కింద 60 మంది పిల్లలను చేరదీశారు.

## ఎవరి ఇల్లు వారిదే..

పిల్లలందర్నీ ఒకే గదిలో పెడితే సొంతింట్లో ఉన్నామన్న భావన కలుగదు. వాళ్ల మనస్తత్వాన్ని పసిగట్టి పెంచటమూ కష్టమవుతుంది. ఆ వయసులో తగినంత ప్రేమ అందకపోతే మానసిక ఎదుగుదల లోపిస్తుంది. ప్రేమాభిమానాలు లేకుండా కేవలం సౌకర్యాలొక్కటే అమర్చితే- వేళకు తిండి జరిగిపోవచ్చు. అంతో ఇంతో చదువు రావచ్చు. కాని అన్ని భావోద్వేగాల మధ్య పెరిగిన మనిషి మాత్రం అవ్వలేరు. అందుకే ప్రతి పదిమందికి ఒక హౌస్‌ను ఏర్పాటు చేసింది ఎస్ఓఎస్. ఈ ఇళ్లన్నీ గేటెడ్ కమ్యూనిటీ లోపలే ఉంటాయి. విస్తీర్ణాన్ని బట్టి హౌస్‌ల సంఖ్య పెరగొచ్చు, తగ్గొచ్చు. వట్టినాగులపల్లిలోని చిల్డ్రన్స్ విలేజ్‌లో మాత్రం 12 హౌస్‌లను నిర్మించారు. హౌస్‌లు ఎన్ని ఉన్నా ఒక్కో ఇంట్లో 10 నుంచి 12 మంది పిల్లలకే ఆవాసం లభిస్తుంది. అంతకు మించి ఒక్కరిని కూడా ఉంచరు. ఇంట్లోలానే చిన్నప్పటి నుంచి కలిసిమెలిసి ఉండే అలవాటు రావాలన్న ఉద్దేశ్యంతో.. ప్రతి హౌస్‌లో ఆడమగ ఇద్దరూ ఉండేలా చూస్తారు. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ల మాదిరి సోదర ప్రేమకు దూరం కాకూడదన్నదే ఎస్ఓఎస్ లక్ష్యం. హౌస్‌లలో చేరిన వెంటనే పిల్లల ఆసక్తులను బట్టి ప్రైవేటు స్కూళ్లలో ఇంగ్లీషు మీడియంలో చేర్పిస్తుంది యాజమాన్యం. స్కూలు ఫీజులు, యూనిఫాం, పుస్తకాల ఖర్చు పెట్టుకోవడమే కాక రానుపోను బస్సులను కూడా ఏర్పాటు చేశారు. సాయంత్రం ట్యూషన్లను కూడా పెట్టించారు. ఇక్కడున్న వాళ్లలో ఎనభైశాతం మంది పిల్లలు తొంభై శాతం మార్కులతో పాసవుతుండం విశేషం.





ఇంటి ముంగిట కాలక్షేపం

మగ పిల్లలకు 14 ఏళ్లు వచ్చాక.. 'యూత్ ఫెసిలిటీ' పేరుతో నగరంలో ప్రత్యేక వసతిని కల్పిస్తారు. పగలు వస్తూపోతూ ఉండొచ్చు కాని రాత్రి పూట మాత్రం హౌస్‌లో ఉండేందుకు అనుమతించరు. యూత్‌ఫెసిలిటీ పొందుతున్న పిల్లలు వాళ్ల ఆసక్తులను బట్టి పై చదువులు చదువుకోవచ్చు. లేదా కోర్సుల్లో శిక్షణ తీసుకోవచ్చు. అందుకు అయ్యే ఖర్చులను సంస్థే భరిస్తుంది. ఆడపిల్లల్ని మాత్రం వాళ్లు బాగా చదువుకుని, ఉద్యోగాల్లో స్థిరపడి, పెళ్లిళ్లు చేసుకునే వరకు విలేజ్ హౌస్‌లలోనే ఉంచుకుంటారు. ''నాకు అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు లేరన్న కొరతే లేదు. నేను ఎక్కడ పుట్టానో, ఇప్పుడు నా అమ్మానాన్నలెవరో నాకు అనవసరం. ఈ విలేజ్‌లో ఇంతమంది మాకోసం కనిపెట్టుకుని ఉన్నారంటే మేమెంత అదృష్టవంతులం..? మా హౌస్‌లో ఉన్న పిల్లలే నాకు బ్రదర్సు, సిస్టర్సు. ఇంతకంటే ఏం కావాలి..? విలేజ్‌లోని ఉద్యోగుల్ని కూడా 'సార్' అని పిలవం. అంకుల్, బాబాయ్, చిన్నమ్మ, పెద్దమ్మ.. అనే పిలుస్తాం..'' అంది అక్కడ ఉంటున్న ఓ ఎనిమిదేళ్ల అమ్మాయి.

## అస్తిత్వాన్ని కాపాడతాం..





పిల్లలు మా విలేజ్‌లో చేరాక.. వాళ్ల పేర్లు, కులం, మతం.. ఇలాంటివేవీ మార్చము. పిల్లల అస్తిత్వానికి ఏ మాత్రం భంగం కలిగించము. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేటప్పుడు కూడా తల్లిదండ్రుల పేర్లే నమోదు చేయిస్తాం. ఇవన్నీ చిన్న విషయాలే అనుకుంటాం కాని పిల్లలకు తమ మీద తమకు విశ్వాసాన్ని కలుగజేస్తాయవి. పండుగలు, పుట్టినరోజుల నాడు చాలా మంది అనాథాశ్రమాలకు వచ్చి.. మిఠాయిలు పంచిపెట్టడం, భోజనాలు అందివ్వడం చేస్తుంటారు. ఇలా బయటి నుంచి వచ్చే పదార్థాలను మేము ప్రోత్సహించం. ఎందుకంటే, సమాజం సానుభూతి మీద బతుకుతున్నామన్న విషయం పదే పదే గుర్తుకొస్తే.. వాళ్లలో న్యూనతాభావం కలిగే ప్రమాదం ఉంది. ఎప్పటికప్పుడు ఇలాంటి ప్రతికూల ఆలోచనలను తొలగించి.. స్ఫూర్తిని రగిలించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటాం. ఐఏఎస్, ఐపీఎస్‌లతోపాటు ఎంతో మంది ప్రముఖులు మా విలేజ్‌కు వచ్చి పిల్లల్ని ప్రోత్సహిస్తుంటారు.

**– కె.నటరాజన్, డైరెక్టర్,**

**విజయశ్రీ, అసిస్టెంట్ విలేజ్ డైరెక్టర్**

## సకల సౌకర్యాలు..

ప్రతి ఇంట్లో ఫ్రిజ్, టీవీ, డైనింగ్ టేబుల్, కిచెన్‌లతో పిల్లలకు కావాల్సిన సదుపాయాలన్నీ అమర్చారు. సాధారణ అనాథాశ్రమాల్లో అయితే- నిద్రపోవాలన్నా, అన్నం తినాలన్నా అందరికీ ఒకే చోట సదుపాయం ఉంటుంది. ఇక్కడ అలా కాదు. ఎవరింట్లో వాళ్లు వండుకు తింటారు. ఇంటికి అవసరమైన సరుకులు, కూరగాయలను ఎవరికి వాళ్లే తెచ్చుకుంటారు. కిరాణాకొట్టుకు వెళ్లినా, బట్టల దుకాణానికి వెళ్లినా, పుస్తకాలు కొనాల్సి వచ్చినా.. 'తల్లి'తోపాటు పిల్లలందరూ కలిసి బజారుకు వెళతారు. అందుకు అయ్యే బిల్లులను సంస్థ చెల్లిస్తుంది. ''ఈ ఇల్లు మాది అన్న భావన పిల్లల్లో కలగాలి. వాళ్లకు ఏం కావాలో కొనుక్కునే స్వేచ్ఛ ఉండాలి. అప్పుడే బయటి సమాజంతో సహజంగా కలిసిపోయే మనస్తత్వం అలవడుతుంది. ఆత్మవిశ్వాసం చిగురిస్తుంది..'' అన్నారు విలేజ్ డైరెక్టర్ కె.నటరాజన్. పండుగలు వచ్చినప్పుడు కూడా ఎవరికి నచ్చిన వంటలు వారు చేసుకుంటారు. కుల, మతాల భేదాలుండవు. ఏం

చేసినా పిల్లల మనసెరిగే చేయాలి. ''మా హౌస్‌లో ప్రతి పండగని సెలబ్రేట్ చేసుకుంటాం. పండగలప్పుడే కాదు. మిగిలిన రోజుల్లో కూడా పిల్లలు తమకు ఏం కావాలన్నా పోట్లాడి మరీ చేయించుకుంటారు..!'' అని చెప్పారు తల్లులు. ఇక్కడ చేరిన పిల్లలకు పుట్టినరోజు వేడుకలను ఎంతో ఘనంగా చేస్తారు. చిన్న పిల్లలకైతే బాసర తీసుకెళ్లి అక్షరాభ్యాసం చేయిస్తారు. ''అక్కడ గోడ మీదున్న నా కూతురు ఫోటోను చూడండి. దాని పేరు సాయిప్రియ. చిట్టిది ఎంత ముద్దొస్తోందో చూడండి. అది ఇక్కడికి వచ్చినప్పుడు రెండ్రోజుల పసిపాప. ఎక్కడో ఆస్పత్రిలో దొరికిందట పాపం. పోలీసులు తీసుకొచ్చి మాకు అప్పగించారు. పేరు కూడా నేనే పెట్టాను. పదకొండు రోజులకు బారసాల చేశాం. తల్లులందరం బాసరకు తీసుకెళ్లి అక్షరాభ్యాసం చేయించాం. ఇప్పుడు ఆ పిల్ల రెండో తరగతి చదువుతోంది..'' అంటూ మురిపెంగా చెప్పుకొచ్చారు మదర్ ఉషారాణి. పిల్లలు తమ రక్తం పంచుకు పుట్టకపోయినా.. సొంతపిల్లల కంటే ఎక్కువగా చూసుకునే తల్లులు ఉన్నారిక్కడ. ''స్వచ్ఛమైన ప్రేమను పంచే మదర్స్ లేకపోతే ఈ విలేజెస్సే ఉండవు'' అని చెప్పిన హెర్మన్ లక్ష్యం నెరవేరింది.

## విలేజ్‌కు అమ్మలే దిక్కు...

'చిట్టీ హోంవర్క్ పూర్తయిందా?', 'చిన్నోడా స్నాక్స్ తీసుకున్నావా?', 'స్నానం చేసిరా తల్లీ కూర్చుందాం. లెక్కల్లో డౌట్స్ అన్నావుగా' 'పరీక్షలు పూర్తయ్యాక పిక్నిక్ పెట్టుకుందాం'.. చిల్డ్రన్స్ విలేజ్‌లోని ఇళ్లలో ఇలాంటి మందలింపులు, బుజ్జగింపులే కనిపిస్తాయి. అప్పుడప్పుడు మన ఇళ్లలో విధించే చిన్నపాటి దండనలూ కనిపిస్తాయక్కడ. ఏం చేసినా పిల్లల బాగు కోసమేనంటారు తల్లులు. పిల్లల తిండితిప్పల దగ్గర్నుంచి చదువుసంధ్యల వరకు అంతా తల్లులదే బాధ్యత. అందుకే తల్లుల ఎంపికకు ఎస్ఓఎస్ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తుంది. మదర్ కావాలనుకునే వారు పదో తరగతి పూర్తి చేసుండాలి. భర్త చనిపోయి పిల్లలు లేని మహిళలను మాత్రమే అర్హులుగా పరిగణిస్తుంది సంస్థ. ఎలాంటి బాదరబందీలు లేని మహిళలే పిల్లలను బాగా చూసుకుంటారని ఈ నిబంధనలను పెట్టారు. ''రిలేషన్‌షిప్ అనే మాటకు అర్థం తల్లి నుంచే బిడ్డలకు తెలుస్తుంది. మహిళలందరూ మాతృప్రేమ అందించగలరు. అందుకే మా పిల్లల సంరక్షణ కోసం అలాంటి తల్లులనే తీసుకుంటున్నాం..'' అని చెప్పారు అసిస్టెంట్ విలేజ్ డైరెక్టర్ విజయశ్రీ. ఎంపికైన తల్లులకు ఢిల్లీలోని 'మదర్స్ ట్రైనింగ్ స్కూల్'లో ప్రాక్టికల్, థియరిటికల్ శిక్షణ ఇస్తారు. ఫ్యామిలీ కౌన్సెలింగ్, చైల్డ్‌కేర్, రిలేషన్‌షిప్స్, హెల్త్, న్యూట్రీషన్, హ్యూమన్ సైకాలజీ వంటి అంశాల మీద లోతైన అవగాహన కల్పిస్తారు నిపుణులు. ఇక్కడి నుంచి వెళ్లే మహిళలకు భాషా సమస్య తలెత్తితే, అనువాదకులను ఏర్పాటు చేస్తారు. చిల్డ్రన్ విలేజ్‌కు భిన్న మనస్తత్వాలు కలిగిన పిల్లలు వస్తారు కాబట్టి.. వాళ్లను అర్థం చేసుకునేందుకు ఈ శిక్షణ తోడ్పడుతుంది. శిక్షణ పూర్తయ్యాక మదర్స్‌గా ఉద్యోగం ఇస్తారు. రెండేళ్లకు పూర్తిస్థాయి వేతనం అందుతుంది. ఉచిత భోజన, వైద్య సదుపాయాలతోపాటు పింఛను సౌకర్యం కూడా కల్పిస్తారు. అరవై ఏళ్లు పూర్తయి రిటైర్ అయ్యే వరకు మదర్స్ యోగక్షేమాలన్నీ కూడా సంస్థే చూసుకుంటుంది. తమ ఇంటిని, పిల్లలను చక్కగా చూసుకునే తల్లులను ఎస్ఓఎస్ ప్రెసిడెంట్ బంగారపు ఉంగరంతో సన్మానిస్తారు.



స్కూలుకు వెళ్తూ...



హోం వర్క్ చేసుకుంటూ...

## పిల్లల్ని ఎలా తీసుకుంటారు..?

ఒకప్పుడు మరీ పసి పిల్లల్ని, ఒక పేరెంట్ ఉన్న పిల్లల్ని తీసుకునే వారు కాని కొత్త నిబంధనల ప్రకారం.. తల్లిదండ్రులిద్దర్నీ కోల్పోయిన పిల్లలను మాత్రమే తీసుకుంటున్నారు. అయిదు నుంచి పదేళ్ల లోపు వయసున్న పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా జిల్లాల స్త్రీ, శిశు సంక్షేమశాఖకు చెందిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీల నుంచి ఆమోదపత్రం తీసుకోవాలి. తల్లిదండ్రులు మరణించినట్లు ధృవీకరణ పత్రాలు, పిల్లల బర్త్ సర్టిఫికెట్లు ఉండాలి. దత్తత నిబంధనలకు లోబడే పిల్లలకు విలేజ్‌లో ప్రవేశం లభిస్తుంది. ఒక్కసారి తీసుకున్నాక పిల్లలకు అన్నీ తానై నిలుస్తుంది ఎస్ఓఎస్. చిల్డ్రన్ విలేజ్‌తోనే ఆగకుండా గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు కూడా మార్గదర్శిగా నిలవాలనుకుంటున్నారు వాళ్లు. ఫ్యామిలీ స్ట్రెంతెనింగ్ ప్రోగ్రామ్ (ఎఫ్ఎస్‌పి) పేరుతో విలేజ్ చుట్టుపక్కల గ్రామాల్లోని తల్లిదండ్రుల సంరక్షణ కోల్పోతున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు సంస్థ ప్రతినిధులు. కొందరికి ఆర్థిక చేయూతను అందించి కొత్త జీవితాన్ని కూడా ప్రసాదించారు. ఈ పనులన్నిటికీ కార్పొరేట్ సంస్థలు తలా ఒక చేయి వేస్తున్నాయి. చిల్డ్రన్స్ విలేజ్‌లు నడిపేందుకు మాత్రం యూరోపియన్ దేశాల దాతలే ఎక్కువ సాయం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ దేశాలను ఆర్థిక మాంద్యం పీడిస్తుండటంతో.. దాతలు చేసే సాయంపైనా ఆ ప్రభావం పడింది. ఈ విలేజ్‌లలో చదువుకున్న ఎంతోమంది పిల్లలు ఇప్పుడు ఉన్నతస్థాయి ఉద్యోగాలు చేస్తున్నారు. విమానాలను నడిపే పైలెట్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, సీఈవోలు, ఫ్యాషన్ డిజైనర్లు అయ్యారు.

ఫోటోలు : మున్వర్ ఖాన్

### ఆ పిలుపే ఒక బంధం



ఈ పిల్లలు ఏ తల్లిదండ్రులకు పుట్టారో.. ఏ ఊరో తెలియదు. అయినా నోరు తెరిచి 'అమ్మా' అంటుంటే ఆ పిలుపుతోనే బంధం అల్లుకుంది. నేను పుట్టి పెరిగిన ఇంట్లో కూడా ఇంత అనుబంధాన్ని చూడలేదు. పిల్లలందరూ మా చేతుల్లోనే పెరిగి పెద్ద చదువులకు వెళుతుంటే అదొక వరంగా భావిస్తున్నాం. వాళ్లకు ఏమీ తక్కువ కాకుండా అన్ని సదుపాయాలను కల్పించింది సంస్థ. అర్ధరాత్రయినా అపరాత్రయినా ఏ కష్టమొచ్చినా అమ్మలం మేమున్నాం. వాళ్లు ఆడుతూ పాడుతూ చదువుకుంటే చాలు. మిగిలినవన్నీ మేము చూసుకుంటాం. దిక్కులేని పిల్లలన్న ఆలోచనే రాదు. ఇది అంతర్జాతీయ స్వచ్ఛందసంస్థ. అన్ని దేశాలలో వేలమంది పిల్లలు ఈ విలేజ్‌లలో ఉంటున్నారు. వాళ్లంతా వీరికి బంధువులేనని చెబుతుంటాను. మా హౌస్‌లో పెద్దమ్మాయి విష్ణుప్రియ డిగ్రీ చదువుతోంది. మిగిలిన పిల్లలు పాఠశాల చదువు చదువుతున్నారు.

– సత్యవతి, మదర్

## సండే పజిల్

నిర్వహణ: గొరుసు

### అడ్డం

1. చేపల కోసం కాబోలు 'బక ధ్యానం' (4)
4. పెళ్లిలో వరుడి కాళ్లు కడిగి చేసే ఆచారం (4)
7. ఇది లేనివాడు దేనికీ కొరగాడు (2)
8. నగల తయారీ మనిషి (3)
10. కంచె – వెనకనుండి కట్టండి (2)
11. క్రీస్తుకి వేసింది – మొదలు లేదు (2)
13. ఒక ఉత్తరాది క్షేత్రం, 'కాశీ --- లేలనో!' అన్నాడు పింగళి (3)
15. ఒక వారం (2)
16. 'జల ప్రళయం' (3)
17. కుడితిలో కలిపే 'మెత్తని పొట్టు' (3)
18. ఇది కూడా చంపడమే (2)
19. భిన్నాంకంలో హారము నెత్తినుండేది (3)
21. సగం కన్నీళ్లు (2)
23. పక్షవాతంలో సగం (2)
25. సొరకాయకు మరో పేరు (3)
27. ఇది ఎంచి మేలు ఎంచాలి – అట్నుంచి (2)
28. హనుమంతుడు ఎత్తిన పర్వతం (4)
29. తత్త్వవేత్త 'జిడ్డు ----' (4)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | ● | 4 | | 5 | 6 |
| 7 | | ● | 8 | 9 | | ● | 10 | |
| | ● | ● | ● | | ● | ● | ● | |
| 11 | 12 | ● | 13 | | 14 | ● | 15 | |
| ● | 16 | | | ● | 17 | | | ● |
| 18 | | ● | 19 | 20 | | ● | 21 | 22 |
| | ● | ● | ● | | ● | ● | ● | |
| 23 | 24 | ● | 25 | | 26 | ● | 27 | |
| 28 | | | | ● | 29 | | | |

### నిలువు

1. 'గిరి'తో మొదలైన పాముకి తోక తెగింది (4)
2. దుర్గంధం – ఇలా వచ్చింది (2)
3. పద్మం పుట్టింది ఇందులోనే (2)
4. మనం జీవిస్తున్న యుగం (2)
5. హిందీ 'గడ్డం' (2)
6. కడప జిల్లాలో ఒక మండలం (4)
9. పాకిస్తాన్ కోడలయిన మన క్రీడాకారిణి (3)
12. అమృతం దాచుకున్న ధరణి (3)
13. 'ప్రమీలార్జునీయం'లోని స్త్రీ (3)
14. వాడుకలో భూతకాలం (3)
15. 'అడుగు' కింద నుండి పైకి వెయ్యి (3)
18. తండ్రి మాటకోసం రాముడు చేసింది (4)
20. అన్న భార్య (3)
22. యశస్సుతో అంతమైన భరతుడి సతి (4)
24. తిరగబడ్డ వేతనం (2)
25. ఆద్యంతాల ఆమని (3)
26. దయ – కిందనుండి చూపండి (2)
27. ఒకటి రెండుతో కలిసి పల్టీకొట్టింది (2)

### గత వారం సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 చె | వు | 2 డు | ● | 3 యా | ● | 4 మా | రు | 5 తీ |
| లి | ● | 6 జీ | 7 జీ | నాం | 8 చా | రి | ● | తు |
| 9 మి | 10 తం | ● | గం | ● | కు | ● | 11 రా | వు |
| ● | 12 తి | త్తి | ● | 13 గా | ● | 14 గం | గ | ● |
| 15 జ | త | ● | 16 బూ | డి | ద | ● | 17 మా | ఘ |
| ● | 18 పా | చి | ● | ద | ● | 19 వా | లి | ● |
| 20 కో | లా | ● | 21 కం | ● | 22 ఈ | ● | 23 క | 24 స |
| నం | ● | 25 బొం | ద | 26 ల | గ | 27 డ్డ | ● | మ |
| 28 గి | డు | గు | ● | త | ● | 29 బి | డి | యం |

## పూరణం

### అడ్డం

1. 'ఇష్క్'లో నితిన్ సరసన నాయిక (5)
4. 'ముత్యమంత ముద్దు'లో రాజేంద్రప్రసాద్ జోడీ (2)
5. అల్లరి నరేశ్ హీరోగా వచ్చిన 'అహ నా పెళ్లంట' సంగీత దర్శకుడు (2)
6. 'ఎంతవారుగానీ వేదాంతులైన గానీ' పాట ఈ చిత్రం లోనిదే (5)
8. జూ. ఎన్టీఆర్ హీరోగా ఎ.ఎం. రత్నం నిర్మించిన చిత్రం (2)
10. కృష్ణ, చిరంజీవి హీరోలుగా నటించిన 'తోడుదొంగలు' దర్శకుడు (3)
12. మహేశ్ 'బిజినెస్‌మేన్' సంగీత దర్శకుడు (3)

### నిలువు

1. బాలకృష్ణ, ఆద్రిమిష్‌పురి కాంబినేషన్ ఫిల్మ్ (4)
2. తనీశ్ హీరోగా పరిచయమైన చిత్రం (4)
3. కృష్ణ, జయప్రద జంటగా బోయిన సుబ్బారావు డైరెక్షన్‌లో వచ్చిన చిత్రం (4)
6. కృష్ణంరాజు, భానుప్రియ జంటగా నటించిన చిత్రం (4)
7. కేరక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్న రచయిత '....భరణి' (4)
9. 'అందాల రాముడు'లో అక్కినేని జోడీ (2)
11. తల్లి పాత్రల్లో రాణిస్తున్న నటి (2)

### గత వారం సమాధానాలు

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 సు | థీ | ర్ | 2 బా | బు | ● | 3 పూ |
| మ | ● | ● | ల | ● | ● | ల |
| 4 ల | క్ష్మి | ● | 5 చం | ద్ర | హా | రం |
| త | ● | ● | ద | ● | ● | గ |
| ● | 6 శం | 7 క | ర్ | ● | 8 వీ | డు |
| 9 ని | ● | ల్ప | ● | 10 వా | ● | ● |
| ప్పు | ● | 11 న | య | న | తా | ర |

## సినిమా పజిల్

నిర్వహణ: యజ్ఞమూర్తి

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | 2 | | ● | 3 |
| | ● | ● | | ● | 4 | |
| 5 | | ● | | ● | ● | |
| | ● | 6 | | 7 | | |
| ● | 8 | | ● | | ● | ● |
| 9 | ● | | ● | 10 | | 11 |
| 12 | | | ● | | ● | |



## కొత్తిమీరతో

**కావలసిన పదార్థాలు:** బ్రొకొలి – 2 పువ్వులు, ధనియాలు – 1 టేబుల్ స్పూను, కొత్తిమీర – 1 కట్ట, కొబ్బరి తురుము– పావు కప్పు, కరివేపాకు – 2 రెబ్బలు, పచ్చిమిర్చి – 2, ఎండుమిర్చి – 1, జీడిపప్పులు – 10, ఉప్పు – రుచికి తగినంత, మినపప్పు, ఆవాలు, జీలకర్ర – అర టీ స్పూను చొప్పున, ఇంగువ – చిటికెడు, నువ్వుల నూనె – అర టేబుల్ స్పూను.

**తయారుచేసే విధానం:** బ్రొకొలి ముక్కలుగా తరిగి ఆవిరిపైన 3 నిమిషాలు ఉడికించాలి. కడాయిలో ధనియాలు, కొత్తిమీర, కొబ్బరి తురుము వేగించి, చల్లార్చి జీడిపప్పుతో పాటు (కొద్ది నీరు కలిపి) మెత్తగా రుబ్బుకోవాలి. నూనెలో తాలింపు గింజలు, ఎండుమిర్చి, కరివేపాకు వేగాక ఉడికిన బ్రొకొలి ముక్కలు వేయాలి. రెండు నిమిషాల తర్వాత మసాలా పేస్టు కలిపి సన్నని మంటపై బుడగలు వచ్చేదాక ఉడికించాలి. ఈ కూర అన్నంలోకి బాగుంటుంది.

వంటశాల

# బ్రొకొలి...బ్రొకొలి

***చూడటానికి కాలీఫ్లవర్‌లా కన్పించినా ఆకుపచ్చ అందం సంతరించుకున్న పువ్వుకూర 'బ్రొకొలి'. ఇప్పుడు అన్ని సూపర్‌మార్కెట్లలోనూ మిగతా కూరగాయలతో పాటు దొరుకుతోంది. ఎన్నో పోషక విలువ లున్న బ్రొకొలిని సలాడ్, సూప్స్‌లే కాక కూరగా కూడా చేసుకోవచ్చు.***



## క్యారెట్‌తో

**కావలసిన పదార్థాలు:** బ్రొకొలి – 2 పువ్వులు, క్యారెట్ – 1, ఉల్లిపాయ – 1, పచ్చిమిర్చి – 2, నూనె – 2 టీ స్పూన్లు, ఉప్పు – రుచికి తగినంత, గరం మసాలా – అర టీ స్పూను, ఆవాలు – అర టీ స్పూను.

**తయారుచేసే విధానం:** బ్రొకొలి, క్యారెటును ముక్కలుగా తరిగి చిటికెడు ఉప్పు వేసి ఉడికించాలి. నీళ్లు వార్చి పక్కనుంచాలి. తాలింపులో ఆవాలు చిటపటమన్న తర్వాత, ఉల్లి, పచ్చిమిర్చి వేగించాలి. ఉడికిన బ్రొకొలి, క్యారెట్ ముక్కలతో పాటు ఉప్పు, ఉడికించిన నీటిని కలిపి సన్నని మంటపైన 5 నిమిషాలు ఉంచాలి. దించే ముందు గరంమసాల చల్లాలి. ఈ కూర అన్నంలోకైనా, చపాతీల్లోకైనా బాగానే ఉంటుంది.





## శనగలతో

**కావలసిన పదార్థాలు:** బ్రొకొలి – 4 పువ్వులు, వెల్లుల్లి – 2 రేకలు, ఉల్లిపాయ –1, (నానబెట్టిన) శనగలు – 1 కప్పు, వెజిటెబుల్ స్టాక్ – అర కప్పు, మిరియాలపొడి – అర టీ స్పూను, ఉప్పు – పావు టీ స్పూను, నూనె – అర టేబుల్ స్పూను.

**గ్రేవీ కోసం:** వెల్లుల్లి – 2 రేకలు, వెజిటెబుల్ స్టాక్ – అరకప్పు, టొమోటాలు – 2, (రెడ్) క్యాప్సికం – 1, గరం మసాల పొడి – 1 టీ స్పూను, కారం – అర టీ స్పూను, జీలకర్రపొడి – 1 టీ స్పూను.

**తయారుచేసే విధానం:** గ్రేవీ కోసం పైన చెప్పిన పదార్థాలన్నీ ముందుగా గ్రైండ్ చేసి పెట్టుకోవాలి. నూనెలో ఉల్లి తరుగు, వెల్లుల్లి, బ్రొకొలి ముక్కలు, శనగలు రెండు నిమిషాలు వేగించి వెజిటెబుల్ స్టాక్ వేసి మూత పెట్టి 5 నిమిషాలు ఉడికించాలి. తర్వాత గ్రేవీ వేసి 15 నిమిషాలు ఉంచాలి. ఉప్పు, మిరియాల పొడి కలిపి దించేయాలి. పరాటాల్లోకి ఈ కూర బాగుంటుంది.

ఈ వారం కథ

# ‘గ లు బె’

★ సాయి బ్రహ్మానందం గొర్తి

బొమ్మలు: అక్బర్

**యూసెమిటి యాత్రకి కెనడీ మిడిల్ స్కూల్ బస్సులన్నీ సిద్ధంగా ఉన్నాయి. తల్లిదండ్రులందరూ తమ తమ పిల్లల్ని వారికి కేటాయించిన బస్సుల దగ్గర వీడ్కోలు ఇస్తున్నారు. కొంతమంది పిల్లల బ్యాగులూ అవీ బస్సులోపల ఎక్కించడానికి సహాయం చేస్తున్నారు. అక్కడంతా చాలా కోలాహలంగా ఉంది. ఏటా ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులందర్నీ వారం రోజుల విహార యాత్రకి తీసుకెళ్లడం కాలిఫోర్నియా స్కూళ్లకి పరిపాటి. దాదాపు విద్యార్థులందరూ వెళతారు.**

‘‘సిద్ధూ జాగ్రత్త. నీక్కావలసిన వెబ్‌స్టర్ డిక్షనరీ, స్పెల్ ఇట్ పుస్తకాలన్నీ ఐపేడ్‌లోకి నాన్న డౌన్లోడ్ చేశారు. బ్రేక్ టైములో రివ్యూ చేసుకో. రాత్రి డిన్నరయ్యాక మరోసారి చదువుకో. చెప్పడం మర్చిపోయాను. మీరు హైకింగ్‌కి వెళ్లినప్పుడు నువ్వు చదువుకోడానికని ఫ్లాష్ కార్డులు కూడా నీ బ్యాగులో పెట్టాను. టైం వేస్టు చెయ్యకు’’ సిద్ధూ వాళ్ల అమ్మ చెప్పుకుంటూ పోతోంది. సిద్ధూ చికాగ్గా మొహం పెట్టి తల్లికేసి చూశాడు.

ఇది గమనించిన సిద్ధూ వాళ్ల నాన్న ‘‘అబ్బా, ఆల్రెడీ ఇంతకు ముందు కారులో చెప్పావు కదా. వాడు చదువుతాడులే ... వదిలేయ్ వాణ్ణి’’ అంటూ నువ్వు అమ్మ మాటలు పట్టించుకోకన్నట్లుగా సిద్ధూకేసి చూశాడు.

‘‘మీరిలాగే చెప్పి వాణ్ణి తగలేయండి. వచ్చే రాగానే కాలిఫోర్నియా స్పెల్లింగ్ బీ ఫైనల్స్ ఉంది. కేథరీన్ అసలు పంపవద్దని చెప్పింది. కాలిఫోర్నియా ఫైనల్సులో ఫస్టు రాకపోతే ఇన్నేళ్ల శ్రమా వృధా అవుతుంది. వాడు వెళతానని ఏడిస్తే పంపుతున్నాను. పంపడం నాకస్సలు ఇష్టం లేదు. అయినా మనం యూసెమిటీకి క్రితం సమ్మరులోనే వెళ్లాం కదా? అన్ని సార్లు చూడ్డానికి అదేమయినా డిస్నీలాండా?’’ మొగుడికేసి కోపంగా చూస్తూ అంది. సిద్ధూ వాళ్ల నాన్న ఇదంతా మామూలే అన్నట్లు చూశాడు.




పిల్లలందరూ ఎక్కారని నిర్ధారించుకున్న తర్వాత బస్సులన్నీ బయల్దేరాయి. ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాడు సిద్ధూ.

బస్సు బయల్దేరుతుండగా ఒక నల్లజాతి పిల్లాడు సిద్ధూ పక్కన వచ్చి కూర్చున్నాడు.

‘‘హాయ్, ఐ యామ్ ఎరిక్ ... కెన్ ఐ సిట్ హియర్?’’ అని అడిగాడు. కూర్చోమన్నట్లు తలాడిస్తూ సిద్ధూ తన పేరు చెప్పాడు. ఎరిక్‌తో పెద్దగా పరిచయం లేదు కానీ లంచ్ బ్రేకులో బాస్కెట్ బాల్ ఆడుతుండగా రెండు మూడు సార్లు చూశాడు. అంతకు మించి పరిచయం లేదు.

‘‘నీదే విలేజ్? నాది ఎల్’’ తనే మళ్లీ అడిగాడు. సిద్ధూ తన విలేజ్ చెప్పాడు. (క్లాసు రూములని విలేజ్ అంటారు)

సిద్ధూ చాలా ముభావి. చెప్పుకోదగ్గ స్నేహితులు ఎవరూ లేరు. ఉన్న సమయం కాస్తా స్పెల్లింగ్ బీకీ, హోం వర్కుకే సరిపోతోంది.

కొంతసేపయ్యాక ఎరిక్ గేమ్ బాయ్‌ను బ్యాగ్‌లోంచి తీశాడు. సిద్ధూ దానికేసి కాసేపు ఆసక్తిగా చూశాడు. మళ్లీ ఎరిక్ ఏమనుకుంటాడో అనుకొని, ఐపేడ్ తీసి స్పెల్ ఇట్ చదవడం ప్రారంభించాడు.

గేమ్ ఆడటానికే సిద్ధూ ఐపేడ్ తీశాడనుకున్న ఎరిక్, సిద్ధూ డిక్షనరీ చదవడం చూసి ఆశ్చర్యపోయాడు.

‘‘ఏమిటి? కొత్త గేమా?’’

‘‘కాదు. స్పెల్లింగ్‌బీకి సంబంధించిది’’

సిద్దూ మెల్లగా చెప్పాడు.

ఎరిక్ సిద్దూ కేసి అదోలా చూసి తన ఆటలో మునిగిపోయాడు. సిద్దూకి చదవ బుద్ధి కాలేదు. ఎరిక్ చేతిలోని గేమ్ బాయ్ వైపే చూస్తున్నాడు.

కొంతసేపయ్యాక "నీకూ ఆడాలనుందా?" అన్నాడు. సిద్దూకి ఏం చెప్పాలో తెలీక అయోమయంగా చూశాడు. ఎన్నోసార్లు అమ్మని వీడియో గేమ్స్ గురించి అడిగాడు. ఫలితం సున్నా. అమ్మకెప్పుడూ చదువూ, చదువే! ఇంకేం పట్టవు.

ఎరిక్ సిద్దూ చేతిలో గేమ్ బాయ్ పెట్టి ఆడమన్నట్లు చూశాడు.

తటపటాయిస్తూ సిద్దూ దాన్ని అందుకున్నాడు.

★★★

యూసెమిటి చేరుకునేసరికి మధ్యాహ్నం మూడు దాటింది.

పిల్లలందరికీ రోజువారీ కార్యక్రమాలూ, అక్కడి రూల్సూ వగైరాలు వివరంగా చెప్పారు. వారం రోజుల్లో ఏమేమి చేయనున్నారో ప్రణాళిక వేసి చూపించారు.

యూసెమిటి లోయ చాలా అందమైన ప్రదేశం. వసంత రుతువు సమీపిస్తున్నా అక్కడ కొండల్ని మంచు వీడలేదు. సిద్దూ ఇంతకుముందే ఇవన్నీ చూశాడు. కాకపోతే ఇంత దట్టంగా ఘనీభవించిన మంచుని చూళ్లేదు. ఎరిక్ యూసెమిటి రావడం ఇదే మొదటిసారి. ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూసి 'వావ్' అనుకున్నాడు.



**"ఇది నేషనల్ స్పెల్లింగ్ బీ. నెక్స్ట్ వీక్ కాలిఫోర్నియా ఫైనల్సులో నెగ్గితే నేషనల్సులో గెలిచే అవకాశముంది. ఫైనల్స్ టీవీలో వస్తుంది కూడా" ఈ మాత్రం తెలీదా అన్న ధ్వనితో అన్నాడు సిద్దూ.**

**"కమాన్, డూడ్! మనం ఇక్కడికి ఎంజాయ్ చెయ్యడానికొచ్చాం. నాట్ ఫర్ స్టడీస్!" రెచ్చగొట్టినట్లుగా అంటూ ఎరిక్ గేమ్ బాయ్‌ని సిద్దూ చేతిలో పెట్టాడు.**

పిల్లలందర్నీ వాళ్లకి కేటాయించిన కేబిన్లకి తీసుకెళ్లారు. యాదృచ్ఛికంగా సిద్దూకీ, ఎరిక్‌కీ పక్కపక్క బెడ్‌లు వచ్చాయి.

ఆ రాత్రి పడుకోబోయే ముందు సిద్దూ స్పెల్లింగ్ బీ చదవడానికని మళ్లీ ఐపాడ్ తీశాడు.

"వాటీజ్ దిస్ డూడ్? ఏదైనా పరీక్షా?" దాన్ని చూడగానే మరోసారి ఆశ్చర్యపోతూ అడిగాడు ఎరిక్.

"ఇది స్పెల్లింగ్ బీకి ప్రిపరేషన్. నీకు తెలీదా?" జవాబిచ్చాడు సిద్దూ.

"స్కూల్లో ఇదెప్పుడో అయిపోయింది కదా?" ఎరిక్‌కి చదువు మీద అంత శ్రద్ధ లేదు. అతనికి బాస్కెట్ బాల్ ఆడడం ఒక్కటే ఇష్టం. అదే అతని ప్రపంచం.

"ఇది నేషనల్ స్పెల్లింగ్ బీ. నెక్స్ట్ వీక్ కాలిఫోర్నియా ఫైనల్సులో నెగ్గితే నేషనల్సులో గెలిచే అవకాశముంది. ఫైనల్స్ టీవీలో వస్తుంది కూడా" ఈ మాత్రం తెలీదా అన్న ధ్వనితో అన్నాడు సిద్దూ.

"కమాన్, డూడ్! మనం ఇక్కడికి ఎంజాయ్ చెయ్యడానికొచ్చాం. నాట్ ఫర్ స్టడీస్!" రెచ్చగొట్టినట్లుగా అంటూ ఎరిక్ గేమ్ బాయ్‌ని సిద్దూ చేతిలో పెట్టాడు.

ఉదయం బస్సులో మూడు గంటలు ఆడినప్పుడే అతనికి అందులో ఉన్న మజా తెలిసింది. సిద్దూ వద్దనలేదు.

★★★

"బాస్కెట్ బాల్ ఆడదామా? మన కేబిన్ దగ్గర్లో ఒక హూప్ చూశాను" ఎరిక్ సిద్దూని అడిగేడు. ఆ రోజు మంచు ఎక్కువగా కురవడంతో హైకింగ్ కార్యక్రమం రద్దు చేశారు. పిల్లలకు అక్కడే వారికి తోచినవి చేసుకోమని చెప్పారు.

సిద్దూ ఎప్పుడూ బాస్కెట్ బాల్ ఆడలేదు. అసలు ఏ ఆటా ఆడడానికి అతనికి అవకాశమే రాలేదు. చదువూ, స్పెల్లింగ్ బీ, కోచింగూ వాటితోనే సరిపోయేది. ఎప్పుడైనా ఇంట్లో యూనో గేమ్ ఆడేవాడంతే!

"ఆడ్డానికి బాల్ కావాలి కదా. అయినా నాకు రాదు" సిద్దూ చెప్పాడు.

"అక్కడ స్టోరు ఉంది, వెళ్లి కొనుక్కొస్తాను. నేను నేర్పిస్తాగా" అంటూ ఎరిక్ పరిగెత్తాడు.

అతన్ని అనుసరించాడు సిద్దూ.

మొదట్లో కాస్త ఇబ్బందనిపించినా ఒక గంట గడిచేసరికి సిద్దూకి ఆటలో మెళకువ తెలిసింది. ఎంతసేపు ఆడారో వాళ్లకే తెలియలేదు.

"నాకు తెలీక అడుగుతాను. బాస్కెట్ బాల్ మీవాళ్లే ఎక్కువ ఆడతారెందుకని?" సిద్దూకి అనుమానమొచ్చి అడిగాడు.

"మీ ఏషియన్స్ స్కూల్లో ఎందుకు టాప్ రాంకులన్నీ కొట్టేస్తున్నారు? ఇదీ అంతే!" ఎదురు ప్రశ్నించాడు ఎరిక్.

సిద్దూ వద్ద సమాధానం లేదు. అతనికి అమ్మ మాటలు గుర్తుకొచ్చాయి.

"నువ్వు కనక ఈసారి స్పెల్లింగ్ బీ నేషనల్స్‌కి వెళ్లకపోతే ఊరుకునేది లేదు ..." ఆ మాటలు తలచుకుంటేనే భయం వేసింది. క్రితం సారి ఎనిమిదో స్థానం వచ్చిందని ఇంట్లో పెద్ద యుద్ధం చేసింది అమ్మ. తన బదులు వారం రోజుల పాటు తల్లి ఏడవడం గుర్తుకొచ్చింది.

"డూడ్! బాస్కెట్ బాల్ ఈజ్ ఎ ఫన్ గేమ్! రేపు కూడా బ్రేక్ టైములో ఆడదాం. నేను మిగతా వాళ్లకి చెబుతాను" అంటూ ఎరిక్ మర్నాటికి రంగం సిద్ధం చేశాడు.

ఆ రాత్రి కూడా గేమ్ బాయ్ సిద్దూ చేతుల్లో నలిగిపోయింది.

★★★

యూసెమిటిలో ఉన్న ఏడు రోజులూ ఏడు క్షణాల్లా గడిచిపోయాయి సిద్దూకి. ఏనాడూ స్పెల్లింగ్ బీ చదివిన పాపాన పోలేదు. తల్లి తిడుతుందని తెలుసు. కానీ అతనికి అక్కడి జలపాతాలూ, మంచుకొండలూ, వాతావరణమూ ఎంతో నచ్చేశాయి. ఇంతకుముందు చాలా సార్లు చూసిన ప్రదేశమయినా ఈసారి మరింత కొత్తగా, అందంగా అనిపించింది. ముఖ్యంగా ఎరిక్‌తో బాస్కెట్ బాల్ ఆడడమూ, రాత్రిళ్లు గేమ్ బాయ్ ఆడుకోవడమూ!

"ఈ వారం రోజులూ ఎంతో ఫన్! బాగా గడిచింది కదా?" సిద్దూ బస్సెక్కుతుండగా అన్నాడు. ఈసారి కూడా ఇద్దరూ పక్కపక్కనే కూర్చున్నారు.

"అవును. రోజూ స్కూల్లో లంచ్ టైములో

బాస్కెట్ బాల్ ఆడతాం. నువ్వూ రా. వారంలో ఆటని భలే పట్టేశావే! నీ త్రీ పాయింటర్స్ సూపర్బ్'' సిద్దూని పొగుడుతూ అన్నాడు ఎరిక్.

స్కూల్లో కూడా ఆడితే బాగుంటుంది కాని అమ్మకి తెలిస్తే ఊరుకోదు. చంపేస్తుంది. పైగా ఈ వారం రోజుల్లో అస్సలు ఒక్కసారి కూడా స్పెల్ ఇట్ పుస్తకం తెరవలేదు.

''మా అమ్మకి ఇలాంటివి నచ్చవు. అయినా రావడానికి ప్రయత్నిస్తాను. బాస్కెట్ బాల్ నాకూ బాగా నచ్చింది. ఇట్స్ ఫన్!'' సిద్దూ సంతోషంగా అన్నాడు.

★★★

సిద్దూ కాలిఫోర్నియా స్పెల్లింగ్ బీలో నెగ్గి నేషనల్స్‌కి వెళ్లాడు. యూసెమిటి యాత్ర నుండి వచ్చాక సిద్దూ వాళ్లమ్మ అతనికి ఊపిరి సలపనీయలేదు.

అయినా సిద్దూకి ఎరిక్‌తో స్నేహం బాగా పెరిగింది. ప్రతీరోజూ లంచ్‌లో కలవడం, బాస్కెట్ బాల్ ఆడడం స్కూలు దినచర్యలో భాగమైపోయాయి.

ఒకరోజు ఎరిక్ పుట్టినరోజు పార్టీకి పిలుస్తూ స్లీపోవర్‌కి ఉండిపొమ్మన్నాడు. స్లీపోవర్ అంటే రాత్రంతా ఎరిక్ ఇంట్లో ఉండిపోవడం. అమ్మ ఒప్పుకోదని సిద్దూకి తెలుసు. అయినా అడిగాడు. ఎరిక్ పేరు చెప్పగానే 'ఎవరీ కొత్త పిల్లాడు?' అంది. యూసెమిటి వెళ్లినప్పుడు పరిచయమయ్యాడని చెప్పాడు.

''కావాలంటే ఓ రెండు గంటలు పార్టీకెళ్లిరా. నో స్లీపోవర్!'' గట్టిగా చెప్పింది. కనీసం పార్టీకయినా ఒప్పుకుందన్న సంతోషంలో స్లీపోవర్‌కి సిద్దూ పట్టు పట్టలేదు.

బర్త్‌డే పార్టీలో కేక్ కటింగ్ అయ్యాక, ఎరిక్ వాళ్ల నాన్న ఒక ప్రత్యేకమయిన వాయిద్యంతో పాట వాయించాడు. చివర్లో 'హేపీ బర్త్‌డే' కూడా వాయించాడు. సిద్దూకి ఆ వాయిద్యం నచ్చింది. చూడ్డానికి ఫ్లూటులా ఉన్నా, ఫ్లూటు కాదు. ఎరిక్ కూడా అది వాయించాడు. సిద్దూకి బాగా నచ్చిందని తెలిసి ఎరిక్ ఆ వాయిద్యాన్ని ఇవ్వబోయాడు.

''తీసుకో. ఇది నా గిఫ్ట్. దీని పేరు గలుబె. ఈ వాయిద్యం మా కుటుంబంలో అందరూ, అంటే మా తాత, వాళ్ల నాన్నా, అలా అందరూ వాయిస్తారు. నా పేరు, ఎరిక్ జి. విలియమ్‌లో జి అంటే గలుబ. అది ఈ వాయిద్యం పేరే. మా ఇంట్లో నా ముద్దు పేరు కూడా గలుబ. నిజానికి గలుబె అని పిలవాలి. కానీ అందరూ గలుబ అనే అంటారు'' ఎరిక్ వివరించాడు.

**''తీసుకో. ఇది నా గిఫ్ట్. దీని పేరు గలుబె. ఈ వాయిద్యం మా కుటుంబంలో అందరూ, అంటే మా తాత, వాళ్ల నాన్నా, అలా అందరూ వాయిస్తారు. నా పేరు, ఎరిక్ జి. విలియమ్‌లో జి అంటే గలుబ. అది ఈ వాయిద్యం పేరే. మా ఇంట్లో నా ముద్దు పేరు కూడా గలుబ. నిజానికి గలుబె అని పిలవాలి. కానీ అందరూ గలుబ అనే అంటారు''**




గలుబె అన్నది ఫ్రెంచ్ పదం కదాని సిద్దూ అంటే, అవును మా వాళ్లు ఫ్రాన్సు నుండి అమెరికా వచ్చారని ఎరిక్ చెప్పాడు.

సరిగ్గా రెండు గంటలవగానే సిద్దూ వాళ్లమ్మ వచ్చి అతన్ని తీసుకెళ్లింది. సిద్దూకి మాత్రం ఇంకా అక్కడే ఉండాలని ఉంది. కానీ తల్లి ముందు తన మాట సాగదని తెలుసు.

ఇప్పుడు స్కూల్లో సిద్దూకున్న ఏకైక మిత్రుడు ఎరిక్. సిద్దూకి ప్రతీ రోజూ స్కూల్లో ఎరిక్‌తో బాస్కెట్ బాల్ ఆడడం వ్యసనంలా తయారయ్యింది.

ఓ రోజు తల్లికి ఆ విషయం తెలిసి నానా రాద్ధాంతమూ చేసింది. అది చూసి బెదిరిపోయాడు సిద్దూ. మర్నాడు ఎరిక్‌కి చెబుదామని స్కూల్లో అతనికోసం చూశాడు.

కాని ఎరిక్ కనబడలేదు. స్కూలుకి రాలేదేమో అనుకున్నాడు. ఆ మర్నాడూ కనిపించలేదు. చూస్తుండగా వారం గడిచింది. అయినా ఎరిక్ స్కూల్లో కనిపించలేదు. ఎరిక్ విలేజ్ వాళ్లని వాకబు చేశాడు. ఎరిక్ స్కూల్ మానేశాడని మాత్రమే తెలిసింది. చెప్పా పెట్టకుండా ఎరిక్ ఎక్కడికెళ్లాడో అర్థం కాలేదు సిద్దూకి. తోటి స్నేహితులని అడిగి చూశాడు. ఎవరికీ తెలియదన్నారు ప్రిన్సిపల్‌తో సహా. సాధారణంగా స్కూల్ అయ్యాక పిల్లలందరూ గూగుల్ చాట్‌లో ఉండేవారు. కాని ఆ తర్వాతెప్పుడూ గూగుల్ చాట్‌లో ఎరిక్ పేరు పక్కన పచ్చ గుర్తు కనిపించలేదు.

అమ్మ కసురుకుంటుందని తెలిసినా రోజూ లంచ్ టైములో బాస్కెట్ బాల్ హూప్ దగ్గరే నిలబడి ఆట చూస్తూ ఉండేవాడు. ఎరిక్ లేకుండా బాస్కెట్ బాల్ ఆడడానికి అతనికి అయితే మనసొప్పలేదు.

చూస్తుండగానే రెండు నెలలు గడిచిపోయాయి. ఎరిక్ జాడ మాత్రం తెలియలేదు సిద్దూకి.

★★★

సిద్దూ నేషనల్ స్పెల్లింగ్ బీ ఫైనల్స్‌కి వెళ్లాడు. మొత్తం పోటీని టీవీలో లైవ్ చూపిస్తున్నారు.

సెమీ ఫైనల్ వడబోత తర్వాత లీసా అనే అమెరికన్ అమ్మాయీ, సిద్దూ మాత్రమే ఫైనల్స్‌లో మిగిలారు.

మొదట ఇద్దర్నీ చెరో పదం అడిగారు. ఇద్దరూ సరిగానే చెప్పారు. ఒకరు తప్పు చెప్పి, రెండోవాళ్లు సరిగా చెబితే వెంటనే వాళ్లనే విజేతగా ప్రకటిస్తారు. ఎవరో ఒకరు తప్పు చెప్పేదాకా అది అలా కొనసాగుతుంది.

సిద్దూ వాళ్లమ్మకి భరించరాని ఉద్వేగంగా ఉంది.

సిద్దూకి కూడా చాలా నెర్వస్‌గా ఉంది. ఈ సారి గెలవకపోతే అమ్మ ఊరుకోదు. క్రితంసారి అమ్మ కోపం ఇంకా గుర్తుంది తనకి.

మొత్తం హాలంతా ఎంతో ఉత్కంఠ. ఎవరు విజేత అవుతారో అని చూస్తున్నారు.

లీసాని మరో పదం అడిగారు. సరిగానే చెప్పింది. తరువాత సిద్దూ వంతు. సిద్దూ కూడా కరక్టుగానే చెప్పాడు. ఇలా మూడుసార్లు జరిగాక లీసా ఒక పదం తప్పు చెప్పింది. ఇప్పుడు సిద్దూ వంతు.

అతన్నడిగిన పదం సరిగా చెబితే అతనే ఈ ఏడాది స్పెల్లింగ్ బీ విజేత. సుమారు ఏభై లక్షల బహుమానం.

లీసా తప్పు చెప్పిందని తెలియగానే సిద్దూకి వణుకు ప్రారంభం అయ్యింది. ఇదే చిట్టచివరి అవకాశం. చేతులు వణుకుతు

న్నాయి. మెదడు ఒక్కసారి మొద్దుబారిపోయింది.

అక్కడున్న జడ్జి చివరగా ఒక పదం అడిగాడు. ఆ పదం వినగానే ఎక్కడో విన్నట్లుగా అనిపించింది.

సూదిపడితే వినిపించేటంతటి నిశ్శబ్దం. అందరి మొహాల్లో ఉత్కంఠ!

సాధారణంగా ఒక్కో పదం స్పెల్లింగ్ చెప్పడానికి కొంత సమయం ఇస్తారు. అందులో ఆ పదం యొక్క పుట్టుపూర్వోత్తరాలూ, మూల భాష ఇలాంటివన్నీ అడిగి తెలుసుకున్నాక చివరగా స్పెల్లింగ్ చెప్పమంటారు. జడ్జి పదం చెప్పి చెప్పగానే ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా జవాబిచ్చేశాడు సిద్ధూ.

అక్కడున్న అందరూ తెల్లబోయి చూశారు.




జడ్జి సిద్ధూ చెప్పినది కరక్టని అనగానే ఆ ప్రదేశమంతా కరతాళ ధ్వనులతో మారుపోగింది. సిద్ధూ వాళ్లమ్మ అది తట్టుకోలేక ఏడుస్తూ కిందపడిపోయింది.

సిద్ధూ కంటి నిండా జలజలా కన్నీళ్లు రాలాయి.

అందరూ స్పెల్లింగ్ బీ నెగ్గినందుకని అనుకున్నారు. కాని ఎరిక్ గుర్తుకొచ్చాడు, సిద్ధూకి.

సిద్ధూ నెగ్గిన పదం ...

గలుబె: G-A-L-O-U-B-E-T.

★★★

సిద్ధూ పేరు టీవీల్లోనూ, పేపర్ల నిండా మారుమోగిపోయింది. ఒక్కసారిగా కుపర్టినో స్కూల్లో హీరో అయిపోయాడు. వాళ్లమ్మ ఆకాశంలో తేలుతోంది.

ఎంతోమంది సిద్ధూని మెచ్చుకున్నా, ఎరిక్ లేని లోటు కొట్టొచ్చినట్టు కనబడింది సిద్ధూకి. ఎరిక్ గుర్తొచ్చినప్పుడల్లా ఇంట్లో గలుబె వాయిద్యాన్ని వాయించడానికి ప్రయత్నిస్తాడు సిద్ధూ.

ప్రతీ రోజూ లంచ్ టైములో బాస్కెట్ బాల్ హూప్ దగ్గరకి వెళ్లి అక్కడ వేరే పిల్లలు ఆడుతూంటే చూస్తాడు తప్ప తనెప్పుడూ ఆడడు. ఎరిక్ ఎప్పటికయినా వస్తాడన్న ఆశ.

★★★

మూడు వారాల తరువాత, ఒకనాడు హఠాత్తుగా గూగుల్ చాట్‌లో ఎరిక్ పేరు పక్కన పచ్చ గుర్తు కనిపించేసరికి ఒక్కసారి ఎగిరి గంతేశాడు సిద్ధూ!

సిద్ధూ: ఓ మై గాడ్! హాయ్ ఎరిక్! ఐ కాంట్ బిలీవ్ ఇట్. ఎలా ఉన్నావు?

ఎరిక్: హాయ్ సిద్ధూ! బాగానే ఉన్నాను. నువ్వెలా ఉన్నావు?

సిద్ధూ: బావున్నాను. ఏమైపోయావిన్నాళ్లూ? నీ గురించి ఎంత చూశానో తెలుసా?

ఎరిక్: సారీ. అనుకోకుండా మేం అమెరికా వదిలి వెళ్లాల్సి వచ్చింది. మా నాన్న మా వాళ్లని చూడ్డానికని ఫ్రాన్సు వెళ్లాడు. అక్కడ కారు ఏక్సిడెంటు జరిగిందని తెలిసి మేమూ వెళ్లాం. అక్కడ ఓ రోజు బాస్కెట్ బాల్ ఆడుతుండగా తలకి పెద్ద గాయం అయ్యి రెణ్ణెల్లు ఆసుపత్రిలో ఉన్నాను. ఎలాగో బతికి బయటపడ్డాను. ఇది జరిగిన నెల్లాళ్లకి మా నాన్న చనిపోయాడు. మా అమ్మా, నేనూ ఇక్కడే ఉండి

**''సారీ. అనుకోకుండా మేం అమెరికా వదిలి వెళ్లాల్సి వచ్చింది. మా నాన్న మా వాళ్లని చూడ్డానికని ఫ్రాన్సు వెళ్లాడు. అక్కడ కారు ఏక్సిడెంటు జరిగిందని తెలిసి మేమూ వెళ్లాం. అక్కడ ఓ రోజు బాస్కెట్ బాల్ ఆడుతుండగా తలకి పెద్ద గాయం అయ్యి రెణ్ణెల్లు ఆసుపత్రిలో ఉన్నాను. ఎలాగో బతికి బయటపడ్డాను. ఇది జరిగిన నెల్లాళ్లకి మా నాన్న చనిపోయాడు. మా అమ్మా, నేనూ ఇక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.''**

పోవాల్సి వచ్చింది.

సిద్ధూ: ఐ యాం వెరీ వెరీ సారీ! ఇప్పుడు ఎలా ఉన్నావు? ఇంకా ఫ్రాన్స్‌లోనే ఉన్నావా? ఐ రియల్లీ మిస్ యూ!

ఎరిక్: మీ టూ! యా, ఫ్రాన్సులోనే ఉన్నాను.

సిద్ధూ: ఐ యాం రియల్లీ వెరీ హాపీ టు హియర్ యూ!

ఎరిక్: మీ టూ! ఏవయ్యింది నీ స్పెల్లింగ్ బీ? నువ్వు నెగ్గావా?

సిద్ధూ: నెగ్గాను.

ఎరిక్: ఓ ... గ్రేట్! యూ ఆర్ రియల్లీ ఎ జీనియస్!

సిద్ధూ: నో, ఐ యాం లక్కీ!

ఎరిక్: కమాన్: యూ గాట్ టేలెంట్! యూ ఆర్ మై హీరో టూ!

సిద్ధూ: నేనా?

ఎరిక్: అవును. ఆసుపత్రిలో ఉండగా బోరు కొట్టినప్పుడు చాలా పుస్తకాలు చదివాను. తెలీని పదం చదివినప్పుడల్లా నువ్వే గుర్తుకొచ్చేవాడివి. కొన్నాళ్లకి నాకు తెలియకుండానే స్పెల్లింగ్స్ మీద ఇంటరెస్టు వచ్చింది. చదువంటే శ్రద్ధ లేని నాకు ఇప్పుడిప్పుడే నెమ్మదిగా ఇష్టం కలుగుతోంది. ఇప్పుడు నీలా చదవాలని అనుకుంటున్నాను.

సిద్ధూ: గ్రేట్! నీకో విషయం తెలుసా?

ఎరిక్: ఏమిటది?

సిద్ధూ: వన్ మినిట్, మా అమ్మ పిలుస్తోంది..

ఎరిక్: నో ప్రోబ్లెం..

ఓ రెండు నిమిషాల తరువాత –

సిద్ధూ: సారీ, మా అమ్మ పిలిచింది. ఇంకో రెండు గంటల్లో నాకు టీవీలో ఇంటర్వ్యూ ఉంది. నేను వెళ్లాలి.

ఎరిక్: యూ ఆర్ ఏ బిగ్ హీరో నౌ! యేదో చెబుతూ మధ్యలో ఆపేసావు?

సిద్ధూ: డూ యూ నో ది ఫైనల్ వర్డ్ ఐ వన్ ఇన్ స్పెల్లింగ్ బీ?

ఎరిక్: నో!

సిద్ధూ: ఇట్ ఈజ్ గలుబె.

ఎరిక్: యూ ఆర్ కిడింగ్!

సిద్ధూ: నో! ఐ యామ్ నాట్ కిడింగ్! సీరియస్! ఇట్ ఈజ్ ఆల్ బికాజ్ ఆఫ్ యూ!

ఎరిక్: కమాన్! యూ గాట్ టేలెంట్! నువ్వే విజేతవి. ఇది సాధించడానికి ఎన్నేళ్లు కష్టపడ్డావో నాకు తెలుసు.

సిద్ధూ: గెలిచింది నేను కాదు, మా అమ్మ. ఐ లాస్ట్.

ఎరిక్: గివ్ మీ ఏ బ్రేక్! యూ లాస్ట్ ...?

సిద్ధూ: అవును. కోల్పోయాను. ఐ లాస్ట్ ఆల్ ది ఫన్ యాజ్ ఎ ఛైల్డ్!

ఎరిక్: ....

సిద్ధూ: సారీ, అమ్మ పిలుస్తోంది, ఐ గాట్ టూ గో! బై!

ఎరిక్: బై! లెట్ అజ్ కీప్ ఇన్ టచ్!

సిద్ధూ: యా! సీ యూ – బై!

....................................

రచయిత మెయిల్:
gorthib@yahoo.com

# అనుగ్రహం

4-10 మార్చి 2012

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

బంధువులు, ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. మీ ఆలోచనలు పలు విధాలుగా ఉంటాయి. ఆదాయ వ్యయాల్లో మీ అంచనాలు ఫలించకపోవచ్చు. శనివారం నాడు పనివారలతో జాగ్రత్త. అవివాహితులకు శుభదాయకం. ఉద్యోగినులకు ఇంటా బయటా పని భారం. ఆస్తి వివాదాలు కొత్త మలుపు తిరుగుతాయి. ఆరోగ్య విషయంలో అశ్రద్ధ కూడదు.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ఈ వారం ప్రతికూలతలు, ధననష్టం ఎదుర్కొంటారు. మీ పనుల సానుకూలతకు బాగా శ్రమించాలి. మీ శ్రీమతి సలహా పాటించడం ఉత్తమం. ఊహించని ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాల పట్ల శ్రద్ధ వహించండి. ప్రతి వ్యవహారం మీరే చూసుకోవడం మంచిది. ఆకస్మిక ప్రయాణం తలపెడతారు. మీ పనులు, కార్యకలాపాలు మందకొడిగా సాగుతాయి. షేర్ల క్రయ విక్రయాలు లాభిస్తాయి.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

సమస్యలు, ఇబ్బందులు తొలగి మానసికంగా కుదుటపడతారు. అవివాహితులకు శుభదాయకం. పరిచయాలు, వ్యాపకాలు విస్తరిస్తాయి. ఆహార, ఆరోగ్య విషయాల్లో జాగ్రత్త. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. వాయిదాలు, పన్నులు సకాలంలో చెల్లిస్తారు. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలు అమలు చేస్తారు. మీ తప్పిదాలకు ఇతరులను బాధ్యులు చేయడం మంచిది కాదు.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఆహ్వానాలు, ముఖ్య సమాచారం అందుకుంటారు. ప్రయత్నపూర్వకంగా కొన్ని అవకాశాలు కలిసి వస్తాయి. ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించాలి. తొందరపాటుతనం వల్ల వ్యవహారం బెడిసికొట్టే ఆస్కారం ఉంది. ఖర్చులు ప్రయోజనకరం. ఆది, సోమవారాల్లో ధన సహాయం చేసే విషయంలో జాగ్రత్త. స్త్రీల ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఉమ్మడి వ్యవహారాలు, నూతన వెంచర్లకు అనుకూలం.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మీ అభిప్రాయాలను ఖచ్చితంగా తెలియజేయండి. పెద్ద ఖర్చు తగిలే అస్కారం ఉంది. ధనం మితంగా వ్యయం చేయాలి. సోదరుల ఇంట ఒక శుభకార్యానికి హాజరవుతారు. మంగళ, బుధవారాల్లో మీ వ్యాఖ్యలు చర్చనీయాంశమవుతాయి. పనివారు, ప్రత్యర్థుల విషయంలో జాగ్రత్త. గృహ నిర్మాణాలు, మరమ్మతులు చేపడతారు. ఉద్యోగస్తులకు బాధ్యతల మార్పు, స్థానచలనం ఆందోళన కలిగిస్తాయి.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

బంధువుల మాటతీరు నిరుత్సాహం కలిగిస్తుంది. వ్యాపారాల్లో గట్టి పోటీ, అధికారుల తనిఖీలు ఎదుర్కొంటారు. మీ వ్యవహార దక్షతకు పరీక్షా సమయం. మిమ్మల్ని తప్పుదారి పట్టించేందుకు కొంతమంది యత్నిస్తారు. మీ తప్పిదాలు సరిదిద్దుకునేందుకు యత్నించండి. ప్రయత్నపూర్వకంగా కొన్ని అవకాశాలు కలిసి వస్తాయి. ఆదాయానికి మించిన ఖర్చులు ఆందోళన కలిగిస్తాయి.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

బంధువులు, సన్నిహితులకు ఆహ్వానం అందిస్తారు. ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయి. ఆదాయ వ్యయాల్లో ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తారు. వాయిదాపడిన పనులు పూర్తి కాగలవు. శనివారం నాడు మంచి చేసినా విమర్శలు తప్పవు. మీ బాధ్యతలను ఇతరులకు అప్పగించకండి. అకారణంగా మాట పడవలసి వస్తుంది. అవివాహితులకు శుభదాయకం.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

సన్మానాలు, సమావేశాల్లో పాల్గొంటారు. రాబడికి మించి ఖర్చులుంటాయి. మీ అవసరాలకు కావలసిన ధనం అతికష్టంమ్మీద సర్దుబాటు అవుతుంది. ఆది, సోమవారాల్లో ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, చెల్లింపుల్లో ఏకాగ్రత అవసరం. ప్రతి విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవడం ఉత్తమం. మీ యత్నాలు గుట్టుగా సాగించండి. విద్యార్థులు వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

వ్యాపారస్తులకు శుభదాయకం. కొత్త కొత్త పథకాలు, షాపుల అలంకరణతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు. ఒక నష్టాన్ని మరొక విధంగా పూడ్చుకుంటారు. ఇంటా బయటా మీ ఆధిపత్యం కొనసాగుతుంది. మం గళ, బుధవారాల్లో హామీలకు దూరంగా ఉండాలి. దాంపత్య సౌఖ్యం, ప్రశాంతత పొందుతారు. పెద్ద మొత్తం నగదుతో ప్రయాణం మంచిది కాదు. వృత్తి, ఉపాధి పథకాలు ప్రోత్సాహకరం.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్యాలు, స్థిరాస్తుల కొనుగోలుపై దృష్టి సారిస్తారు. మీ అభిప్రాయాల వ్యక్తీకరణకు సందర్భం కలిసి వస్తుంది. ఆహార వ్యవహారాల్లో మొహమాటం కూడదు. ఆది, గురువారాల్లో ముఖ్యమైన పనులు మీరే చూసుకోవడం ఉత్తమం. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. వృత్తి, వ్యాపారాల్లో పెరిగిన పోటీ ఆందోళన కలిగిస్తుంది. దంపతుల మధ్య దాపరికం కూడదు. నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

అందరితోను సఖ్యతగా ఉంటూ మీ పనులు చక్కబెట్టుకుంటారు. ఆదాయ వ్యయాలు మీ బడ్జెట్‌కు తగ్గట్టుగానే ఉంటాయి. ఒక శుభకార్యాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అయినవారి రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మంగళ, శనివారాల్లో ఒక వ్యవహార సానుకూలతకు బాగా శ్రమించాలి. దీర్ఘకాలిక పెట్టుబడులు, నూతన వ్యాపారాలకు అనుకూలం. ఉద్యోగస్తులు ప్రలోభాలకు దూరంగా ఉండాలి.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అసాధ్యమనుకున్న పనులు సునాయాసంగా పూర్తి కాగలవు. మిమ్మల్ని ఆందోళనకు గురిచేసిన సమస్య తేలికగా సమసి పోతుంది. గురు, శుక్రవారాల్లో ఇతరుల విషయాల్లో జోక్యం కూడదు. ఉద్యోగస్తులకు నగదు బహుమతి, పదోన్నతి వంటి శుభఫలితాలున్నాయి. స్త్రీలకు ఆరోగ్య భంగం, వైద్య సేవలు తప్పవు. శుభకార్యాలకు ముహూర్తం నిశ్చయమవుతుంది. నిరుద్యోగులకు నిరుత్సాహం.

# బిట్ బ్యాంక్



మానవ శరీరంలో సాధారణంగా 2 నుంచి 3 మిలియన్ల శ్వేదగ్రంథులుంటాయి.



మనిషి కన్ను సుమారు 20 అడుగుల దూరాన్ని చూడగలుగుతుంది. 15 అడుగుల కంటే తగ్గితే చూపు మందగించినట్టే.



గబ్బిలాలు ఎగరగలవు కాని నడవలేవు. కారణం వాటి కాలి ఎముకలు అతి పల్చగా ఉంటాయి.



సొరచేప కోరలు ఎంత బలమైనవంటే ఇనుముకున్నంత శక్తి వాటికుంటుంది.

★ ఆడ గుర్రం, మగ గాడిదకి పుట్టే జంతువును మ్యూల్స్ అంటారు. మగ గుర్రం, ఆడ గాడిదకి పుట్టే జంతువును హిన్నీ అంటారు. మగ జీబ్రాకి, ఆడ గాడిదకు పుట్టే జంతువును 'యేజెబ్రాసీ' లాంటి పేరు ఏదో ఉంది. ఈ కొత్త జంతువులేవీ పాపం.. పిల్లలను కనలేవట.



ప్రతి క్షణం శరీరంలో కోటికిపైగా రక్తకణాలు చనిపోతూ, కొత్తవి పుడుతూ ఉంటాయి.

★ పుట్టినప్పుడు ఏ సైజులో ఉంటాయో చివరి వరకు మన కళ్ళు అదే సైజులో ఉంటాయి. ముక్కు, చెవులు మాత్రం పెరుగుతూనే ఉంటాయి.



ఏనుగు సగటున రోజుకు రెండు గంటలు మాత్రమే నిద్రపోతుంది.

★ 1386లో ఒక పందిని బహిరంగంగా ఉరి తీశారు. పాప హత్యకు కారణమైందన్న కోపంతో ఆ పని చేశారు.

★ రోదసి లోంచి చూసినపుడు భూమి మీది కట్టడాలేమీ కనబడవు. చైనా గోడ కనబడుతుందనేది నిజం కాదు. చంద్రుడి మీద నుంచి చూసినా కూడా భూమి అక్కడక్కడా నీలంగా (సముద్రాలు), తెల్లగా (మబ్బులు), పసుప్పచ్చగా (ఎడారులు) ఆకుపచ్చగా (చెట్లు) మాత్రమే కనిపిస్తుంది.



నోరు పూర్తిగా తడారిపోయినప్పుడు రుచిగ్రంథులు పనిచేయవు.



మనిషి కనుగుడ్డు బరువెంతో తెలుసా? ఒక ఔన్సు. అంటే సుమారుగా 28 గ్రాములు.



ప్రతి రెండొందల కోట్ల జనాభాలో ఒక్కరు మాత్రమే 116 సంవత్సరాలు బతుకుతారు.



మన భూగ్రహం బరువు ఎంతుంటుందను కుంటున్నారు? 6.6 సెక్స్టిలియన్ టన్నులు. అంటే ఆరు తర్వాత 21 సున్నాలు. (ఒక బిలియన్‌కి తొమ్మిది సున్నాలు. మరి 21 సున్నాలంటే ఎన్ని బిలియన్లో లెక్కించండి).

# అదృష్ట రత్నజ్యోతి


## రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255

ఫోన్: 040-6522 5554


భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తనే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ....................................

పుట్టిన తేదీ ............................

పుట్టిన సమయం ......................

పుట్టిన ఊరు (మండలం) ...........

ప్రశ్న ...................................

పుట్టిన తేదీ వివరాలు లేని వారు 1 నుండి 249 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాసి పంపండి. (ఇది న్యూమరాలజీ కాదు, కృష్ణమూర్తి పద్ధతిలోని 249 సబ్స్).

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అదృష్ట రత్నజ్యోతి,**

ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 033.

**సి.ఆర్., తిరుపతి**

**మా అమ్మాయి జన్మకుండలి సంపూర్ణంగా, నిర్మొహమాటంగా వివరించగలరు.**

మీ అమ్మాయి జన్మకుండలి ప్రకారం-

నక్షత్రం విశాఖ. రాశి తుల.

2018 డిసెంబర్ వరకూ గురు దశ.

2018 డిసెంబర్ నుండి 2037 ఆగస్ట్ వరకూ శని దశ.

2037 ఆగస్ట్ నుండి 2054 మే వరకూ బుధ దశ.

2054 మే నుండి 2061 ఏప్రిల్ వరకూ కేతు దశ. పిదప శుక్ర దశ.

**కంట్రోలింగ్ ఫేక్టర్స్ :** గురువుకు శని శుక్ర రాహువులు. శనికి రవిశుక్రులు. బుధునికి శుక్ర శని కుజ కేతువులు. కేతువుకు రాహు శుక్రులు. శుక్రునికి చంద్ర గురువులు.

**యోగాలు :** 1. రాజయోగం 2. లక్ష్మీయోగం 3. నీచభంగ రాజయోగం.

శుక్రునికి నీచభంగం బుధునితో అవుతుంది. ఇక్కడ పైన చెప్పుకున్న రాజయోగంతో నీచభంగం కావడం విశేషం. ఏదిఏమైనా ఈ జన్మకుండలిలో ఎన్ని అవకవతకలున్నా రాజయోగం అని చెప్పుకుంటున్న శని శుక్రుల కలయికే ఇక్కడ పెద్ద రక్షణ కవచం. అయితే ఈ రాజయోగంలో చిన్న విచిత్రత ఉంది. నన్ను కాపాడితే నేను మిమ్మల్ని కాపాడతాను అన్న చందం! కారణం గ్రహయుద్ధం. కనుక ఈ జాతకంలో తీసుకోవలసిన మొట్టమొదటి జాగ్రత్త... ఉన్న యోగాన్ని తెలివిగా పనిచేసేలా చేసుకోవడం, తగిన పరిహారాలు పాటించడం. అదృష్ట స్థానాధిపతి అష్టమంలో పడడం ఈ జాగ్రత్తని హెచ్చరికగా తీసుకోవాలని చెప్తోంది.



**విద్య :** ఇంజనీరింగ్. ఎక్సెల్ చేయడం జరుగుతుంది. కానీ ఒక లవ్ ఎఫైయిర్ కారణంగా కాలేజ్‌లో చాలా గొడవలవుతాయి. దీనికి గట్టి రెమిడీస్ పాటించాలి. పిజి ఉంటుంది. అయితే ఒకసారి చేరి, మానేసి, తిరిగి ఆ తదుపరి సంవత్సరం చేయడం జరుగుతుంది.

**లవ్ ఎఫైయిర్స్ :** 1. 19వ ఏట అంటే 2029 సెప్టెంబర్ నుండి 2031 ఏప్రిల్ మధ్య. 2. 33వ ఏట అంటే 2043 అక్టోబర్ నుండి 2044 ఆగస్ట్ మధ్య. ఈ రెండవ దానివలన వైవాహిక జీవితంలో తుపాను ఏర్పడుతుంది. వైవాహిక జీవితానికి కానీ లవ్ ఎఫైయిర్స్ విషయంలో కానీ సూర్యునికి ఎంత గట్టి రెమిడీస్ పాటిస్తే అంత మంచిది.

దశమాధిపతి భాగ్యంలో, భాగ్యాధిపతి అష్టమంలో అష్టమాధిపతి సప్తమంలో, సప్తమాధిపతి దశమంలో స్థితి పొందడమనే కాంబినేషన్‌కి సంబంధం సంపూర్ణమయింది.

ఉద్యోగానికి విదేశ సంబంధ మేర్పడడం, అయినా కూడా విదేశాలలో నివసించాలనే సంకల్పం నెరవేరకపోవడం, కొలీగ్స్‌తో కావలసిన దానికంటే ఎక్కువ స్నేహం ఏర్పడడం, ఒకానొక సమయంలో వైవాహిక జీవితంలో విసిగి కమిట్ చేసుకోవాలని ప్రయత్నించడం ఇవన్నీ పై కాంబినేషన్ తాలూకు ఫలితాలు.

భవతి హృదయ హారీ క్వాపి కస్యాపి కశ్చిత్ ! కొంతమందికి ప్రేమ విషయంలో ఇగో తృప్తి పడదు. ఆ అసంతృప్తి కొంప ముంచకుండా చూసుకోవాలి. సూర్యునికి పాటించే పరిహారాలు అక్కరకు వస్తాయి.

**వివాహం :** పాతికేళ్ళ వరకూ వివాహం లేదూ వద్దూ! 26వ సంవత్సరంలో వివాహం. అంటే 2036లో. 2036 అక్టోబర్ నుండి డిసెంబర్ మధ్య, 2036 డిసెంబర్ నుండి 2037 ఫిబ్రవరి మధ్య రెండు స్పెల్స్ నడుస్తాయి. వీటిలో రెండవ స్పెల్ లోనే వివాహం చేయాలి.

అబ్బాయి సహ ఉద్యోగి! మహా సౌందర్యవంతుడు. తెల్లగా ఉండే నలకూబరుడు. మాటల్లో చతురోక్తులకు ఎవరైనా ఆకర్షింపబడాల్సిందే. వెటకారం లేని హాస్యం అరుదు కదా!

అయినా కూడా అబ్బాయిలో అస్సలు నచ్చని విషయం ఈ జాతకురాలికి ఒకటి ఉంటుంది. అది... అతడికి తల్లి మీదుండే అతిశయించి ప్రేమ! యుగాల నుండి వస్తున్న సమస్య! భార్యా, తల్లా?! ప్రేమ పొందే విషయంలో ఈ జాతకురాలి ఇగో ఎందుకు తృప్తిపడదో బోధపడింది కదా! అయితే ఆ అసంతృప్తి చిమ్మే విస్ఫులింగాల రూపాంతరాలు విచిత్రంగా ఉంటాయి.

మన ప్రవర్తన ఎటు పరివర్తనం చెందుతున్నది నిర్ణయించబడేది ఇక్కడే! నిజానికి అక్కడే మనిషి ఒక్కడై మిగిలిపోయేది! ఏదిఏమైనా ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఈ భార్యాభర్తల మధ్య నడిచే అనురాగ జీవితం పాండవుల రాజయోగం లాంటిది... తాత్కాలికం మాత్రమే!

**కెరీర్ :** ఉద్యోగంలో కావలసిన దానికంటే ఎక్కువ మార్పులుంటాయి. అలాగే కమ్యూనికేషన్స్ రంగం కలిసివస్తుంది. బుధ దశంతా కూడా... అంటే 27వ ఏట నుండి 17 ఏళ్ళ పాటు విదేశాలకు ఇలా వెళ్ళడం అలా రావడం జరుగుతుంటుంది. అయితే విదేశ నివాసానికి మాత్రం... నో! కేతు దశలో అంటే 44 నుండి 51 వ సంవత్సరం మధ్య కెరీర్‌లో అత్యున్నత స్థితి. తదుపరి 20 ఏళ్ళ పాటు నడిచే శుక్ర దశలో విదేశ నివాసం, అన్నింటా విజయం!

**సంతానం :** సంఖ్య 1. సంతానం వలన అంతా సంతోషమే! స్థిరపడేది విదేశాల్లో.

**స్థిరచరాస్తులు :** విదేశాల్లో ఏర్పడతాయి. మంచి గృహ యోగం, ఆస్తులు అమరే సమయాలు.

1. 36వ ఏట 2. 46వ ఏట 3. 57వ ఏట, ఈ సమయంలో ఏర్పడేది పెలాషియల్ బిల్డింగ్.

**అదృష్ట రత్నాలు :** పచ్చ, వజ్రం విడివిడిగా. నక్షత్రం విశాఖ అని పుష్యరాగం ధరించకూడదు. ఫలితం అలసిపోయేటన్ని ప్రయాణాలు. విరక్తి కలిగించే షార్ట్ జర్నీస్.

**అదృష్ట దిక్కు :** ఎట్టి పరిస్థితిలోనూ నివసించకూడనిది నార్త్ ఫేసింగ్. కలిసొచ్చేది సౌత్ ఫేసింగ్.

**శక్తి యుక్తులు :** ఏ లెపర్డ్ డజన్ట్ ఛేంజిట్స్ స్పాట్స్! కొంతమంది భర్తలు మారరు. మార్చాలని ప్రయత్నించడం మన అజ్ఞానం!

వృథా తృప్తస్య భోజనమ్! వృథా దీపో దివాపిచ!


పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం '**అధినేత**'. 1993లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత '**అధినేత**' ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: 98499 92892.

ఆవిష్కరణ

# వేలిముద్రల తుపాకి



అమెరికాకు చెందిన కొందరు స్నేహితులు కలిసి ఒక తుపాకి తయారు చేసారు. దీని ప్రత్యేకత ఏమిటంటే ఎవరి ఫింగర్ ప్రింట్స్ దీనిలో నమోదు చేస్తారో వారి చేతిలో మాత్రమే అది పని చేస్తుంది. ఈ తుపాకిని కొనేటపుడు ఆ వ్యక్తి వేలిముద్రలు కూడా తీసుకుంటారు. తుపాకిలో ఉన్న మెమరీ చిప్‌లో ఈ వివరాలు నమోదు చేస్తారు. ఆ తుపాకిని ఉపయోగించాల్సినప్పుడు హ్యాండిల్‌పై ఉన్న స్కానర్‌పై అతను తన బొటనవేలు ఉంచాలి. వేలిముద్ర సరిపోతేనే తుపాకీ పేలడానికి సిద్ధంగా ఉంటుంది. నమోదు కాని వేలిముద్రలతో ఉన్న ఏ వ్యక్తీ ఆ తుపాకీని ఉపయోగించలేడు. దీనివల్ల మారణాయుధాలను విచ్చలవిడిగా ఉపయోగించడం తగ్గుతుంది. సమాజానికి ఉపయోగపడే మంచి ఆవిష్కరణ చేసిన వారి పేర్లు మైక్ నీడ్, కాటి మెరిక్, జామి రాల్ఫ్, ట్రేసీ పీటర్స్, జాన్ కాల్.

# రంగులు వేయండి



# చెప్పండి చూద్దాం



1. సంఖ్య 7ని నాలుగుసార్లు తీసుకోండి. లెక్కల్లోని ఏదైనా సింబల్‌ను ఒకేసారి ఉపయోగించి చివరకు 100 వచ్చేలా చేయండి.
2. ఎటు నుంచి చదివినా ఒకేలా వినిపించే మూడు ఇంగ్లీషు పదాలు చెప్పండి.
3. ఒంటె కంటే ఎక్కువసేపు నీళ్ళు తాగకుండా బతకగలిగిన జంతువేదో చెప్పండి.
4. అమెరికన్ లైబ్రరీల నుంచి ఏ పుస్తకం ఎక్కువసార్లు దొంగిలించబడిందో ఊహించండి.
5. ఇంగ్లీషు భాషలో ఏ పదానికి ఎక్కువ అర్థాలు ఉన్నాయి?

# దారి కనుక్కోండి




## జవాబులు

### చెప్పండి చూద్దాం

1. 77/.77=100, 2. racecar, kayak, level
3. ఎలుక, 4. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ 5. సెట్ (set)

### గుర్తుపట్టండి

1. IBM (అంతర్గతంగా వాడే లోగో), 2. ఎ నుంచి జెడ్ వరకు అన్నీ మా దగ్గర దొరుకుతాయని చెప్పడానికి అలా పెట్టారు.
3. ఈ డిజైన్‌లో కనిపిస్తున్న అక్షరాలు C L U E . ఆ గేమ్ పేరు కూడా క్లూనటిక్.

| | |
|---|---|
| పద విన్యాసం | 1. గోడు 2. మోడు 3. కాడు 4. వాడు 5. తాడు 6. కీడు 7. నేడు 8. తోడు 9. రేడు 10. జోడు |

# గుర్తు పట్టండి

NATIC

ఇదొక పజిల్ గేమ్ లోగో. తాళంలా కనిపిస్తుంది. కాని కాదు.

ఈ లోగోలో బాణం గుర్తుకు అర్థమేమిటో చెప్పండి చూద్దాం.

amazon.com

ఇది దేని లోగోనో చెప్పగలరా? ఐటిలో చాలా పేరున్న కంపెనీయే. బొమ్మల్ని బట్టి ఊహించండి.

## పద విన్యాసం

కింది ఆధారాలతో 'డు'తో ముగిసే పదాలను రాయండి

| | | |
|---|---|---|
| 1. మొర | ☐ | డు |
| 2. ఎండిన చెట్టు | ☐ | డు |
| 3. స్మశానం | ☐ | డు |
| 4. ఉపయోగించు | ☐ | డు |
| 5. సూత్రము | ☐ | డు |
| 6. ఆపద | ☐ | డు |
| 7. ఈదినం | ☐ | డు |
| 8. ఆసరా | ☐ | డు |
| 9. మహారాజు | ☐ | డు |
| 10. రెండు | ☐ | డు |

నిర్వహణ : చేబియ్యం రామారావు

## నా బొమ్మ



జి. సాయి ప్రీతి, 8వ తరగతి,
మార్టినెట్ హైస్కూల్,
పార్సిగుట్ట, సికింద్రాబాద్






## కిటికీ దగ్గర పొలం

పిల్లలూ పొలాల్లోకి ఎప్పుడైనా వెళ్లి చూసారా? పచ్చటి పైరు గాలికి రెపరెపలాడుతూ అందంగా కనిపిస్తుంది. అలాగని ఎప్పుడూ పొలం దగ్గరే ఉండిపోలేం కదా! అందుకే పచ్చని పంట పొలాన్ని మన ఇంటి కిటికీలోనే ఏర్పాటు చేసుకునే పద్ధతి తెలుసుకుందాం.

వడ్లు, కందులు, గోధుమలు, పెసలు, మినుములు, శెనగలు వీటన్నింటినీ గుప్పెడు చొప్పున తీసుకోండి. వెడల్పుగా ఉన్న మట్టి పాత్ర లేక కుండీలో మట్టిని నింపండి. పైన చెప్పిన ధాన్యాలన్నిటినీ నీళ్లలో వేసి అరగంట నాననివ్వండి. తర్వాత వాటిని కుండీలోని మట్టిపై జల్లి కాస్త నీళ్లు చిలకరించండి. రోజూ ఉదయం సాయంత్రం కుండీలోని మట్టిపై నీళ్లు చిలకరిస్తూ ఉండండి. ఒక వారం గడిచేసరికి లేత ఆకుపచ్చ రంగులో చిన్న మొలకలు వస్తాయి. మరో నాలుగు రోజులు గడిచేసరికి సన్నని దారాల్లాంటి మొలకలు పైకి ఎదుగుతుంటాయి. పదిరోజులకల్లా పచ్చని పైరు మీ కుండీలో కనువిందు చేస్తుంది. ఆ కుండీని గదిలో కిటికి దగ్గర కాని హాల్లో కాని ఎక్కడైనా పెట్టుకుని చూస్తే ఆనందించవచ్చు.

తెలుగు సినిమాల్లో మరపురాని నృత్యాలెన్నింటినో చేసి ప్రేక్షక మహాజనుల చేత వహ్వా అనిపించుకున్న మేటి నర్తకి కుచలకుమారి. 'సరసాల జవరాలను' (సీతారామకల్యాణం), 'కొమ్ములు తిరిగిన మగవారూ...' (భట్టివిక్రమార్క), 'నెలనడిమి వెన్నెలరేయి' (జయసింహ), 'రంగరంగేళి' (భార్యాభర్తలు)... వంటి వందలాది గీతాలకు మరపురాని నృత్యాలు చేసి ఆనాటి ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన కుచలకుమారి జ్ఞాపకాలు ఈ వారం...



# సరసాల జవరాలను...

మా స్వస్థలం తంజావూరు. మా ఇంట్లో అందరూ సినిమా రంగంలో పనిచేసిన వారే. మా అమ్మ సోదరీమణుల్లో ఒకరు సుప్రసిద్ధ నటి టి.ఆర్. రాజకుమారి. జెమినీ వారి 'చంద్రలేఖ', 'మనోహర' చిత్రాల్లో హీరోయిన్. మా అమ్మ కూడా సినిమానటే. ఆమె 1935లోనే సినిమా రంగంలోకి వచ్చింది. మా మేనమామ టి.ఆర్. రామన్న. ఈయన తెలుగు, తమిళ భాషల్లో పెద్ద నిర్మాత. ఆయనకు ముగ్గురు భార్యలయితే, వాళ్ళల్లో ఇద్దరు సుప్రసిద్ధ నాయికలు. ఒకరు బి.ఎస్. సరోజ, రెండోవారు ఇ.వి. సరోజ. బి.ఎస్. సరోజ తమిళంలో పెద్ద హీరోయిన్. ఇ.వి. సరోజ తెలుగులో కూడా చాలా చిత్రాల్లో నృత్యాలు చేసింది. ఇక తెలుగు, తమిళ రెండు భాషల్లోను కుర్రకారును హుషారు పరచిన శృంగార నర్తకీమణులు జ్యోతిలక్ష్మి, జయమాలిని. ఈ ఇద్దరు అక్కచెల్లెళ్ళు నా కజిన్ సిస్టర్సే... ఇదీ మా కుటుంబ నేపథ్యం.

మా అమ్మ అనేక తమిళ చిత్రాల్లో నటించింది కానీ ఎందువల్లనో తారాపథం ఆమెకు అందని పండయ్యింది. దాంతో ఆమె తిరిగి తంజావూరు వెళ్ళిపోయింది. అక్కడే నేను డిసెంబర్ 6, 1937లో జన్మించాను. నేను పుట్టిన తర్వాత బ్రతుకు తెరువు కోసం మా అమ్మ మళ్ళీ మద్రాసు వచ్చింది. నాకు ఒక తమ్ముడు. పేరు శేఖర్. అతను ఓ వాచ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం నేను అతని దగ్గరే ఉంటున్నాను. నా ముద్దుపేర్లు కుచిలీ, గుజిలీ. ఇప్పటికీ తెలిసిన వాళ్ళు నన్ను అలాగే పిలుస్తారు. నా ఏడవ ఏటనే మా అమ్మ వళ్లువుర్ రామయ్య పిళ్ళై దగ్గర భరతనాట్య శిక్షణ కోసం నన్ను చేర్పించింది. టి.నగర్‌లోని 'విద్యోదయ' స్కూలులో నాల్గవ ఫారం వరకూ చదివి, ఆపైన హోలీ ఏంజిల్స్ కాన్వెంటులో ఎస్.ఎస్.ఎల్.సి పూర్తి చేశాను.

నేను రామయ్య పిళ్ళై గారి దగ్గర భరత నాట్యాన్ని 1950 వరకూ క్షుణ్ణంగా నేర్చుకున్నాను. ఆ తర్వాత 'అరంగేట్రం' ఇవ్వకుండానే నాట్యప్రదర్శనలివ్వడం ప్రారంభించాను. అది సంప్రదాయ విరుద్ధం. కాబట్టి ఆ రోజులకు అది సాహసమే.

## ఏడవ ఏటనే బాల పాత్ర పోషించా

మా పిన్ని (టి.ఆర్. రాజకుమారి) అప్పట్లో తమిళంలో టాప్ హీరోయిన్ గనుక నా సినీరంగ ప్రవేశం చాలా సులువుగానే జరిగింది. మా పిన్ని– నేను చాలా చిన్నపిల్లను కదా, ముద్దుగా ఉంటానని షూటింగ్‌లకి తీసుకువెళ్ళేది. అక్కడ దర్శక నిర్మాతలు చూసి ముచ్చటపడి బాల పాత్రలు ఇచ్చారు. అలా నా ఏడవ ఏటనే 'మహామాయ' అనే తమిళ చిత్రంలో కన్నాంబ కూతురు పాత్ర ధరించాను. మొదటి రోజు లైట్లు, కెమెరాలు ఆ హంగామా అంతా చూసి భయపడిపోయానట. కన్నాంబగారు నన్ను ఒళ్ళోనే కూర్చోబెట్టుకుని, లాలిస్తూ, బుజ్జగిస్తూ మధ్య మధ్యలో చాక్లెట్లు, బిస్కట్లు తీసిస్తూ నా భయం పోగొట్టారు. అప్పటి నుండి ఆమె నన్ను సొంత కూతురులాగే చూసుకునేది. ఆ తర్వాత నేను ఎంత పెద్ద స్టార్‌ని అయినా ఆమె చాక్లెట్లు, బిస్కట్లు తీసివ్వడం మానలేదు. కన్నాంబగారు పోయిన రోజు మా అమ్మే చనిపోయినంతగా ఏడ్చాను నేను.

## కాంచన నా సహాధ్యాయి

సుప్రసిద్ధ నటీమణి కాంచన నా సహాధ్యాయి. మా అందరిలోనూ కాంచన చాలా ప్రత్యేకంగా కన్పించేది. ఆ తర్వాత నేను విద్యోదయ నుండి హోలీ ఎంజిల్స్‌కు మారడంతో మా స్నేహం కొనసాగలేదు. మళ్ళీ నేను సినిమాల్లో పెద్ద నర్తకిగా ఉన్న రోజుల్లో ఒకరోజు 'న్యూటోన్ స్టూడియో'లో షూటింగ్‌లో ఉండగా కన్పించింది. దగ్గర కొచ్చి 'ఏమే కుచిలీ ఎంత పెద్ద స్టార్‌వి అయిపోయావు' అని ముద్దుపెట్టుకుని ప్రశంసలతో ముంచెత్తింది. మొదట్లో నాతో ఎలా ఉండేదో, తారాపథానికి వెళ్ళిన తర్వాతా, ఈ రోజు కూడా నాతో అలాగే ఉంది. గర్వం లేదు. ఎప్పుడు చెన్నై వచ్చినా నన్ను కలవకుండా వెళ్ళదు. నేనంటే తనకు అంత ఇష్టం. తరచూ పుట్టపర్తిలో కలిసేవాళ్ళం. ఇద్దరమూ సాయిబాబా భక్తులమే.

## అదో స్వర్ణయుగం

తమిళ చిత్ర పరిశ్రమలో సుమారు పదేళ్ళు నా నృత్యం లేకుండా ఏ చిత్రమూ ఉండేది కాదు. తమిళంలో బాగా పేరు వచ్చిన తర్వాత బి.ఎ. సుబ్బారావు గారు 'రాజు పేద' (1954) చిత్రంలో మొట్టమొదటిసారిగా అవకాశమిచ్చారు. అందులో 'కళ్ళు తెరచి కనరా' అన్న పాటకు నేను చేసిన నృత్యం ఆంధ్రదేశాన్ని మారు మ్రోగించింది. సినిమాలో కథకు అన్వయిస్తూ చేసిన నృత్యమది. ఆ పాట విజయవంతం

జ్ఞాపకాలు

## నటి కుచలకుమారి

కావడంతో తెలుగులో కూడా నర్తకిగా వెంటవెంటనే బుక్ అయిపోయాను. 1954 నుండి 1965 వరకూ నా డాన్స్ లేకుండా తెలుగు, తమిళ చిత్రాలు ఏవీ ఉండేవి కావు కూడా. ప్రేక్షకులు నా పాట, నృత్యం లేకుంటే చాలా నిరాశపడుతూ ఉత్తరాలు రాసేవారు కూడా... అదో స్వర్ణయుగం.

### నా నృత్యాలంటే ఎన్టీఆర్‌కు మక్కువ

ముఖ్యంగా ఎన్.టి. రామారావుగారి సొంత చిత్రాల్లో నాకు చాలా అవకాశాలు కల్పించారు. ఎన్.ఎ.టి. బానర్ అంటే నా డాన్సు ఉండాల్సిందే. 'జయసింహ' (1955)లో 'నెలనడిమి వెన్నెలరేయి', 'పాండురంగ మహాత్మ్యం' (1957)లో 'ఎక్కడోయి ముద్దులబావ', 'సీతారామ కల్యాణం'(1961)లో 'సరసాల జవరాలను' నాకు బాగా పేరు తెచ్చిన నృత్యాలు. ఎన్.టి.రామారావు గారికి నేనంటే చాలా ఇష్టం. నేను చాలా చిన్నదాన్నే అయినా ''ఏమండీ! కుచలకుమారిగారూ!'' అని చాలా గౌరవంగా సంబోధించేవారు. ఆయన సోదరుడు త్రివిక్రమ రావు గారు షూటింగ్ రోజుల్లో ఇంటికి వచ్చి స్వయంగా కారులో తీసుకువెళ్ళేవారు. పారితోషికాలు చాలా ఖచ్చితంగా ఉండేవి ఎన్.ఎ.టిలో.

ఎన్.టి. రామారావు, ఎస్.వి. రంగారావు, గుమ్మడి, నేను 'జయసింహ' శతదినోత్సవాలకు ఆదోని, కడప, నంద్యాల, కర్నూలుకు వెళ్ళాం. కర్నూలులో అయితే వేలాది ప్రేక్షకులు మాకు నీరాజనాలు పట్టారు. వాళ్ళ అభ్యర్థన మేరకు బహిరంగ వేదికపై నేను మళ్ళీ 'నెలనడిమి వెన్నెలరేయి' అనే పాటను అభినయించాను. అప్పటికి సంతృప్తి పడ్డారు అభిమానులు. నాకు తెలుగులో మంచిపేరు తెచ్చిన మరో నృత్యం 'దొంగరాముడు' (1955)లో 'లేవోయి చిన్నవాడ'. కె.వి.రెడ్డి గారి దర్శకత్వంలో వచ్చిన ఆ పాటను ఆంధ్ర ప్రేక్షకులు ఎప్పటికీ మరచిపోలేరు.

పసుమర్తి కృష్ణమూర్తి నృత్య దర్శకత్వంలో 'భట్టి విక్రమార్క', 'భార్యాభర్తలు' చిత్రాల్లో కూడా చాలా మంచి నృత్యాలు చేశాను. 'కన్నెపిల్ల సొగసు చూడు మహారాజా' అనే పాట ప్రేక్షకుల్ని ఓ ఊపు ఊపేసింది. భార్యాభర్తల్లో పసుమర్తి నా చేత చాలా నృత్య ప్రయోగాలు చేయించారు. నాదేమో ఓ సాధారణ నర్తకి పాత్ర. నేనాడుతుంటే కథానాయకుడికి నా ముఖంలో నాయిక (కృష్ణకుమారి) కన్పిస్తుంది. ఆమేనని నాయకుడు భ్రమించి సంతోషపడుతుంటాడు. ఆ మాయ అంతరించి పోతుంటే కలవరపడుతుంటాడు. ఆ రెండు అభినయాలు నా చేత ఏకకాలంలో పసుమర్తిగారు అభినయింపజేశారు.

### నాకు నచ్చిన దర్శకులు

ఇక దర్శకుల విషయానికొస్తే తమిళంలో ఎం.వి. రామన్, తెలుగులో ఎల్.వి. ప్రసాద్‌గార్లు నాకు నచ్చిన దర్శకులు. వారి దర్శకత్వంలో వచ్చిన చిత్రాలు నాకు నర్తకిగా మంచిపేరు తెచ్చి పెట్టాయి. తెలుగులో 'కనకతార', 'గౌరీ మహాత్మ్యం', 'కాళహస్తి మహాత్మ్యం', 'భలేబావ', 'శ్రీకృష్ణలీలలు', 'మహాకవి కాళిదాసు' మొదలైన చిత్రాల్లో చాలా చక్కటి నృత్యాలు చేశాను. తమిళంలో జి. వరలక్ష్మి నిర్మించిన 'హరిశ్చంద్ర', కన్నాంబగారి 'దక్షయజ్ఞం' నన్ను టాప్ డాన్సర్‌గా పరిశ్రమలో నిలబెట్టాయి.

నేను తెలుగు, తమిళ, మలయాళ, కన్నడభాషల్లో మొత్తం 200 చిత్రాల్లో నృత్యాలు, పాత్రలు ధరించాను. ఆ రోజుల్లో నేను ఇ.వి. సరోజ, రాజసులోచన, రీటా, ఎల్. విజయలక్ష్మి.. ఇలా చాలా మంది నర్తకీమణులు ఉండేవాళ్ళం. మాలో ఈర్ష్యాసూయలు ఉండేవి కావు. ఏ భాషలోని డైలాగులనైనా నేను తమిళంలో రాసుకుని ఉచ్చరించేదాన్ని. దానివల్ల లిప్ మూవ్‌మెంటు కరెక్టుగా వచ్చేది.

### సొంతంగా ఓ ట్రూప్

సినిమా రంగంలో ఎంత పేరు తెచ్చుకున్నా నేను నృత్య ప్రదర్శనలివ్వడం మానలేదు. నా తొలి నృత్య ప్రదర్శన తిరుప్పూరులో ఒక వివాహ సందర్భంలో 1954 జూన్ నెలలో జరిగింది. ఆ తర్వాత నేనే సొంతంగా ఒక డాన్స్ ట్రూప్ నడిపాను. ఈ సినిమాలు, డ్యాన్స్ ప్రోగ్రామ్స్ వల్ల నేను పెళ్ళికూడా చేసుకోలేదు. కళారంగంలోనే ఉండిపోవాలనుకున్నాను. వివాహం వల్ల ఇంట్లో పురుషాధిక్యత ఎక్కువై నా నాట్యానికి ఎక్కడ అవాంతరం ఏర్పడుతుందోననే భయంతోనే చేసుకోలేదు. అయినా నాకేం చింతలేదు. అయితే మధ్యలో ఆర్థికంగా చాలా చిక్కుల్లో పడ్డాను. బంధువులందరికీ ష్యూరిటీలు ఇచ్చి, వాళ్ళు అప్పులు కట్టకుంటే నేను కట్టాల్సి వచ్చింది. అందువల్ల శరవణ్ మొదలియార్ వీధిలో ఉన్న పెద్ద ఇల్లు చాలా చౌకగా అమ్మేయాల్సి వచ్చింది. దాంతో నిలువనీడ కోల్పోయాను. ఆ సమయంలో కరుణానిధిగారు ఒక ప్రభుత్వ గృహాన్ని నాకు చాలా చౌకగా అద్దెకు ఇప్పించి ఆదుకున్నారు. ఇప్పుడు అదే ఇంట్లో నా తమ్ముడి కుటుంబాన్ని నా దగ్గరే పెట్టుకుని ఉంటున్నాను. ప్రస్తుత తమిళనాడు ముఖ్యమంత్రి డా. జె.జయలలిత కూడా నన్ను ఆర్థికంగా ఆదుకున్నారు. ప్రతి నెల ఐదువేల రూపాయలు పెన్షన్ అందజేస్తున్నారు. ఆ డబ్బుతో నా శేష జీవితం ప్రశాంతంగా గడిచిపోతోంది.

తెలుగులో నర్తకిగా నా చివరి చిత్రం రామానాయుడుగారి మొదటి చిత్రం 'రాముడు భీముడు'. ఆ తర్వాత కె. బాలచందర్ తీసిన 'మన్మథలీల' చిత్రంలో నృత్యం చేయలేదు కాని హలం ఆంటీగా క్యారెక్టర్ వేశాను. అవే నా చివరి చిత్రాలు. రామానాయుడుగారు ఆర్టిస్టులను గౌరవించే నిర్మాత. చాలా గొప్ప హృదయం ఉన్నవారు. 'రాముడు భీముడు' శతదినోత్సవాల్లో బంగారంతో తయారుచేసిన రింగ్ వాచీ బహూకరించారు. 'సురేష్ ప్రొడక్షన్స్' విలువలతో కూడిన సంస్థ. ఆ మధ్య తమిళంలో 'జానకి' అనే టెలీ సీరియల్‌లో నటించాను. ప్రస్తుతం ఏవైనా కార్యక్రమాలకు పిలిస్తే వెళుతుంటాను. నాకు కలై సెల్వం కాక మా గురువుగారు రామయ్య పిళ్ళై పేరుతో ఒక అవార్డు వచ్చింది. తెలుగు ప్రాంతాల్లో నాకేమీ అవార్డులు రాలేదు. అయినా బాధ లేదు. అరవై సంవత్సరాలుగా నన్ను, నా నృత్యాల్ని అభిమానిస్తున్న వారికి నేనెప్పటికీ ఋణపడి ఉంటాను. ప్రేక్షకులకి, పరిశ్రమకీ ధన్యవాదాలు.

– డా. కంపల్లె రవిచంద్రన్
98487 20478

సీతారామకళ్యాణంలో...



జయసింహలో...



## రావణబ్రహ్మగా కనిపించా

ఇప్పుడు మీరు చూస్తున్న రావణ బ్రహ్మ వేషం దాదాపు 38 ఏళ్ల క్రితం అంటే నా 13వ ఏట వేసింది. విజయనగర్ కాలనీ (హైద్రాబాద్)లో 8వ తరగతి చదువుతున్న సమయంలో పబ్లిక్ గార్డెన్స్ 'బాలవిహార్'లో కొన్ని సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆ సందర్భంలో మా స్కూలు తరపు నుండి వేసిన వేషం ఇది. రావణబ్రహ్మ ఏకపాత్రాభినయం మా నాన్నగారు నేర్పించారు. ఆయనకు రేడియో నాటకాలు రాసిన అనుభవం ఉంది. ఆనాటి గుర్తుగా దాచుకున్న అపురూప ఛాయా చిత్రం ఇది. ప్రస్తుతం ఎస్.ఎఫ్.సి.లో డిప్యూటీ మేనేజర్‌గా పని చేస్తున్నాను.

– తాతపూడి సాయికుమార్,
శాంతినగర్, వనస్థలిపురం, హైదరాబాద్



## ఇదీ నేనే!





## హాస్యబ్రహ్మనై అలరించా

నా చిన్నతనం నుండి హాస్యమంటే చాలా ఇష్టం. నేను ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నప్పుడే స్వాతంత్ర్య దినోత్సవం (1960) నాడు మహాత్మాగాంధీ గూర్చి బుర్రకథ చెప్పి అందులో హాస్య పాత్ర పోషించాను. తర్వాత మా గురువుగారైన యెల్లుమహంతి సన్యాసిరావు పట్నాయక్ గారి శిష్యరికంలో నటనలో ఎన్నో మెళకువలు నేర్చుకున్నాను. కామెడీ కింగ్ 'హాస్యవల్లరి ప్రకాష్'గా పేరు పొందాను. రంగస్థలంపై నన్ను చూడగానే ప్రేక్షకులు నవ్వడం ప్రారంభించేవారు. ఇప్పుడు మీరు చూస్తున్న 'హాస్య బ్రహ్మ' అవతారం నేనే. ప్రభుత్వ వ్యవసాయ శాఖలో ఎ.ఇ.ఒ.గా పనిచేసి రిటైర్ అయ్యాను.

– జి.ఎస్. ప్రకాశరావు, శ్రీకాకుళం
సెల్: **99087 42466**

**ఇదీ నేనే,** ఆంధ్రజ్యోతి ఆదివారం, ప్లాట్ నెం: 76, రోడ్ నెం: 70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 33 చిరునామాకు పోస్టు ద్వారా గాని, sunday.aj@gmail.com కు మెయిల్ ద్వారా గాని పంపవచ్చు.




# ఒరిగామీ కీటకాలు

ఇన్ని కీటకాలను ఇప్పుడెందుకు చూపిస్తున్నారు అనుకుంటున్నారా? ఇవి నిజమైనవి కావు. ఒరిగామీతో తయారుచేసినవి. ఒరి అంటే మడవడం, కామీ అంటే కాగితం. కాగితాన్ని మడుస్తూ ఒక కళాకృతిని తయారు చేయడమే ఒరిగామీ. జపనీయుల ప్రాచీన కళల్లో ఇదీ ఒకటి. 17వ శతాబ్దంలో మొదలైన ఈ కళ ఆధునికతను సంతరించుకుని కొత్త రూపంలో ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. ఎక్కడా కాగితాన్ని కత్తిరించకుండా, జిగురు వాడకుండా నలుచదరపు రంగు కాగితాలను మడుస్తూ ఈ ఆకృతులను తయారు చేస్తారు. బ్రయాన్ చాన్ స్వతహాగా కళాకారుడు. ఒరిగామీలో ఎన్నో ప్రయోగాలు చేశాడు. దీనిపై ఒక పుస్తకాన్ని కూడా తేవాలనుకుంటున్నాడు. అతడి వేళ్ల విన్యాసం నుంచి పుట్టినవే ఈ కీటకాలన్నీ.



















# ఇంటి చిత్రాలు

ఇళ్ళని కూడా ఇంత అందంగా గీయొచ్చా అనిపిస్తోంది కదూ వీటిని చూస్తే. బ్లాక్ అండ్ వైట్ ఇళ్లు. రంగు రంగుల ఇళ్లు. ఇంటి బయటి చెట్లు. ఇంటి లోపలి దృశ్యాలు. 'నాకు తెలిసిన ఇళ్ళతో నేను వేసిన బొమ్మలివి' అంటాడు ఆర్టిస్టు సుమంతో చౌదురి. తన ఆర్కిటెక్చర్ బొమ్మలలో వర్గ దృక్పథం కూడా ఉందని చెప్పుకున్నాడు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 10వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గాలరీ స్పేస్‌లో జరుగుతున్న ప్రదర్శనలో ఈ చిత్రాలను చూడొచ్చు.







ఆదివారం

# ఆంధ్రజ్యోతి

11 మార్చి 2012

వైభవం : గోవిందుడు.. 'పూల'రంగడు

హ్యాపీడేస్ : మోహనకృష్ణ ఇంద్రగంటి

కథ : ప్రజానాయకుడు






# e టైలింగ్

# ‘ఈ రోజుల్లో..’ ఏం జరుగుతోంది!

ఈ రోజుల్లో ఏం జరుగుతుంది? అందులో సినిమాలో? ఒకే ఒక జవాబు మాత్రమే ఉంది దానికి. ప్రేమ... ప్రేమ... ప్రేమ. ‘ఈ రోజుల్లో..’ సినిమాలోనూ అదే ఉంది. అల్లు అర్జున్ చిన్ననాటి మిత్రుడు మారుతి దీని దర్శకుడు. దర్శకుడితోపాటు హీరో శ్రీ, హీరోయిన్ రేష్మి కూడా కొత్తవాళ్లే. ప్రేమ, బాధ్యత అనే ఇతివృత్తంతో తెర కెక్కుతున్న ఈ సినిమాను నలుగురు మిత్రులు కలిసి ‘గుడ్ సినిమా గ్రూప్’ పతాకంపై నిర్మిస్తున్నారు.











## జై ‘లవ్‌జర్నీ’

‘జర్నీ’ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన తమిళ్ హీరో జై మళ్ళీ ఇప్పుడు ‘లవ్‌జర్నీ’తో వస్తున్నాడు. అతని సరసన షాజన్ పదంసీ, కలర్ స్వాతి నటిస్తున్నారు. తమిళంలో విడుదలైన ‘కనిమొళి’ చిత్రాన్నే తెలుగులో ‘లవ్ జర్నీ’ పేరుతో డబ్ చేస్తున్నారు నిర్మాత జక్కుల నాగేశ్వరరావు. దీని దర్శకుడు శ్రీపతి రంగస్వామి. ‘జర్నీ’ సినిమాతో యువ హృదయాలను గెలుచుకున్న జై ‘లవ్‌జర్నీ’తో దాన్ని నిలుపుకుంటాడో లేదో చూడాలి.

ఆదివారం ఆంధ్రజ్యోతి

11 మార్చి 2012

ఇన్‌డెక్స్

టైలర్ కింగ్స్ . . . . . . . . . . . . . 8
దర్జాబాబుల దర్జీలు

కల నిజమాయె . . . . . . . . . . 11
సింగ్ ఈజ్ కింగ్

వైభవం . . . . . . . . . . . . . . 12
గోవిందుడు 'పూల'రంగడు

వంటశాల . . . . . . . . . . . . . . 22
దోసెతో నాన్‌వెజ్

ఈ వారం కథ . . . . . . . . . . . 23
ప్రజానాయకుడు

కేరింత . . . . . . . . . . . . . . . 30
బేస్‌బాల్ సైజు వడగళ్ళు



కవర్ స్టోరీ . . . . . . . . . . . . . 17
e టైలింగ్



కొత్తపుస్తకాలు . . . . . . . . . . 32
నాట్యాంబుజము, నాట్య అశోకము

'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారం లోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.comకి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.

## 33 ఏళ్లు/333 సినిమాలు

కవర్‌స్టోరీ 33 ఏళ్లు/333 సినిమాలు అంటూ మల్లెంపూటి ఆదినారాయణ... పరుచూరి బ్రదర్స్ గురించి చెప్పిన వైనం చాలా బాగుంది. వాళ్లు రాసిన డైలాగులు, నటీనటులతో అనుభవాలు బాగున్నాయి. అలాగే ఈ వారమే ఆరంభమైన 'హ్యాపీడేస్' శీర్షికన నటుడు శివాజీ పంచుకున్న కాలేజీరోజుల అనుభవాలు కూడా చాలా చాలా బాగున్నాయి. 'శివపురి' కథ రాసిన శరత్ చంద్రకు నమస్సులు. కొంగ్రొత్త శీర్షికలతో వారం వారం అభిమాన పాఠకులను అలరిస్తున్న ఆదివారం ఆంధ్రజ్యోతికి మా హృదయపూర్వక అభినందనలు.

– కురువ శ్రీనివాసులు, హైదరాబాద్

★★★

డైలాగ్ బ్రదర్స్ మొదటినుంచి ఆఖరి అక్షరం వరకు వదలకుండా చదివించింది. డైలాగ్స్ చదువుతున్నప్పుడు ప్రతిసారీ ఆ సినిమా సీన్స్, హీరోల హావభావాలు కన్నులకు కట్టినట్లు కనిపించాయి. అన్నీ హిట్, సూపర్ హిట్, సూపర్‌డూపర్ హిట్ సినిమాలే. ఆంధ్ర ప్రజానీకమంతా తప్పకుండా చూసిన ఆణిముత్యాలే. మంచి ఆర్టికల్ అందజేసిన మీకు ధన్యవాదాలు.

– బి.రాధ, అనంతపురం

★★★

ఈ సంచిక ముఖచిత్రంగా పరుచూరి సోదరులు నవ్వుతూ ఉన్న చిత్రం బాగున్నది. 33 సంవత్సరాలలో 333 సినిమాలకు డైలాగులు రాయడమంటే సామాన్యమైన విషయం కాదు. అందులో సంతోషాన్ని కలిగించే డైలాగులు,



కన్నీళ్లు తెప్పించే డైలాగులు, ఫిరంగిలాడ పేలే డైలాగులు, ప్రేమాభిమానాలను తెలిపే డైలాగులు ఇలా ఎన్నో రకాల డైలాగులు ప్రజల నాడి తెలుసుకుని రాసినవే. బాపు రమణల్లో ఒకరు బొమ్మలేస్తే రెండోవారు రాసేవారు. కాని పరుచూరి బ్రదర్స్ అలా కాదు. ఇద్దరూ కలిసి డైలాగులు అదరగొట్టేలా రాస్తారు. అరిస్తే చరుస్తా..చరిస్తే కరుస్తా..కరిస్తే..నిప్పు మిస్తా- ఈ డైలాగ్ ఎంత బాగుంది.

– ఎస్.డి.గిరిజాప్రసాద్, తిరుపతి

## మా మనసూ దోచింది

ఈ సంచికలో మెల్‌బోర్న్ విషయాలు అలరించాయి. విక్టోరియా స్టేట్ రాజధాని మెల్‌బోర్న్–నూతన ప్రదేశాలు కనుగొనడానికి బయలుదేరిన కెప్టెన్ కుక్ పేరున కాటేజి, పెద్ద



ఇన్‌బాక్స్

అక్వేరియం–పెంగ్విన్ పేరేడు–గ్రేట్ ఓషన్ రోడ్ విషయాలు ఆసక్తికరంగా ఉన్నాయి.

– ఆచార్య నూతి నారాయణరావు, హైదరాబాద్

## కొత్త శీర్షిక బాగుంది

ఆదివారం ఫిబ్రవరి 26 సంచిక చాలా బావుంది. కవర్‌స్టోరీగా పరుచూరి బ్రదర్స్ కథనం, శరత్ చంద్ర కథ బావున్నాయి. నూతన శీర్షిక హీరో శివాజీ హ్యాపీడేస్ వెరీ గుడ్. మనసుదోచిన మెల్‌బోర్న్ ట్రావెలాగ్



కంలో చాలా విషయాలు తెలుసుకునే అవకాశం కలిగింది. మంచి మంచి ఆర్టికల్స్ అందిస్తున్న ఆంధ్రజ్యోతికి అభినందనలు.

– ఉద్దంటి శ్రీనివాసరావు, ఇ–మెయిల్

– నరసింహారెడ్డి, ఇ–మెయిల్

## కథ బాగుంది

శివపురి కథ చాలా చాలా బావుంది. చదువుతున్నంతసేపు ఇలాంటి పని నేను ఎందుకు చేయలేకపోయానని బాధగా ఉంది.

– వాసు, ఇ–మెయిల్

శివపురి కథ బాగుంది. మానవ సంబంధాలను రచయిత హత్తుకునే విధంగా చిత్రించారు.

– సదాశివ్, ఇ–మెయిల్





# మిక్చర్ పొట్లం

పాఠకులకు ప్రత్యేకం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్‌రెడ్డి

## అడ్డొచ్చే జాతీయగీతం



ఇద్దరు కొత్త కానిస్టేబుళ్లు మాట్లాడుకుంటున్నారు.

'మా తమ్ముడికి పరీక్షల్లో సున్నాలొచ్చినప్పుడు కొట్టాలని లాఠీ ఎత్తుతాను కాని ... వీలు కావట్లేదోయ్'' వాపోయాడు పి.సి. నెం. 220.

''అదేం?'' ఆశ్చర్యపోయాడు పి.సి.నెం. 120.

''ఏం చేయనూ? నేను కర్ర తీయగానే జాతీయ గీతం ఎత్తుకుంటాడు. కర్ర పారేసి సెల్యూట్ చేయక తప్పట్లేదు'' చెప్పేడు 220.

## అందుకే వచ్చా!



''ఏరా నిన్న మాదిరే ఈ రోజూ లేటుగా వచ్చావు?'' కోపంగా అరిచింది టీచర్.

''లేటుగా వస్తే ఇంటికి పంపిస్తానన్నారుగా'' ఠపీమని చెప్పాడు విద్యార్థి.

## తీర్పు



రమేష్‌కి ఇంటర్నెట్ చాటింగ్ ద్వారా రమోలా పరిచయం అయింది. ఇద్దరి అభిరుచులు కలిశాయి. ఒక మంచి ముహూర్తం చూసి పెళ్లి చేసుకున్నారు. రెండు నెలల తర్వాత రమోలాకి గతంలో పెళ్లయిందని తెలిసి, కోపంగా కోర్టుకెక్కిన రమేష్‌ని జడ్జి ఇలా ప్రశ్నించాడు...

''ఏం చేస్తుంటావు?''

''క్రీడాకారుడ్ని''

''ఏ ఆట?''

''క్రికెట్''

''క్రికెట్‌లో ఏంటి?''

''స్పిన్నర్''

''స్పిన్నర్ చేతికి కొత్త బంతి దొరకదనే విషయం తెలీదా? వేషాలు కట్టిపెట్టి ఏలుకో'' తీర్పు ఇచ్చాడు జడ్జి జగన్నాథం.

## పుట్టినరోజులేవీ?



''గాడిద పెద్దదా? గుర్రం పెద్దదా?'' ప్రశ్నించింది టీచర్ రోజీ.

''ముందు వాటి డేటాఫ్ బర్త్‌లు తెలిస్తే గానీ ఏది పెద్దదో చెప్పడం కష్టం టీచర్'' బదులిచ్చాడు రాము.

## అందుకే వచ్చా!



''ఏవండోయ్! మీకు గుర్తుందా? మన పెళ్ళై ఈ రోజుకు సంవత్సరం. ఆఫీసునుండి వచ్చేప్పుడు ఓ నాటు కోడి పట్రండి ... కోసుకుందాం'' స్కూటర్ స్టార్ట్ చేస్తున్న భర్తకు వినిపించేలా అరిచింది కాంతం.

''ఎందుకే కాంతం? మనం చేసిన తప్పుకు దాన్ని బలిచేయడం!'' బాధగా మూలిగి, బండి ముందుకు పోనిచ్చాడు రాంబాబు.

## ఎర్రగళ్ల క్యాలండరు



కొత్త క్యాలండరు కొనడానికి వెళ్లిన విద్యార్థి వీరగంధానికి ఎన్ని రకాల క్యాలండర్లు చూసినా నచ్చట్లేదు. విసిగిపోయిన కొట్టువాడు ''ఇంతకీ నీకు ఎలాంటి క్యాలండరు కావాలి?'' చిరాగ్గా అడిగాడు.

''ఎర్రగళ్లు ఎక్కువుండే సెలవుల క్యాలండరు'' పరధ్యానంగా చెప్పేడు వీరగంధం.





# హోమియోలైఫ్

# ఆటిజమ్



Dr.A.M.Reddy, MD

పిల్లల ఎదుగుదల శారీరకంగా, మానసికంగా సరిగ్గా లేకపోతే ఏ తల్లిదండ్రులైనా బాధపడతారు. అదే పిల్లలు మాట్లాడటం, నడవడం ఆలస్యమైతే మరింత ఆందోళనకు గురవుతారు. కొంతమంది పిల్లలు మాట్లాడలేకపోవడం, మాట్లాడేటప్పుడు కళ్ళలోకి చూడకపోవడం, సామాజిక సంబంధ-బాంధవ్యాలు సరిగా ఏర్పరచుకోలేకపోవడం, దానితోపాటు భావోద్వేగాలను అర్థం చేసుకోలేక, చూపించలేకపోతుంటే, చిత్రమైన చేష్టలు విచిత్రమైన ప్రవర్తన కలిగి ఉంటే అది "ఆటిజమ్" అయ్యి ఉండవచ్చు. వినికిడి సమస్యతో బాధపడే పిల్లలకు కూడా మాటలు సరిగ్గా రావు. అందువలన ఇతర సమస్యలేమైనా ఉన్నాయేమో చూసుకొని, వైద్యుల సలహా తీసుకుని "ఆటిజమ్"ని నిర్ధారించుకోవాలి. ఎందువలన అంటే "ఆటిజమ్" ఒక స్పెక్ట్రమ్ డిసార్డర్, ఇందులో ఎన్నో రకాలు ఉండడమే కాకుండా కొన్ని సార్లు "ఆటిజమ్" ఉన్న పిల్లలకి ఆరోగ్యంగా ఉన్న పిల్లలకి మధ్య తేడాను కనిపెట్టడం కష్టతరం కావచ్చును. మెదడు ఎదుగుదల సరిగ్గాలేక పోవడం వలన వచ్చే ఈ వ్యాధిని గుర్తించడం ఎంతైనా అవసరం.

"ఆటిజమ్" లక్షణాల తీవ్రత అందరి పిల్లలలో ఒకలాగానే ఉండదు. కొందరిలో ఈ లక్షణాలు ఖచ్చితంగా, స్పష్టంగా కన్పిస్తాయి దీనిని "క్లాసిక్ ఆటిజమ్" అని అంటారు. కొంతమందిలో లక్షణాల తీవ్రత చాలా తక్కువగా ఉండి అది వారి జీవన శైలిపై ఎలాంటి ప్రభావం చూపించదు. దీనిని "మైల్డ్ ఆటిజమ్", యాస్పర్జర్ సిండ్రోమ్" మొదలగు పేర్లతో వ్యవహరిస్తారు. తీవ్రత ఎలా ఉన్నా ఆటిజమ్ పిల్లలో సాధారణంగా కనిపించే లక్షణాలు :

- భావవ్యక్తీకరణలో, ఏకాగ్రతను కేంద్రీకరించడం ఇబ్బందిని ఎదుర్కోవడం, 40% మందికి మాటలే రాకపోవచ్చు.
- పిల్లలు స్నేహితులను చేసుకోలేకపోవడం.
- ఎదుటివారి మనోభావాలను అర్థం చేసుకోలేకపోవడం.
- నలుగురిలో కలవలేకపోవడం, లేదా ఆనందాలను, బాధలను పంచుకోలేకపోవడం.
- ఒకే మాటను పదేపదే ఉచ్చరించడం, లేదా అడిగిన ప్రశ్నను తిరిగి అడగడం. దీనిని "ఇకోలేలియా" అని అంటారు.
- పిల్లలు ఆడుకునే ఆటవస్తువులలో ఏదో ఒక భాగంపైన లేదా ఒకే రకమైన ఆటవస్తువుల పైన దృష్టి కేంద్రీకరించడం.
- ఎప్పుడూ రొటీన్‌నే కోరుకోవడం ఒకే రకమైన ఆహారం లేదా దుస్తులు వేయమనడం. వయస్సుకు తగినంత మానసిక పరిపక్వత లేకపోవడం
- చేతులు కాళ్ళు విచిత్రంగా ఆడించడం, కదపడం, చుట్టూ తిరగడం, శరీరంలో జెర్క్‌గా కదలికలు రావడం మొదలగు విభిన్నమైన ప్రక్రియలు. వీటిని "స్టీరియో టైప్డ్ మూవ్‌మెంట్స్" అని అంటారు. "ఆటిజమ్"ని గుర్తించడానికి ఇవి బాగా తోడ్పడతాయి.

"ఆటిజమ్" అనేది మెదడు, నాడీ వ్యవస్థ సరిగ్గా ఎదగలేకపోవడం వలన పుట్టకతో వచ్చే సమస్యే అయినా కొంతమంది పిల్లల్లో మూడు సంవత్సరాల వరకు దీనిని గుర్తించలేకపోవచ్చు. ఆటిజమ్ జన్యుపరమైన కారణాల వలన వస్తుందని తెలిసినా దానికి సంబందిత జన్యువుని ఇంకా గుర్తించలేదు. అంతే కాకుండా పిల్లలు గర్భంలో ఉన్నప్పుడు తల్లికి రుబెల్లా, సైటోమెగాలో వైరస్ ఇన్ఫెక్షన్లు వచ్చినా, మాదకద్రవ్యాలు, మద్యపానం వంటి వాటికి అలవాటుపడి ఉన్నా, అధిక రక్తస్రావం కానీ, థైరాయిడ్, డయాబెటిస్ వంటి సమస్యలతో బాధపడుతున్నా పిల్లలకు "ఆటిజమ్" వచ్చే అవకాశం ఉంది. తల్లిదండ్రుల వయస్సు పెరిగే కొద్దీ ఆటిస్టిక్ పిల్లలు పుట్టే అవకాశాలు పెరుగుతాయి. పిల్లలు పుట్టిన తర్వాత కొన్ని రకాల అలర్జీల వలన, వాక్సినేషన్ వలన, కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు, మందులు వాడడం వలన కూడా ఆటిజమ్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు భావిస్తున్నారు. బాల్యంలో తీవ్రమైన మానసిక సంఘర్షణకు గురైన పిల్లల్లో, తల్లిదండ్రుల నుండి సరైన అప్యాయతానురాగాలు పొందలేకపోయిన వారిలో కూడా ఈ సమస్యలు తలెత్తవచ్చు.

"క్లాసిక్ ఆటిస్టిక్ డిసార్డర్" ఉన్న పిల్లలు బాహ్యప్రపంచానికి అస్సలు సంబంధం లేకుండా పదేపదే ఒకే పని చేసుకుంటూ ఉంటారు. ఇలాంటి పిల్లలు చిన్న చిన్న శబ్దాలకు, వాసనలకు కూడా ఎక్కువగా ప్రతిస్పందిస్తారు. వీరు ఎదుగుదల, జ్ఞాపకశక్తి, తెలివి తేటలు మాత్రం వ్యక్తికి-వ్యక్తికి తేడాగా ఉంటాయి. అయితే "యాస్పర్జర్ డిసార్డర్" ఉన్న పిల్లలలో తెలివితేటలు ఎక్కువగా ఉండి వారు తదేకంగా చేసే పనులలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తారు. అయితే ఈ పిల్లలలో భావ వ్యక్తీకరణ తక్కువగా ఉండి విచిత్రమైన శారీక కదలికలను ప్రదర్శిస్తారు. "రెట్స్ సిండ్రోమ్" అనే మరొక రకం ఆటిజం ఎక్కువగా ఆడ పిల్లలలో కనిపిస్తుంది. ఈ పిల్లలలో శరీరం చిక్కిపోయినట్లుండి, పిల్లలకు తల్లిదండ్రుల అవసరత కావాలి. పెర్వేసివ్ డిసింటిగ్రేటెడ్ డిసార్డర్, చైల్డ్‌హుడ్ డిసింటిగ్రేటెడ్ డిసార్డర్ ఇలా ఎన్నో రకాల సమస్యలు ఆటిజమ్ ఉన్న వారిలో కనిపిస్తాయి.

"ఆటిజమ్" ఉన్న పిల్లలకు లక్షణాలనుబట్టి చికిత్స ప్రారంభించవలసి ఉంటుంది. మాటలు సరిగా రానివారికి స్పీచ్ థెరపి ఉపయోగకరంగా ఉంటుంది. బిహేవియర్ థెరపి కూడా ఇలాంటి పిల్లల ప్రవర్తనలో మార్పు రావడానికి సహాయపడుతుంది. హోమియోపతిలో చికిత్స పిల్లల వ్యక్తిగత లక్షణాలను బట్టి, కుటుంబ, సామాజిక పరిస్థితులను అవగహనలోకి తీసుకుని, మూల కారణాలను బట్టి ఉంటుంది. పిల్లలలో ఆటిజమ్ వ్యాధి తీవ్రతను బట్టి చికిత్సావ్యవధి ఆధారపడి ఉంటుంది. సరియైన హోమియోపతి మందును సరిపడే మోతాదులో అనుభవజ్ఞులైన వైద్యుల పర్యవేక్షణలో వాడితే క్రమంగా పిల్లలు మామూలుగా లేదా గరిష్ఠ మెరుగు స్థితికి వస్తారు. హోమియోపతి చికిత్స వలన ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండా ఆరోగ్యంగా ఉన్న పిల్లలలా వారు జీవితాన్ని హాయిగా కొనసాగించడానికి అవకాశం ఉంటుంది.


సలహాలు, సందేహాల కొరకు ఈక్రింది చిరునామాకు ఉత్తరాల ద్వారా సంప్రదించండి

**పాజిటివ్ హోమియోపతి**

ఫ్లాట్.102, శ్రీ సాయిరామ్స్ స్వర్ణలత ఎస్టేట్, DTDC లేన్ ప్రక్కన, సారథి స్టూడియో, అమీర్‌పేట్, హైదరాబాద్.

help@positivehomeopathy.in, PHONE:92909 01010

## బ్లాగోతం

# ధైర్యే సాహసే ఎంకటలక్ష్మి

**అది ఇంజనీరింగ్‌లో చేరిన కొత్త రోజు. సి అంటే ఏమిటి? డేటాస్ట్రక్చర్ అంటే ఏమిటి అని రోజుకి వందసార్లు చెప్పినా కూడా ఈజీగా ఉంది అని అన్ని ప్రోగ్రామ్స్‌లోను అల్గారిథం రాస్తూ ఉండే పసి తనం. కంప్యూటర్సే భయంకరంగా ఉన్నాయి అంటే.. మా ప్రాణానికి ఎలక్ట్రానిక్స్ సబ్జెక్టులు కూడా ఏడిశాయి.. ఎవరి పేరు చెప్తే మేము క్లాసులకి రావడానికి భయపడి కాంటీన్‌కు పరిగెడుతా మో..ఎవరి పేరు చెప్తే ..చెత్త సినిమా అయినా కూడా ప్రాణాలకు తెగించి వీర్ కమల్ థియేట ర్‌కి పారిపోతామో..ఎవరి పేరు చెప్తే బేకర్స్ ఇన్‌కి లగెత్తి పేస్ట్రీలు ..బర్గర్లు..పీజాలు తింటా మో..అదే అండి మా ఇంజనీరింగ్ నెట్వర్క్స్.. అతి వీర ఘోర దారుణ భయంకరమైన సబ్జెక్టు.**

దానికి మాకు ఒక మేడం వచ్చేది రాధాకుమారి అని..పాపం ఆవిడ కూడా మా టైపే..పెద్దగా సబ్జెక్టు రాదు.. ఏదో క్లాస్‌లో బోర్డుమీద బొమ్మలేసి చెప్తే..పోన్లే పాపం అని పట్టించుకోలేదు. కాని ప్రాక్టికల్సు..హ్మ్మ్ .. మన వల్ల అవుతుందా..సరే ఏదో ఒకటి అని గట్టిగ ఊపిరి పీల్చుకుని..కుడి కన్ను అదురుతూ ఉండగా..

ఒక దుర్ముహూర్తాన మా ఎలక్ట్రానిక్స్ డిపార్టుమెంట్‌కు వెళ్లి లేబ్‌లో..మొదటి రోజు ఎడమకాలు పెట్టి ఎంట్రీ ఇచ్చాను... వెంటనే ఆ లేబ్ అటెండర్ వచ్చి దిష్టి తీసి వీరతిలకం అవీ దిద్ది..మా అందర్నీ ఒక మూలకు నున్చో పెట్టాడు.. మాకు లేబ్ ఇంచార్జ్ .. అలాంటిలాంటి వ్యక్తా.. ఆయన గురించి చెప్పాలంటే ఒక చిన్న ఫ్లాష్‌బ్యాక్.. ట్రి ట్రి ట్రి వెళ్లిపోయాను. అది 1965 మా నాన్న అదే ఇంజనీరింగ్ కాలేజిలో జాయిన్ అయ్యారు.. అప్పట్లో ఆయన బెస్ట్‌ఫ్రెండే ఈ రాయుడు.. సర్వరాయుడు.. ఫ్లాష్‌బాక్ ఫినిష్.. సో మా నాన్న బెస్ట్ ఫ్రెండ్ .. నా ఇంజనీరింగ్ నెట్వర్క్స్ ప్రావీణ్యం ఇప్పుడు ఈయనకు చూపిస్తే ఇంట్లో నా పరువు పోతుంది అని చెప్పి.. అందరికంటే వెనకాల దాక్కున్నా.. కాని నా ఖర్మ.. మా అందర్నీ గ్రూప్స్ కింద విభజిస్తారు కదా..అప్పుడు దొరికిపోయా..అంతే ఆయన క్షేమసమాచారాలు మొదలెట్టేసాడు.. అంతా అయ్యాక చూస్తే..నా బేచ్ అంతా అబ్బాయిలే..నేనే లీడర్ని..అసలే కొత్త. దానికి తోడు అబ్బాయిలు. పరువుపోతుంది..ఏమి చెయ్యాలో అర్థం కాలేదు..మన రాయుడు గారేమో రెచ్చింగ్స్..ఏంటో ఇప్పుడు ఆ పదాలు గురుతు కూడా రావడం లేదుకానీ.. రెండు వైరులు కలుపు అన్నాడు..రానప్పుడు మాటాడకుండా ఉండొచ్చు కదా..మిగత వాళ్లు చేస్తారు..కదా. ఉహూ ..ఏదో కంటికి ఇంపుగా కనిపించిన రెండు కలర్ వైర్లు కలిపా..వెంటనే పాతాళభైరవి టైపులో.. ఒక చిన్న మంట వచ్చి వెలుగు వచ్చింది..ఫాలోడ్ బై పొగ అండ్ రాయుడు గారి అరుపులు..నేను కెవ్వ్ అని అరిచా అనుకున్నా..నోరుకూడా తెరిచా..కానీ భయంతో నోట మాట రాలేదు.

ఈ లోగా మహేష్‌బాబులాగా వీరోచితంగా ఒక టు డ్రాప్స్ వాటర్ దాని మీద పోసాడు ఒక అబ్బాయి. వెంటనే నేను వావ్ అన్న.. వాడు పెద్ద ఫైర్ నుంచి రెస్క్యూ చేసిన రేంజ్‌లో బిల్డప్ ఇచ్చాడు..కాని అది ఎంతోసేపు నిలవ లేదు.. సర్క్యూట్ కాల్చినందుకు నన్ను ..దాని మీద నీళ్లు పోసినందుకు వాడిని ఇద్దరినీ గెట్ అవుట్ అని బహిష్కరించాడు.. మా నాన్నకు ఫోన్ చేసి నీ కూతురు పెద్ద శుంఠ టైపులో రెండు నీతి వాక్యాలు అవీ చెప్పాడు.. ఆ తర్వాత సీను మీకు చెప్పక్కర్లేదు కదా.. నువ్వు నాకు నచ్చావ్‌లో చంద్రమోహన్‌లాగా..



మా నాన్న నాకు ఫుల్ క్లాస్ పీకేశారు..నువ్వు అక్కడికి వెళ్లి ఏమీ చేయకపోయినా పర్లేదు ..కానీ మా ఫ్రెండ్‌షిప్ మాత్రం చెడగొట్టకు ..(ఇక్కడ ఇంత భారీ డవిలాగ్ అవసరమా తొక్కలో సర్క్యూట్‌కే ఫ్రెండ్‌షిప్ పాడైపోతుందా..దానికి మళ్ళీ నేను కారణం..హ్మ్మ్..ఏంటో) మా అమ్మ దగ్గరకెళ్లి చెప్తే..ఇలా దా నీకు జడేస్తా అని ఫుల్‌గా నూనె రాసి జడేసింది. (మా అమ్మ అంతే. ఏమి చెప్పాలో తెలియనప్పుడు ఇలా నూనె రాసి జడేస్తూ ఉంటుంది..ఎందుకు అని అడగకండి నాకు తెలీదు. మా అమ్మకు అస్సలు తెలీదు)

ఆ తర్వాత నుంచి లేబ్ అసిస్టెంట్‌ని మంచి చేసుకుని మా సర్క్యూట్స్ అన్నీ వాడితోనే చేయిన్చేసేవాళ్లం... అలా ఉన్న రోజుల్లో.. ఫస్ట్‌ఇయర్ ఎగ్జామ్స్ వచ్చాయి..ఏమొచ్చు రాయడానికి ఒక ముక్క కూడా రాదు..ఏంటో ఖర్మ ..అని అనుకుంటూ ఉన్నా..నాకు ప్రతి ఎగ్జాం రాయడానికి వెళ్లేప్పుడు .. నా హాల్‌టికెట్‌ను ప్రతి దేముడు ఫోటో దగ్గర పెట్టడం అలవాటు..నెట్వర్క్స్ ఎగ్జాం కి ఎంతలాగా మతి పోయింది అంటే..అన్ని ఫోటోలకి పెట్టి చివరకి నా ఫోటో దగ్గర కూడా పెట్టి దణ్ణం పెట్టా..అది మా నాన్న కంటపడింది...వెంటనే ఒక అర గంట క్లాసు..సరే ఏదైతే అది అయింది అని ధైర్యే సాహసే ఎంకటలక్ష్మి అని మా ఎంకమ్మ మంత్రం జపించి ఎగ్జాం హాల్ దాకా వచ్చేసా. బయట మా తొట్టిగాంగ్ అంతా చేరి సీరియస్‌గా డిస్కషన్స్..

ఒకానొక దుర్ముహూర్తాన మా రిజల్ట్స్ వచ్చాయి..నేను అన్ని సబ్జెక్టులు పాసు..జంతర్ మంతర్ ఛూ మంతర్ ఏంటంటే..నెట్వర్క్స్‌లో నేనే క్లాస్ ఫస్ట్..కెవ్వ్.. మా ఎంకమ్మ మంత్రం బాగా పని చేసింది. సో మీరు కూడా కష్టకాలాల్లో ఆ మంత్రాన్ని జపించి గెలుపు పొందండి మరి..ఆల్ ద బెస్ట్.

( outofmyscope.blogspot.com నుంచి సంక్షిప్తంగా..)



ఫైటింగులు, పంచ్ డైలాగులతో మన హీరోలకు బోర్‌కొట్టిందో ఏమో... ఈ మధ్య మన యువ హీరోలు పాటలు పాడేందుకు నెమ్మదిగా ఉత్సాహం చూపిస్తున్నారు. ఇది ట్రెండ్‌గా మారుతోంది. వాళ్ల పాటలకు అభిమానుల నుంచి కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది. అందుకే అవకాశం వస్తే చాలు గొంతువిప్పేందుకు సిద్ధమైపోతున్నారు. ఇటీవల విడుదలైన 'ఇష్క్' చిత్రంలో నితిన్ 'కోడిపాయ లచ్చమ్మది' అంటూ హడావుడి చేశాడు. దీన్ని విడుదలకు ముందే యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేయడంతో అభిమానులు తెగ ఎంజాయ్ చేసేశారు. అలాగే 'లవ్ ఫెయిల్యూర్'లో హీరో సిద్ధార్థ్ ఓ పాటను ఆలపించాడు. అంతకుముందు విడుదలైన 'ఓ మై ఫ్రెండ్' చిత్రంలో కూడా సిద్ధు 'శ్రీ చైతన్య కాలేజ్' అంటూ శ్రుతిహాసన్‌తో కలిసి యువతను హుషారెత్తించాడు. 'యమదొంగ' చిత్రంలో 'ఓలమ్మి తిక్కరేగిందా' అంటూ జూ.ఎన్టీఆర్ పాడితే, 'బిజినెస్‌మేన్' చిత్రంలో 'కలబడితే వదలనురో' అంటూ మహేష్ పంచ్ డైలాగులతో ఓ బిట్ సాంగ్‌ని ఆలపించాడు. ఇలా అవకాశం వచ్చినప్పుడు మన యువ హీరోలు తమ ఎక్స్‌ట్రా టాలెంట్‌ని వెండితెరపై చూపించి బోనస్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందిస్తున్నారు.



# హీరో గంధర్వులు





ఫిల్మ్‌నగర్

# ఆసిన్ సాహసం



రీల్ లైఫ్‌లోనే కాదు రియల్ లైఫ్‌లోనూ సాహసం చేస్తానంటోంది ఆసిన్. ఇటీవల 'బోల్ బచ్చన్' షూటింగ్ కోసం పంచ్‌గని వెళ్లినప్పుడు 'పారాగ్లైయిడింగ్' విన్యాసంలో స్వయంగా పాల్గొందట ఆసిన్. ''ఎప్పటినుంచో ఇలాంటి సాహసాలు చేయాలని ఉంది, అడ్వెంచర్ స్పోర్ట్స్‌కి నేను పెద్ద ఫ్యాన్‌ని. ఇన్నాళ్లకు అలాంటి అడ్వెంచర్ చేసే అవకాశం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. పారాగ్లైయిడింగ్‌లో ఆకాశం హద్దుల వరకు వెళ్లి రావడం రియలీ అమేజింగ్'' అంటోంది ఆసిన్. ప్రస్తుతం ఆసిన్ 'హౌస్‌ఫుల్-2' కాక 'బోల్ బచ్చన్'లో కూడా నటిస్తోంది.

# ఒకే ఒక్క పదం

టాలీవుడ్‌లో రాబోవు సినిమా పేర్లను చూడండి.. టైటిల్‌ని చూడగానే యాక్షన్ సినిమా అనేది అర్థమైపోయేలా సూటిగా, సంక్షిప్తంగా రెండు మూడు అక్షరాలతోనే పంచ్ పడేలా ఉన్నాయి. ఇవి వాడుక భాషలో ఉండటం వల్ల సామన్యుడికి సైతం ఆ చిత్రం ఎలాంటిదనేది తెలిసిపోతోంది. ఎన్టీఆర్ 'దమ్ము' చూపిస్తానంటే... రామ్ చరణ్ 'రచ్చ' చేస్తానంటున్నాడు. త్వరలోనే మరోసారి 'యాక్షన్' చేస్తానని ఎన్టీఆర్ అంటే... నారా రోహిత్ నేను 'ఒక్కడినే' అంటూ రెడీ అవుతున్నాడు. ప్రభాస్ 'రెబల్'గా వస్తానంటే, రవితేజ 'దరువు' వేస్తా అంటున్నాడు. వెంకటేష్ 'షాడో'గా ఫిక్సయిపోగా, సాయి ధరమ్ తేజ్ 'రేయ్' అంటూ త్వరలో మీ ముందు కొస్తా ఆశీర్వదించండి అంటున్నాడు. 'సీఎం'(కామన్‌మ్యాన్)గా రావడానికి మరో అగ్ర హీరో కూడా సిద్ధంగా ఉన్నారు. ఒకే ఒక్క పదంతో అదరగొట్టేద్దామనుకుంటున్నట్టున్నారు దర్శకులు, హీరోలు.



టైలర్ కింగ్స్

# దర్జాబాబుల దర్జీలు

**వీళ్లు అల్లాటప్పా టైలర్లు కాదు. బిల్ క్లింటన్, అన్నాకౌర్నికోవా, ప్రిన్స్ ఛార్లెస్, డేవిడ్ బెక్‌హామ్, లక్ష్మీ మిట్టల్, సారాపాలిన్ వంటి హేమాహేమీలందరికీ కొత్త చొక్కాలు, సూట్లు, ప్యాంట్లు కుట్టే టైలర్లు...**



హాంకాంగ్ ఖరీదైన నగరం. విదేశీయులను విపరీతంగా ఆకర్షించే పర్యాటక ప్రదేశం. దాంతో పాటు ఈ సిటీకి మరో ప్రత్యేకత కూడా ఉంది. ప్రపంచంలోని చాలామంది ప్రముఖులకు దుస్తులు కుట్టిపెట్టే టైలర్లకు ఈ నగరమే కేంద్రం. ఇంగ్లండ్, అమెరికా, యూరప్, ఆస్ట్రేలియాల్లోని సెలబ్రిటీలందరూ కేవలం దర్జీల కోసమే ఇక్కడికి రాకపోకలు జరుపుతుంటారు. బిజీ షెడ్యూల్ వల్ల వాళ్లు రాలేకపోతే ఇక్కడ దర్జీలే ఆయా దేశాలకు వెళ్లొస్తారు. అందుకే, హాంకాంగ్ టైలర్లందరూ ఏడాది పొడవునా ఎక్కే విమానాలు దిగే విమానాలతో బిజీబిజీ. వాళ్లు ఏ దేశం ఎప్పుడు వెళతారు? ఏ లాడ్జిలో బస చేస్తారు? ఏ సమయానికి అపాయింట్‌మెంట్స్ ఫిక్స్ అయ్యాయి? వంటి వివరాలన్నీ వాళ్ల సొంత వెబ్‌సైట్లలో అప్‌డేట్ అవుతుంటాయి. అందులోని సమాచారాన్ని బట్టి టైలర్ల దగ్గరకు సెలబ్రిటీలు వచ్చి కొలతలిచ్చి వెళతారు. అప్పుడే, శాంపుల్ ఫ్యాబ్రిక్ ఎంపిక కూడా జరిగిపోతుంది. హాంకాంగ్ తిరిగొచ్చాక.. దుస్తుల్ని కుట్టి.. పార్శిల్స్ పంపించేస్తారు.

ఇలా చేస్తున్న టైలర్లలో చాలామంది భారతీయులే ఉండటం విశేషం. అందులో ఒకరు మను మెల్వానీ. ఈయన నడుపుతున్న టైలరింగ్ షాపు పేరు 'శామ్స్ టైలర్స్'. దీనికి పెద్ద చరిత్రే ఉంది. ఆ దుకాణాన్ని మను వాళ్ల నాన్న 'శామ్' నెలకొల్పినందున షాపుకు ఆ పేరే పెట్టారు. ''నా దగ్గరికి ఎంతో మంది ప్రముఖులు వస్తుంటారు. కొలతలు తీసుకున్నాక నా ఆటోగ్రాఫ్ తీసుకుంటారు. ఎవరైనా వాళ్ల ఆటోగ్రాఫ్ పుస్తకాలను తిప్పి చూస్తే.. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన సెలబ్రిటీల ఆటోగ్రాఫ్‌లతో పాటు టైలర్ ఇచ్చిన ఆటోగ్రాఫ్ కేవలం నాదొక్కడిదే ఉంటుంది..'' అంటూ నవ్వేస్తాడు మను మెల్వానీ. క్వీన్ ఎలిజబెత్, రోనాల్డ్‌రీగన్, ఇంగ్లండ్ రాకుమారులు ఫిలిప్స్, చార్లెస్, ఫోర్డ్, బుష్ సీనియర్, బిల్‌క్లింటన్, టోనీ బ్లెయిర్, మైఖేల్ జాక్సన్, బోరిస్ బేకర్..లాంటి వాళ్లంతా శామ్స్ టైలర్స్‌కు కస్టమర్లు. ''వాళ్లందరూ చాలా పెద్దోళ్లు కదా. కొలతలు తీసుకునేటప్పుడు నువ్వు ఏవేవో ప్రశ్నలు వేస్తుంటావు కదా..! వాళ్లు విసుక్కోరా..?'' అని మనూను అడుగుతుంటారు స్నేహితులు. అందుకు ఆయన ఏమంటారంటే ''వాళ్లు ఎంత సెలబ్రిటీలైనా కొలతలు తీసుకునేటప్పుడు కొన్ని ప్రశ్నలు అడగాల్సిందే కదా. నాతో బాగానే సరదా కబుర్లు చెబుతారు. కబుర్లాడుతూనే కొలతలు తీసుకుంటా..'' అంటారాయన.



బీ స్పోక్ టైలరింగ్ (నచ్చినట్లు కుట్టించుకోవడం)లో మరో పేరున్న టైలర్ రాజా దస్వానీ. హాంకాంగ్‌లోనే 'రాజా ఫ్యాషన్స్' పేరుతో షాపును పెట్టారు. ఒకప్పుడు రాజా కుటుంబీకులు ముంబయిలో ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చాక.. అక్కడి నుంచి హాంకాంగ్‌కు వెళ్లిపోయారు. అప్పటికే హాంకాంగ్‌లో టైలరింగ్ షాపులన్నీ బ్రిటిష్ పద్ధతిలో నడుస్తున్నాయి. ఆంగ్లేయులకు నచ్చినట్లు బట్టలు కుట్టడంలో చైనీయులు సిద్ధహస్తులు. అయితే వాళ్ల సమస్యల్లా ఆంగ్లంలో సరిగా మాట్లాడలేకపోవడం. అదే రాజా ఫ్యాషన్స్‌కు కలిసొచ్చింది. దీనికితోడు చైనాలో మావో పోయాక కమ్యూనిజం తీవ్రత తగ్గింది. ప్రజలందరూ వేషధారణలో పాశ్చాత్య జీవనశైలిని అనుసరించటం మొదలుపెట్టారు. సూట్లు, స్పోర్ట్స్ జాకెట్లు, ట్రౌజర్లు, బ్లేజర్స్‌లకు డిమాండ్ ఏర్పడింది. వాటిని కుట్టడంలో రాజాఫ్యాషన్స్‌కు ఎక్కడలేని పేరొచ్చింది. ''మా దగ్గరికి అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్, హాలీవుడ్ నటుడు రిచర్డ్‌గేర్, టెన్నిస్‌స్టార్లు బోరిస్ బేకర్, రాజకీయ నాయకురాలు సారాపాలిన్ వంటి వాళ్లు వస్తుంటారు. వాళ్లందరూ సూట్లు కుట్టించుకుంటారు. టెన్నిస్‌స్టార్ అన్నా కౌర్నికోవాకు కుట్టిన బ్లాక్‌సూట్ భలే పేరు తెచ్చింది..'' అని గుర్తు చేసుకున్నారు రాజా దస్వానీ. ఆయన కేవలం కొలతలు తీసుకోవడానికే ఏడాదిలో తొమ్మిది మాసాలు విదేశాల్లో తిరుగుతుంటారు. డ్రెస్ కావాల్సిన టైంకి మూడు మాసాల ముందే ఆర్డర్ చేసుకోవాలి. డేవిడ్ బెక్‌హామ్, ప్రిన్స్‌ఛార్లెస్, లక్ష్మీ మిట్టల్ కూడా రాజాకు రెగ్యులర్ కస్టమర్లు.

మాక్స్‌వెల్ క్లాతియర్స్ స్థాపకుడు ఆండీ మాక్స్‌వెల్ కూడా సెలబ్రిటీ టైలర్లలో ఒకడు. కాశ్మీర్ ఓవర్‌కోట్లు, డిన్నర్ జాకెట్లు, ఊల్ ట్రౌజర్లను కుట్టడంలో నేర్పరి. ఈ టైలర్లందరూ ఒక్కో సూట్ కుట్టేందుకు 50 వేల నుంచి రెండు లక్షల రూపాయల వరకు తీసుకుంటారు.

మరో సెలబ్రిటీ టైలరింగ్ దుకాణం 'యంపైర్ ఇంటర్నేషనల్ కస్టమ్ టైలర్స్'. దాని యజమాని ఆంథోని అసఫ్. పంజాబీ. బ్యాంకాక్ వెళ్లి స్థిరపడ్డారు. ''అంతర్జాతీయ క్రీడాకారులు, పాప్ మ్యూజిక్ స్టార్లు, దేశాధ్యక్షులకు సూట్లు కుట్టే పనిలో బిజీగా గడుపుతుంటాను. బ్రెజిల్, వియన్నా, ఫ్రాంక్‌ఫర్ట్, పారిస్‌లలోనూ మా టైలరింగ్ దుకాణాలున్నాయి..'' అన్నారు అసఫ్.

వామ్మో అనుకుంటున్నారా! మరి అందంగా కనబడటమంటే ఏమిటనుకున్నారు.. అత్యంత ఖరీదైన వ్యవహారం.




**సాహితీ వారసత్వం పుణికిపుచ్చుకుని, చిత్రపరిశ్రమలో అంచలంచెలుగా ఎదిగిన దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి. చలం 'దోషగుణం' కథను 'గ్రహణం' గా తెరకెక్కించి ఒకేసారి ప్రాంతీయ, జాతీయ ప్రభుత్వాల నుండి 'ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు'గా పురస్కారాలు అందుకున్నారు. తర్వాత రసవత్తరంగా 'అష్టాచమ్మా' ఆడించి, అందరి తలలో నాలుకయ్యారు. విజయవాడలో మొదలైన తన కాలేజీ ప్రస్థానాన్ని హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మీదుగా, కెనడాలోని 'యార్క్' యూనివర్సిటీ వరకు కొనసాగించారు. ఆయన 'హ్యాపీడేస్' ఇవి.**

# డ్రామాలు, స్క్రిప్టులతోనే గడిచింది



ఇంటర్మీడియట్ నుంచి ఫిలిం మేకింగ్‌లో డిగ్రీ పుచ్చుకునేదాకా దాదాపు పుష్కర కాలం వరకూ నాది స్టూడెంట్ లైఫే! అయితే నా కాలేజీ డేస్‌లో గ్రూపులు కట్టడాలూ, అమ్మాయిలను ఆట పట్టించడాలూ, లెక్చరర్స్‌కి నిక్ నేమ్స్ పెట్టడాలూ, సైకిల్ చెయిన్లతో బాహాబాహీ పోరాటాలూ, భుజాలూ తొడలూ చరుస్తూ మీసాలు మెలేయడాలూ గట్రా లేవు. ఎంతసేపూ చదవడం, డిబేటింగ్స్‌లో పాల్గొనటం, ప్రపంచ ప్రఖ్యాత సినిమాలు చూడటం, స్క్రిప్ట్స్ రాసుకోవడం, చిన్న చిన్న ఎపిసోడ్స్ తీయడం, ఎప్పుడైనా నాటికలు వేయడం ... అభిరుచి గల అతి కొద్దిమంది మిత్రులతో నా భావాలు పంచుకోవడం .... ఇవే నా 'హాపీ డేస్'.

## 'పెద్దిభొట్ల'వారు తెలుగు చెప్పేవారు

విజయవాడ 'శ్రీఅమరవాణి నికేతన్' హైస్కూల్లో టెన్త్ పూర్తయ్యాక అక్కడే పి.బి.సిద్ధార్థ కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరాను. అప్పట్లో ఆడపిల్లయితే డాక్టర్, మగపిల్లాడయితే ఇంజనీరింగ్ చదవాలనేవారు. బహుశా ఈ నానుడికి జడిసే నాకంతగా ఇష్టం లేకపోయినా ఎం.ఇ.సి. చదివి, సెకండ్ క్లాసులో ప్యాసై నెమ్మదిగా బి.ఏ. ఇంగ్లీష్ లిటరేచర్ చదవడానికి ఆంధ్రా లయోలా కాలేజీలో చేరిపోయా.

బి.ఏ.లో పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారు మాకు తెలుగు చెప్పేవారు. రాజశేఖరచరిత్ర, నిగమశర్మ అక్క, కన్యాశుల్కం లాంటి సాహిత్య కథనాలు ఎంతో ఆసక్తిగా వివరించేవారు ఆయన. కమల్ పుజారా, రఘు, చిరంజీవి, సూర్య లాంటి మంచిమిత్రులు ఉండేవారు. అందరం కలిసి తరచూ డిబేట్లలో పాల్గొనేవాళ్లం. ఇతర కాలేజీల్లో పాల్గొని ప్రైజులు కూడా తీసుకొచ్చేవాళ్లం. ఒకసారి అమలాపురం 'బానోజీ రామర్స్' కాలేజీలో డిబేటింగ్‌లో పాల్గొనడానికి వెళ్లినప్పుడు స్థానిక విద్యార్థులకూ మాకూ మధ్య చిన్న గొడవ వచ్చి చిలికి చిలికి గాలివానైంది. దాన్ని ఎంతో సమయస్ఫూర్తితో పరిష్కరించి చివరికి వాళ్లంతా తమ ఇళ్లకి మమ్మల్ని భోజనాలకు పిలిచేంత ప్రేమని సంపాదించగలిగాం. అప్పుడే మా నాన్నగారు రాసిన 'నగరానికి దూరంగా' అనే పాట పాడి వాళ్లను ఇంప్రెస్ చేసిన గుర్తు.

## సెంట్రల్ యూనివర్సిటీలో చేరిక

ఒకసారి మా కాలేజీలో జరిగిన డిబేటింగ్‌లో పాల్గొనడానికి మేరీ స్టెల్లా కాలేజీ నుండి ఉమ, వేగుంట మోహనప్రసాద్‌గారి అమ్మాయి మమత వచ్చి ఫస్ట్ ప్రైజ్ కొట్టుకుపోయారు. (ఉమతో ఆనాటి పరిచయం అంచెలంచెలుగా పెరిగి నా సహచరి అయ్యిందనుకోండి).

బి.ఏ. చదువుతున్న కాలంలోనే హోటల్ మమతా, నవరంగ్ థియేటర్లలో వేసే ఫిల్మ్ క్లబ్ సినిమాలు తెగ చూసేవాడిని. వాటిని చూస్తున్నంత సేపూ అంతర్లీనంగా ఏదో అలజడి. ఆ డైరెక్టర్లని అంచనా వేస్తూ, వారు అనుకున్నది ఏ రూపంగా ప్రేక్షకులకు అందిస్తున్నారో అధ్యయనం చేసేవాడిని. ఆ రోజుల్లోనే అయితే జర్నలిస్టుగా, లేదంటే

డైరెక్టరుగా జీవితంలో స్థిరపడాలని నిర్ణయానికి వచ్చేశాను. బహుశా ఆ కోరికే తర్వాత ఎం.ఏ. కోసం సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ రాయడానికి హైద్రాబాద్ వచ్చేయడానికి దోహద పడిందేమో!

## తొలి 'డాక్యు డ్రామా'

యూనివర్సిటీలో ఉండగా సినిమా ఎలా తీయాలి? అనేదొక్కటే నా బుర్రలో గింగుర్లు తిరిగేది. అప్పటికి ఫిలిం మేకింగ్ గురించి ఓనమాలు తెలియవు. ఎంత పెద్ద ప్రయాణమైనా ఒక అడుగుతోనే ప్రారంభం అవుతుంది కదా! ఒక 'డాక్యు డ్రామా' తీసి చూద్దాం అనుకుని యూనివర్సిటీకి వచ్చిన ఒక కుర్రాడి ఆలోచనలు, అతన్ని వెంటాడే జ్ఞాపకాలు నేపథ్యంలో 15 నిమిషాల స్క్రిప్ట్ రాసుకున్నా. అప్పటికే యూనివర్సిటీలో శ్రీవిద్య, నైజిల్ అనే మంచి మిత్రులను సంపాదించా. వాళ్లు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం నన్ను అబ్బురపరిచేది. వాళ్ల ప్రేరణతో అడుగులు వేస్తుండేవాడిని. నా ఎపిసోడ్‌లో శ్రీవిద్య, నైజిల్ నటించారు. కెమెరా కోసం బెజవాడ మిత్రుడు హరిని పిలిపించాను. సెంట్రల్ యూనివర్సిటీలో వివిధ ఆకృతుల్లో రాళ్లు ఉండేవి. కొన్ని డైనోసర్స్‌లా కన్పించేవి. వాటిని చూపినప్పుడు జురాసిక్ పార్కులోని మ్యూజిక్‌ని వాడుకున్నాను. మొత్తం మీద 'డౌన్ మెమరీ లేన్' (జ్ఞాపకాల దారిలో) అని పేరు పెట్టి ప్రదర్శించాం. మా స్టూడెంట్స్ అందరూ ఆహా అని భుజం తట్టి ప్రోత్సహించారు.

## 'అష్టాచమ్మా'కి బీజం పడింది అప్పుడే

నాటకాలు, నవలలు ఎప్పుడు చదివినా వాటికి దృశ్యరూపం ఇస్తే ఎలా ఉంటుందా అని ఆలోచించేవాడిని. షేక్స్‌పియర్ 'జూలియస్ సీజర్', 'హామ్లెట్', 'మర్చెంట్ ఆఫ్ వెనిస్' లాంటివి చదివిన వెంటనే విధిగా వాటి సినిమాలు వెదికి చూసేవాడిని. ముఖ్యంగా ఆస్కార్ వైల్డ్ 'ది ఇంపార్టెన్స్ ఆఫ్ బీయింగ్ ఎర్నెస్ట్' నాటకం నా మనసులో నిలిచిపోయింది (దీని స్ఫూర్తితోనే తర్వాత 'అష్టాచమ్మా' తెరకెక్కించాను)

'డాక్యుడ్రామా' విజయం తర్వాత సోఫోక్లిస్ 'యాంటిగని' అనే గ్రీకు నాటకానికి స్క్రిప్ట్ తయారుచేసి స్టేజి నాటకం వేయాలనుకున్నాను. అందులో సైనికుడి పాత్ర నాది (చిన్నతనంలో ముళ్లపూడి 'బుడుగు', శ్రీరమణ 'గ్లాసు పగిలింది' నాటకాల్లో పాల్గొన్న అనుభవం ఉందిలెండి). 'యాంటిగని'గా శ్రీవిద్య నటించింది. ఉమది కూడా ఒక పాత్ర (అప్పటికే తనూ సెంట్రల్ యూనివర్సిటీలో చేరింది). అచ్చంగా గ్రీకు ఆహార్యంతో ఆనాటి నేటివిటీని ప్రతిబింబించేలా తయారుచేశాను. రూ.5/- టికెట్ పెట్టి, పలానా టైంలో ఆ నాటకం వేస్తున్నామని చేత్తో రాసి తరగతుల్లో, కాంటీన్ గోడలపైన అతికించాం. మా కాంటీన్ ముందున్న కానుగచెట్టు చప్టాపై గంటపాటు వేసిన ఈ నాటకాన్ని స్టూడెంట్స్ ఎగబడి చూశారు.

సెంట్రల్ యూనివర్సిటీలో చదవడం అన్నమాటే గానీ తరచూ ఉమతో కలిసి సినిమాహాళ్లకు, రవీంద్ర భారతిలో నాటకాలకీ, డాన్స్ ప్రోగ్రామ్స్‌కీ తిరిగేవాణ్ణి. ముఖ్యంగా సికింద్రాబాద్‌లోని సంగీత్, బషీర్‌బాగ్‌లోని స్కైలైన్, స్టెర్లిన్ థియేటర్లే మా అడ్డ. వీటిల్లో ఇంగ్లిష్ సినిమాలు తెగ చూసేవాళ్లం. మాతో పాటు శ్రీవిద్య, నైజిల్‌లు సరేసరి ... ఇంకా రేఖ, అనిత, శ్రీలతలు ఉండేవారు. నన్ను ప్రోత్సహించిన ప్రొఫెసర్లలో తేజస్విని నిరంజన్, సంజయ్ పాలిషీకర్, సతీష్ దేశ్‌పాండే, విశ్వనాథన్‌లు ముఖ్యులు.



## అద్భుతమైన 'డేస్' అవి

ఎం.ఫిల్ అయ్యాక టొరంటోలోని యార్క్ యూనివర్సిటీలో ఫిలిం మేకింగ్ కోర్సులో చేరాను. 'అమ్నాన్ బక్ బైండర్' నాకు గైడెన్స్ ప్రొఫెసర్‌గా ఉండేవారు. యార్క్ యూనివర్సిటీలోని 'సిఎంఐఎల్' లైబ్రరీలో ప్రపంచ దేశాల సినిమాలు దాదాపు పాతిక వేలదాకా ఉండేవి. ఎన్ని వేల సినిమాలు చూశానో లెక్కలేదు. 'క్విన్ వీడియో' అనే ప్రైవేట్ షాపులోంచి కూడా ఎన్నో సినిమాలు తెచ్చి చూసేవాణ్ణి. కాలం తెలిసేది కాదు. ఫస్ట్ ఇయర్‌లో ఉండగా 5 నిమిషాల ఎపిసోడ్ ఒకటి తీశాను. 'ఓం స్వీట్ ఓం' దాని పేరు. పరాయిదేశం వచ్చిన వారికి స్వదేశం పైగల ప్రేమ, తను ప్రస్తుతం ఉంటున్న ఊరిపై ఇష్టం పెంచుకోవడం ... ఈ అంశంతో తయారైన డాక్యుమెంటరీ అది. నా గ్రూప్‌లోని స్టూడెంట్సందరం కలిసి దాన్ని రూపొందించాం. దీనికి డైరెక్షన్ చేసినందుకు గాను 'ఎ ప్లస్' గ్రేడ్ వచ్చింది నాకు. సెకండియర్‌లో 'సంభాషణం', 'పగటి కల' అనే రెండు పదకొండు నిమిషాల నిడివిగల ఫిలింస్ తీశాను. ఇవి కూడా మంచి మార్కులు తెచ్చుకున్నవే.

## మరిచిపోలేని అనుభవాలు

ఆస్కార్ లైఫ్‌టైం పురస్కారం పొందిన హాలీవుడ్ డైరెక్టర్ 'నార్మన్ జూ ఈసన్' మా కాలేజీకి వచ్చినప్పుడు కొన్ని ప్రశ్నల్ని నేను వేయడం ... ఆయన ఓపిగ్గా సమాధానం చెప్పడం మర్చిపోలేని అనుభవం. 'ఎన్ని కష్టాలు వచ్చినా నీవు నమ్మిందాన్నే సినిమాగా తీయాలి. చివరికి అదే అందరికీ నచ్చుతుంది. నిజమైన గుర్తింపుని తెస్తుంది, నీకు ఆత్మతృప్తిని మిగులుస్తుంద'ని చెప్పిన వారి మాటలు నా మనసులో ఇప్పటికీ నాటుకునే ఉన్నాయి. ఇంకోసారి హాలీవుడ్ నటుడు రాబర్ట్ ఫారెస్టర్ వచ్చారు. 'జీవితాన్ని ప్రభావితం చేసే కళ ఇదొక్కటే. వినోదం కోసం తీస్తూ వికాసాన్ని అందించగలిగిన కళ ఇది' అని చెప్పడం కూడా మర్చిపోలేను.



జాతీయ పురస్కారం అందుకుంటూ...

మా అమ్మగారి నవల 'వెన్నెల మట్టి'ని స్క్రిప్ట్‌గా రాసి థీసిస్‌కి అప్లయ్ చేశాను. అదొక తల్లీకూతుళ్ల కథ. ఈ స్క్రిప్ట్ యూనివర్సిటీ థీసిస్ అవార్డుకు నామినేట్ అవడం నా కాలేజీ డేస్‌లోని మరో హ్యాపీ విషయం.

మోహనకృష్ణ మెయిల్: mokris@reddiffmail.com

– గొరుసు జగదీశ్వరరెడ్డి

కల నిజమాయె!



**ఆ ఒక్క మ్యాచ్ ఓడిపోతే.. ఏళ్లతరబడి కన్న కలలు కలగానే మిగిలిపోతాయి. ఆ ఒక్క మ్యాచ్ గెలిస్తే.. ఒలింపిక్స్‌లో ఆడే అరుదైన అవకాశం లభిస్తుంది. భారతీయుల స్వప్నాన్ని బాధ్యతగా తీసుకుని.. గెలిచి చూపించి.. 'సింగ్ ఈజ్ కింగ్' అనిపించుకున్నాడు భారత్ హాకీ క్రీడాకారుడు సందీప్‌సింగ్..**

# సింగ్ ఈజ్ కింగ్

ఢిల్లీలోని ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఫ్రాన్స్‌పై భారత్ గెలవగానే అభిమానులందరూ ''సింగ్ ఈజ్ కింగ్.. సింగ్ ఈజ్ కింగ్'' అంటూ గట్టిగా నినాదాలు ఇచ్చారు. మైదానంలోని క్రీడాకారులందరూ చుట్టుముట్టడంతో సందీప్‌సింగ్, తన కుడిచెయ్యిని పైకెత్తి అభివాదం చేశాడు. అప్పుడు అందర్నీ ఆకర్షించింది ఏమిటో తెలుసా..? ఆ చేయికి వేయించుకున్న అయిదు రింగుల ఒలింపిక్స్ టాటూ. లండన్‌లో జరగబోయే ఆ గేమ్స్‌లో పాల్గొనాలన్నదే సందీప్ ఏకైక లక్ష్యం. ఆ కల ఇప్పుడు నెరవేరింది. దీంతో 'సింగ్' ఒక్కసారిగా 'కింగ్' అయ్యారు. భారత హాకీప్రియుల హృదయాలలో రారాజుగా మిగిలాడు. మ్యాచ్ పూర్తవ్వగానే ''నా భావోద్వేగాలను వ్యక్త పరిచేందుకు మాటలు చాలడం లేదు. మన టీం లండన్ ఒలింపిక్స్‌కు అర్హత పొందడం చాలా గ్రేట్‌గా ఫీలవుతున్నాను..'' అన్నాడు సందీప్‌సింగ్. ఈ మ్యాచ్ గెలిచిన మర్నాడే ఆయన పుట్టిన రోజు కూడా.

ఈ మధ్య కాలంలో భారత్ క్రికెట్ టీం ఎన్ని ఓటములు చవిచూస్తున్నదో.. హాకీ టీం అన్నేసి విజయాలను నమోదు చేస్తోంది. దానికి కారణం సందీప్‌సింగ్ లాంటి ఆటగాళ్లు హాకీ టీంలో ఉండటమే. హర్యానాలోని కురుక్షేత్రకు సమీపంలో ఉన్న షహబాద్‌లో పుట్టాడు సింగ్. సోదరుడు బిక్రమ్‌జిత్‌సింగ్ కూడా హాకీ ఆటగాడే.



కౌలాలంపూర్‌లో 2004లో జరిగిన అజ్లాన్ షా కప్‌లో ఆడటంతో.. అంతర్జాతీయ మ్యాచ్‌లలో అడుగుపెట్టాడీ ఆటగాడు. టోర్నమెంట్‌లో విశేష ప్రతిభ చూపాడు. మళ్లీ 2009లో ఇదే టోర్నమెంట్‌లో భారత్ హాకీటీంకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఫైనల్‌లో అద్భుతంగా ఆడి కప్ గెలిచారు. 13 ఏళ్ల తర్వాత సందీప్ నాయకత్వంలో ఈ కప్ భారత్ గెలుచుకోవడం మరిచిపోలేనిదని అప్పట్లో కొనియాడారు క్రీడాభిమానులు.

సందీప్ రాకముందు భారత్ హాకీ జట్టుకు ఓ సమస్య ఉండేది. పెనాల్టీ కార్నర్ కన్వర్షన్ కొట్టగలిగే ఆటగాళ్లే టీంలో ఉండేవారు కాదు. ఇప్పుడు సందీప్ ఆ కొరతను భర్తీ చేశాడు. బెస్ట్ పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్‌గా గుర్తింపు పొందాడు. మ్యాచ్ ఎలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా నెగ్గుకొస్తాడన్న నమ్మకం కలిగించాడు. డ్రాగ్ ఫ్లికర్ కొట్టడంలో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తాడు. సందీప్ కొట్టే బంతి గంటకు 145 కిలోమీటర్ల వేగంతో పరిగెడుతుంది. ప్రత్యర్థుల అంచనాలను తలకిందులు చేసే ఈ ఆటగాడు.. ఎలాగైనా మ్యాచ్‌ను గెలిపించి తీరతాడన్న విశ్వాసం ప్రేక్షకుల్లో ఉంటుంది. ఫిబ్రవరి 26తో ముగిసిన భారత్–ఫ్రాన్స్ టోర్నమెంట్ బరిలోకి దిగే ముందు 12 గోల్స్ చేస్తానని ప్రకటించాడు సందీప్. మ్యాచ్ ముగిశాక 16 గోల్స్ కొట్టి సత్తా చూపించాడు.

''అతని వయస్సు చాలా చిన్నది. కాని అబ్బురపరిచే నాయకత్వ లక్షణాలున్నాయి. ఆటకు ముందే తోటి క్రీడాకారుల్లో కసిని రగిలిస్తాడు. తను కూడా అంతే కసితో ఆడి స్ఫూర్తిగా నిలుస్తాడు..'' అంటున్నారు క్రీడా పండితులు. ఫ్రాన్స్‌తో గెలిచిన తర్వాత.. లండన్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంతో.. హర్యానా ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. ఫైనల్‌లో సందీప్ అయిదు గోల్స్ చేసినందుకు పాతిక లక్షల రూపాయలు, మిగిలిన పదకొండు గోల్స్‌కు లక్ష చొప్పున ప్రకటించింది. సహారా సంస్థ కూడా హాకీ టీం మొత్తానికి 1.17 కోట్లు అందివ్వనుంది. హాకీలో మెరుపులు మెరిపిస్తున్న సందీప్ ప్రస్తుతం.. హర్యానా పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో.. డీఎస్పీ క్యాడర్‌లో కొనసాగుతున్నాడు. లండన్ ఒలింపిక్స్‌లో భారత్‌కు విజయాలు తీసుకొచ్చేందుకు ఉవ్విళ్లూరుతున్నాడు.




# గోవిందుడు.. 'పూల'రంగడు

**తిరుమల వెంకన్న పూలరంగడు. రోజుకో రకమైన పూల అలంకారాలతో కళకళలాడుతూ ఉంటాడు. వింత వింత హారాలు, పునుగు జువ్వాది పరిమళాలతో నిత్యం సువాసన భరితంగా ఉంటాడు... గుడి గడపదాటి ఊరేగడానికి వచ్చాడంటే ఆయన పూల షోకులకు అంతే లేదు. ఎన్ని రకాల పూలు..ఎన్ని రకాల పత్రాలు.. ఎన్నెన్ని వింత పరిమళాలు..?! నల్లనయ్య అందానికి పరవశించి మోహించని భక్తులుంటారా మరి! తిరుమల శ్రీనివాసుని పూలవైభోగం స్వామిదే కాదు, ఆయన భక్తులది కూడా.**

పచ్చని కొండలు..ఉండుండీ కమ్ముకొచ్చే మబ్బులు.. మబ్బుల్ని చీల్చుకుంటూ దూసుకొచ్చే వెలుగు రేఖలు.. పొగమంచు పరచుకున్న లోయలు..సహజ శిలాకృతి శిఖరాలు.. వయ్యారపు వొంపులతో సాగే కనుమ దారి..దారికిరువైపులా రంగురంగుల కాగితపు పూపొదలు..



ఇలాంటి తోటలెన్నో...



పుష్పయాగానికి సిద్ధమైన పూలు

తిరుపతిలో అలిపిరిటోల్‌గేట్ దాటినప్పటి నుంచీ ప్రతి మలుపూ ఒక అద్భుత దృశ్యమై కనులముందు నిలుస్తుంది. సగం కొండెక్కగానే తిరుపతి వేడిసెగలు మటుమాయమై చల్లని కొండగాలులు పలుకరిస్తాయి. మలుపులన్నీ పూర్తవగానే తిరుమల పూదోటలు తొలి స్వాగతం పలుకుతాయి. తిరుమలలో మీరు ఎక్కడ బసచేసినా, ఎక్కడెక్కడ తిరుగులాడినా పూల సొగసులు కనువిందు చేస్తాయి. కాటేజీల ముందు ఆకాశమంత ఎత్తు సంపంగి చెట్లు చందనపురంగు పూలతో పరిమళాన్ని పంచుతాయి. ఒక్కో రుతువులో ఒక్కో రంగు పూలు తిరుమలకు వింత అందాలను సంతరించిపెడతాయి. ఆకుల జాడ లేకుండా గులాబి, నీలం, పచ్చని పసుపు రంగుల పూలు విరబూసిన వృక్షాలు బారులు బారులుగా దర్శనమిస్తాయి. తెల్లని పూలను జలజలా రాల్చే మాను సంపంగి, ఎర్రెర్రని మంటలా కనిపించే చిటికెనేరి చెట్లు ఎటు చూసినా కనిపిస్తాయి. ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో, రాజకీయాల్లో, కుటుంబాల్లో తలమునకలై కోటి వత్తిళ్ళతో కొండకు వచ్చే భక్తుల మనస్సులను తిరుమల పచ్చదనం సేదతీరుస్తుంది. స్వామి సేవతో పాటు భక్తుల సేవలోనూ తిరుమల గిరుల్లో పూసే పూలు తరిస్తున్నాయి. ఇవేవీ సహజంగా పడి పెరిగిన చెట్లు కావు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక శ్రద్ధతో పెంచుతున్న వనాలు.

అరచెయ్యంత వెడల్పాటి గులాబీలు, దోసెడంత మందారాలు, ముద్దబంతులు, చేమం

తులు, కనకాంబరాలు, మల్లెలు, విరజాజులు, కాగడాలు, నందివర్ధనాలు, లిల్లీ పూలు, కస్తూరి, గన్నేరు, వెల్వెట్... యింకా ఎన్నో రకాల పూలు తిరుమల ఉద్యానవనాల్లో కనిపిస్తాయి. జీఎన్సీ, ఎస్ఎమ్సీ, పద్మావతి నగర్, హెచ్వీసీ, టీబీసీ, ఎంబీసీ, ఎన్జీసీ, రాంభగీచ, ఆస్థాన మండపం, దివ్యారామం, గోగర్భం డ్యామ్ తదితర చోట్ల మొత్తం రెండొందల ఎకరాల్లో ఈ పూల తోటలున్నాయి. వందలాది మంది సిబ్బంది ఈ పచ్చదనాన్ని కాపాడుతూ ఉంటారు. ఇందుకోసం టీటీడీ ఏటా ఇరవై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది.



దండ సరిగ్గా ఉందా...!



పూలమాలలు కడుతూ...

## తోమాలసేవ

తిరుమల స్వామి సేవ కోసం రోజుకెన్ని పూలు వాడుతారో తెలుసా? 250 కిలోలు. బ్రహ్మోత్సవాలు, ఇతర పర్వదినాల్లో అయితే రోజుకి నాలుగైదు టన్నుల పూలు కావాలి. ఇన్ని పూలు లేనిదే వెంకన్నస్వామికి రోజు గడవదు. గర్భగుడిలోని స్వామికి రోజూ తోమాల సేవ ఉంటుంది. శిఖామణి, సాలిగ్రామం, శ్రీదేవి, భూదేవి కంఠహారాలతో పాటు 30 రకాల మాలలతో స్వామిని అలంకరించడమే తోమాలసేవ. ఉదయం వేసిన మాల సాయంత్రానికి మారిపోతుంది. స్వామి పూలమాలలు అల్లడానికే 150 మంది ఉద్యోగులు టీటీడీలో ఉన్నారు. స్వామి పూలమాలలు అల్లే అవకాశం భక్తులకీ ఉంది. శ్రీవారిసేవకులు ఉద్యానవనాల పెంపకంలోనూ, పూలఅలంకరణల్లోనూ టీటీడీ ఉద్యోగులకు సహకరించవచ్చు. స్వామిని తాకే అవకాశం ఎలాగూ ఉండదు కాబట్టి తమ చే స్పర్శ తగిలిన పూలు స్వామిని తాకుతాయనే భావనే వారికి అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. లేతాకుపచ్చని అరటి పిలకల అలంకరణతో ఒక్కోసారి ఆలయపరిసరాలు అరటి తోటలా మారుతాయి. ఆలయ మహాద్వారం, అద్దాలమహల్, కల్యాణోత్సవ వేదిక, గరుడాళ్వార్ సన్నిధి, పరివార దేవతల మందిరాలు, ఊంజల్సేవ, వైభవోత్సవ మండపాలను రోజూ అరటి పిలకలతో అలంకరిస్తారు. దీనికోసం ఏడాదికి 20వేల అరటి పిలకలు కావాలి. లేత పిలకల కోసం తిరుమలలోనే ప్రత్యేక అరటి వనాలను పెంచుతున్నారు. రథసప్తమి, తెప్పోత్సవం, వసంతోత్సవం, పద్మావతి పరిణయోత్సవం, పవిత్రోత్సవం, పుష్పయాగం, వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో స్వామి కోసమే కాదు, ఆలయ పరిసరాల అలంకరణ కోసమూ టన్నుల కొద్దీ పూలు వినియోగిస్తారు. బ్రహ్మోత్సవాల రోజుల్లో అయితే తిరుమల కొండ పుష్ప పర్వతంలా కనిపిస్తుంది. అప్పుడు జరిగే ఫల, పుష్ప ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణ. లక్షలాది మంది దీనిని తిలకించి ఫోటోలు దిగుతుంటారు. ఇందుకోసం 25 నుంచి 30 టన్నుల పూలు అవసరం. కొన్నిసార్లు భక్తులే పూలను విరాళంగా యిస్తుంటారు. తిరుమల పూలతోటల పెంపకంలో, నిర్వహణలో టీటీడీ ఉద్యానవనశాఖతో పాటు అటవీశాఖ కూడా పాలుపంచుకుంటుంది. సహజ శిలాతోరణం, రెండు ఘాట్‌రోడ్ల దారిపొడవునా తోటలు పెంచి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు.

### శ్రీవారి పుష్పయాగాన్ని వర్ణించే అన్నమయ్య పద్యం

మొదల శ్రీసతి చేతి మోహన కమలమే
పొదల నీకెపుడును పుష్పయాగము
కేలితో నారదుడొసగిన పారిజాతము
భూలోకమున నీకు పుష్పయాగము
తొరలి అలమేల్మంగ తురుమున విరులే నీకు
పొరసి నీవురముపై పుష్పయాగము
సిరులతో మునులెల్ల శ్రీ వేంకటాద్రీశ నీకు
పొరి పొరి చేసేరు పుష్పయాగము



## పుష్పయాగం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఏటా కార్తీకమాసంలో శ్రవణ నక్షత్ర పర్వదినాన పుష్పయాగ మహోత్సవం నిర్వహిస్తారు. దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో 15వ శతాబ్దం నుంచి ఈ పుష్పయాగ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు శాసనాలు తెలుపుతున్నాయి. అప్పట్లో బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణ జరిగిన ఏడో రోజున స్వామికి పుష్పయాగం చేసేవారు. ఆ తర్వాతి కాలంలో ఈ ఉత్సవం ఆగిపోయింది. 1980లో టీటీడీ దీనిని మళ్లీ పునరుద్ధరించింది. శ్రీదేవి, భూదేవి, మలయప్పస్వామిని సంపంగి ప్రదక్షిణలోని కల్యాణ మంటపంలోకి తీసుకువస్తారు. హోమం, స్నపన తిరుమంజనం తర్వాత పుష్ప కైంకర్యం చేస్తారు. 18 రకాల పుష్పాలతో స్వామి, అమ్మవార్లను వక్షస్థలాల దాకా పుష్పాభిషేకం చేస్తారు. వందలాదిమంది రంగురంగుల పూల బుట్టలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వచ్చే దృశ్యం అపురూపమైంది.

ఇందుకోసం హైదరాబాదు, బెంగళూరు, చెన్నయ్, వైజాగ్, తిరుపూర్, శ్రీరంగం, పళనితో పాటు హాలెండ్, మలేషియా, సింగపూర్, బ్యాంకాక్ వంటి విదేశాల నుంచి కూడా పుష్పాలు తెప్పిస్తారు. సంపంగి, మరువం, దమనం, చేమంతి, వృక్షి, లిల్లీస్, మల్లి, కనకాంబరం, నందివర్ధనం, గన్నేరు, తులసి, పన్నీరాకు, బంతి, వాడమల్లి, విరజాజి, గులాబి వంటి కుసుమాలతో 20 సార్లు నిర్వహించే పుష్పకైంకర్యం చూసేందుకు వేయి కన్నులు చాలవు. ఇందుకు అవసరమయ్యే పుష్పాలను సాధారణంగా పూర్తిగా దాతలే సమకూరుస్తుంటారు.

– ఆర్.ముని, ఆన్‌లైన్, తిరుమల

ఫోటోలు: ఎం. శివయ్య

# కన్యాకుమారిలోనూ 'టస్సాడ్స్'



ఆ మధ్య బాలీవుడ్ హీరో హృతిక్‌రోషన్‌ని అమ్మాయిలు ముద్దులతో ముంచెత్తారట. దీన్ని సీసీ కెమెరాల్లో చూసిన వారంతా అవాక్కయ్యారట. ముద్దులిస్తే అవాక్కవ్వడం ఏంటని అనుకుంటున్నారా... అమ్మాయిలు ముద్దులతో ముంచెత్తింది నిజమైన హృతిక్‌రోషన్‌ని కాదు. అతని పోలికలతో ఉండే మైనపు బొమ్మను. లండన్‌లోని టస్సాడ్స్ మ్యూజియంలో బాలీవుడ్ సెలబ్రిటీల విగ్రహాలు ఎన్నో ఉన్నాయి. అచ్చం అలాంటి మ్యూజియం మన పొరుగు రాష్ట్రంలోనే ఉందంటే నమ్మగలరా... ఇది నిజం. అది కూడా ఆధ్యాత్మికతకు పేరుగాంచిన కన్యాకుమారిలో కొలువుదీరింది. సునీల్ కందలూర్ అనే వ్యక్తి ఈ మ్యూజియంను ఏర్పాటు చేసి అందులో 50 మంది సెలబ్రిటీల మైనపు విగ్రహాలను పెట్టాడు. కొల్లాంలోని మాధవ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చదువుకున్న ఇతనికి వైవిధ్యమైన కళలంటే చాలా మక్కువ. దీంతో ఈ సెలబ్రిటీ వ్యాక్స్ మ్యూజియానికి అంకురార్పణ చేశారు. ఆధ్యాత్మిక గురువులు, చరిత్రకారులు, సినీ తారలు, రాజకీయ నాయకులు, సామాజిక ఉద్యమకారులు తదితరులవి అచ్చం మనిషిని పోలివుండేలా మైనపు విగ్రహాలను తయారుచేసి పర్యాటకులకోసం ఇక్కడ ఉంచారు. అవినీతిపై పోరుసాగిస్తున్న సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే మైనపు విగ్రహాన్ని ఇటీవలే లక్షన్నర ఖర్చుతో ఏర్పాటు చేశారు. ఈ మైనపు బొమ్మలు టస్సాడ్స్ మ్యూజియంలోని మైనపు విగ్రహాలంత రిచ్‌గా లేకపోయినా... ఇలాంటి ఒక మ్యూజియం మనకు అందుబాటులో ఉండటం విశేషమే!

# చిరునామాల టీ షర్టు




మీరు పూటుగా తాగి ఏ పబ్బులోనో... బారులోనో పడిపోయారా... మీ వద్దనున్న సెల్ ఫోను పోగొట్టుకుని మద్యం మత్తులో మునిగిపోయారా... వర్రీ కాకండి. మీ ఊరు, పేరు వివరాలతో అడ్రసు రాసుకునే టీ షర్ట్స్ మార్కెట్లోకి వచ్చాయి. మీరు ఏ మిడ్‌నైట్ పార్టీకో వెళుతుంటే వాటిని ఎంచక్కా ధరించి వెళ్ళొచ్చు. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే. ఆ టీ షర్టుపై అడ్రసు రాసుకొని ధరించడం. మీరు మద్యం మత్తులో జోగుతుంటే... పబ్బు, బారు నిర్వాహకులు, పోలీసులు లేదా మిమ్మల్ని చూసిన వారెవరైనా సరే మీ టీ షర్టుపైనున్న అడ్రసుకు క్షేమంగా మిమ్మల్ని చేరవేస్తారనే కాన్సెప్ట్‌తో ఈ టీషర్ట్స్‌ని తయారు చేశారు.

# కోతికి ఐపాడ్ దొరికితే...

టొరెంటోలోని మిల్‌వాకీ జూలో ఉంటున్న ఒరాంగుటాన్లు (కోతుల్లో ఒకరకం) టెక్ సావీలుగా మారిపోయాయి. తోటి స్నేహితులతో కలిసి ఐపాడ్‌లో 'యాంగ్రీ బర్డ్స్' ఆడుతూ సరదాగా కాలక్షేపం చేస్తున్నాయవి. ఇదెలా జరిగిందంటే...

ఒరాంగుటాన్ ఔట్‌రీచ్ అనే స్వచ్ఛందసంస్థ 'యాప్స్ ఫర్ ఏప్స్' (apps for apes) అనే కార్యక్రమం ద్వారా వానరాలకు ఐపాడ్‌లు ఇచ్చే కార్యక్రమం ఒకటి మొదలుపెట్టింది. 'వానరాలు బోర్ ఫీలవ్వకుండా ఉండేందుకు, వాటిలో సృజనాత్మకతను పెంచేందుకు ఐపాడ్‌లు బాగా ఉపయోగపడతాయి. ఒరాంగుటాన్‌లు కూడా మిగతా వానరాల్లాగానే పెంకిగా, అల్లరిగా ఉంటాయి. అయితే వానరాల్లోని మిగతా రకాలతో పోలిస్తే ఇవి చాలా తెలివికలవి. వీటికి సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే తెలివితేటలు బోలెడు ఉంటాయి. అంతేకాక సమాచారాన్ని సంజ్ఞల భాష ద్వారా చక్కగా చెప్పగలుగుతాయి. శిక్షణ ఇస్తే వాటి ఆహారాన్ని అవే వండుకుంటాయి కూడా. ఇన్ని చేయగలిగిన వీటిని జైల్లో నిర్బంధించడంతో బోర్ ఫీలవుతున్నాయి. వాటిలో చురుకుదనం నింపేందుకు ఐపాడ్‌లు ఉపయోగపడతాయి' అంటున్నారు పరిశోధకులు. ఐపాడ్ ఉపయోగించడాన్ని అవి చాలా వేగంగా నేర్చుకుంటున్నాయట. చాలా మంది మనుషుల కంటే అవే మేలేమో.



# అంకెలతో అదృష్టం

**ఐ.బి. సాహు**
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీ కాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియని తనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.......................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ - 500 033.

**కె.ఎన్.ఆర్., తిరుపతి**

నా పేరు మరియు పుట్టిన తేదీ వివరములలో ఉన్న వైబ్రేషన్స్, ఆర్.వి. ఎనర్జీ తెలుపగలరు. పేరులో పాజిటివ్ ఎనర్జీ పెరగడానికి పేరు ఏవిధంగా మార్చుకోవాలో తెలియజేయగలరు.

మీ బర్త్ వైబ్రేషన్ 1.
మీ విధాన వైబ్రేషన్ 6.
మీ ఆర్.వి. ఎనర్జీ 42/43.

బర్త్ వైబ్రేషన్ శక్తివంతమైనదైనప్పటికీ 19 సంవత్సరాల తరువాత శక్తి స్థాయి బలహీనం అవుతుంది. విధాన వైబ్రేషన్‌గా ఉన్న 6వ సంఖ్యా ప్రభావం మీకు ఇంజనీరింగ్ విద్యనివ్వడంలో తోడ్పడుతుంది. 6వ సంఖ్య తిరిగి మీ ప్రొఫెషన్‌లో మార్పులపై ప్రభావం చూపిస్తుంది. శక్తిస్థాయి బలహీనమైన ఒకటవ సంఖ్య వైబ్రేషన్‌ను 6వ సంఖ్య నెగెటివ్ ప్రభావాన్ని కంట్రోల్ చెయ్యగల సంఖ్యా రూపం 5. మీ పేరు 5వ సంఖ్యకు సంబంధించి 23వ సంఖ్య మొత్తంలో ఉన్నట్లయితే పాజిటివ్ ఎనర్జీ పెరుగుతుంది. మీ పేరులో చివరి పదం వాడకండి. పాజిటివ్ ఎనర్జీ కొరకు మార్చబడిన పేరు ఎన్,ఎ,ఆర్,ఎ,ఎ,వై,యు,ఎ,ఎస్. ఈ పేరును ప్రతి రోజు 23 సార్లు వ్రాసుకోండి. వ్రాసే పద్ధతి నిర్దిష్టంగా ఉండాలి. సంతకంలో కె.ఎన్.ఎన్.ఆర్ అక్షరాలు ఉండేట్లు చేయాలి. ఇంటి పేరుతో కలిపి వ్రాయాలంటే కె తో వాడుకోవచ్చు.

మీ పాజిటివ్ సంఖ్య 5,9,1.
నెగెటివ్ సంఖ్యలు 4,8,2,3.
న్యూట్రల్ సంఖ్య 6.

**సి.కె., త్రివేండ్రం**

నా పేరు నాకు ఇష్టం లేదు. పూర్తిగా మార్చుకోవాలని అనుకుంటున్నాను. ప్రాసెస్ తెలియజేయగలరు. ఏ పేరు నప్పుతుందో వివరించగలరు.

మీ పుట్టిన తేదీ వివరాలు ఏవీ రాయలేదు. పేరు పూర్తిగా మార్చే ప్రాసెస్ కొంచెం కష్టమైన వ్యవహారం. మీ పేరులో ఏ రకమైన బలమూ లేని పక్షంలో పూర్తిగా మార్చవచ్చు. వీలైతే హైదరాబాద్ వచ్చినపుడు వివరాలతో కలవండి.

**బి.ఆర్., కర్నూల్**

నా పేరులో సజెషన్ అవసరం ఉందా, తెలుపగలరు. ఇంటిపేరు పూర్తిగా వాడను. సర్టిఫికెట్స్‌లో వ్రాయలేదు. నా వైబ్రేషన్స్‌లో వ్యాపారానికి సంబంధించిన శక్తి స్థాయి ఏవిధంగా ఉందో తెలుపగలరు. వ్యాపారం బావుండడానికి నా పేరులో మార్పు ఏవిధంగా చేయగలరో ఆవిధంగానే అనుసరిస్తాను.

మీ పేరు 2వ సంఖ్య మొత్తంలో ఉంది. మీ విధాన సంఖ్య 2వ సంఖ్య మొత్తంలో ఉంది. ఇది బలమైన కాంబినేషన్. కాని మీ బేసిక్ వైబ్రేషన్ మొత్తం 1వ సంఖ్యకు లోబడి ఉంది. మీ పీరియాడిక్ వైబ్రేషన్ 7వ సంఖ్యకు లోబడి ఉంది. 2,7 అనే సంఖ్యా స్వరూపాలు ఒకే ఛార్ట్‌లో పాజిటివ్‌గా ఉండవు. ఎంత బలమైన వైబ్రేషన్ అయినప్పటికీ 2వ సంఖ్య పరిమితులు చాలా తక్కువ, పరిధి తక్కువ. వ్యాపారానికి సంబంధించి 9వ వైబ్రేషన్ బలంగా ఉంది. ఆర్.వి. ఎనర్జీ 27/33. కన్‌స్ట్రక్షన్ మెటీరియల్స్, రియల్ ఎస్టేట్ బావుంటాయి. ఈ రంగాలలో అభివృద్ధి సాధించడానికి మీ పేరులో 'హెచ్' చేర్చి ఇంటి పేరును పూర్తిగా వాడుతూ పాజిటివ్ శక్తిని సాధించవచ్చు. ప్రతి రోజు 90 సార్లు పేరును వ్రాయండి. ఇలా 100 రోజులు వ్రాయండి. మొత్తం 9 కోర్స్‌లు వ్రాయాలి. పైన చెప్పిన అభివృద్ధి ఖచ్చితంగా సాధించవచ్చు.

**ఎమ్.ఎస్., వైజాగ్**

నేను ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాను. విదేశాలకు వెళ్ళి పై చదువులు చదవగలనా? అన్ని ఎగ్జామ్స్ ప్రిపేర్ అవుతున్నాను. కొంత శ్రద్ధ తగ్గినట్లు చదువును నిర్లక్ష్యం చేస్తున్నట్లుగా అన్పిస్తోంది. నా పేరులో హార్మొని తగ్గిందని అనుమానం. పేరులో వైబ్రేషన్స్ సరిచేసి మార్పును సూచించగలరు.



9,1 కాంబినేషన్‌లో విద్య ఇంజనీరింగ్ అద్భుతంగా ఉంటుంది. మీరు ఖచ్చితంగా విదేశాలకు వెళ్ళవచ్చు. మీ పేరు విలువ 24గా ఉంది. ఈ సంఖ్య అత్యంత శక్తివంతమైనదైనప్పటికీ మీకు ఈ సంఖ్య వ్యతిరేక ఫలితాలనిస్తుంది. పూర్తి పేరు విలువ 42. కాబట్టి మీ పేరులో ఎస్. ప్రక్కన 'సి' చేర్చి ప్రతిరోజు 27 సార్లు వ్రాయండి. ఉదయం 27 సార్లు, సాయంత్రం 27 సార్లు. ఈ రెండు సంవత్సరాలు ప్రతిరోజూ వ్రాయండి. ఇన్నిసార్లు వ్రాయబడ్డ పేరు ఇచ్చే ఫలితం మీ విదేశ ప్రయాణం. వ్రాసేటపుడు నిర్లక్ష్య ధోరణి ఉండకూడదు. సరైన పద్ధతిలో వ్రాయబడ్డ పేరు అన్ని ఫలితాలను సవ్యంగా అందించగలరు. ఇలా పేరు వ్రాయబడినపుడు హార్మొని సరిగ్గా ఉంటుంది. మీ పేరులో తగ్గిన ఈ ఒక్క అక్షరం మీకు సంఖ్యాశాస్త్రపరంగా అద్భుత ఫలితాన్నిస్తుంది.

శుభమ్

**నోట్ :-** న్యూమరాలజీపై ఆసక్తితో అభిలాషతో నేర్చుకోవాలనుకునేవారు సంప్రదించవలసిన నంబర్ **81255 84837**

ఈ వారం కవితలు

# కళ్లు కలలు



మస్తిష్కం ఒక కలల కర్మాగారం

దుమ్ము అణిగే వరకు వేచి ఉండు
మొక్కలు సీతాకోక చిలుకలను పూస్తాయి
పికిలి పిట్టపై పుల్ల పుల్ల చేర్చి గూడు కట్టు
అది రెక్కలకు సాయంత్రపు శాంతినిస్తుంది.
ఇక చూడు
కొండలు సముద్రాలు దేహాలు మోహాలు
ఈనెల మీద పత్రహరితమై పరుచుకుంటాయి
ఎక్కడికీ వెళ్లక్కర్లేదు, ఎవర్నీ వెళ్లగొట్టక్కర్లేదు

దుమ్మురేగే వరకు వేచి ఉండు
సూర్యుడు సీతాకోక చిలుకలను పూస్తాడు
ఎండ పిట్టలు బిలబిల్లాడుతూ గదిలో వాల్తాయి
పిట్టలు రెక్కలు చాచి వస్తువులను నిర్మిస్తాయి
ఇక చూడు
పొలాలు ఫ్యాక్టరీలు వాణిజ్యాలు రాజ్యాలు
పొగలుగా పోరాటాలుగా విచ్చుకుంటాయి
ఎక్కడికీ వెళ్లక్కర్లేదు, ఎవర్నించీ విడిపోనక్కర్లేదు

తన లోంచి ఒక గుండ్రని ముక్కను విసిరేసి
దానికి బతుకునివ్వడానికి సూర్యుడు తపిస్తాడు
వెయ్యి నోళ్లతో వేడుకోనక్కర్లేదు, అది వాడి పని
గుండ్రని ముక్కకు కృతజ్ఞత అద్దం కావడం కోసం
వీపున నల్ల కళాయి పూసుకుంటాడు చంద్రుడు
మృదు మధుర పదాలతో వాడిని పొగడక్కర్లేదు
సూర్య చంద్రులు కళ్లు, నువ్వొక మట్టి ముద్దవి
కళ్లున్నది రోడ్లు దాటడానికీ కలలు కనడానికీన్నీ
కలలు విచ్చి ఎగరడానికి పెద్ద గాలి అవసరం లేదు

ఇతరులకు బుద్ధితో పాటు కొంచెం మనసు కూడా ఉంటుంది, ఆ
కొంచెం చాలు, నువ్వు చెయ్యాల్సిందల్లా దాన్ని గట్టిగా నమ్మడమే!

– హెచ్చార్కె
96529 79201

బొమ్మలు: అక్బర్

# నీ నువ్వు

గట్టి కౌగిలింతకై గాలి నీలోకి
నీ నువ్వు లోపలిలోకి

నువ్వెక్కడో లోతు లోటులేని
రక్తం దాగిన మెత్తటి చీకటి ముళ్లపై

ఆత్మజ్ఞాపకంలో దేహం ఉంటుందా
ఆత్మజననం దేహానికి తెలుస్తుందా

అద్దాల్లో సంతానాలు
అద్దాలతో సంతాపాలు

శాశ్వత మరణఛాయ
అశ్రువులే మనసు విరామచిహ్నాలు

విషాద కృతజ్ఞతతో ప్రతి ముఖం

– ఎం.ఎస్. నాయుడు



కవర్ స్టోరీ



# e టైలింగ్



★ వి. శ్రీనివాస్

ఇ-కామర్స్, ఇ-ట్రేడింగ్, ఇ-టైలింగ్ , ఆన్‌లైన్ షాపింగ్, వర్చువల్ షాపింగ్.... పేరేదైనా కానీ.

ఇల్లు కదలకుండా, కడుపులో చల్ల కదలకుండా కంప్యూటర్ మౌస్ క్లిక్‌తో పూర్తి చేసే షాపింగ్. చిత్రనిద్రలో చిరునవ్వులొలికించే పసిపాపల ఆటవస్తువులు, డయాపర్లు, పెద్దవాళ్ల కళ్లజోళ్లు, పాదరక్షలు, యువజనాన్ని ఉర్రూతలూగించే అత్యాధునిక ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, ఫ్యాషన్ దుస్తులు...బర్గర్లు, పిజ్జాలు, బిర్యానీలు...ఏం కావాలన్నా ఛలో ఆన్‌లైన్. ఊరించే ఆఫర్లు. పోటాపోటీగా డిస్కౌంట్లు. బార్గెయిన్ హంట్.. ఎప్పట్నించో ఉన్నవే ఏమిటి కొత్త అంటారా! పదేళ్ళ క్రితం సందడి మళ్ళీ కనబడుతోంది. దీన్ని థర్డ్‌వేవ్ అనొచ్చేమో. ఈ కొత్త కెరటం గురించే ఈ వారం కవర్‌స్టోరీ.

అమెరికాలో ఉన్న జయంత్‌కు ఫోన్.

వచ్చేవారంలోనే డాక్టర్ డేట్ ఇచ్చినట్టుగా నెలలు నిండిన భార్య చంద్రిక చెప్పింది.

అమె ఇంకా నర్సింగ్‌హోమ్‌లో చేరనేలేదు.

సర్‌ప్రైజ్... పుట్టబోయే పాప కోసం తాను ప్లాన్ చేసి కొనాలనుకున్న సమస్త సరంజామా ఇంటికొచ్చేసింది. స్నానానికి సబ్బులు, పాల సీసా, దుస్తులు, స్ట్రోలర్, ఆటవస్తువులు, పక్కబట్టలు. డెలివరీ డేట్ ఇచ్చారని తెలియగానే అమెరికా నుంచి జయంత్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేశాడు. వస్తువులు ఇండియాలో ఇంటికి చేరాయి.

★★★

పదేళ్ళ క్రితం హడావుడి గుర్తుందా! పుట్టగొడుగుల్లా వెలసిన డాట్ కామ్ కంపెనీలు. ఆన్‌లైన్‌లో అద్భుతాలను సృష్టిస్తామంటూ వాగ్దానాలు. పెద్ద సంఖ్యలో వెంచర్ కాపిటలిస్టులు. కోట్ల రూపాయల్లో పెట్టుబడులు. ఆకర్షణీయమైన అంచనాలు. హాట్‌మెయిల్ డాట్‌కామ్‌ను మైక్రోసాఫ్ట్‌కు అమ్మేసి రాత్రికిరాత్రి వందల కోట్ల డాలర్లను సొంతం చేసుకున్న సబీర్ భాటియా, ప్రవాస భారతీయుడు రాజేష్ జైన్ ప్రమోట్ చేసిన ఇండియావరల్డ్ డాట్ కామ్‌ను 499 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసిన సత్యం ఇన్‌ఫోవే...ఇవే వార్తలు. సంపద అంతా అక్కడే పోగుపడినట్టుగా సందడి. ఏ మూల చూసినా ఒక డాట్ కామ్ కంపెనీ. న్యూమిలీనియంతో పాటు అంతర్జాతీయ యవనికపై డాట్‌కామ్ ప్రభంజనంలా విస్తరించింది. అంతలోనే కల చెదిరింది. డాట్‌కామ్ బుడగ పేలింది. ఇ కామర్స్ మంత్రం మరుగున పడిపోయింది.



అలా తొలి కెరటం విరిగిపోయింది. భూమ్మీద కాళ్లు నిలిపిన కొన్ని కంపెనీలు మాత్రం నిలదొక్కుకున్నాయి. బిజినెస్ టు బిజినెస్ పోర్టల్స్, టూర్స్ అండ్ ట్రావెల్‌తో పాటు మరికొన్ని సర్వీసులకు సంబంధించిన వెబ్ కంపెనీలు మాత్రం రంగంలో మిగిలాయి. ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్ ట్రేడింగ్, రైల్వే, ఎయిర్ టికెట్ల కొనుగోళ్లు, బ్యాంకింగ్‌తో సహ ఫైనాన్షియల్ సర్వీసుల్లోని ఇంటర్‌నెట్ కంపెనీలు వ్యాపారాన్ని పెంచుకుంటూ వచ్చాయి. 2009-2010 నాటికి ఈ వ్యాపారం బాగా స్థిరపడింది. ఇది రెండో కెరటం. సెకండ్ వేవ్. ఇప్పుడు మూడో కెరటం కమ్ముకువస్తోంది. అదే ఆన్ లైన్ రిటైలింగ్.. సంక్షిప్తంగా ఇ టైలింగ్. ఈ మూడు కెరటాల సిద్ధాంతం శాస్త్రీయమేమీ కాదు. స్థూల వర్గీకరణ మాత్రమే. అమెరికన్ ఆన్‌లైన్ దిగ్గజం ఇ బే దేశంలో అడుగుపెట్టింది 2005లో. ఆ తర్వాత ఏడేళ్ళకు 2012లో మరో దిగ్గజం అమెజాన్ వచ్చింది. కొంచెం ముందుగా గ్రూపన్ అడుగుపెట్టింది. థర్డ్‌వేవ్‌ను బలోపేతం చేస్తున్న అంశం ఇది. థర్డ్‌వేవ్ దూకుడును చూస్తున్న వారికి పదేళ్ల క్రితం పరిణామాలు గుర్తుకువస్తున్నాయి. అదే సందడి. పెరుగుతున్న కంపెనీల సంఖ్య. ఎగబడుతున్న వెంచర్ కాపిటలిస్టులు, విలీనాలు, టేకోవర్లు, భారీ రెవెన్యూ టార్గెట్లు...పాత ఫ్రేమ్‌నే దుమ్ము దులిపి మళ్ళీ గోడకు వేళ్లాడదీసినట్టుగా ఉంది.




## జమానా బదల్‌గయా..

ఏ వస్తువు కొనాలనుకున్నా చేత్తో పట్టి చూసి, కళ్లతో నాణ్యతను పరీక్షించి తృప్తిపడిన తర్వాత మాత్రమే కొనే తరానికి ఆన్‌లైన్‌లో వస్తువులను విక్రయించాలనుకోవడం ఎంత పొరపాటో అనుభవపూర్వకంగా తెలుసుకున్న కాలం అప్పటిది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఇంటర్నెట్ భారీ స్థాయిలో విస్తరించింది. బ్రాడ్‌బాండ్ సేవలు దేశమంతా లభ్యమవుతున్నాయి. వైర్‌లెస్ ఇంటర్నెట్, మొబైల్ ఇంటర్నెట్ వినియోగం పెరిగింది. 3జి, 4జి సర్వీసులు దూసుకువస్తున్నాయి. స్మార్ట్ ఫోన్‌లు, టాబ్లెట్ పీసీలు మార్కెట్‌ను ఆక్రమిస్తున్నాయి. క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల వినియోగం బాగా పెరిగింది. అన్నిటీ

## కండోమ్‌కి భలే గిరాకీ

ఏ ఈవెంట్ వచ్చినా డాట్‌కామ్ కంపెనీలకు పండుగే. రిపబ్లిక్ డే కావచ్చు. పంద్రాగస్టు కావచ్చు, మదర్స్ డే, ఫాదర్స్ డే, బర్త్‌డే, వాలెంటైన్స్ డే ఏదైనా సరే ఆన్‌లైన్‌లో ఒక సెలబ్రేషనే. వాలెంటైన్స్‌డే రోజు కొన్ని సైట్స్‌లో గిఫ్ట్‌లతో పాటు కండోమ్స్‌కు భారీ గిరాకీ వచ్చింది. కాంట్రాసెప్టివ్స్ అమ్మే వెబ్ సైట్ కండోమ్‌కింగ్ డాట్ ఇన్‌కు ఆరోజు వరదలా ఆర్డర్లు వచ్చిపడ్డాయట. తాను ఫ్రాన్స్‌లో రెండు దశాబ్దాల పాటు ఉన్నా వాలెంటైన్స్ డే రోజున భారత్‌లో వచ్చిన స్పందన తన జీవితంలో ఏనాడూ చూడలేదని కండోమ్ కింగ్ డాట్ ఇన్ వ్యవస్థాపకుడు రమేష్ శ్రీనివాస్ వ్యాఖ్య. స్నాప్ డీల్ డాట్ కామ్ అనే మరో సంస్థ కూడా వాలెంటైన్స్ డే రోజున 1.2 లక్షల కండోమ్స్‌ను ఒక రూపాయి రేటుతో విక్రయించింది.

మించి వెర్చువల్ ప్రపంచంలో కాలం గడిపేసే ఒక కొత్త జెనరేషన్ వచ్చేసింది. ఈ జెనరేషన్ మెట్రోల్లోనే కాదు.. ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో కూడా ఉంది. వారికి కావల్సిన అత్యాధునిక గాడ్జెట్స్, ఫ్యాషన్ దుస్తులు, ఇష్టమైన బ్రాండ్స్, స్థానికంగా దొరకవు. అందువల్ల కూడా ఆన్‌లైన్‌ను ఆశ్రయిస్తున్నారు వాళ్లు. చిన్న పట్టణాలు, గ్రామాల్లో ఉన్న ఎగువ మధ్యతరగతి, సంపన్న గృహస్థులు కూడా తమకు కావల్సిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. ప్రీమియం






చెల్లించి మరీ కొంటున్నారు. మరోవైపు కొరియర్ సర్వీసులు భారీగా విస్తరించాయి. విమానయాన రంగం విస్తరణతో కనెక్టివిటీ పెరిగింది. అందుకే ఈ హడావుడి.

## మూడు రకాల వ్యూహాలు...

ఆన్‌లైన్ వ్యాపారంలో ప్రపంచ దిగ్గజాల్లాంటి అమెజాన్, ఇ బే, గ్రూపన్... ఈ మూడు కంపెనీలది మూడు రకాల బిజినెస్ మోడల్ .




ఇ-టైలింగ్ రంగంలోని ఏ కంపెనీ అయినా ఈ మూడు నమూనాల్లో ఏదో దాన్ని అనుసరించాల్సిందే. లేదంటే వీటినే సంకరం చేసి కొత్త నమూనా తయారు చేసుకోవాలి. ఇ బే అనుసరిస్తున్న వ్యూహాన్ని మార్కెట్ ప్లేస్ నమూనాగా వ్యవహరిస్తారు. కొనుగోలుదార్లను, విక్రేతలను తమ ప్లాట్‌ఫామ్ మీదకు తేవడం వరకే ఈ మోడల్‌లోని కంపెనీల బాధ్యత. ఇన్వెంటరీ, ప్రొడక్ట్ డెలివరీతో సంబంధం ఉండదు. రెండోది అమెజాన్ అనుసరిస్తున్న స్టాక్ అండ్ సేల్ నమూనా. అంటే తమ పోర్టల్ ద్వారా విక్రయించే సమస్త సరంజామాను ముందుగానే కంపెనీ తన గోడౌన్‌లో నిల్వ చేస్తుందన్నమాట. ఆన్‌లైన్‌లో ఆర్డర్ వచ్చిన వెంటనే సరుకు తన సొంత పంపిణీ వ్యవస్థ ద్వారా కస్టమర్‌కు వెళ్లిపోతుంది. సరుకును కొనడం, నిల్వ ఉంచడం, దాన్ని కొనుగోలుదారుకు చేర్చేందుకు వీలుగా కొరియర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ఈ నమూనాలో ముఖ్యాంశం. ఈ రెండు నమూనాలు 1995 నుంచి ఉన్నాయి.

ఇక మూడో నమూనా 2008లో గ్రూపన్ డాట్‌కామ్ ప్రవేశపెట్టిన డిస్కౌంట్ కూపన్స్ నమూనా. రకరకాల సర్వీసులకు సంబంధించి డిస్కౌంటెడ్ కూపన్స్‌ను ఆఫర్ చేయడమే ఈ వ్యాపారం. కేవలం కూపన్స్‌కే పరిమితమైనప్పటికీ ఆ తర్వాత ఈ మోడల్‌లో స్వల్ప మార్పులు చేసి కూపన్స్‌తో పాటు ఉత్పత్తులను కూడా తమ వెబ్‌సైట్ ద్వారా విక్రయించడం ప్రారంభించారు. ఈ మూడు నమూనాలను అనుసరిస్తున్న ఇ టైలింగ్ కంపెనీలు ఇండియాలో డజన్ల సంఖ్యలో ఉన్నాయి. అందులో బాగా పాపులరైన సంస్థలు పాతిక వరకు ఉంటాయి. అమెజాన్‌కు ఉన్నంత వ్యాపారం ఇ బేకు లేదు. ఇ బేది భద్రమైన గేమ్. 2-5 శాతం మార్జిన్‌తో హ్యాపీ. అమెజాన్‌కు ఖర్చు, మార్జిన్లు రెండూ ఎక్కువే. అమెజాన్ అంతర్జాతీయ టర్నోవర్ 2011లో 4800 కోట్ల డాలర్లు. ఈ ఏడాది మొదట్లో జంగ్లీడాట్ కామ్ ద్వారా భారత్‌లో అడుగుపెట్టిన ఈ సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా గోడౌన్లను, సరుకులు చేరవేసే రవాణా వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటోంది. మల్టీబ్రాండ్ రిటైల్‌లోకి బహుళజాతి సంస్థలను నూరు శాతం పెట్టుబడితో ఆహ్వానించేందుకు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే అమెజాన్ విజృంభిస్తుంది.




ఇ బే భారత్‌లో అడుగుపెట్టి అప్పుడే ఆరేళ్లు దాటింది. తమ ప్లాట్‌ఫామ్ ద్వారా ట్రేడింగ్ కోసం.... కొత్త కొత్త వ్యాపార సంస్థలతో ఈ సంస్థ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నది. దూకుడుగానే వ్యాపార విస్తరణ కోసం ప్రయత్నిస్తోంది. ఇ బే గ్లోబల్ రెవెన్యూ గత ఏడాది 1160 కోట్ల డాలర్లు చేరుకుంది. బాజీ డాట్‌కామ్ అనే సంస్థను టేకోవర్ చేయడం ద్వారా భారత్‌లో అడుగుపెట్టిన వచ్చిన ఇ బేకు ప్రస్తుతం పాతికవేల మంది విక్రయదారులు, 30 లక్షల మంది వరకు రిజిస్టర్డ్ యూజర్స్ ఉన్నట్టుగా అంచనా.




డే ఆఫ్ ది డీల్స్‌తో అమెరికా మార్కెట్‌లో సంచలనం సృష్టించిన గ్రూపన్ (గ్రూప్ కూపన్ నుంచి వచ్చిన పదం)ది భిన్నమైన మోడల్. ఈ సంస్థ సోసస్తా డాట్ కామ్‌ను కొనుగోలు చేయడం ద్వారా గత ఏడాది భారత్ మార్కెట్‌లో ప్రవేశించింది. సోసస్తా పేరును ఆ తర్వాత క్రెజీల్ డాట్‌కామ్‌గా మార్చేసింది. క్రెజీల్ అంటే క్రేజీ డీల్స్ అన్న మాట. సర్వీసులు, ఉత్పత్తుల మార్కెటింగ్ సంస్థలతో ముందస్తుగా చేసుకున్న ఏర్పాటు ప్రకారం భారీ డిస్కౌంట్‌తో కూపన్స్‌ను తమ వెబ్ సైట్‌లో ప్రకటిస్తుంది. ఆ డిస్కౌంట్‌ను ఉపయోగించుకోవాలంటే నిర్దిష్ట సంఖ్యలో వ్యక్తులు ముందుకురావాలి. సరిపడినంత మంది ముందుకు రాకుంటే డీల్ రద్దవుతుంది. సంఖ్య సరిపోతే అందరూ సదరు డిస్కౌంట్‌ను ఉపయోగించుకోవచ్చు. డీల్స్ చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.




## మేరా భారత్ మహాన్...

భారత్‌లో ఆన్‌లైన్ మార్కెట్ టర్నోవర్ 2015 నాటికి 1200 కోట్ల డాలర్లు అంటే 60,000 కోట్ల రూపాయలకు చేరుతుందని అంచనా. గత రెండుమూడేళ్లుగా ఇ మార్కెట్ శరవేగంగా దూసుకుపోతున్నది. 2007లో ఇ -కామర్స్ విలువ 8146 కోట్ల రూపాయలు మాత్రమే ఉండేది. భారతీయ రైల్వే సంస్థ ఐఆర్‌సిటిసి 2002లో ఆన్‌లైన్ టికెట్ సర్వీసులను ప్రారంభించినప్పుడు వినియోగదారుల సంఖ్య చాలా స్వల్పం. ఈ పదేళ్లలో ఆన్‌లైన్‌లో టికెట్స్ కొనుగోలు చేస్తున్నవారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోయింది. అమెజాన్, ఇ బే, చైనా సంస్థ టావోబావో, 360బైస్... ఇలాంటి అంతర్జాతీయ దిగ్గజాలతో పోలిస్తే భారతీయ డాట్ కామ్ కంపెనీలు వాటి దరిదాపుల్లో లేవు. పుష్కర కాలం క్రితమే ఏర్పాటైన రీడిఫ్ డాట్ కామ్ షాపింగ్, ఇండియాటైమ్స్ డాట్ కామ్ ఇప్పటికి ఒక మోస్తరు వ్యాపారంలోనే ఉన్నాయి. వీటికంటే

ఈ మధ్యకాలంలో వచ్చిన ఇ టైలింగ్ కంపెనీలు శరవేగంతో దూసుకుపోతున్నాయి.

ప్రస్తుతం దేశంలో ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నవారి సంఖ్య పది కోట్లు ఉంటుందని అంచనా. ఇందులో పది శాతం మంది అంటే కోటి మంది మాత్రమే ప్రస్తుతం ఆన్‌లైన్ షాపింగ్‌లో విరివిగా పాల్గొంటున్నారు. విదేశాలతో పోలిస్తే మన ఇంటర్నెట్ వినియోగదారుల్లో అత్యధిక శాతం మంది 35 ఏళ్ల సగటు వయస్సులో ఉన్నవారు కావడంతో ఇంటర్నెట్ షాపింగ్ వినియోగం రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది.

## లీప్ ఇయర్ బొనాంజా...

నాలుగేళ్లకోసారి వచ్చే లీప్ ఇయర్ కూడా పెద్ద పండుగే. మనకు ఫిబ్రవరి 29 నాడు ఆన్‌లైన్ పోర్టళ్లు అదరగొట్టే ఆఫర్లతో భారీ వ్యాపారం చేశాయి. 50 నుంచి 70 శాతం వరకు డిస్కౌంట్లు ఆఫర్ చేశాయి. కొన్ని సంస్థలైతే 100 శాతం వెనక్కిచ్చే విధంగా ఆఫర్స్‌ను డిజైన్ చేశాయి. ఫ్యాషన్‌అండ్‌యు డాట్ కామ్ దానిలో ఒకటి. ఫ్యాషన్ అండ్ యు ఎక్స్‌ట్రా 29 శాతం డిస్కౌంట్ ప్రకటిస్తే ట్రాడస్ డాట్ ఇన్ లీప్ ఇయర్ క్లియరెన్స్ సేల్ పేరుతో బ్రాండెడ్ వాచ్‌లు, వ్యాలెట్స్, హాండ్ బాగ్స్...వగైరాపై 50 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఫిబ్రవరి 29కి వారం రోజుల ముందుగా ప్రారంభమైన క్లియరెన్స్ సేల్ తర్వాత వారంరోజుల పాటు కొనసాగింది.




కొత్త వినియోగదారులను ఆకర్షించడమే ఇ టైలింగ్ సంస్థల ముందున్న పెద్ద సవాలు. ఈ సవాలును ఎదుర్కొని నిలబడే క్రమంలో కొన్ని కంపెనీలు పరాధీనం కావడం, మరికొన్ని కంపెనీలు మసకేసి పోవడం, ఇంకొన్ని బోర్డులు తిప్పేయడం షరామామూలే. మార్కెట్‌లోకి అగ్రెసివ్‌గా దూసుకువచ్చిన లెట్స్‌బై డాట్ కామ్ ఆ తర్వాత ఫ్లిప్‌కార్ట్ చేతుల్లోకి వెళ్లిపోయింది. 125 కోట్లతో లెట్స్‌బై డాట్‌కామ్‌ను కొద్ది కాలం క్రితం ఫ్లిప్‌కార్ట్ కొనుగోలుచేసింది. ఫ్లిప్‌కార్ట్‌ది పూర్తిగా అమెజాన్ డాట్ కామ్ నమూనా. బీస్టయిలిష్ డాట్ కామ్, ఇంక్‌ఫ్రూట్ డాట్ కామ్, ఫ్యూచర్ బజార్ డాట్ కామ్, యేప్‌మీడాట్ కామ్, యేభీ డాట్ కామ్, స్మార్ట్ షాపర్స్.. వంటి కంపెనీలకు కూడా అమెజాన్ నమూనానే ఆదర్శం. ఫ్లిప్‌కార్ట్ రాబడి 2011–12లో 550 కోట్ల రూపాయలుంటుందని అంచనా. లెట్స్‌బైని టేకోవర్ చేసిన నేపథ్యంలో ఈ రెవెన్యూ 700 కోట్లరూపాయలను తాకవచ్చు. ఫ్లిప్‌కార్ట్‌కు దేశవ్యాప్తంగా ఎనిమిది ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్స్ ఉన్నాయి. 30 పట్టణాల్లో 1500 మంది ఉద్యోగులు ఉన్నారు. రోజుకు 30 వేల ఆర్డర్లను ఈ సంస్థ ప్రాసెస్ చేస్తుంది. కస్టమర్ కొనుగోలు చేసిన సరుకు తన ఇంటికి చేరేవరకు (లాస్ట్ మైల్) బాధ్యతను తానే తీసుకుంటుంది.ఆర్డర్లు వచ్చిన కొన్ని గంటల్లోనే సరుకును డెలివరీ చేసే సామర్థ్యం వేర్‌హౌజింగ్, లాజిస్టిక్స్‌పై కంట్రోల్ ఉన్న సంస్థలకు ఉంటుంది. అదే తమ బలమన్నది ఫ్లిప్‌కార్ట్ వాదన. ఇటీవల కాలంలో భారీగా వ్యాపారాన్ని పెంచుకుంటున్న మరో దేశీ ఇ టైలర్ స్నాప్‌డీల్ డాట్ కామ్‌కు ఒకరకంగా ఇ బే ఆదర్శం. ఇన్వెంటరీలు, సర్వీసింగ్ నెట్‌వర్క్...మార్జిన్లను మింగేస్తాయన్నది ఈ సంస్థ భయం. ఆర్డర్లు రాగానే వెండర్ నుంచి సేకరించడం, వెండర్ దగ్గర నుంచే నేరుగా కస్టమర్‌కు సరుకు చేరవేయడం ఈ కంపెనీ విధానం. సేకరణ, పంపిణీని వేగవంతం చేసేందుకు టెక్నాలజీపై పెట్టుబడి పెట్టడం మంచిది కానీ వేర్‌హౌజ్, లాజిస్టిక్స్ ఎందుకు దండుగ అంటుంది స్నాప్‌డీల్. అయితే పూర్తిగా ఇ బే మోడల్‌తో సరిపెట్టకుండా గ్రూపన్ మోడల్‌ను కొంత అరువు తెచ్చుకుంది. స్నాప్‌డీల్‌లో డిస్కౌంట్ కూపన్స్, ఆఫర్లు దర్శనమిస్తుంటాయి. పూర్తిగా ఇ బేను అనుసరిస్తున్న కంపెనీల్లో ఇండియా ప్లాజా, 99 లేబుల్స్ డాట్‌కామ్, జంగ్లీడాట్‌కామ్, కూప్స్ డాట్‌కామ్ వగైరా ఉన్నాయి. ఈ రెండు కంపెనీల మోడల్స్‌ను రంగరించి వ్యాపారం చేస్తున్న కంపెనీల్లో హోమ్‌షాప్ 18, ట్రాడస్ డాట్ ఇన్, తిమ్‌తారా, ఫెటిస్ డాట్‌కామ్ ఉన్నాయి. ఆల్‌స్కూల్‌స్టఫ్ డాట్ కామ్ కేవలం విద్యారంగానికి పరిమితమైన పోర్టలైతే, పిల్లల కోసం ఫస్ట్‌క్రై డాట్ కామ్ ఉంది. పుస్తక ప్రియులకోసం ఇన్ఫీబీమ్, పుస్తక్, మేగజైన్ మాల్‌డాట్ కామ్‌లు ఉన్నాయి.







## తెలుపు..నలుపు..

దశాబ్దకాలం కింద కనిపించిన డాట్‌కామ్ బూమ్‌కు ఇప్పటి బూమ్‌కు మధ్య తేడా ఉన్నప్పటికీ సమస్యలు పూర్తిగా పోయాయని మాత్రం చెప్పలేం. పరిమితంగా ఉన్న వినియోగదారులను ఆకర్షించేందుకు భారీయెత్తున కంపెనీలు సొమ్ము ఖర్చుచేయాల్సి వస్తోంది. పైగా వ్యాపారం మొబైల్స్, కెమెరా తదితర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఫ్యాషన్ దుస్తులు, ఆహార ఉత్పత్తుల వంటి వాటికే ఎక్కువగా పరిమితమైంది. పరిమితమైన స్పేస్‌లో పోటీవల్ల లాభాల మాట దేవుడెరుగు నష్టాల పాలు కాకుండా తమను తాము రక్షించుకోవడమే సమస్యగా మారింది. మరోవైపు నిధుల సమస్య. గత ఏడాది వెంచర్ కాపిటల్ ఫండ్స్ దేశీయ డాట్ కామ్ కంపెనీల్లో 65 కోట్ల డాలర్లు పెట్టుబడి పెట్టాయి. ఇందులో 38 శాతం అమెజాన్ మోడల్ కంపెనీల్లోకి, మరో 38 శాతం ఇ బే మోడల్ కంపెనీల్లోకి వెళ్లగా, 24 శాతం కూపన్ మోడల్ కంపెనీల్లోకి వెళ్లింది. బిజినెస్‌లో ఏ మాత్రం తేడా కనిపించినా వెంచర్ కాపిటల్ సంస్థలు ఊరుకోవు. కస్టమర్లు కూడా పూర్తి తృప్తిగా లేరు. సర్వీసులకు సంబంధించి వినియోగదారుల నుంచి అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. అరిష్టాలను అధిగమించి వాడవాడలా వెలుస్తున్న మాల్స్‌కు గట్టి ప్రత్యామ్నాయంగా నిలదొక్కుకునేందుకు ఇ టైలింగ్ రంగానికి మరికొంత కాలం ఎలాగూ పడుతుంది.



## సండే పజిల్

నిర్వహణ: గొరుసు

**అడ్డం**

1. స్త్రీతో మొదలయ్యే తొనల పండు (3)
4. చావబోతున్నవారి నోట్లో పోసే తీర్థం (3)
6. ఏకమైన (శివ) సతులు (5)
9. తిరగబడ్డ భూమికి మొదలు లేదు (2)
11. కొందరికి పళ్లపై పట్టేది (2)
12. తెలుగు 'సొసైటీ' (2)
14. వెళ్ళిన రంగుల పండుగ (2)
15. వార్తాహరుడు (2)
16. పనికిరాని వస్తువుల్ని దీని పైకి ఎక్కిస్తుంటాం (3)
17. కార్మిక దినోత్సవం (2)
18. మద్యంలా వినిపించే వ్యవసాయం (2)
19. ఆనవాలు (2)
20. శిరము కోల్పోయిన తల కోన (2)
23. వృశ్చికం – కుడి నుండి ఎడమకు పాకింది (2)
25. పిల్లల ఆట్లైన 'ముళ్లపూడి' ఆత్మకథనం (5)
28. వంద వేలను దాచుకున్న గుణం (3)
29. ఎండిన పేడ (3)

| 1 | | 2 | ● | 3 | ● | 4 | | 5 |
|---|---|---|---|---|---|---|---|---|
| | ● | 6 | 7 | | 8 | | ● | |
| 9 | 10 | ● | | ● | | ● | 11 | |
| ● | 12 | | ● | 13 | ● | 14 | | ● |
| 15 | | ● | 16 | | | ● | 17 | |
| ● | 18 | | ● | | ● | 19 | | ● |
| 20 | | ● | 21 | ● | 22 | ● | 23 | 24 |
| | ● | 25 | | 26 | | 27 | ● | |
| 28 | | | ● | | ● | 29 | | |

**నిలువు**

1. నర్తించే ఆడ నాగు (3)
2. దీన్ని మాయన్నాడు దేవదాసు (2)
3. సౌందర్యం (2)
4. ఈ తగవు ఎప్పటికీ తెగదని సామెత (2)
5. సినిమా నక్షత్రమైన 'నటి' (3)
7. కాలంతో మారేది (2)
8. తలరాతలు రాసేవాడి కళత్రం (2)
10. మృచ్ఛకటికం కథానాయిక (5)
11. శూన్యంలో కట్టే భవనాలు (5)
13. నోటి నుండి గొంతులోకి రవాణా క్రియ (3)
20. రాముడి రాజ్యం (3)
21. భయం (2)
22. 'చెమ్మచెక్క'లోని తడి (2)
24. బరువు కానిది (3)
25. త్రికోణంలోని 'డిగ్రీ' (2)
26. వ్యాయామంతో కరిగేది (2)
27. వెర్రి తిరగబడింది (2)

### గత వారం జవాబులు

| 1 కొం | 2 గ | జ | 3 పం | ● | 4 క | న్యా | 5 దా | 6 నం |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 డ | బ్బు | ● | 8 కం | 9 సా | లి | ● | 10 డి | ద |
| చి | ● | ● | ● | ని | ● | ● | ● | లూ |
| 11 లు | 12 వ | ● | 13 ప్ర | యా | 14 గ | ● | 15 గు | రు |
| ● | 16 సు | నా | మీ | ● | 17 త | వు | డు | ● |
| 18 వ | ధ | ● | 19 ల | 20 వ | ము | ● | 21 అ | 22 శ్రు |
| న | ● | ● | ● | ది | ● | ● | ● | త |
| 23 వా | 24 తం | ● | 25 ఆ | న | 26 ప | ● | 27 డు | కీ |
| 28 సం | జీ | వ | ని | ● | 29 కృ | ష్ణ | మూ | ర్తి |

## పూరణం

## సినిమా పజిల్

నిర్వహణ: యజ్ఞమూర్తి

**అడ్డం**

1. ఇప్పటి 'ఏకవీర' హీరో (6)
5. వెంకటేశ్, ట్వింకిల్ ఖన్నా జంటగా వచ్చిన చిత్రం (2)
6. 'మల్లిగాడు' కథానాయకుడు (2)
7. 'బంగారు బొమ్మలు'లో అక్కినేని జోడీ (3)
9. కల్యాణ చక్రవర్తి హీరోగా కోడి రామకృష్ణ చిత్రం (4)
11. ఎన్టీఆర్, శ్రీదేవి జంటగా తాతినేని రామారావు చిత్రం (4)

**నిలువు**

1. చిరంజీవి, కవిత జంటగా కె. వాసు చిత్రం (6)
2. 'ఝుమ్మంది నాదం సయ్యంది పాదం' పాటకి జాతీయ అవార్డు పొందిన గాయని (4)
3. 'జయం'తో పరిచయమైన హాస్య నటుడు 'సుమన్ ...' (2)
4. 'వీడే'లో రవితేజ జోడీ (6)
8. అర్జున్ హీరోగా పి.ఎన్. రామచంద్రరావు సినిమా (4)
10. నాగార్జున 'ఆవిడా మా ఆవిడే'లో హీరోయిన్ తారు మారయ్యింది (2)

### గత వారం జవాబులు

| 1 ని | త్యా | మీ | 2 న | న్ | ● | 3 జ |
|---|---|---|---|---|---|---|
| పు | ● | ● | చ్చా | ● | 4 సీ | త |
| 5 ర | ఘు | ● | వు | ● | ● | గా |
| వ్వ | ● | 6 భ | లే | 7 త | మ్ము | డు |
| ● | 8 నా | గ | ● | ని | ● | ● |
| 9 ల | ● | వా | ● | 10 కె | వా | 11 సు |
| 12 త | మ | న్ | ● | ళ్ల | ● | ధ |

| 1 | | 2 | | 3 | | ● |
|---|---|---|---|---|---|---|
| | ● | | ● | | ● | 4 |
| | ● | 5 | | ● | 6 | |
| 7 | | | ● | 8 | ● | |
| | ● | ● | 9 | | | |
| | ● | 10 | ● | | ● | |
| ● | 11 | | | | ● | |



# దోసతో నాన్‌వెజ్

చలవ చేసే దోసని వేసవి కాలమంతా ఏదో ఒక రూపంలో తీసుకుంటే మంచిది. కేవలం పప్పు, పచ్చడికే పరిమితం చేయకుండా ఇలా నాన్ వెజ్‌తో కలిపి వెరైటీగా తిని చూడండి.

## మటన్‌తో

**కావలసిన పదార్థాలు:** మటన్ – అర కేజీ, దోస ముక్కలు – 2 కప్పులు, ఉల్లిపాయ తరుగు – అర కప్పు, పచ్చిమిర్చి – 2, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 టీ స్పూను, దనియాలపొడి – 1 టీ స్పూను, పసుపు – చిటికెడు, కారం – 2 టీ స్పూన్లు, గరం మసాల – పావు టీ స్పూను, నూనె – సరిపడా, ఉప్పు – రుచికి తగినంత, కొత్తిమీర తరుగు – అరకప్పు.

**తయారుచేసే విధానం:** కుక్కర్లో ఉల్లి, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్టు ఒకటి తర్వాత ఒకటి దోరగా వేగించాలి. పసుపు, కారం, ఉప్పు, దనియాలపొడి వేసి నిమిషం తర్వాత మటన్ ముక్కలు కలిపి నీరు ఇగిరిపోయేదాకా సన్నని సెగమీద ఉంచాలి. తర్వాత అరకప్పు నీరు పోసి 3 విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. (స్టౌవ్ ఆపేసి, కుక్కర్ చల్లబడ్డాక) దోసకాయ ముక్కలు వేసి మరో విజిల్ వచ్చేవరకు ఉంచి గరం మసాల, కొత్తిమీర తరుగు చల్లాలి. ఈ కూర అన్నంతోనూ, పరాటాలతోనూ బాగుంటుంది.





## గుడ్లతో

**కావలసిన పదార్థాలు:** (ఉడికించిన) గుడ్లు – 6, ఉల్లి తరుగు – 1 కప్పు, దోస ముక్కలు – 1 కప్పు, టమోటా తరుగు – అరకప్పు, గరం మసాల – అర టీ స్పూను, పచ్చిమిర్చి తరుగు – 1 టీ స్పూను, కొత్తిమీర – 1 కట్ట, అల్లం వెల్లుల్లి పేస్టు – 1 టీ స్పూను, కారం, పసుపు, ఉప్పు, నూనె – సరిపడా.

**తయారుచేసే విధానం:** నూనెలో ఉల్లి, పచ్చిమిర్చి, అల్లం వెల్లుల్లి పేస్టులని దోరగా వేగించి పసుపు, కారం, ఉప్పు, టమోటా తరుగు, దోసముక్కలు వేసి కొద్దిసేపు తర్వాత కప్పు నీరుపోయాలి. గుడ్లకు గాటు పెట్టుకుని ఉడికే కూరలో వేసి పది నిమిషాల తర్వాత దించేసి గరం మసాల, కొత్తిమీర తరుగు చల్లి దించేయాలి.

## ఎండు రొయ్యలతో



**కావలసిన పదార్థాలు:** ఎండు రొయ్యలు – 2 టేబుల్ స్పూన్లు, దోసకాయ ముక్కలు – 2 కప్పులు, ఉల్లి తరుగు – అర కప్పు, టమోటా తరుగు – అరకప్పు, కారం – రెండు టీ స్పూన్లు, పసుపు – చిటికెడు, ఉప్పు – రుచికి తగినంత, నూనె – 1 టేబుల్ స్పూను, కొత్తిమీర తరుగు – 1 టేబుల్ స్పూను.

**తయారుచేసే విధానం:** రొయ్యల్ని అరగంటపాటు నానబెట్టి నీరు పిండేయాలి. నూనెలో ఉల్లితరుగు వేగించి, టమోటా ముక్కలు, పసుపు, ఉప్పు కలపాలి. టమోటాలు మెత్తబడ్డాక రొయ్యలు, దోస ముక్కలు, కారం వేసి మూత పెట్టాలి. రెండు నిమిషాల తర్వాత 3 కప్పులు నీరు పోయాలి. కూర చిక్కబడ్డాక కొత్తిమీర వేసి దించేయాలి. అన్నంతో ఎంతో రుచిగా ఉండే కర్రీ ఇది.

# ప్రజానాయకుడు

ఈ వారం కథ

★ మోని శ్రీనివాస్

బొమ్మలు: అక్బర్

*మూడు రోజులనుండి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. అయినా ఇంకా నల్లటి మేఘాలు ఆకాశాన్ని విడిచిపెట్టలేదు. మళ్లీ ఏ క్షణంలోనైనా వర్షం వచ్చేలా ఉంది. ఈదురుగాలులు వీస్తున్నాయి. ఊరికి దూరంగా ఉన్న జీవన్‌గాడి గెస్ట్ హౌస్‌లో వాడితో కలిసి ఫారెన్ విస్కీ పార్టీ మొదలుపెట్టబోతుండగా సెల్ రింగయింది. డిస్‌ప్లేపై శేఖర్ పేరు కన్పించింది.*



"చెప్పు శేఖర్" అన్నాను.

"సార్, రాత్రి కురిసిన వర్షానికి పల్వంచ పెద్దవాగు మీది డామ్ పగుళ్లొచ్చిందట. మన నియోజకవర్గంలోని క్యాసంపల్లి గ్రామం బాగా లోతట్టు ప్రాంతం కదా ... ఆ ఊళ్లోకి నీళ్లొస్తున్నాయట" ఆదుర్దాగా చెప్పాడు శేఖర్.

"ఎప్పట్నించి?"

"రెండు గంటల నుండి. మీరు లోకల్లోనే ఉన్నారు కదా!"

"ఆం .. క్యాసంపల్లి దగ్గర్లోనే ఒక స్నేహితుడి గెస్ట్‌హౌస్‌లో ఉన్నాను. మనవాళ్లందర్నీ తీసుకుని అక్కడికి వెళ్లు. అరగంటలో వస్తాను. అక్కడ అన్నీ మనమే చెయ్యాలి... అర్థమైంది కదా" అన్నాను 'మనమే' అన్న పదం నొక్కి పలుకుతూ.

"సరే సార్, ఉంటాను."

"ప్రెస్‌వాళ్లకి ఫోన్ చేశావా?"

"ఇంకా లేదు సార్."

"వెంటనే చెయ్యి ... మనవాళ్లందరినీ కవర్ చేసుకొని వెళ్లు" అంటూ ఫోన్ కట్ చేశాను.

"క్యాహువా అన్వర్ భాయ్?" అడిగాడు జీవన్.

క్యాసంపల్లి సంగతి వివరించాను.

"అరెరె! ఇప్పుడు నీవు వెళ్లడం తప్పనిసరా?"

"ఎస్ .. తప్పదు."

"మరి పార్టీ సంగతి?"

"పార్టీదేముంది జీవన్? మనం ఎప్పుడు కలిస్తే అప్పుడు సెలబ్రేట్ చేసుకోవచ్చు. నా నియోజకవర్గంలో అయిదువేల ఓటర్లున్న విలేజ్ క్యాసంపల్లి. జిల్లాలో ఆదర్శగ్రామంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు ఇబ్బందుల్లో పడింది. ఇలాంటి అవకాశాలు తరుచూ రావు. వచ్చినప్పుడే వినియోగించుకోవాలి. ఈ సమయంలో కాస్త ఓవర్ యాక్షన్ చేశామనుకో ప్రజలకు బాగా గుర్తుండిపోతాం. ఆపదసమయంలో ఆదుకున్నామన్న కృతజ్ఞతతో ఎలక్షన్లలో మనకే ఓట్లు వేస్తారు" అన్నాను కన్ను గీటుతూ.

"అన్వర్ భాయ్ ... నీ బుర్రలో ఉన్నది మెదడు కాదు, పాదరసం. అందుకే 30 ఏళ్లకే ఎమ్మెల్యేవై కూర్చున్నావు" మెచ్చుకోలుగా అన్నాడు జీవన్.

"మళ్లీ కలుస్తాను" జీవన్‌తో చెప్పి కారెక్కాను.

కారు క్యాసంపల్లి వైపు దూసుకుపోతోంది. నా ఆలోచనలు కారు వేగంతో పోటీ పడుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో నన్ను నేను ఎలా ఎలివేట్ చేసుకోవాలో ఆలోచిస్తున్నాను.

★★★

పదేళ్ల క్రితం బి.ఏ. డిగ్రీ తప్ప చేతిలో మరేమీ లేదు. కాలేజీ రోజుల్లో స్టూడెంట్ లీడర్‌గా సంపాదించిన అనుభవం డిగ్రీ తర్వాత నన్ను ఉద్యోగాలవైపు కంటే రాజకీయాలవైపే మొగ్గు చూపేలా చేసింది. ఒక మైనారిటీ రాజకీయ నాయకుడికి అనుచరుడిగా, తర్వాత నా తెలివితేటలతో ప్రధాన సలహాదారుడిగా ఎదిగాను. ఆ నాయకుని ఆశీస్సులతో నామినేటెడ్ పోస్టులలో రాజకీయ పాఠాలు నేర్చుకుంటూ ఒక్కొక్క మెట్టు ఎక్కుతున్న కాలంలో అదృష్టవశాత్తు ఆ నాయకుడు ఒక యాక్సిడెంట్‌లో మరణించాడు. పరిస్థితులను నాకు అనుగుణంగా మలచుకొని ఉప ఎన్నికల్లో మైనారిటీ కోటాలో టికెట్ పొంది ఎమ్మెల్యేనయ్యాను. రాజకీయ చదరంగంలో ఏ ఎండకా గొడుగు పడుతూ, ఎప్పటికప్పుడు పావులు కదుపుతూ, అవకాశాలను అందిపుచ్చుకుంటూ, ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితుల్లో ఒకడినయ్యాను. రేపోమాపో విస్తరించబోయే కేబినెట్‌లో స్థానం సంపాదించడం ఖాయమని మీడియా ఇప్పటికే కోడై కూస్తోంది.

మనిషికి ఆశ ఉండడంలో తప్పు లేదు... కాని అత్యాశ పనికిరానిది నా సిద్ధాంతం. వేయి రూపాయల పనులు చేయించి వందరూపాయలు కమీషన్ కొట్టు. ఎవరికీ అనుమానం రాదు. పైగా పనులు చేయించామని కీర్తిస్తారు. వచ్చే ఎలక్షన్లో ఓట్లేసి గెలిపిస్తారు. వేయిరూపాయల్లో ఐదు వందలు నొక్కేస్తే అవినీతిపరుడని ఛీ కొడతారు. అప్పుడు నీ ఎదుగుదల ఐదు వందల దగ్గరే ఆగిపోతుంది. ఇదే నా వాళ్లకి చెప్పి నేను కూడా పాటించే నియమం. అందుకే ఈరోజు ఇలా ప్రజలచే జేజేలు అందుకుంటున్న 'జననేత'నయ్యాను. అమాయక ఓటర్ల ఆశాకిరణాన్నయ్యాను. ప్రజాప్రతినిధినయ్యాను.

పేదలకు బియ్యం పంపిణీ విషయంలో కానీ, పావలావడ్డీ

రుణాల్లో కానీ, పక్కా ఇళ్ల నిర్మాణంలో కానీ, నా వాళ్లకి కాంట్రాక్టులు ఇప్పించుకోవడంలో కాని, పథకం ఏదైనా కానీ ... ప్రతి దాంట్లో ముడుపులు ముట్టనిదే కథ ముందుకు నడవకుండా చూసుకోవడం, అలాగే మన చేతికి తడి అంటకుండా పావులు కదపడం నా ప్రత్యేకత. అందుకే నియోజకవర్గ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నానంటూ ప్రజలు నాకు బ్రహ్మరథం పడుతున్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రిగారే రాష్ట్రమంతటిలో కెల్లా నా నియోజకవర్గంలోనే పథకాల అమలు తీరు అద్భుతంగా ఉందంటూ కితాబిచ్చారు. కారణం ... వందమందికి చేరాల్సిన సంక్షేమ లబ్ధి కనీసం ఎనభై మందికైనా చేరుతుంది కాబట్టి. గుడ్డి కంటే మెల్ల ఎప్పుడూ బెటరే కదా.

తెల్లని ఖద్దర్లో హుందాగా కన్పించడం, సాధారణ ప్రజల్లో ఒకడిగా కలిసిపోయి, వాళ్ల భుజం తడుతూ మాట్లాడ్డం, పేదల ఇళ్లలో గొడ్డుకారం మెతుకులు తినడం, కొంచెం చురుగ్గా ఉన్న వ్యక్తులను గుర్తుపెట్టుకుని వాళ్లని పేర్లు పెట్టి పిలవడం, ఎలక్షన్ల సమయంలోనే కాకుండా తరచూ నియోజకవర్గంలో పర్యటించడం, వారి కష్టసుఖాలను విచారించడం లాంటివి 'జననేత'గా కొనియాడబడడానికి నేను ప్లే చేస్తున్న జిమ్మిక్కులు.

★★★

కారు క్యాసంపల్లి చేరుకుంది. ఊరి బయటే శేఖర్‌తో సహా నా అనుచరులు దాదాపు పాతికమంది నాకోసం నిరీక్షిస్తున్నారు. కారు దిగి వాళ్లతో కలిసి ఊర్లోకి చేరాను. ఊరిలో దాదాపు పన్నెండు మేడలున్నాయి. పాతిక వరకు డాబాలున్నాయి. మిగిలినవన్నీ పెంకుటిళ్లు, పూరిగుడిసెలు. అప్పటికే ఊర్లో అడుగు ఎత్తున నీరు ప్రవహిస్తోంది. నీళ్లలో నడిచివెళ్తుంటే జనం గౌరవంగా నమస్కరిస్తున్నారు.

లోతట్టుగా ఉన్న ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఆదరాబాదరాగా నేలమీది సామాన్లు మంచాలమీద బల్లల మీద సర్దుకుంటున్నారు జనం. నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఇంతలో సుమోలో విలేఖర్ల బృందం కెమెరాలతో దిగడంతో హడావిడి మొదలైంది. అపోజిషన్ పార్టీ వాళ్లెవరూ ఇంకా రాలేదు. ఆపద సమయంలో ఊరి జనానికి సపోర్టుగా కేవలం మా పార్టీ, నేను మాత్రమే ఉన్నామన్న క్రెడిట్ కొట్టేయవచ్చు. ఆ ఊహే నన్ను నిలవనీయడం లేదు.

మోకాలిలోతు నీళ్లలో నిలబడి బిందెలు అందుకుంటూ, తట్టలు బుట్టలు చేరవేస్తూ, చాలా సహజంగా ఫోటోలకు ఫోజులిస్తున్నాను. ఎలక్ట్రానిక్ మీడియా కెమెరాల్లోకి చూస్తూ ముఖ్యమంత్రిగారికి ఫోన్‌చేసి క్యాసంపల్లి దుస్థితిని దీనాతిదీనంగా వివరించి తక్షణ సహాయం కొరకు అర్థించాను. ఈ దెబ్బతో రేపు జరగబోయే మంత్రివర్గ విస్తరణలో నాకు కచ్చితంగా చోటు దక్కినట్లేనని భావించాను.

ఇదంతా అయ్యాకచూస్తే నీళ్లు మోకాలి పైభాగానికి తగిలేలా ఉండడం చూసి గుండెలు దడదడా కొట్టుకోసాగాయి. సరిగ్గా ఊరి మధ్యలో ఉన్నాను. చుట్టూ సముద్రంలా నీరు. చూస్తుండగానే పెళపెళ ఉరుములు, మెరుపులతో పాటు 'టప్ ...టప్' మంటూ రూపాయి బిళ్లంత చినుకులతో వర్షం మళ్లీ మొదలైంది. ఈ వరదకు వర్షం తోడైతే ఇందులోంచి బయటపడటం కష్టం అనుకుంటూనే లోపలి ఆందోళన ఏమాత్రం బయటికి కనిపించకుండా జాగ్రత్తపడుతూ ప్రజలకు ధైర్యం చెప్పసాగాను. రోడ్డుకి అటూ ఇటూ ఉన్న ఇళ్ల ముందు ఎత్తైన అరుగులపై జనాలు నిలబడి ఉన్నారు. నేను కుడి పక్క ఇంటివైపు అడుగులు వెయ్యబోతుంటే, ఎడం వైపున్న ఇంటి అరుగుమీదున్న జనం ''ఎమ్మెల్యేసాబ్ ... ఇటువైపు రండి'' అంటూ పిలిచారు. ఆ అరుగుపైకి చేరాను. ఆ ఊళ్లో నాకు బాగా తెలిసిన వాళ్లు, చురుకైన యువకులు కూడా నేనున్న అరుగుపైకి చేరారు.

**లోతట్టుగా ఉన్న ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఆదరాబాదరాగా నేల మీది సామాన్లు మంచాలమీద బల్లల మీద సర్దుకుంటున్నారు జనం. నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఇంతలో సుమోలో విలేఖర్ల బృందం కెమెరాలతో దిగడంతో హడావిడి మొదలైంది. అపోజిషన్ పార్టీ వాళ్లెవరూ ఇంకా రాలేదు. ఆపద సమయంలో ఊరి జనానికి సపోర్టుగా కేవలం మా పార్టీ, నేను మాత్రమే ఉన్నామన్న క్రెడిట్ కొట్టేయవచ్చు. ఆ ఊహే నన్ను నిలవనీయడం లేదు.**



''ఇంత నీరు ఊళ్లోకి రావడం నా డెబ్బై యేళ్ల జీవితంలో ఇదే మొదటిసారి'' ఓ వృద్ధుడు గొప్ప సత్యాన్ని చెప్తున్నట్లు చెప్పుకొస్తున్నాడు.

నీటి ప్రవాహం మేం నిల్చున్న అరుగులను కూడా ముంచేస్తోంది.

''సుదర్శనం నిన్ననే గాదె నిండా ధాన్యం నింపాడట. వాడిల్లు పల్లంలో ఉంది కదా. గాదెలోకి నీరెళ్లిందట. వాడు పెళ్లాం బిడ్డలతో బయటకొచ్చి లబోదిబోమంటున్నాడు.'' అప్పుడే అక్కడికొచ్చిన రామస్వామి అన్నాడు.

''ఏ సుదర్శనం... బీపేట సుదర్శనమేనా?'' అడిగాను.

''వాడే సార్ ... ఈసారి పంట బాగా పండిందని సంబరపడ్డాడు. అంతలోనే ఈ ఘోరం. పంట చేతికొచ్చినా ఫలితం దక్కకపాయె'' బాధగా అన్నాడు రామస్వామి.

బీపేట సుదర్శనం మా పార్టీలో చురుకైన కార్యకర్త. ఏ మీటింగ్ కయినా పొద్దున్నే హాజరవుతాడు. తనతోపాటు పదిమంది జనాలను పోగుచేసుకు వస్తాడు.

''అయ్యో పాపం! పోనీ మనమేమైనా ధాన్యం పైకి తీయడానికి వీలవుతుందేమో చూద్దామా?'' అన్నాను. లోలోపల భయంగానే ఉంది, వాళ్లెక్కడ వెళ్దాం పదండి అంటారోనని.

''అబ్బే ... వీలవదయ్యా. గాదెలో ధాన్యాన్ని రాశిలా నింపారు. బస్తాలైతే తీయడానికి వీలవునేమో!''

''అయ్యయ్యో!'' అని బాధని ప్రకటించాను, వెళ్లనక్కర్లేదని మనసులో సంతోషిస్తూనే.

రామస్వామి ఆ ఊళ్లో ఒక సామాజిక వర్గానికి చెందిన పెద్ద. ఆ వర్గ ప్రజలకు ఆయన చెప్పిందే వేదం. ఆయన చెప్పిన వారికే ఓట్లేస్తారు. గత ఎలక్షన్లకు ముందు రామస్వామి ఇల్లు కట్టుకోవడానికి రుణం మంజూరు చేయించాను. నన్ను చూడగానే అతని కళ్లలో ఆ కృతజ్ఞతా భావమే కన్పిస్తుంది. ఆ రుణం డబ్బులేవో నా జేబులోంచి ఇచ్చాననుకుంటారు జనం. అది రాజ్యాంగబద్ధంగా వాళ్లకు సంక్రమించే లబ్ధి అని, ప్రభుత్వం కల్పించే ఒక వెసులుబాటని వాళ్లు తెలుసుకోలేనంత కాలం మా బోటి నాయకులు జననేతలుగా జేజేలు అందుకుంటూ, నడిచే దేవుళ్లుగా కొలవబడుతూనే ఉంటారు.

క్షణక్షణానికి వర్షం తీవ్రత పెరుగుతోంది. దానికి తోడు జలప్రవాహం ఉగ్రరూపం దాలుస్తోంది. మేము నిల్చున్న వీధి పెద్ద కాలవని తలపిస్తోంది. ఇళ్లలోని వంటపాత్రలు, వస్తువులు నీటిబుడగల్లా తేలుతూ ప్రవా



హంలో కొట్టుకుపోతున్నాయి. వరద నీటితో పాటు నాలో ఆందోళన పెరగసాగింది. నా అనుచరులు కొందరే మిగిలారు. మరికొంత మంది ఎక్కడ చిక్కుకున్నారో తెలీదు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలా బయటపడాలో అర్థం కావడం లేదు. ఇంతలో పెళపెళ మంటూ ఇల్లు కూలిన చప్పుడు. ఇప్పటివరకూ తాను నిల్చున్న ఇల్లే .. సినిమా సెట్టింగులా ఒక్కసారిగా నేలకూలింది. మైగాడ్ ... పెంకుటిల్లు నేలమట్టమైంది. నాతో అప్పటిదాక కబుర్లు చెబుతూ నిలుచున్న జనాల్లో పది మంది వరకు హాహాకారాలు చేస్తూ నా కళ్లముందే శిథిలాల కింద నలిగిపోతున్నారు. నా కాళ్లకింద నేల కంపించినట్లయింది ఒక్కసారిగా చిగురుటాకులా వణికిపోయాను.

ఇదే సంఘటన కొన్ని క్షణాల క్రితం జరిగి ఉంటే అప్పటిదాకా అక్కడే నిల్చున్న నేను కూడా వారితోపాటు విగతజీవిగా మారేవాడినే. మైగాడ్, ఎంత ప్రమాదం తప్పింది. శిథిలాల కింద నలిగిన శరీరాల నుండి కారుతున్న రక్తంతో వరదనీరు క్షణాల్లో ఎరుపు వర్ణంగా మారి ప్రవహించసాగింది. క్షతగాత్రుల హాహాకారాలు ఒకవైపు, మీడియా వాళ్ల కవరేజి కోసం చేసే హడావిడి మరోవైపు ... ఒక్క క్షణంలో ఆ ప్రాంతమంతా బీభత్సంగా మారిపోయింది. ఎటుచూసినా జనం అరుపులు, ఆక్రందనలు ...

ఏదో ప్రజల దృష్టిలో పెద్ద హీరోననిపించుకుందామని వెనకాముందు చూసుకోకుండా ఇక్కడికి రావడంలో నేనెంత పెద్ద తప్పు చేశానో అర్థమవసాగింది. కొందరు శిథిలాల కిందినుండి మనుషుల్ని లేపడానికి ప్రయత్నిస్తున్నారు.

నీటి మట్టం మరింత పెరిగింది. ఇలాగే కొనసాగితే మరికొద్దిసేపట్లో క్యాసంపల్లికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయే ప్రమాదముందనిపించింది. అప్పటికే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు యంత్రాంగం నానా అవస్థలు పడుతూ ఊళ్లోకి అడుగుపెట్టి సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలను ఇళ్లల్లోంచి బయటకి రావలసిందిగా హెచ్చరిస్తూ పిల్లలను, మహిళలను స్కూలు భవనాలపైకి చేరుస్తున్నారు.

''ముఖ్యమంత్రిగార్కి ఫోన్ చేయండి. రెస్క్యూ ఆపరేషన్‌కి ఏర్పాట్లుచేయమని చెప్పండి'' శేఖర్ పక్కకి పిలిచి సలహా ఇచ్చాడు.

సెల్ తీసి డయల్ చేశాను. నో సిగ్నల్ ... ఏదో ఉపద్రవం ముంచుకొస్తున్న సంకేతాన్ని నా సిక్త్‌సెన్స్ హెచ్చరించింది. కుండపోతగా వర్షం. దగ్గర్లో పిడుగులు పడుతున్న శబ్దాలు. ఆ శబ్దాలకు కంపిస్తున్న శరీరాన్ని అదుపులో పెట్టుకోవడానికి ప్రయత్నిస్తుండగానే ఒక్కసారిగా 'ఢాం' అంటూ పక్కనే బాంబు విస్ఫోటనం జరిగినట్లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయి చుట్టూ చిమ్మ చీకట్లు ఆవరించుకున్నాయి. ఒక్కసారిగా ఊరు ఊరంతా గాఢాంధకారంలో మునిగిపోయింది. ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి. జనం భయాందోళనలతో కూడిన అరుపులు, కేకలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.

పరిస్థితి ఇంత దారుణంగా ఉంటుందనుకోలేదు! పల్వంచ పెద్దవాగు ఒక చిన్న ఉపనది లాంటిది. ఏదో మైనర్ డామేజీ అనుకున్నాను కాని, ఇంత ప్రమాదాన్ని ఊహించలేకపోయాను. నాలోని ఆలోచనలు చదివినట్లు ''మిమ్మల్ని ఏదైనా మేడపైకి చేరుస్తాను. సిగ్నల్ దొరకగానే ముఖ్యమంత్రికి హెలీకాప్టర్ పంపమని సూచించండి. అందులో మీరు క్షేమంగా బయటపడవచ్చు'' అన్నాడు శేఖర్.

అంతలోనే ఒక్కసారిగా ఉరుము ఉరిమినట్లు 'ఢడేల్ ... ఢడేల్' మంటూ భూగోళం బద్దలయినట్టు పెద్ద శబ్దంతో పల్వంచ డ్యాం చూస్తుండగానే ముక్కచెక్కలుగా కూలి నేల

**ఒక్కసారిగా ఉరుము ఉరిమినట్లు 'ఢడేల్ ... ఢడేల్' మంటూ భూగోళం బద్దలయినట్టు పెద్ద శబ్దంతో పల్వంచ డ్యాం చూస్తుండగానే ముక్కచెక్కలుగా కూలి నేలమట్టమయింది. వేయి నాల్కల జలరక్కసి, కోటి అలల కోరలు చాస్తూ పెద్ద తిమింగలం నోరు తెరుచుకున్నట్లు పన్నెండడుగుల ఎత్తైన కెరటం ... ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఊరుపైన విరుచుకుపడింది. పల్వంచ వాగు ప్రచండత్వం తట్టుకోలేక చెట్టూ, పుట్టా, గొడ్డూ, గోదా, ఇళ్లూ, గుడిసెలూ ... ఒకటేమిటి అడ్డొచ్చిన ప్రతీదీ అమాంతం నేలకూలింది.**

మట్టమయింది. వేయి నాల్కల జలరక్కసి, కోటి అలల కోరలు చాస్తూ పెద్ద తిమింగలం నోరు తెరుచుకున్నట్లు పన్నెండడుగుల ఎత్తైన కెరటం ... ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఊరుపైన విరుచుకుపడింది. పల్వంచ వాగు ప్రచండత్వం తట్టుకోలేక చెట్టూ, పుట్టా, గొడ్డూ, గోదా, ఇళ్లూ, గుడిసెలూ ... ఒకటేమిటి అడ్డొచ్చిన ప్రతీదీ అమాంతం నేలకూలింది.

ఒక్కసారిగా ఎగిసిపడ్డ ప్రవాహానికి నేను బంతిలా గిరగిరా తిరిగి దూరంగా ఎగిరిపడ్డాను. 'మైగాడ్ ... ఈ విపత్తునుండి బతికి బయటపడడం సాధ్యమేనా' అనుకుంటూ కాళ్లు చేతులు బలంగా కదిలించసాగాను. అంతటి వానలోనూ చెమటలు పట్టాయి. కాళ్ల కింద నీరు తాచుపాములా మెలేసుకొని నన్ను లాక్కుపోతోంది.

ఎన్ని కలలు కన్నాను రాజకీయాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని! గొప్ప నాయకుడిగా చరిత్రలో మిగిలిపోవాలని! చివరికిలా పల్వంచ వాగులో కల్సిపోతున్నానా? ఏది ఏమైనా చివరివరకూ పోరాడాలని నిశ్చయించుకొని కాళ్లూ చేతులూ కదుపుతూనే ఉన్నాను. కొద్దిసేపటికి ఏదో తగిలింది. చేతులతో ఒడిసి పట్టుకుని తల కొద్దిగా పైకెత్తాను. మేడ క్రింద భాగం ఇంకా నీళ్లలోనే ఉంది. గుండెలనిండా పీల్చుకుని చుట్టూ చూశాను. అది కిటికీపైన ఉండే ఆర్చిలాంటి నిర్మాణం. దాన్ని బలంగా పట్టుకుని ఒకవైపు నేను వేలాడుతుండగా, మరోవైపు నాలాగే మరో యువతి పట్టుకొని ఒకటే అరుపులు, కేకలువేస్తోంది ప్రాణభయంతో.

పురాతన కట్టడమైన ఆ ఇంటి కిటికీ ఆర్చికి ఇద్దరు మనుషులం వేలాడుతుంటే అదికూడా ఏ క్షణంలోనైనా కూలడానికి సిద్ధంగా ఉంది. అది కూలితే మాత్రం వేలాడుతున్న ఇద్దరం వరదలో కొట్టుకుపోవడం ఖాయం. మేడ టెర్రస్‌పైన ఏదో అలికిడైతే తలెత్తి చూశాను. రామస్వామి కన్పించడంతో పోయిన ప్రాణం లేచివచ్చినట్లయింది. కిటికీకి ఆ పక్కన వేలాడుతున్న స్త్రీ ఆక్రందనలు విని మేమున్న వైపుకి చూసిన రామస్వామి బహుశా ఆ యువతిని గుర్తించినట్లున్నాడు. ''నువ్విక్కడున్నావా చంద్రకళా ...కంగారుపడకు. తాడు తెస్తాను. పట్టుకొని పైకి వద్దువుగాని..'' అని వెనుదిరుగుతుండగా, ''రామస్వామీ ..'' నా గొంతులోంచి చీల్చుకువచ్చిన పిలుపు విని అతని దృష్టి నాపై సారించాడు.

నన్ను చూడగానే ''అయ్యా మీరా? మీకేం

పర్వాలేదు ... ఇప్పుడే వస్తాను'' అంటూ కిందకి పరిగెత్తాడు తాడు కోసం.

కిటికీ ఎంతోసేపు ఆగేట్లు లేదు. నీటి ప్రవాహానికి అది కూడా కిరకిరమని శబ్దం చేస్తూ ఏ క్షణంలోనైనా వరదతో పాటు కొట్టుకుపోవడానికి సిద్ధంగా ఉంది. దగ్గరపడింది... ఇంకా కొన్ని సెకన్లే అనుకుంటున్న తరుణంలో చితికిన ఆశల్ని చిగురింపజేస్తున్నట్లుగా తాడుతో ప్రత్యక్షమయ్యాడు రామస్వామి. తాడు ఒక చివరని తన చేతికి రెండు చుట్లు చుట్టుకుని కిందికి విసిరాడు. పైన రామస్వామి తప్ప మరెవ్వరూ లేరు. అతనొక్కడే మా ఇద్దరినీ రక్షించాలి. కిటికీ పరిస్థితి చూస్తుంటే ఇద్దరినీ రక్షించేంత సమయం ఉన్నట్టనిపించలేదు. ఎవరో ఒకరమే రక్షింపబడతాం. తాడుని చూడగానే ఆ స్త్రీ కళ్లలో బతికి బయట పడుతున్నానన్న ఆశ స్పష్టంగా గోచరిస్తోంది. తాడు మెల్లగా కిందికి దిగుతోంది ఆమెవైపుగా. అంటే రామస్వామి నాకన్నా ముందు ఆ స్త్రీనే కాపాడటానికి ప్రయత్నిస్తున్నాడా? నో... అలా జరగడానికి వీల్లేదు. ఆమెను రక్షిస్తే రామస్వామికేమొస్తుంది? ఆ యువతి కూలిదానిలా ఉంది. బతికించినందుకు ప్రతిఫలంగా ఆమె రామస్వామికి ఏమివ్వగలదు? అదే నన్ను బతికిస్తే అతనికి భవిష్యత్తులో నేనెంతో మేలు చేయగలను.

తాడు దగ్గరవుతోంటే ఆమె కళ్లలో బతుకుపై ఆశ, నాకేమో యమపాశం సమీపిస్తున్నట్లుగా భయం ''రామస్వామీ ...'' అర్థిస్తున్నట్లుగా పైకి చూస్తూ అరిచాను.

ఏమనుకున్నాడో ఏమో ... చివరి క్షణంలో తాడుని అనూహ్యంగా నావైపు కదిలించాడు. కదపక ఏం చేస్తాడు మరి? రామస్వామి తెలివైన నిర్ణయం తీసుకున్నాడు. ఒక ఎమ్మెల్యేని, కాబోయే మంత్రినైన నన్ను కాపాడి తన భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంటున్నాడు. తెలివితక్కువవాడైతే ఆ కూలిదాన్ని రక్షించి జీవితాంతం కూలివాడిగానే మిగిలిపోయేవాడు. తాడు నావైపు వస్తుంటే నా కళ్లలో ఆశ, ఆ ఆడమనిషి కళ్లలో ఆశ్చర్యంతో కూడిన ఆందోళన.

ఊపిరి బిగబట్టి నా బరువంతా ఒక్కడే మోస్తున్నాడు రామస్వామి. ఎనభై కిలోల బరువున్న బలమైన నా శరీరాన్ని పైకి లాగడానికి నానా తంటాలు పడుతున్నాడు. నేను పైకి చేరుకోవడానికి ఏడెనిమిది నిమిషాలు పట్టింది. కాని నాకు మాత్రం కొన్ని గంటలు ఆ తాడుకి వేలాడినట్లనిపించింది. నా కాలు మేడమీద ఆనిన మరుక్షణం కింద 'ఫట్' మన్న పెద్ద శబ్దం... కిందికి చూస్తే కిటికీ ఆర్చితో పాటు ఆ స్త్రీ ప్రవాహంలో ఆర్తనాదాలు చేస్తూ కొట్టుకుపోతున్న దృశ్యం ...

అంతే నన్నొదిలేసి 'చంద్రకళా' అని అరుచుకుంటూ కిందికి పరిగెత్తాడు రామస్వామి.

ఒకేరోజు రెండు సార్లు మృత్యువుతో పోరాడిన అనుభవం తల్చుకోగానే ఒళ్లంతా జలదరించింది. విపరీతమైన అలసటతో నా కళ్లు మూతలు పడుతున్నాయి.

ఇంకా కొన్ని సెకన్లే అనుకుంటున్న తరుణంలో చితికిన ఆశల్ని చిగురింపజేస్తున్నట్లుగా తాడుతో ప్రత్యక్షమయ్యాడు రామస్వామి. తాడు ఒక చివరని తన చేతికి రెండు చుట్లు చుట్టుకుని కిందికి విసిరాడు. పైన రామస్వామి తప్ప మరెవ్వరూ లేరు. అతనొక్కడే మా ఇద్దరినీ రక్షించాలి. కిటికీ పరిస్థితి చూస్తుంటే ఇద్దరినీ రక్షించేంత సమయం ఉన్నట్టనిపించలేదు. ఎవరో ఒకరమే రక్షింపబడతాం. తాడుని చూడగానే ఆ స్త్రీ కళ్లలో బతికి బయట పడుతున్నానన్న ఆశ స్పష్టంగా గోచరిస్తోంది. తాడు మెల్లగా కిందికి దిగుతోంది ఆమెవైపుగా. అంటే రామస్వామి నాకన్నా ముందు ఆ స్త్రీనే కాపాడటానికి ప్రయత్నిస్తున్నాడా? నో ... అలా జరగడానికి వీల్లేదు. ఆమెను రక్షిస్తే రామస్వామికేమొస్తుంది?



★★★

కొన్ని గంటల తరువాత తెలివొచ్చింది. తెలతెలవారుతోంది. ప్రజల రోదనలు ... అరుపులు విన్పిస్తున్నాయి దూరంగా. మెట్లు దిగి రోడ్డుపైకి వచ్చాను. అలల ఆగ్రహం చల్లారినట్లుంది. రోడ్డంతా వరద మిగిల్చిన బురద. వరద ఎలా వచ్చిందో అలానే వెళ్లిపోయింది ఊరుని వల్లకాడుగా మార్చేసి.

ఎక్కడ పడితే అక్కడ కుప్పకూలిన గుడిసెలు, పూరిళ్లు, పశువుల పాకలు, శవాలు, శవాల చుట్టూ మూగి గుండెలవిసేలా విలపిస్తున్న మృతుల కుటుంబీకులు... ఎటు చూసినా గుండెల్ని పిండేసే విషాద దృశ్యాలు. ఒకనాడు తమ శ్రమతో జిల్లాలోనే ఆదర్శ గ్రామాన్ని తీర్చిదిద్దుకున్న రైతన్నలు... ఈనాడు సర్వస్వం కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వారిని ఎలా ఓదార్చాలో అర్థంకాని స్థితిలో అడుగులు ముందుకువేశాను.

''ఒసేవ్ నన్నలా చూడకే... నన్నన్యాయం చేసి వెళ్లిపోయావు కదే..'' ఆ గొంతు రామస్వామిది. నా ప్రాణదాతది. గుంపుని ఛేదించుకుని లోనికెళ్లాను. రామస్వామి ఒళ్లో ఓ స్త్రీమూర్తి విగత శరీరం. ఆ స్త్రీని పోల్చుకోగలిగాను. మృత్యువుతో నాతోపాటు పోరాడిన స్త్రీ మృతదేహమది. మైగాడ్! ఆవిడ రామస్వామి భార్యా!! నాకు తెలియకుండానే నా కళ్లు చెమ్మగిల్లాయి. ఒకవేళ రామస్వామి గనక నాకన్నా ముందు ఆమెని రక్షిస్తే ఆమె స్థానంలో నేనుండేవాడిని. తాడు ఆఖరి క్షణంలో నావైపు కదిలినప్పుడు ఆమె కళ్లలో కదలాడిన ఆశ్చర్యం చనిపోయాక కూడా అలానే ఉండిపోయింది.

రామస్వామి దగ్గరకెళ్లి భుజం మీద చేయి వేశాను ఓదార్చడానికన్నట్లు.

అంత బాధలోనూ నన్ను చూడగానే అదే ఆప్యాయతతో నన్ను చుట్టేసి వెక్కివెక్కి ఏడుస్తూ ''అయ్యా ... నన్నలా చూడొద్దని మీరైనా చెప్పండయ్యా!'' మనసు కదిలిపోయేలా అరిచి అరిచి ఏడుస్తున్నాడు రామస్వామి.

''అర్థం చేసుకోవే చంద్రకళా ... నువ్వు సచ్చిపోతే దిక్కులేకుండా పోయేది నేనొక్కడినే. కాని ఆ అయ్య సచ్చిపోతే వేలమందికి దిక్కుండదే ... అందుకేనే నిన్ను బలిచ్చి ఆ బాబుని బతికించింది'' అంటూ ఎగిసెగిసిపడి రోదిస్తున్నాడు.

రామస్వామి ఆక్రందనలోని నిజాయితీ నన్ను దహిస్తోంది. భగవంతుడా! రామస్వామి లాంటి సాధారణ జనాల్లో ఇంతటి త్యాగ గుణం ఉంటుందా? నేను... నిజంగా ప్రజల మనిషినా? ప్రజలమనిషిగా నటిస్తున్న ప్రజానాయకుడినా!?

ఎప్పుడొచ్చాడో వెనకనుండి భుజంపై తడుతూ వెళ్దాం పదమని కళ్లతో సైగచేస్తున్నాడు శేఖర్. రామస్వామి కంటపడకుండా నా తల పూర్తిగా వంచుకుని చచ్చిన శవంలా అక్కడ్నుంచి వెనుదిరిగాను.

..................................................

రచయిత సెల్: 92912 23136

# అనుగ్రహం

11-17 మార్చి 2012

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

వ్యాపార వర్గాల వారికి దస్త్రం, శుభకార్యాల్లో ఒత్తిడి అధికం. గృహంలో సందడి నెలకొంటుంది. వస్త్రాలు, విలువైన సామగ్రి కొనుగోలు చేస్తారు. ఆది, గురువారాల్లో ముఖ్యమైన వ్యవహారాల్లో ఏకాగ్రత అవసరం. స్త్రీల ఆరోగ్యం మందగిస్తుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి, విశ్రాంతి లోపం. మీ పనులు, కార్యక్రమాలు వాయిదాపడతాయి. అవగాహన లేని విషయాలు, హామీలకు దూరంగా ఉండాలి.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

గృహ వాస్తు మార్పులు, నూతన పెట్టుబడులకు అనుకూలం. మంగళ, శనివారాల్లో చిన్న విషయాలను పట్టించుకోవద్దు. ఆదాయానికి మించిన ఖర్చులుంటాయి. స్త్రీల కోరికలు, అవసరాలు వాయిదావేసుకోవాల్సి వస్తుంది. ఉద్యోగస్తులకు కొత్త బాధ్యతలు, ఉపాధ్యాయులకు స్థానచలనం తప్పవు. ఆకస్మిక ప్రయాణం తలపెడతారు. ఆస్తి పంపకాలు, కోర్టు వ్యవహారాలు పరిష్కారదిశగా సాగుతాయి.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

అయినవారి నుంచి ఆహ్వానం అందుకుంటారు. ఒక సమస్య మీకు అనుకూలంగా పరిష్కారమవుతుంది. ఆదాయ వ్యయాలు మీ అంచనాలకు తగ్గట్టుగానే ఉంటాయి. ఒక శుభకార్యానికి హాజరయ్యే విషయంలో సందిగ్ధానికి లోనవుతారు. గురు, శుక్రవారాల్లో ఏ పనీ సాగక విసుగుచెందుతారు. స్త్రీల ఉద్యోగ యత్నం ఫలిస్తుంది. ఉన్నతాధికారుల హోదా పెరగడంతో పాటు స్థానచలనానికి ఆస్కారం ఉంది.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

మీ వ్యవహార దక్షత, పనితీరుకు గుర్తింపు, ప్రశంసలు అందుకుంటారు. వాయిదాపడిన పనులు అనుకోకుండా పూర్తి చేస్తారు. ఖర్చులు పెరిగినా ఆదాయానికి లోటుండదు. ప్రముఖులు, చిన్ననాటి వ్యక్తులను కలుసుకుంటారు. దూరపు బంధువుల నుంచి ఆహ్వానం అందుతుంది. శనివారం నాడు బ్యాంకు పనులు, ప్రయాణంలో జాగ్రత్త. వ్యాపారాల్లో కొత్త కొత్త పథకాలతో కొనుగోలుదార్లను ఆకట్టుకుంటారు.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొత్త పథకాలు, ఆలోచనలతో యత్నాలు సాగిస్తారు. గత తప్పిదాలు పునరావృతమయ్యే ఆస్కారం ఉంది. కొన్ని అనుకోని సంఘటనలు మనస్థిమితం లేకుండా చేస్తాయి. వృత్తి వ్యాపారాల్లో చికాకులు తొలగి అనుభవం గడిస్తారు. వివాహ నిశ్చితార్థాలు, వాణిజ్య ఒప్పందాలకు అనుకూలం. ఆస్తి వివాదాలు పరిష్కారదిశగా సాగుతాయి. మీ వాహనం, విలువైన వస్తువులు జాగ్రత్త. నూతన టెండర్లు, లీజు పొడిగింపులు అనుకూలిస్తాయి.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఈ వారం ధన వ్యయం, ఒప్పందాల్లో జాగ్రత్త. అయినవారే మీ నిజాయితీని శంకిస్తారు. మీ యత్నాలు, పథకాలు గుట్టుగా సాగించాలి. స్త్రీలకు ఆరోగ్యం ఏమంత బాగుండదు. ఆదాయ వ్యయాలకు పొంతన ఉండదు. ఆత్మీయుల రాకతో మానసికంగా కుదుటపడతారు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. విద్యార్థులు వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త. వృత్తి, వ్యాపారాల్లో నిలదొక్కుకోవడానికి బాగా శ్రమించాలి.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక పరిస్థితులు గత మాసం కంటె మెరుగ్గా ఉంటాయి. ఖర్చులు సామాన్యం. ఒక శుభవార్త వింటారు. మొదటిసారి అనుకూలించని యత్నం రెండోసారి ఫలిస్తుంది. ఆది, సోమవారాల్లో చేపట్టిన పనులందు ఆసక్తి ఉండదు. ఒక శుభకార్యానికి తీవ్రంగా యత్నాలు సాగిస్తారు. అయినవారి ద్వారా ఒక ముఖ్య సమాచారం అందుతుంది. ముఖ్యమైన పత్రాలు, రశీదులు జాగ్రత్త. ఒక స్థిరాస్తి కొనుగోలు దిశగా మీ ఆలోచనలుంటాయి.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. మీ యత్నాలు గుట్టుగా సాగించాలి. రాబోయే ధనానికి ముందుగానే ఖర్చులు సిద్ధంగా ఉంటాయి. బంధుమిత్రులు మీ నుంచి ధనసహాయం అర్థిస్తారు. కొంత మొత్తం సహాయం చేసి వారిని సంతృప్తిపరచండి. మంగళ, బుధవారాల్లో హామీలు, మధ్యవర్తిత్వాల వల్ల చిక్కుల్లో పడే ఆస్కారముంది. నూతన దంపతుల మధ్య అన్యోన్యత, అవగాహన నెలకొంటాయి.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

వృత్తి, వ్యాపారులకు కొత్త కొత్త అవకాశాలు కలిసివస్తాయి. ఒక సమస్యను తేలికగా పరిష్కరిస్తారు. రావలసిన ధనం అనుకోకుండా వసూలు కాగలదు. ఖర్చులు ప్రయోజనకరం. వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొంటారు. గురు, శుక్రవారాల్లో స్త్రీలు, అపరిచితులతో మితంగా సంభాషించండి. మీ ప్రమేయం లేకున్నా మాటపడవలసి వస్తుంది. గృహోపకరణాలు, విలాస వస్తువులు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు శుభవార్తా శ్రవణం.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

నూతన పెట్టుబడులు, వ్యాపారాల విస్తరణలకు ముహూర్తం నిశ్చయమవుతుంది. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. చిన్ననాటి వ్యక్తులు పరిచయస్తులను కలుసుకుంటారు. శనివారం నాడు ఏ పనీ సక్రమంగా సాగక విసుగుచెందుతారు. నిరుద్యోగుల ఉపాధి పథకాలకు మంచి స్పందన లభిస్తుంది. స్త్రీలకు వస్త్రలాభం, వాహనయోగం, వస్తులాభం వంటి శుభఫలితాలున్నాయి. మీ వాహనం ఇతరులకిచ్చే విషయంలో లౌక్యంగా మెలగండి.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఉద్యోగస్తుల హోదా పెరిగే సూచనలున్నాయి. ఇంటా బయటా మీ మాటకు మంచి స్పందన లభిస్తుంది. కుటుంబీకులు, అయినవారి కోసం ధం బాగా వెచ్చిస్తారు. మిమ్మల్ని కలవరపరచిన సంఘటన తేలికగా సమసిపోతుంది. ఆది, సోమవారాల్లో నగదు చెల్లింపులు, హామీల విషయంలో జాగ్రత్త. స్త్రీల ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతుంది. వ్యాపారాల్లో పెరిగిన పోటీని దీటుగా ఎదుర్కొంటారు.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఖర్చులు పెరిగే సూచనలున్నాయి. వివాహ నిశ్చితార్థాలు, వాణిజ్య ఒప్పందాలకు అనుకూలం. మంగళ, బుధవారాల్లో అవగాహన లేని పనులకు దూరంగా ఉండడం ఉత్తమం. వ్యాపారాల విస్తరణలకు అనుకూలం. ప్రముఖుల సహకారంతో కొన్ని వ్యవహారాలు సానుకూలమవుతాయి. గృహంలో సంతోషం, సందడి నెలకొంటాయి. వాయిదాపడిన పనులు ఎట్టకేలకు పూర్తి చేస్తారు. విద్యార్థులు వాహనం నడిపేటప్పుడు జాగ్రత్త.



పెంపుడు కుక్కలు, పిల్లులు కలిసి ఏడాదిలో 700 కోట్ల డాలర్ల ఖరీదైన తిండి తింటున్నాయి.

థంబ్ రూల్ అనే మాట పాత ఇంగ్లీషు చట్టం నుంచి వచ్చింది. బొటనవేలి కంటే వెడల్పయిన ఏ వస్తువుతోను భర్తలు భార్యల్ని కొట్టడానికి వీల్లేదని రూలు అప్పట్లో ఉండేదట.



గోల్డ్ ఫిష్ జ్ఞాపకశక్తి మూడే మూడు సెకండ్లు.

ఉల్లిపాయలు కోసేటపుడు చూయింగ్ గమ్ నములుతుంటే కన్నీళ్ళు రావట.



మొసలి నాలుకను బయటికి చాపలేదు.

ఒంటె పాలతో పెరుగు తోడుకోదు.

మనకు తెలిసిన చరిత్రలో పౌర్ణమి లేని ఒకే ఒక నెల 1865 ఫిబ్రవరి.

కాలిగోర్ల కంటే చేతిగోర్లు నాలుగురెట్లు ఎక్కువ వేగంగా పెరుగుతాయి.

1980 నాటికి ప్రపంచంలో టెలిఫోన్లు లేని ఒకే ఒక దేశం భూటాన్.




రెడ్ ఇండియన్ల భాషలో కెనడా అంటే 'పెద్దగ్రామం'.

ఉష్ట్రపక్షి కన్ను దాని మెదడు కంటే పెద్దది.

తుమ్ము ఎంత వేగంగా బయటికి వస్తుందో తెలుసా! వంద మైళ్ళు.

రెండు కళ్ళనూ ఒకేసారి ఆర్పగల ఒకే ఒక చేప సొరచేప.



పిల్లి వంద రకాల శబ్దాల్ని చేయగలదు. కుక్క మాత్రం పది రకాలే చేయగలదు.

ఖడ్గమృగం నోరు పూర్తిగా తెరిస్తే నాలుగడుగుల పిల్లవాడు సులభంగా పట్టేస్తాడు.



dousతో అంతమయ్యే పదాలు ఇంగ్లీషులో నాలుగే నాలుగున్నాయి. tremendous, horrendous, stupendous, hazardous.

మనిషి సగటున రోజుకు 15సార్లు నవ్వుతాడు.



# అదృష్ట రత్నజ్యోతి


## రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255

ఫోన్: 040-6522 5554


భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తనే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ....................................

పుట్టిన తేదీ ............................

పుట్టిన సమయం ........................

పుట్టిన ఊరు (మండలం) ...........

ప్రశ్న ....................................

పుట్టిన తేదీ వివరాలు లేని వారు 1 నుండి 249 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాసి పంపండి. (ఇది న్యూమరాలజీ కాదు, కృష్ణమూర్తి పద్ధతిలోని 249 సబ్స్).

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అదృష్ట రత్నజ్యోతి,**

ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76,
అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్ - 500 033.

**ఆర్.ఆర్., వరంగల్**

మానసిక క్షోభ, కోపం, చిరాకు, నిరాశ, నిస్పృహలతో జీవిస్తున్నాను. జీవితం అస్తవ్యస్థంగా మారింది. ఒక పురోహితుడి సూచన మేరకు పంచలోహపు ఉంగరంలో పచ్చరాయి (ఎమరాల్డ్) ధరిస్తున్నాను. నా సమస్యకు పరిష్కారమార్గాన్ని చూపించగలరు.

మీ జన్మకుండలి ప్రకారం 1995 మార్చ్ నుండి 2014 డిసెంబర్ వరకూ యోగకారకుడు శుక్రుని దశ. ఇది మీకు యోగించదు. యాక్సిడెంట్స్ కూడా ఇస్తుంది. మీ నక్షత్రం జ్యేష్ఠ కనుక పచ్చ ధరించమని చెప్పి ఉంటారు. పచ్చ పెడితే మీ వరకూ ఆరోగ్య సమస్యలు, పూర్వ పాపాలు పెల్లుబికి అల్లుకుపోవడం, తద్వారా ఏదీ కలిసి రాకపోవడం జరుగుతాయి. లగ్నాధిపతి శని అని నీలం ధరించడం కూడా సరికాదు. ధరిస్తే ఆటంకాలు,అవమానాలు.

మీరు ధరించాల్సిన రత్నం ముత్యం. ధరిస్తే స్థిరమైన వృత్తిలో స్థిరపడతారు. సమస్యలు తొలగుతాయి. మిగిలిన జన్మకుండలి మరోసారి పరిశీలిద్దాం.

**ఆర్, అనకాపల్లి**

వివాహం జరిగినప్పటి నుండి స్థిరత్వం లేదు. ఏ రత్నం ధరించాలి వివరించగలరు.

మీ వివాహానికీ, మీ స్థిరత్వానికీ మీ జన్మకుండలి ప్రకారం ఎలాంటి సంబంధం లేదు. ప్రస్తుతం 2010 ఆగస్ట్ నుండి 2013 జులై వరకూ శనిలో శని. మీరు ఎన్ని దేవాలయాలూ, పుణ్యక్షేత్రాలూ దర్శిస్తే, అది మీకు అంత రెమిడీగా పనిచేస్తుంది.



అలాగే మీరు ధరించాల్సిన రత్నాలు పగడం+గోమేధికం. ఫలితం- శక్తి ఉద్దీప్తం కావడం. శక్తి ఉద్దీప్తమైతే అన్ని పనులూ అవే చక్కబడతాయి కదా.

అయితే మీ నక్షత్రం హస్త అని ముత్యం ధరించకూడదు. ధరిస్తే వృత్తిలో ఆటంకాలూ, చెడ్డపేరు, ఏ విషయంలోనూ ఒక నిర్ణయానికి రాలేకపోవడం. రాశి కన్య అని పచ్చ ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు వైవాహిక జీవితంలో ఘర్షణ. పరస్పరమైన ఆకర్షణ కోల్పోవడం. శని దశ, ఏలినాటి శని నడుస్తున్నాయని నీలం అస్సలు ధరించకూడదు. యోగకారకుడు సూర్యుడని కెంపు కూడా ధరించకూడదు. ధరిస్తే భాగ్యహీనత. లాసాఫ్ లక్!

**జి.ఎస్., కరీంనగర్**

ధరించాల్సిన రత్నం తెలుపగలరు. మాది చాలా పెద్ద కుటుంబం, ఆర్థిక ఇబ్బందులు చాలా ఎక్కువ.

మీ జన్మకుండలి ప్రకారం ధరించాల్సిన రత్నాలు పచ్చ+వజ్రం. అలాగే నీలం విడిగా. ధరిస్తే ఫలితాలు ధనయోగం, వాహనయోగం. యోగం పట్టడం. సుఖపడడం. మీ నక్షత్రం పూర్వాభాద్ర అని పుష్యరాగం ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు విద్యలో బ్రేక్స్, డిగ్రీ పూర్తికాకపోవడం. ఇక కుజునికి ఎంత గట్టి రెమిడీస్ పాటిస్తే, మీ పూర్వపాపం అంత క్షయిస్తుంది. ఏదిఏమైనా 2012 ఆగస్ట్ నుండి మీకు యోగకాలం!

**ఎమ్.వి.ఎల్., విజయవాడ**

మా అన్నయ్య రత్నధారణ గురించి వ్రాస్తున్నాను. వద్దని వారించినా నలుపు రంగు ఎక్కువ ఇష్టపడతాడు. వారించినా వినకుండా ప్రేమ వివాహం చేసుకున్నాడు. అతని మీద అందరం ఆధారపడి ఉన్నాము.

మీ అన్నయ్య జన్మకుండలి ప్రకారం 2006 డిసెంబర్ నుండి 2023 డిసెంబర్ వరకూ బుధ దశ. బుధుడు లగ్నాధిపతి. అంటే సెల్ఫ్. ఆయన అష్టమంలో పడి, అష్టమంలోని కేతువుతో కంట్రోల్ చేయబడడం దురదృష్టం! ఫలితం- దూరదృష్టి లేకుండా చేసే స్వయంకృతాపరాధాలు!

నలుపు రంగు వలన ప్రత్యేకించి జరిగే నష్టమేమీ ఉండదు. ప్రస్తుతం నడుస్తున్న బుధ దశని రిపేర్ చేయాలంటే ధరించాల్సిన రత్నం నీలం! అలాగే అదృష్ట దురదృష్ట స్థానాధిపతుల కలయికకి కూడా గట్టి రెమిడీస్ పాటించాలి. కుజదోషానికి కూడా. అయితే నక్షత్రం పూర్వాభాద్ర అని పుష్యరాగం ధరించకూడదు. నడుస్తున్న దశ బుధ దశ అని పచ్చ కూడా ధరించకూడదు.

**బి.ఎన్., హైదరాబాద్**

నేను ధరించే రత్నం చెప్పగలరు. భవిష్యత్ ఎలా ఉంటుంది.

మీ జన్మకుండలి ప్రకారం మీరు ధరించాల్సిన రత్నం వజ్రం. ఫలితాల విషయం తర్వాత సంగతి. ధరించడం అనివార్యం, అవసరం!

మీ నక్షత్రం ఉత్తరాభాద్ర అని నీలం ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు వైవాహిక జీవితంలో గొడవలు, విడిపోయే పరిస్థితి తలెత్తడం. మీ రాశి మీనం అని పుష్యరాగమూ ధరించకూడదు.

2008 జూన్ నుండి 2028 మార్చ్ వరకూ శుక్ర దశ. పూర్తి స్థాయిలో అస్తంగతుడయిపోయిన శుక్రుని దశ. గట్టి రెమిడీస్ పాటించాలి. 2011 అక్టోబర్ నుండి 2012 సెప్టెంబర్ మధ్య ఈ అస్తంగత్వ ప్రభావం చోటుచేసుకోకుండా జాగ్రత్తపడాలి. ఆరోగ్యం, సంతానం, షేర్స్ విషయాల్లో జాగ్రత్త అవసరం పడుతుంది.

2012 సెప్టెంబర్ నుండి 2014 మే మధ్య ఉద్యోగంలో ఉన్నతి.

2014 మే నుండి 2015 జులై మధ్య ధనం వచ్చి, పోతుంది! ఆస్తి వచ్చి అమ్ముడయిపోతుంది. ఈ కోణాల్లో రెమిడీస్ పాటించాలి.

2013 జులై నుండి 2018 జులై మధ్య పిల్లలు అగ్ని జోలికి (దీపావళి) వెళ్ళకుండా జాగ్రత్తపడాలి.

2018 జులై నుండి ఉద్యోగంలో తిరుగులేని స్థితి.

**ఎన్.ఎస్., కర్నూలు**

మా అమ్మాయి ఏ రత్నం ధరించాలో చెప్పగలరు.

మీ అమ్మాయి జన్మకుండలి ప్రకారం ధరించాల్సిన రత్నాలు పచ్చ+వజ్రం. ఫలితాలు యోగం పట్టడం, సంతాన భాగ్యం, అదృష్టం, వివాహం జరగడం. నక్షత్రం హస్త అని ముత్యం ధరించకూడదు. మంచి కెరీర్ కోసం గోమేధికం ధరించాలి. వెంటనే పచ్చ+వజ్రం ధరిస్తే ఈ సంవత్సరం ఎప్పుడు ముహూర్తాలుంటే అప్పుడు వివాహం! వచ్చే అబ్బాయి నక్షత్రం 124.51 దగ్గర పడుతుంది. అంటే ఉత్తర నక్షత్ర జాతకుడు రావాలి!


పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం '**అధినేత**'. 1993లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత '**అధినేత**' ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: 98499 92892.

Advt

# చెప్పండి చూద్దాం



1. మనుషులకు వచ్చే అంటువ్యాధుల్ని ఇంగ్లీషులో epidemic అంటారు కదా. మరి జంతువులకు వచ్చే అంటు వ్యాధులను ఏమంటారో తెలుసా?
2. mt తో అఖరయ్యే ఇంగ్లీషు పదం ఒకటే ఒకటుంది. అదేమిటో చెప్పండి.
3. ఓ ఇంగ్లీష్ పదంలో ఒక అచ్చు(ఒవెల్)ఆరుసార్లు వస్తుంది. ఆ పదమేదో కనుక్కోండి?

# రంగులు వేయండి



## జవాబులు

**చెప్పండి చూద్దాం**

1. epizootic, 2. dreamt, 3. indivisibility

**గుర్తుపట్టండి**

1. మెరిల్ స్ట్రీప్(ఉత్తమ నటి), 2. జీన్ డుజార్డిన్(ఉత్తమ నటుడు), 3. మైకేల్ హాజనవిషియస్(ఉత్తమ దర్శకుడు), 4. ఆక్టేవియా స్పెన్సర్(ఉత్తమ సహాయ నటి), 5. క్రిస్టోఫర్ ప్లమ్మర్(ఉత్తమ సహాయ నటుడు)

**పద విన్యాసం**

1. చెమట, 2. నొసట, 3. బయట, 4. పిమ్మట, 5. పవిట, 6. సందిట, 7. గలాట, 8. ఎదుట, 9. ముంగిట, 10. సమ్మెట

**మీకు తెలుసా?**

ప్రపంచంలోనే ఎత్తయిన హిమాలయ పర్వతాలు నేపాల్ దగ్గరే ఉంటాయి కదా. ఆ దేశంలోనే ప్రపంచంలోనే అతి పొట్టి మనిషి ఉండటం విశేషం. అతని పేరు చంద్ర బహదూర్ డాంగి. వయసు 72 ఏళ్ళు. ఎత్తు 54.6 సెంటీమీటర్లు. అంటే పసిబిడ్డ పొడవన్నమాట. ఇంకా కచ్చితంగా చెప్పాలంటే

# ప్రపంచంలోనే పొట్టి మనిషి



ఒకటిన్నర రెండ డుగుల మధ్యన ఉంటాడు. బరువు 12 కిలోలు. ఇతడు అతి పొట్టి మనిషిగా ఇటీవలే 'గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సు'లో స్థానం సంపాదించుకున్నాడు. 57 ఏళ్ళ 'గిన్నిస్‌బుక్' చరిత్రలో 72 ఏళ్ళ అతి పొట్టి వ్యక్తి చోటు దక్కించుకోవడం ఇదే తొలిసారని దాని ఎడిటర్-ఇన్-చీఫ్ క్రయిగ్ గ్లెన్‌డే తెలిపారు. భారత్‌కి చెందిన గుల్ మహమ్మద్ 57 సెంటీమీటర్ల పొడవుతో ద్వితీయ స్థానం పొందాడు. గతంలో ఫిలిప్పైన్స్‌కి చెందిన 59.9 సెంటీమీటర్ల పొడవు గల జర్నీ బాలావింగ్ పేరిట ఈ రికార్డు ఉండేది. దీనిని వీరిద్దరూ ఇప్పుడు అధిగమించారు.

# దారి కనుక్కోండి




1


2


3


4


5

## గుర్తుపట్టండి

2012
ఆస్కార్ అవార్డు
విజేతలు వీరు.
వీరిని గుర్తుపట్టండి.

## పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో 'ట' చివర గల పదాలను పూరించండి.

1. స్వేదము ☐☐ ట
2. నుదురు ☐☐ ట
3. వెలుపల ☐☐ ట
4. అనంతరం ☐☐ ట
5. చీర చెంగు ☐☐ ట
6. కౌగిలి ☐☐ ట
7. గొడవ ☐☐ ట
8. ముందర ☐☐ ట
9. ఇంటిముందు ☐☐ ట
10. పెద్ద సుత్తి ☐☐ ట

నిర్వహణ : చేబియ్యం రామారావు

## నా బొమ్మ





వి.నిశాంత్ కుమార్, 5వ తరగతి,
ఎస్.ఎస్.ఇ.ఎమ్.స్కూల్, పలమనేరు, చిత్తూరు జిల్లా

## బేస్ బాల్ సైజు వడగళ్లు

తెలుసా?



వడగళ్ళ వాన గురించి మీరంతా వినే ఉంటారు. కొందరు చూసి కూడా ఉండొచ్చు. ఐసు ముక్కలు ఆకాశంలోంచి వేగంగా పడడం వల్ల చిన్న చిన్న దెబ్బలు తగుల్తాయని కూడా మనందరికీ తెలుసు. అయితే వెయ్యి సంవత్సరాల క్రితం హిమాలయ పరిసరాల్లో కురిసిన భారీ వడగళ్ల వాన వల్ల వందల మంది చనిపోయినట్లుగా కొంతకాలం క్రితం జరిగిన ఒక పరిశోధనలో తేలింది. బేస్‌బాల్ అంత పరిమాణంలో ఐస్‌గడ్డలు ఆకాశం నుంచి గంటకు 160 కిలోమీటర్ల వేగంతో నేలపై వర్షించాయట. ఇవి తలపై పడడం వల్లే మరణాలు సంభవించినట్లు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 9వ శతాబ్దంలో మనదేశంలోనే ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రూప్‌కుండ్‌లో వచ్చిన వడగళ్లవాన చరిత్రలో అతిపెద్దదిగా నిలిచిపోయింది.

# అంకెళి

నిర్వహణ : పి.రాఘవరెడ్డి

అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 7 | 9 | 4 | | 5 | | |
| | | | | | 1 | | | |
| 9 | 5 | 1 | 3 | | | 8 | 4 | 2 |
| | | 4 | | 5 | | 1 | 2 | 6 |
| | | | | 9 | | | | |
| 5 | 1 | 2 | | 6 | | 9 | | |
| 3 | 7 | 5 | | | 9 | 2 | 1 | 4 |
| | | | 2 | | | | | |
| | | 6 | | 1 | 7 | 3 | | |

## గత సంచిక జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 6 | 4 | 5 | 8 | 3 | 9 | 1 | 7 |
| 8 | 1 | 3 | 9 | 6 | 7 | 4 | 2 | 5 |
| 5 | 9 | 7 | 1 | 4 | 2 | 3 | 8 | 6 |
| 4 | 5 | 8 | 3 | 9 | 1 | 7 | 6 | 2 |
| 3 | 2 | 1 | 7 | 5 | 6 | 8 | 9 | 4 |
| 9 | 7 | 6 | 4 | 2 | 8 | 5 | 3 | 1 |
| 1 | 4 | 9 | 2 | 3 | 5 | 6 | 7 | 8 |
| 7 | 8 | 5 | 6 | 1 | 9 | 2 | 4 | 3 |
| 6 | 3 | 2 | 8 | 7 | 4 | 1 | 5 | 9 |

## 'రికార్డ్' కవలలు



ఎనా పా, లిల్లీ మిల్‌వర్డ్... వీళ్ళిద్దరూ కవలలు. 102వ పుట్టినరోజు జరుపుకున్నారు. ప్రపంచంలోనే వృద్ధులైన కవలలుగా గిన్నిస్‌బుక్ రికార్డ్స్‌కెక్కారు. ప్రతి పుట్టినరోజు కలిసే జరుపుకుంటారు. ఈసారి లిల్లీ ఆస్పత్రి పాలైనప్పటికీ, అక్కడే ఎనా ఆమెతో కలిసి పుట్టినరోజు జరుపుకుందట. ఎల్లప్పుడూ నవ్వుతూ ఉండడమే మా ఆరోగ్య రహస్యం అంటున్నారు వీళ్ళు. ఈ రికార్డుని వీళ్ళే తిరగరాయాలని కోరుకుందాం.




మనుషుల్లాగే, వారు మాట్లాడే భాషలూ చనిపోతాయన్న భయం నుంచి, వాటిని కాపాడుకోవాలనే కోరిక నుంచి పుట్టుకొచ్చినవే ఆధునిక భాషోద్యమాలు. మాతృత్వాన్ని, లేనిపోని ప్రాచీనత్వాన్ని ఆపాదించడం ద్వారా ప్రశ్నించడానికి వీలులేని భావోద్వేగాల అంచులపై భాషను ఈ ఉద్యమాలు నిలబెట్టాయి. ఇంతవరకే అయితే ఏదోలా సర్దిచెప్పుకోవచ్చు గానీ, దానికో అధికారిక ముద్రను కూడా వేసేశాయి. అధికారాన్ని, వ్యవస్థను ప్రశ్నించడం ద్వారానే, విమర్శ పెట్టడం ద్వారానే పదునెక్కే అస్థిత్వ ఉద్యమాలకు... భాషకు ఆపాదిస్తున్న ఈ అధికారిక స్వరమే అభ్యంతరకరంగా మారింది. అధికార భాష అంటే ఎవరిది? ఏ ప్రాంతం, తెగ, జాతులది? అంటున్న కంచ

# దూషణమే 'భాష'ణం కాదు

ఐలయ్య ప్రశ్నలు మొదలవుతోంది ఇక్కడే. భాషోద్యమాన్ని ప్రజాస్వామీకరించే పని వదిలేసి ఇంగ్లీష్‌ను బూచిగా చూపే ధోరణిని 'బర్త్ వితౌట్ బర్త్‌డే' వ్యాసాల్లో ఐలయ్య నిలదీశారు.




ఉస్మానియా యూనివర్సిటీ స్కాలర్స్ అసోసియేషన్ (ఔస) ప్రచురించిన ఈ పుస్తకంలో మొత్తం 63 వ్యాసాలున్నాయి. ఇంగ్లీష్ భాష పట్ల వాళ్ళ వాళ్ళ వైఖరి ప్రాతిపదికగా తెలంగాణ, మావోయిస్టు ఉద్యమం, ప్రజాస్వామ్యం, కుల నిర్మూలన తదితర ప్రాంతీయ, సామాజిక, విముక్తి భావనలను ఈ వ్యాసాల్లో ఐలయ్య అంచనా వేశారు. ప్రపంచీకరణ అనివార్యమనే నిర్ధారణకు వచ్చిన ఆయన, అది తెచ్చిపెట్టిన ఇంగ్లీష్ సంస్కృతిని, స్థానికతను సమన్వయం చేసుకుని ముందుకుపోవాలని సూత్రీకరించారు. అందుకనే ప్రభుత్వ బడుల్లో సామాజిక భాషా శాస్త్రాలను తెలుగులో, వైజ్ఞానిక శాస్త్రాలను ఇంగ్లీష్‌లో చెరి మూడు పాఠ్యాంశాలుగా బోధించాలని ప్రతిపాదించారు. 'నేను హిందువునెట్లయిత'లో చేసినట్టే, దళిత, జనజీవన సంప్రదాయం నుంచి తన వాదనను బలపరుచుకున్నారు. కానీ, భాష ఓ ఉత్పత్తి సాధనమనేది ఆయన మరిచిపోతున్నారు.

ఉపయోగించేవాడిని బట్టే గానీ, కత్తికి స్వతహాగా ఎలాగైతే ఏ ఉద్దేశమూ ఉండదో, భాషకు కూడా వర్గం, ఆధిపత్యం ఉండవనేది గమనించాలి. అదే సమయంలో ఉత్పత్తి సాధనాల అభివృద్ధిక్రమం సమాజాన్ని మంచిగానో, చెడుగానో ప్రభావితం చేస్తుందనేదీ వాస్తవమే. కత్తులతో నిండిన యుద్ధరంగం తుపాకీ రాకతో ఎలా రూపురేఖలను మార్చుకుంటుందో, అలాగే వ్యవహారిక భాష వాడుక తగ్గి, ఇంగ్లీష్ ప్రాబల్యం పెరిగితే సాహిత్య కళారంగాలు మట్టి వాసనను కోల్పోయి బోన్సాయ్‌లతో నిండిపోతాయి. ఈ ప్రమాదాన్ని భాషోద్యమకారులే కాదు, ఐలయ్య కూడా గుర్తించలేకపోతున్నారు. అందువల్లే ఆయన వ్యాసాల్లో ఎక్కువ భాగం పునాదంటూ లేని తెలుగు భాషోద్యమం నడకను, నాయకత్వం దివాలాకోరుతనాన్ని, సోకాల్డు కమ్యూనిస్టుల, సామ్రాజ్యవాద వ్యతిరేకుల ఆచరణను గేలిచేయడంతోనే సంతృప్తిపడినట్టు కనిపిస్తోంది.

– వి. అరవింద్

**బర్త్ వితౌట్ బర్త్‌డే** (వ్యాసాలు), కంచ ఐలయ్య
పేజీలు : 244, వెల : రూ. 170,
ప్రతులకు : ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్, హైదరాబాద్.

"ఇంట్లో ఫ్రిజ్ వద్దు. మనం రోజూ తాజాగా వండుకుందాం. ఏ రోజుది ఆ రోజే కానిచ్చేద్దాం. దేన్నీ మిగిలించి దాచడం వద్దు. దీంతో జీవితం సులభం అవుతుంది."



**ఫ్రిజ్‌లో ప్రేమ** (మరాఠీ అత్యాధునిక నాటకాలు రెండు), సచిన్ కుండల్కర్, అనువాదం : గూడూరు మనోజ, పేజీలు: 100, వెల : రూ.50/– ప్రచురణ : ప్రాచీ పబ్లికేషన్స్

పుస్తకాలు

తెలుగు నాటక విమర్శనా చరిత్రలో ఆద్యుడు, పూజ్యుడు పురాణం సూరిశాస్త్రి. తొలి దశలో శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కె.వి. గోపాల స్వామి, శ్రీనివాస చక్రవర్తి... అనంతర కాలంలో డా. పి.ఎస్.ఆర్. అప్పారావు, ఆచార్య మొదలి నాగభూషణశర్మ వంటి వారు నాటక చరిత్ర, విమర్శలను గ్రంథస్థం చేయడానికి అవిరళ కృషి చేశారు. ఒక వ్యక్తి తన అవిశ్రాంత కృషితో గొప్ప పనులు చేయవచ్చు కాని తను అభిమానించి, పూజించే రంగానికి సర్వస్వాన్నీ ధారపోసి ఒక సంస్థ చేయాల్సిన పనిని ఒక్కడుగానే చేస్తే అతడు వ్యవస్థతో సమానం. ఆ కోవకు చెందిన కళాబంధువు పురాణం సూరిశాస్త్రి. ఇర వయ్యో శతాబ్దం తొలి దశలో తన జీవితాన్ని సాహిత్యార్చనకు అంకితం చేసిన మహానుభావుడాయన.

సూరిశాస్త్రి రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఎన్నో నాటకాలను చూశారు. మరెన్నో చదివారు.


సూరి శాస్త్రి

స్వీయానుభవాలను, నాటక చరిత్రను తరువాతి తరాలకు అందించడానికి ఆంధ్ర నాటక నామావళి (1916), నాట్యాంబుజము (1923), నాట్యోత్పలము (1925), నాట్య అశోకము (1925- 27), విమర్శక పారిజాతము (1925), ఆంధ్ర నాటక సంస్కరణము (1925). పుస్తకాలు రాశారు. వీటిలో రెండింటిని కలిపి ఇప్పుడు తీసుకొచ్చారు.

## నాట్యాంబుజము

1916 నుండి 1922 వరకూ దేశాటన చేస్తూ తాను చూసిన నాటకాలను, నటుల నటనను గురించి సశాస్త్రీయంగా సద్విమర్శ చేస్తూ వ్రాసిన వ్యాససంకలనం ఇది. తాను స్వయంగా చూసిన నాటకాలపై విమర్శను ఎంత నిశితంగా చేశారో... చూడని

# అలనాటి గ్రంథానికి అపురూప నీరాజనం

నాటకాల గురించి విమర్శ చేయడానికి నిరాకరించడం కూడా వారి సహృదయతకు తార్కాణం.



నాట్యాంబుజంలో ఎనిమిది దళాలున్నాయి. మొదటి దళము నాటకానుభవములు, రెండవ దళము ఆంధ్ర నాటకములు (పూర్వ రూపము), మూడవ దళము నాటక సమాజములు, నాలుగవ దళము ప్రసిద్ధ నటులు, ఐదవ దళము ప్రదర్శన, విమర్శనములు, ఏడవ దళము నాటక సమస్యలు, ఎనిమిదవ దళము నాటక విమర్శనము. ఒక నాటక స్వరూపాన్ని అన్ని కోణాలలో సమ్యక్ దృష్టితో పరిశీలించిన విధానానికి ఈ గ్రంథం దర్పణం పడుతుంది.

తెలుగు నాటక ఆరంభ దశలో వర్ధిల్లిన చెన్నపురి సుగుణ విలాస సభ, బళ్ళారి, మైలవరం, రాజమండ్రిలోని నాటక సమాజాల కృషిని సోదాహరణంగా వివరించారు. 1900-1920 మధ్య కాలంలో విలసిల్లిన నెల్లూరి నగరాజారావు, మంజులూరి, హరిప్రసాదరావు, మల్లాది గోవిందశాస్త్రి, ముప్పిడి జగ్గరాజు, పారుపల్లి సుబ్బారావు వంటి మహానటుల నటనా వైదుష్యాన్ని విశ్లేషించారు. బళ్ళారి రాఘవ ప్రదర్శించిన రామదాసు, రామరాజ్య వినాశనము, డి.వి. సుబ్బారావు చంద్రహాస వంటి నాటక ప్రదర్శనలపై ప్రత్యేకంగా విమర్శ చేశారు. నాటక విజయానికి రచన-ప్రదర్శన జోడు గుర్రాల వంటివనీ, సమిష్టి కృషి మూలంగా నాటక ప్రదర్శన విజయవంతమవుతుందనీ తొలినాళ్ళలోనే స్పష్టం చేసిన దార్శనికుడు సూరిశాస్త్రి.

## నాట్య అశోకము

పదకొండు అధ్యాయాలుగా ఉన్న ఈ పుస్తకంలోని ప్రతి వ్యాసం నాటిక రచన, అభినయ విధానాల సమాహారంగా ఉంది. కనుక శాస్త్రిగారి సశాస్త్రీయ వివేచనకు అద్వితీయమైన లక్ష్యచర్చగా రూపొందింది. రామదాసు నాటకంపై విమర్శ అన్నిట్లోకి తలమానికమైనది.

ఆచార్య మొదలి నాగభూషణశర్మ ఈ గ్రంథానికి సంపాదకులు కావడం బంగారానికి తావి అద్దినట్లే. అలనాటి గ్రంథానికి మొదలివారు సవివరణాత్మకమైన వివరణలను అధో జ్ఞాపికలుగా ఇవ్వడం ఈ తరం పాఠకులకు మృష్టాన్న భోజనమే.

ఒక అరుదైన నాటక విమర్శ గ్రంథాన్ని తీసుకొచ్చిన గురుతుల్యులు ఎం.ఎన్. శర్మగారికి, అచ్చొత్తించిన మల్లాది వారికి అభినందన మందారాలు.

– చాట్ల శ్రీరాములు

**నాట్యాంబుజము, నాట్య అశోకము,** సూరి శాస్త్రి
పేజీలు : 326 , వెల : రూ. 200, ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

# స్వీకారం

**శిల్పి** (ఖండ కావ్యం)



రచన : జి. యాదగిరి
పేజీలు : 44
వెల: రూ.30
ప్రతులకు : సెల్: 94923 53878

★★★

**కర్నూలు జిల్లా కవితరంగిణి**
రచన : వైద్యం వేంకటేశ్వరాచార్యులు
పేజీలు : 206 , వెల: రూ.100/-
ప్రతులకు : సెల్ : 99896 79681

★★★

**కవిరాజుపై అభిప్రాయమాలిక**
సంకలనం : కాట్రగడ్డ కృష్ణచంద్
పేజీలు : 76, వెల: రూ.40/-
ప్రతులకు : 08931-231834

★★★

**శంకరంబాడి సుందరాచారి**
రచన : డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి
పేజీలు : 88, వెల: రూ.50
ప్రతులకు : సెల్: 08581-256234

★★★

**భూమికోసం అమరజీవి**
రచన : పాటూరు రామయ్య
పేజీలు : 102, వెల: రూ.30
ప్రతులకు : ప్రజాశక్తి బుక్ హౌస్

★★★

**మండుతున్న భూగోళం**
రచన : ఎల్. మల్లిక్
పేజీలు: 161, ప్రతిపాదిత చందా: రూ.60
ప్రతులకు : 0891-2548071

★★★

**గ్రంథాలయ సమాచారశాస్త్ర వ్యాసాలు**
రచన : ఎల్.ఎస్. రామయ్య
పేజీలు : 96, వెల: రూ.40
ప్రతులకు : 0866-2436643

★★★

**తెలంగాణపై విస్తృత అంగీకారం**
రచన : కొత్తపల్లి జయశంకర్
పేజీలు: 60, వెల: రూ.80
ప్రతులకు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

★★★

**ఓ నాన్న కథ**



రచన : వి.సాంబశివరావు
పేజీలు: 124,
వెల : రూ.100
ప్రతులకు : సెల్ - 98664 00059



30
ఏళ్లనుండి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నాను. 1991 ప్రాంతాల్లో సంపూర్ణ అక్షరాస్యతా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని మండల పాఠశాలలున్న గ్రామాలు తిరిగి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాను. ముఖ్యంగా స్త్రీ పాత్ర ధరించి అక్షరాస్యతపై అవగాహన కలిగించేలా పాటలు పాడి, నృత్యాలు చేశాను. ఒకసారి

## అక్షరాస్యతపై అవగాహన

రేవనూరు గ్రామంలో నా అభినయానికి మెచ్చి ప్రజలు నా జాకెట్టుకి రూ.250 పిన్ చేయడం మరచిపోలేని సంఘటన. ఎంచేతంటే అప్పుడు నా జీతం కేవలం రూ.398 లే. వారి అభిమానం ఎన్నటికీ గుర్తుంటుంది. అప్పటి ఛాయాచిత్రమే ఇది.

– కె. లక్ష్మీనారాయణ, పార్నపల్లి,
బండి ఆత్మకూరు, కర్నూలు జిల్లా
సెల్: 95024 27919



# ఇదీ నేనే !



రాబోయే మార్చి 20 మా అభిమాన నటుడు శోభన్‌బాబుగారి వర్ధంతి. చిన్నతనం నుండి ఆయన సినిమాలంటే పిచ్చి. ఆయన చిత్రాల సిడిలన్నీ సంపాదించడమే నా జీవిత ధ్యేయంగా పెట్టుకున్నాను. ప్రతి రోజూ వారిది ఏదో ఒక సినిమా చూస్తుంటాను.

## శోభన్‌గారికి ఇదే నా నివాళి

ముఖ్యంగా 'వీరాభిమన్యు'లో వారు నటించిన 'అభిమన్యుడు' పాత్ర నాకెంతో ఇష్టం. ఆ వేషంలో ఉన్న శోభన్‌బాబుగార్ని తలచుకుని, అదే వేషం వేసుకుని ప్రత్యేకంగా దిగిన ఫోటో ఇది. ఈ విధంగా వారికి నివాళి అందచేయాలనిపించింది.

– ఎస్.సుభాని, మసీదు వీధి,
తూర్పు గంగవరం, ప్రకాశం జిల్లా
సెల్: 95025 46987

**ఇదీ నేనే,** ఆంధ్రజ్యోతి ఆదివారం, ప్లాట్ నెం: 76, రోడ్ నెం: 70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 33 చిరునామాకు పోస్టు ద్వారా గాని, sunday.aj@gmail.com కు మెయిల్ ద్వారా గాని పంపవచ్చు.



సమ్‌థింగ్ స్పెషల్





# బెస్ట్ ఆఫ్ వేస్ట్

ప్రపంచాన్ని మనం ఎలా చూస్తే అలా కనిపిస్తుందంటారు. కంప్యూటర్‌లో నుంచి ప్రపంచాన్ని చూసి చూసి ఎవరికో ఆ కంప్యూటర్ విడిభాగాలతోనే ప్రపంచాన్ని తయారుచేయాలనే కోరిక పుట్టినట్టుంది. అయ్యయ్యో ఖరీదైన మదర్‌బోర్డులు, కీబోర్డులు, ర్యామ్‌లు, చిప్పులతో ఏమిటీ ప్రయోగాలు అనుకుంటున్నారా! కంగారుపడకండి. పుర్రె నుంచి బూట్ల దాకా... కిందున్న సోఫా, టీపాయ్‌లతో సహా అన్నీ ఇ-వేస్ట్‌తో తయారైనవే. ఇ-వేస్ట్ పెరిగేకొద్దీ ఇ-కళలు పెరగడం సహజం.















# ఉత్తమ భవిష్యత్తును రూపొందించుకునే సువర్ణ అవకాశం ఇదిగో...

**BSc** యానిమేషన్ & మల్టీమీడియా
విద్యార్హత : ఏ విభాగంలోనైనా ప్లస్ 2 (పాస్/ఫెయిల్*)

**MSc** యానిమేషన్ & మల్టీమీడియా
విద్యార్హత : ఏ విభాగంలోనైనా డిగ్రీ (పాస్/ఫెయిల్*)

ఇటీవల యానిమేషన్, మల్టీమీడియా రంగాలు మనోరంజన జగతిని పాలిస్తూ విప్లవాత్మక రీతిలో ఎదుగుతున్నాయి. విజ్‌టూన్జ్‌లో శిక్షణ పొంది డిగ్రీ పట్టాను అందుకోవడం ద్వారా ఉత్తమ ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. పీయూసీ లేదా డిగ్రీలో ఉత్తీర్ణులు కానప్పటికీ ఇక్కడ శిక్షణ పొందవచ్చు. మూడు సంవత్సరాల కోర్సులో చేరే అవకాశం ఉంది. కోర్సులో చేరిన ఒక సంవత్సరంలోగా ఉత్తీర్ణతకు సంబంధించిన సర్టిఫికెట్ సమర్పిస్తే చాలు. ఒక సంవత్సరం కాలాన్ని వృథా కావడాన్ని నివారించుకోవచ్చు. ఇందువల్ల అత్యమూల్యమైన భవిష్యత్తును రూపొందించుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగా ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమయం వృధాగా కోల్పోవడానికి బదులు సార్థకం చేసుకునే మార్గం ఉండగా ఎందుకు ప్రయత్నించరాదు. ఉత్తమ భవిష్యత్తును రూపొందించుకోవడానికి సువర్ణ అవకాశం ఇదిగో ఇక్కడ ఉంది.

UGC-DEC గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి పొందిన డిగ్రీ

ఫలితాలకోసం చూస్తున్నవారికి & సప్లిమెంటరీకి దరఖాస్తు చేయుచున్నవారికి కూడా తాత్కాలిక ప్రవేశం

హాస్టల్ & PG వసతి- బ్యాంక్ రుణ సహాయం

పరిశ్రమలోని అనుభవజ్ఞులచే శిక్షణ పొందండి. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

**ప్రవేశాలు ప్రారంభం**

**త్వరపడండి పరిమిత సీట్లు!**



**WIZTOONZ**
academy of media & design

CAMPUS
No.64, 13th Cross, 3rd Phase,
JP Nagar, Bangalore - 560078
Ph: 09916645614
email: info@wiztoonz.com
www.wiztoonz.com

# శ్రీ నందన నామ సంవత్సరం
## పంచాంగం - 2012-13

వక్రతుండం మహాకాయ సూర్యకోటి సమప్రభ..
నిర్విఘ్నం కురుమే దేవా సర్వకార్యేషు సర్వదా...

ఆదివారం
# ఆంధ్రజ్యోతి
18 మార్చి 2012










సిండికేట్ బ్యాంక్ ఖాతాదారులకు మా ఉగాది శుభాకాంక్షలు

# సిండ్ స్వర్ణ

సిండికేట్ బ్యాంక్ వారి
విశిష్ట గోల్డ్ లోన్ పథకం



## బంగారు ఆభరణాల భద్రత పూచీకత్తుపై
## టర్మ్ లోన్ లేక ఓవర్ డ్రాఫ్ట్ వసతి

సులభ షరతులు మరియు సరసమైన ధరలపై
ఒక గ్రాము బంగారానికి రూ. 1900/-* వరకు రుణము పొందండి

★ మార్కెట్ ప్రకారం రేటు వర్తిస్తుంది.

★ షరతులు వర్తిస్తాయి.

सिंडिकेटबैंक
SyndicateBank
विश्वसनीय. मैत्रीपूर्ण
Faithful. Friendly
భారత ప్రభుత్వ రంగ సంస్థ A Govt. of India Undertaking

Toll Free Voice Mail No: 1800 425 66 55

www.syndicatebank.in

# ACHARYA INSTITUTES

ACHARYA INSTITUTES

Acharya Dr. Sarvepalli Radhakrishnan Road, Soldevanahalli, Hesaraghatta Main Road, Bangalore 560 090, Karnataka, India
•Ph: +91 80 2372 2222 •Fax: +91 80 2837 0290 •E-mail: admissions@acharya.ac.in **www.acharya.ac.in**

ACHARYA GROUP
b.premnath reddy initiative

- Established in 1990
- 81 Academic Programmes
- 9000 + Students
- 850+ Teaching Faculty, Technical & Administrative Staff
- 15,00,000 sft. of Academic Infrastructure
- 120 Acre WiFi Campus
- ***Affiliated to -*** Bangalore University, Visvesvaraya Technological University, Rajiv Gandhi University for Health Sciences
- ***Recognised by*** - AICTE, Council of Architecture, KNC & INC, NCTE
- NBA & NAAC Accreditations
- Students from 28 countries
- Alliance with various Foreign Universities and Academic Bodies
- Polytechnic at Tanzania





## COURSES OFFERED

**•Bachelor in Engg. (B.E.)**
- •Aeronautical Engg.
- •Architecture
- •Computer Science Engg.
- •Information Technology
- •Electronics & Communication
- •Mechanical Engg.
- •Electrical Engg.
- •Biotechnology
- •Civil Engg.
- •Automobile Engg.
- •Mechatronics

**•Polytechnic** (12 Branches of Engg.)
**• M.Tech. •MBA •MCA •PGDM**
**•B.Pharm •M.Pharm •Pharm.D**
**•M.Com. •MFA •MIB**
**•BBM •B.Com. •BCA**
**•Fashion Tech. •Psychology**
**•Journalism •Mass Comn.**
**•Nursing - M.Sc., B.Sc., GNM**
**•B.Ed. •TCH**

## Bangalore's Largest Composite Academic Facility




## INDUSTRY COLLABORATIONS

| | |
|---|---|
| **IBM Software Centre of Excellence** - An Unique Industry-Institute Partnership for Providing Training to Students within the campus. | **Microsoft IT Academy** - Program Member that gives to students online access to all Microsoft technology products and specialized training. |
| **IBM Incubation Centre** - First and unique in the country at Acharya for entrepreneurial development. | **SUN Microsystems** - Ongoing National Workshops. |
| **Novell Centre of Excellence** - training in emerging technologies for students of Acharya. | **KEANE Platinum Partnership** - To train students in managed services, consulting, program and project management. |
| **Infosys Campus Connect** - A partnership to increase competitiveness, enhance the pool of high-end talent. | **VAES** - Establishment of Learning Centre for providing solutions in various industry verticals. |
| **SAP** - Labs for conducting training on SAP products. | **Computer Society of India** - Association to conduct Seminars / Training / Competitions. |
| **Wipro Mission 10X** - Three-Stage Faculty Empowerment Certification Programme focussed on innovative pedagogical approach. | **VMWare** - A synergistic coming together for student knowledge enhancement. |
| | **United Technologies** - Enabling innovative project work for students. |

# శ్రీ నందన నామ సంవత్సర పంచాంగ పీఠిక

## శ్రీ బాలా త్రిపుర సుందరీ పరశివాభ్యాం నమః

**శ్రీరస్తు** **శుభమస్తు** **అవిఘ్నమస్తు**

శ్రీ కళ్యాణ గుణావహం, రిపుహరం, దుస్స్వప్న దోషాపహం
గంగాస్నాన విశేష పుణ్య ఫలదం, గోదానతుల్యం నృణాం।
ఆయుర్వృద్ధిద ముత్తమం, శుచికరం, సంతాన సంపత్ప్రదం
నానకర్మ సుసాధనం, సుముచితం పంచాంగ మాకర్ణ్యతామ్॥

తిథులు శ్రేయస్సుకు, వారాలు ఆయుర్వృద్ధికి, నక్షత్రాలు పాప పరిహారానికి, యోగాలు రోగనివారణకు, కరణం శుభపరిణామానికి తోడ్పడతాయి. ఈ ఐదింటితో కూడిన పంచాంగం వినడం శుభం కలుగుతుంది. శత్రుబాధ, చెడు కలల వలన కీడు తొలుగుతుంది. గంగలో స్నానం చేసినంత పుణ్యం, గోదానంతో సమానమైన మేలు చేకూరుతుంది. ఆయుర్దాయం పెరుగుతుంది. సంతాన భాగ్యం లభిస్తుంది. అనేక కర్మలు నిర్వహించడానికి పంచాంగం సాధనం అవుతుంది.

**ఉగాది కృత్యం :** ప్రతి సంవత్సరం చైత్ర శుద్ధ పాడ్యమినాడు మంగళ స్నానం చేసి నూతన వస్త్రాభరణాలు ధరించి గణపతిని, ఇష్ట దేవతలను, నవగ్రహాలను ఆరాధించాలి. దైవజ్ఞులను సత్కరించి, పంచాంగానికి నమస్కరించి, వేపపువ్వు, మామిడి ముక్కలు, ఉసిరిక రసం, కొత్త చింతపండు, బెల్లం, ఆవునెయ్యితో చేసిన ఉగాది పచ్చడిని దైవానికి నివేదించిన తరువాత బంధుమిత్రులతో సేవించడం, పంచాంగం వినడం ఆనవాయితీ.

## శ్రీ నందన నామ సంవత్సర ఫలము

శ్లో. ఆనందదాధరాజస్రం ప్రజాభ్యః నందనాబ్దేశ్వ హానిః
శ్యాత్కోశ ధాన్య వినాశ కృత్
శ్లో. సుభిక్షం క్షేమమారోగ్యం ప్రజానాం భవతి శోభకం బహుక్షీర
ఘృతా గావో నందనే నందితాప్రజాః

శ్రీ నందన నామ సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో జీవిస్తారు. పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయి. వెండి, బంగారం లభ్యత తగ్గుతుంది. ఫలితంగా ధరలు పెరుగుతాయి. బ్యాంకు షేర్ల విలువ తగ్గుతుంది. ధాన్యం ఉత్పత్తి తగ్గడం వల్ల ధరలు పెరుగుతాయి. ఆగస్టు వరకు ధాన్యాదుల ధరలు తగ్గుతాయి. ద్వితీయార్థంలో పాడిపంటలు తగ్గటం వల్ల పాల ఉత్పత్తుల ధరలు కూడా పెరుగుతాయి. ఆహార ధాన్యాల ధరలు కూడా పెరుగుతాయి. జగర్లగ్న కుండలిని పరిశీలిస్తే పశ్చిమ రాష్ట్రాలు మార్చి నుంచి సంవత్సరాంతం వరకు దుర్భిక్షంతో అల్లాడతాయి. ఉత్తరాది రాష్ట్రాలు ధనధాన్యాలతో ఉంటాయి. తూర్పు రాష్ట్రాల ప్రజలకు మార్చి నుంచి జూన్ వరకు కష్టనష్టాలు, రాజవిరోధం కలుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు దేశభంగం కలుగుతుంది. సెప్టెంబర్ నుంచి వస్తు విక్రయం వల్ల పరిస్థితి మెరుగుపడుతుంది. శ్రీ నందన నామ సంవత్సర వర్షకుండలి పరిశీలిస్తే తులా లగ్నం అయింది. ఉత్తరాదిలో రాజవిరోధం. దుర్భిక్షం, అతి వాయువు వల్ల పంటలకు నష్టం. స్వల్ప వర్షాలు. పశ్చిమ ప్రాంతంలో యుద్ధ వాతావరణం ఉంటుంది.



### గణేశ ప్రార్థన

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్
సర్వ విఘ్నోపశాంతయే॥

శ్లో॥ అగజానన పద్మార్కం
గజానన మహర్నిశం
అనేకదం తం భక్తానామేక
దన్త ముపాస్మహే॥

| గ్రహములు | నాయకత్వం | ఉపనాయకత్వం |
|---|---|---|
| 1. శుక్ర | రాజు | శుభాధిపత్యం |
| 2. శుక్ర | మంత్రి | అశ్వ, జగర్లగ్న |
| 3. గురు | సేనాధిపతి | నరాధిపతి |
| 4. చంద్ర | సస్యాధిపతి | దేవ, వ్యవహార |
| 5. శని | ధాన్యాధిపతి | వృక్ష |
| 6. గురు | అర్ఘాధిపతి | పశు, యుద్ధ |
| 7. గురు | మేఘాధిపతి | స్త్రీ |
| 8. గురు | రసాధిపతి | వస్త్ర |
| 9. కుజ | నీరసాధిపతి | జంగమ |
| 10. చంద్ర | --- | పురోహిత, గజ, కోశ |
| 11. రవి | --- | పరీక్షక, గ్రామనాయక, ఛత్ర |
| 12. శుక్ర | --- | గ్రామపాలక, రత్న, అజ |
| 13. కుజ | --- | గణక, సర్ప, వర్ష |
| 14. గురు | --- | దైవజ్ఞ, మృగ, వ్యాపార, తటాక |

## నవనాయకత్వ ఫలములు

**రాజు – శుక్రుడు :** ఈ సంవత్సరానికి శుక్రుడికి రాజ్యాధిపత్యం లభించింది కాబట్టి మంచి వర్షాలు కురుస్తాయి. పంటలు సమృద్ధిగా పండుతాయి. పశుసంపద వృద్ధి చెందుతుంది. స్త్రీ–పురుషుల మధ్య సఖ్యత నెలకొంటుంది. వెండి, బంగారం, తెల్లని ధాన్యాలు, కుసుమలు, వజ్రములు, మణులు, ముత్యాలు, ఆహార ధాన్యాలు, పట్టు, జొన్న, సజ్జ, కస్తూరి, సుగంధ ద్రవ్యాలు, నూనె గింజలు, చింతపండు, పసుపు, మసాలా దినుసులు, మిర్చి, మిరియాలు, వేరుశనగ, తెల్లనిరంగులు, గాజు పాత్రలు, అద్దములు, రాగి, ప్రత్తి, టెక్స్‌టైల్ రంగానికి చెందిన షేర్ల ధరలు పెరుగుతాయి. ధాన్య వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి.

**మంత్రి – శుక్రుడు :** శుక్రుడు మంత్రి అయిన కారణంగా ఎలుకలు, చీడపీడల వల్ల సస్యములకు హాని కలుగుతుంది. ప్రజలకు కష్టాలు పెరుగుతాయి. పశుసంపదకు హాని కలుగుతుంది. జంతువుల కారణంగా మనుషులకు భయం వాటిల్లుతుంది. ధాన్యాదుల ధరలు సరసంగా ఉంటాయి. గిరిజనులు, బడుగు వర్గాల వారికి సమస్యలు ఎదురవుతాయి. వర్షాలు బాగా పడడం వల్ల చెరువులు నిండుతాయి.

**సేనాధిపతి – గురువు :** గురుగ్రహానికి సేనాధిపత్యం లభించటం వల్ల ప్రజలు, పాలకులు ధర్మ చింతనతో ఉంటారు. నాయకులు ప్రజల అభీష్టం మేరకు పరిపాలిస్తారు. ప్రజలు సుఖంగా జీవిస్తారు. ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటారు.




**సస్యాధిపతి – చంద్రుడు :** చంద్రుడికి సస్యాధిపత్యం

# ADMISSIONS - 2012

## COURSES OFFERED

### B.Tech⁺⁺

- Electronics & Communication Engineering
- Computer Science & Engineering
- Mechanical Engineering
- Electrical & Electronics Engineering
- Civil Engineering
- Chemical Engineering
- Biotechnology*
- Information Technology
- Mechatronics
- Automobile Engineering
- Textile Technology
- Agricultural Engineering (New)
- Petroleum and Petrochemical Engg. (New)

* Bi.PC Candidates are also eligible for admission into Biotechnology Programme.

⁺⁺ All B.Tech students have choice to opt one of the following minor programmes for additional learning. This is a unique programme in the university. 1. Management 2. Humanities 3. ECE 4. IT

### BBM + MBA

5 Year INTEGRATED COURSE

**Eligibility :** Intermediate with **MEC, CEC, MPC** or **Bi.PC** group with minimum **60%** aggregate

### M.Tech

**ECE**
- Embedded Systems
- VLSI
- Communication & Signal Processing
- Digital Electronics & Communication Systems
- Data Communication & Networking (New)

**EEE**
- Power Electronics & Drives
- Power Systems (New)

**Chemical Engineering**
- Chemical Engineering
- Food Processing Technology (New)

**School of Computing**
- Computer Science & Engineering
- Information Technology

**Mechanical Engineering**
- Machine Design
- CAD/CAM/CAE
- Energy Engineering

**Biotechnology**
- Biotechnology & Bioprocess Engineering

**Management** MBA | **Computer Applications** MCA | **Ph.D Programmes**

# B.Tech Admission Test: V-SAT 2012

## SCHOLARSHIPS⁺

- **Full Fee Waiver for** Top 100 Rankers of V-SAT '12⁺
- **50% Fee Waiver for** 101-300 Rankers of V-SAT '12⁺
- **25% Fee Waiver for** 301-500 Rankers of V-SAT '12⁺

⁺ Applicable for 1st year only

**The scholarships are also available for top rankers of EAMCET, AIEEE and IIT-JEE**

*Various merit scholarships will be offered to meritorious students in each branch in subsequent years*

## How to Apply

- Applications are available at selected branches of AXIS Bank, Post Office & all Vignan Institutions and offices in A.P.
- Download the application from the university website www.vignanuniversity.org
- By sending a DD for Rs. 800/- (Boys) or 600/- (Girls) along with self addressed and stamped envelope.
- DD should be drawn in favour of Vignan University, payable at Guntur on any scheduled bank and sent to: Director Admissions, Vignan University, Vadlamudi, Guntur Dist.-522 213. A.P.

## WHY VIGNAN

**Well qualified faculty** (M.Tech & Ph.D) with research background from IITs and other premier institutions.

**Faculty Mentors:** Senior Professors from IITs/IISc as faculty mentors for each department to promote best practices in teaching/research.

**Campus Recruitment Training:** A 200 hours comprehensive campus recruitment training by qualified trainers and a 150 hour domain training in association with a leading finishing school 'TALENT SPRINT'.

**Industrial Research&Training Centre:** Established by AAS Technologies and IBM centre of Excellence for training, project work and research.

**Summer Semester:** A two month summer semester for academic improvement and undergoing ADD-ON courses.

**Internships:** Summer industry internships for 45 days.

**V-SAT 12**

Last date for receipt of application **07-04-2012**

V-SAT '12 Test Date: **22-04-2012**

For details of **V-SAT 2012 & V-MAT 2012** test centres / availability of applications and other information visit our website:

**www.vignanuniversity.org**

Contact **+91 863 2118 487/88**
**+91 866 6593777/888**

E-mail: director_da@vignanuniversity.org

**VIGNAN** UNIVERSITY
Foundation for Science, Technology & Research
(Estd u/s 3 of UGC Act of 1956)
VADLAMUDI, GUNTUR

FMC/VNU/401




లభించటం వల్ల మాగాణి, మెట్ట పంటలు బాగా పండుతాయి. తోటలు బాగా దిగుబడి ఇస్తాయి. చింతపండు, మామిడి పండ్లు, పనస, నారింజ వంటి ఫలాలు బాగా పండుతాయి. గోధుమలు, జొన్నలు, సజ్జలు, చెరకు, ఉప్పు, తమలపాకుల ధరలు సరసంగా ఉంటాయి.

**ధాన్యాధిపతి – శని :** ధాన్యాధిపతి శని అయిన కారణంగా నల్లని ధాన్యాలు బాగా పండుతాయి. అంటే మినుములు, నువ్వులు, అవిశెలకు మంచి ధర పలుకుతుంది. నల్లని భూముల కూడా మంచి దిగుబడి ఇస్తాయి.

**అర్ఘాధిపతి – గురువు :** గురువుకు అర్ఘాధిపత్యం లభించినందువల్ల సువృష్టి, ధనధాన్య సమృద్ధి కలుగుతుంది. యజ్ఞయాగాదుల యందు ప్రజల్లో ఆసక్తి పెరుగుతుంది. ప్రజా సంక్షేమం కోసం ఉత్సవాలు, వేడుకలు నిర్వహిస్తారు.

**మేఘాధిపతి – గురువు :** పంటలు బాగా పండుతాయి కాబట్టి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు తగ్గుతాయి. అయితే దేశంలో కొన్ని ప్రాంతాల్లో ధరలు పెరుగుతాయి. ప్రజలు ఆరోగ్యంతో, సుఖశాంతులతో జీవిస్తారు.

**రసాధిపతి – గురువు :** బంగారము, వెండి, నెయ్యి, పట్టు, ప్రత్తి, బెల్లం, పంచదార, చెరకు, వస్త్రముల ధరలు తగ్గి, ప్రజలకు అందుబాటులో ఉంటాయి. వర్షాలు అధికంగా ఉంటాయి. పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి.

**నీరసాధిపతి – కుజుడు :** పుష్పాలు, ఫలాల పంటలు బాగా పండుతాయి. బంగారం, మణులు, రక్తచందనము, కలప ధరలు హెచ్చుతగ్గలకు గురవుతాయి. మిర్చి, పొగాకు, ఇనుము, ఉక్కు, యంత్ర పరికరాలు, రాగి, ఇత్తడి, కంచు మొదలైన లోహాల ధరలు పెరుగుతాయి. అపరధాన్యాల ధరలు పెరుగుతాయి. బియ్యం ధరలు తగ్గుతాయి.

**ఆవర్త నామ మేఘ ఫలము :** ఆవర్తక నామ మేఘమున గాని మంచి ధాన్యము, గోధుమలు, జొన్నలు, సెనగలు, ప్రత్తి, నెయ్యి, నూనెగింజలు, నూనెలు మొదలగువాని ఉత్పత్తికి హాని కలుగజేయును, కనుక వీటికి ధరలు హెచ్చును. అల్పవృష్టి యుండును. వ్యాపారాలకు, ధనవంతులకు హాని కలుగును. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షములుండును. ఇంద్రధనస్సులుండును.

**వర్ష ప్రమాణము :** రాజు శుక్రుడగుటచే సముద్రమందు ఏడు భాగములును, పర్వతములందు తొమ్మిది భాగములును, భూమి యందు నాలుగు భాగములును వర్షము.

**ఆఢకదారుని ఫలము :** ఈ సంవత్సరాది 23.3.2012 మొదలు 15.5.2012 వరకు శని తులారాశి లోను ఆ తదనంతరము అనగా 16.5.2012 మొదలు 3.8.2012 వరకు వక్రిలో కన్యారాశిలోను పునః 4.8.2012 నుంచి సంవత్సరాంతము వరకు తులారాశిలో సంచరిస్తాడు. కావున మొదటి మరియు మూడవ భాగము (తులారాశి) లో సంచరిస్తున్నందున ఆఢకము యాదవుని చేతిలో ఉన్నందున సుభిక్ష క్షేమ మారోగ్యములు, పాడిపంటల సమృద్ధి, ధాన్యాదుల ధరలు తగ్గి యుండుట కలుగును. రెండవ భాగము (కన్యారాశి) బ్రాహ్మణుని చేతియందు ఉన్నందున దుర్భిక్షము, భయోత్పాతములు, ప్రజాక్షోభ, ఆహారధాన్యముల కొరత, పాడిపంటలు క్షయించుట, ధాన్యాదుల ధరలు హెచ్చుట సంభవించును.

**అనంత నామక శేషుని ఫలము :** అనంతుడను శేషుడు భూమిని వహించుటచే రాజులు అనేక వస్తువులను కలిగియుందురు. లోకమున భయోత్పాతములు లేక యుండును. జనులు సుఖించెదరు. "నవిద్యతే అతో నాశో యస్యసః అనంతః" అనగా నాశము లేనివాడు. నాగులకు రాజైన ఆదిశేషుడు. పర్వతములందుగాని, చందన తరువులందుగాని




GMR
వర్ణమాల
KSEZ PROJECT
Kakinada
GMR
వరలక్ష్మి ఫౌండేషన్ చిందించేను ఆనందాల హరివిల్లు
Education
Health, hygiene & sanitation
Empowerment & livelihoods
Community - based programmes
ఉగాది
శుభాకాంక్షలు
Health awareness initiative for pregnant women, part of Community Sreemanthalu Program at Kakinada, Andhra Pradesh




పుట్టిన దేవయోనులే నాగులన బడుదురు.

**పశుపాలకుని ఫలము :** పశుపాలకుడు, గోష్ఠాగార ప్రాపకుడు, గోష్ఠాధ్యపి ప్రాపకుడు శ్రీకృష్ణుడగుటచే పశువులు తృణ వృద్ధితో వర్ధిల్లును. ధరలు తగ్గును. గొప్ప పంటలు లభించును. సుభిక్ష క్షేమమారోగ్యములు కలుగును.

**ప్రత్యబ్దయోగ పంచక ఫలము :**

1. జ్యేష్ఠ శుద్ధ ప్రతిపత్ సోమవారము కావున జనులకు సుభిక్షముగల్గి క్షేమమారోగ్యవంతులై యుందురు. వర్షము సస్యములు వృద్ధి పొందును. సమస్త జనులు సుఖింతురు.
2. ఆషాఢ శుద్ధ పంచమి ఆదివారము కావున దుర్భిక్ష భయమును, భీతి, అల్పవృష్టి కలుగును.
3. ఆషాఢ శుద్ధ దశమి శుక్రవారం స్వాతి నక్షత్రం కావున అధిక వర్షములుండును.
4. ఆషాఢ కృష్ణ ద్వాదశి రోహిణి నక్షత్రము కావున సమస్త సస్యములు నశించును.
5. పుష్య కృష్ణ అమావాస్య ఆదివారము కావున ధననాశము వలన సంతాపము, వర్షాధిక్యత వలన సుభిక్షక్షేమమారోగ్యములుండును.

## ఆర్ద్రా ప్రవేశము

శ్రీ నందన నామ సంవత్సరం ఆషాఢ శుద్ధ విదియ గురువారం అనగా 21-6-2012 రాత్రి 10.03 గంటలకు పునర్వసు నక్షత్రం, కౌలవ కరణం, ధృవయోగం, మకరలగ్నంలో రవి ఆర్ద్రా నక్షత్రంలో ప్రవేశిస్తాడు. ఫలితంగా ఈ ఏడాది సమస్త జీవరాశులు సుఖిస్తాయి. సస్య సమృద్ధి కలుగుతుంది. వస్త్రముల ధరలు తగ్గుతాయి. ధాన్యాదుల ధరలు కూడా సరసంగా ఉంటాయి. సస్యాలకు అనుకూలంగా వర్షాలు పడతాయి. పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయి. ప్రజలు సాహసంతో వ్యవహరిస్తారు.

## మకర సంక్రాంతి ఫలము

15-1-2013 మంగళవారం ఉ. 6.48 గంటలకు నిరయన మకర రాశిలో రవి ప్రవేశం జరుగుతుంది.

నామము : మహోదర నామము కాబట్టి మత్తు పదార్థాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. గిరిజన సంక్షేమంపై ప్రభుత్వాలు దృష్టి సారిస్తాయి. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిపై ఈ ఏడాది చొరవచూపుతారు.

స్నానము : బిల్వంతో స్నానం చేయటం వల్ల ప్రజలకు మహాభీతి కలుగుతుంది.

అక్షతలు : ముద్గాక్షతలు – పెసరపంట నశిస్తుంది.

వస్త్రము : భద్రకరణం – బొంత వస్త్రం– ప్రజలు కష్టనష్టాలపాలవుతారు.

గంధము : కర్పూర గంధలేపనం వల్ల ఉపశమనం కలుగుతుంది.

పుష్పము : చంపక పుష్పం – మనోవ్యాకులం.

ఆభరణము : గ్రైవేయం ధరించటం వల్ల పంటలకు అరిష్టం.

పాత్రము : రాయిపాత్ర– వ్యాధిని నశింపజేస్తుంది.

ఆహారము : బెల్లము– ఆకలి అధికం అవుతుంది.

ఫలము : ఇప్పపండు – శుభం చేకూరుతుంది.




Powered by
ASHOK LEYLAND
రాపవర్ అందిస్తోంది
నందన నామ సంవత్సర ఉగాది
శుభాకాంక్షలు
Exclusive, Most Trusted &
No.1 OEA of Ashok Leyland
RAPOWER
GENERATORS
MAKING YOU POWERFUL
RAPOWER GENERATORS
India's Most Trusted Brand
10 kVA to 2000 kVA
DIESEL GENERATORS
www.rapower.in
CPCB & Ashok Leyland Approved Acoustic Enclosure
CPCB Emission Complaint and Environment Friendly
AMP / Semi Auto and Synchronising Panels
Compact Designs
Manufactured at most Modern plant using the latest Technology
World's Most Renowned Alternators
State of art Technology
The next generation power source
BUNGLOW DG
Blue Magic!
10 kVA & 15kVA
PORTABLE GENERATORS
Can take care of AC loads / water pump / lighting
and other miscellaneous loads.
Remote operated DG Set is our innovative
and special feature.
RA POWERGEN ENGINEERS PRIVATE LIMITED
Head Office & Regd. Office: BANGALORE. Mr. RAGHURAM: 0 98800 10148 I Factory: Channapatna
HYDERABAD: # 5/5-93 & 94, 2ND FLOOR, SHIVA CHAMBERS
RANIGUNJ, SECUNDERABAD 500 003
Phone No. 040-27700840/27700841,27711239/2274
FAX: 040-27700841, Epowerzenhyd@gmail.com,
MR. DURGA PRASAD : 0 98486 15020 ,
MR. RAMESH : 0 98486 15026
VIJAYAWADA: #40-22, MOGALRAJ PURAM, BSRK COMPLEX
VIJAYAWADA – 520 010
KRISHNA DISTRICT, ANDHRA PRADESH.
Phone No. 0866 2492838/ 2492848
powergenvja@gmail.com
MR.SRINIVAS R. KODALI :0 99486 13800, 98486 18433.
VISAKAPATANAM: GROUND FLOOR, #48 6 33,
RAMA TALKIES SIDE ROAD, SRINAGAR, VISAKAPATNAM – 530 016
Phone No. 0891 3012009 / 2791602 / 0 9848788816
rapowergenvizag@gmail.com
Mr. UMA MAHESHWAR RAO : 0 98487 88814,
Mr. SHARVAN : 0 98487 88815
KURNOOL: P.O. No. 14, APSP SHOPPING COMPLEX,
NEAR BELLARY CHOWRASTRA, KURNOOL – 518 002
Phone No. 08518 – 256700
kurnool@rapowergen.com
Mr. D.K. KISHORE :0 99486 71600
Other State Branches: Hubli I M'lore I Pune I Kochi. Tamil Nadu: Chennai I Madurai I Coimbatore I Tirunelveli

| | | |
|---|---|---|
| ఆయుధము | : | పాశము– భయప్రదము. |
| ఛత్రము | : | కంబళి గొడుగు– దుఃఖనాశనం. |
| వాహనము | : | కుక్క– ధననాశనం. |
| చేష్ట | : | అధోముఖము– ఆకలి వలన భయము. |
| స్థితి | : | నివిష్ట– మధ్యమ వృష్టి, పాడిపంటలు, ధరలు మధ్యమము. |
| దిగ్యానము | : | ఈశాన్య ముఖం– ఈశాన్య రాష్ట్రాలకు క్షామము. |
| పక్షం | : | శుక్ల పక్షం– దేశంలో దుర్భిక్షం, క్షామం. |
| తిథి | : | చవితి– దుఃఖము, రోగము. |
| వారము | : | మంగళవారం– వ్యాధులు, చోరులు, దుర్భిక్షం వల్ల భయము. |
| లగ్న | : | ధనుస్సు– అల్ప సుఖము. |
| క్రీడా | : | ధనుర్ధారణము – ప్రజారిష్టము |

## కందాయ ఫలము

| | | | | | |
|---|---|---|---|---|---|
| అశ్వని | 1-2-0 | మఖ | 4-2-0 | మూల | 7-2-4 |
| భరణి | 4-0-3 | పుబ్బ | 7-0-0 | పూర్వాషాఢ | 2-0-2 |
| కృత్తిక | 7-1-1 | ఉత్తర | 2-1-3 | ఉత్తరాషాఢ | 5-1-0 |
| రోహిణి | 2-2-4 | హస్త | 5-2-1 | శ్రవణం | 0-2-3 |
| మృగశిర | 5-0-2 | చిత్త | 0-0-4 | ధనిష్ఠ | 3-0-1 |
| ఆర్ద్ర | 0-1-0 | స్వాతి | 3-1-2 | శతభిషం | 6-1-4 |
| పునర్వసు | 3-2-3 | విశాఖ | 6-2-0 | పూర్వాభాద్ర | 1-2-2 |
| పుష్యమి | 6-0-1 | అనూరాధ | 1-0-3 | ఉత్తరాభాద్ర | 4-0-0 |
| ఆశ్లేష | 1-1-4 | జ్యేష్ఠ | 4-1-1 | రేవతి | 7-1-3 |

## ఆదాయ వ్యయాలు, రాజపూజ్యావమానములు (అష్టోత్తరి)

| రాశులు | ఆదాయం | వ్యయం | రాజపూజ్యం | అవమానం |
|---|---|---|---|---|
| మేషం | 02 | 08 | 01 | 07 |
| వృషభం | 11 | 14 | 04 | 07 |
| మిథునం | 14 | 11 | 07 | 07 |
| కర్కాటకం | 08 | 11 | 03 | 03 |
| సింహం | 11 | 05 | 06 | 03 |
| కన్య | 14 | 11 | 02 | 06 |
| తుల | 11 | 14 | 05 | 06 |
| వృశ్చికం | 02 | 08 | 01 | 02 |
| ధనస్సు | 05 | 14 | 04 | 02 |
| మకరం | 08 | 08 | 07 | 02 |
| కుంభం | 08 | 08 | 03 | 05 |
| మీనం | 05 | 14 | 06 | 05 |
| మొత్తం | 99 | 126 | 50 | 55 |

## వాస్తు కర్తరి

శ్రీ నందన నామ సంవత్సర వైశాఖ శుద్ధ త్రయోదశి అనగా 4-5-2012 శుక్రవారం ఉదయం 7.37 గంటలకు ప్రారంభం. జ్యేష్ఠ శుద్ధ సప్తమి అనగా 28-5-2012 సోమవారం మ.12.31 గంటలకు వాస్తు కర్తరి ముగుస్తుంది. ఈ మధ్య రోజుల్లో గృహారంభం, గృహప్రవేశం, చెట్లు నరకడం, బావులు తవ్వడం, బోర్లు వేయించడం, ఇళ్లు కూల్చడం వంటి పనులు చేపట్టరాదు.

## మౌఢ్యాలు

శుక్ర మౌఢ్యమి : 02-06-2012 మొదలు 10-6-2012 వరకు, 4.3.2013 మొదలు






# యానిమేషన్, మల్టీ మీడియా రంగంలో ఉజ్వల భవిష్యత్తు రూపొందించుకోవడానికి ఇది చివరి అవకాశం

## సీట్లు పరిమితం, త్వరగా నిర్ణయించుకోండి ముందు వచ్చిన వారికి ప్రాధాన్యత

### డిగ్రీకి విలువ...

ప్రస్తుతం ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలు ఇంజనీరో లేదా డాక్టరో కావాలని, ఇవేవీ కాదంటే బిఎస్సీ, బికాం చదివి ఏదో ఒక ఉద్యోగంలో చేరితే చాలనుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగులైతే తమ పిల్లలు కూడా తమ మాదిరిగా సుఖంగా ప్రభుత్వ ఉద్యోగాలు చేయాలనుకోవడం సామాన్యం. అయితే విద్యార్జనకు సంబంధించి యానిమేషన్ రంగానికి కూడా ఇంజనీరింగ్, వైద్య రంగాలకు ఉన్న ప్రాధాన్యత ఉందన్న వాస్తవం చాలా మందికి తెలియదు. అందువల్లే ప్రస్తుతం యానిమేష న్ రంగం విద్యకు సంబంధించిన సర్టిఫికెట్లతోపాటు తల్లిదండ్రులు, యానిమేషన్‌ను తమ పిల్లల భవిష్యత్తును రూపొందించే విద్యగా భావిస్తున్నారు. ఇప్పుడు యానిమేషన్‌లో కూడా డిగ్రీ తీసుకునే అవకాశాలు ఉన్నాయి. తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని డబ్బులు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులకు ఒక శుభవార్త. తమ పిల్లలు యానిమేషన్ శిక్షణ పొందడమే కాకుండా ఈ రంగంలో పట్టభద్రులయ్యే అవకాశం ఉంది. తద్వారా ఈ రంగం ఎదుర్కొంటున్న కొరత దీంతో తీరినట్టయ్యింది. అధిక సంఖ్యలో అవసరమైన యానిమేటర్ల అవసరాలను తీర్చడానికి సహకారి కానుంది. దీంతో తల్లిదండ్రులు ఆశించిన డిగ్రీ, పిల్లలకు కావాల్సిన మంచి ఉద్యోగాలు రెండింటిని చేజిక్కిం చుకునే అవకాశం ఉంది.

### అంతటా విస్తరణ...

ఇటీవల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో యానిమేషన్ మార్కెట్ విస్తరించడంతో అదే స్థాయిలో ఆదాయ వనరులు సమీకరించుకుంటోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదాయం రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా భారతదేశంలోని పలు సంస్థలు డొమెస్టిక్ రంగంలో అవసరాలు తీరుస్తున్నాయి. ప్రముఖంగా బాలివుడ్ సినీ రంగంలో యానిమేషన్‌కు ప్రాముఖ్యత పెరుగుతోంది. దీంతో యానిమేషన్ రంగం మనోరంజనకు సంబంధించి రాజ్యమేలుతోంది. ప్రతి విభాగంలోనూ యానిమేషన్ సాంకేతిక పరిజ్ఞానం అవసరం ఉండడంతో ఇదొక విప్లవాత్మకంగా విస్తరి స్తోంది. విద్యార్థులనుంచి వృద్ధుల వరకు అందరినీ ఆకట్టుకుంటున్న ఈ రంగం కేవలం మనోరంజన దృష్టితో కాకుండా ఉద్యోగ ఉపాధి దృష్టితో కూడా అత్యంత సహకారిగా ఉంటోంది.

### డబుల్ ప్రాఫిట్...

కళ (ఆర్ట్స్), వాణిజ్యం (కామర్స్), విజ్ఞానం (సైన్స్) ఇలా ఏదో ఒక విభాగంలో పీయూసీ చదివిన విద్యార్థులు ప్రస్తుతం బిఎస్‌సి యానిమేషన్ అండ్ మల్టి మీడియా కోర్సుకు అర్హులు. 3 సంవత్సరాల కోర్సు తర్వాత డిగ్రీ తోపాటు ఉద్యోగవకాశాలు వీరిని ఆహ్వానించనున్నాయి. యానిమేషన్ కోర్సు వల్ల మరో ఉపయోగం గురించి చెప్పాల్సివస్తే ఇతరత్రా రంగాలలో పట్టభద్రులైన వారితో పోలిస్తే యానిమేషన్ రంగంలో డిగ్రీ పుచ్చుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని విజ్‌టూన్జ్ యానిమేషన్ అకాడమీ సిఇఒ శ్రీధర్ వి.టి. తెలిపారు. పియుసి ఫలితాలు వెలువడడంలో ఆలస్యం జరిగి నా లేదా ఫెయిలైనా కనీసం ఒక సంవత్స రంపాటు వారు భవిష్యత్తు లో వెనుకబడడం ఖాయం. అతి వేగంగా సాగు తున్న కాలంలో ఒక విద్యార్థి ఒక సంవత్సరం ఇంట్లో ఖాళీగా కూర్చుంటే ఆ విద్యార్థికి కోల్పోయిన కాలం విలువ ఊహించడానికే అసాధ్యమన్నారు. అందు వల్ల తామందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని డిగ్రీ చదవడంతో పాటు కాలంతో పోటీగా పరుగెత్తడానికి ఆ విద్యార్థికి అన్నింటా సహకరిస్తామన్నారు.

### ఉత్తమ భవిష్యత్తుకు సువర్ణావకాశాలు...

పియుసి రెండో సంవత్సరం లేదా డిగ్రీలో ఫెయిల్ అయిన వారు అనివార్యంగా ఒక సంవత్సరం పాటు ఇంట్లో వృథాగా గడపాల్సి వస్తుంది. వీరు ఏ కాలేజీలో కూడా విద్య పొందే అవకాశం ఉండదు. ఉత్తీర్ణత పొందిన సర్టిఫికెట్ పొందిన తర్వాతనే పై చదువుకు అవకాశం లభిస్తుంది. అయితే విజ్‌టూన్జ్ సంస్థ ఇందుకు పరిష్కారం సూచిస్తోం ది. పియుసి లేదా డిగ్రీలో ఫెయిల్ అయిన వారు యానిమేషన్ రంగంలో విద్య కొనసాగించవచ్చునన్నారు. వీరు 3 సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరే అవకాశం ఉంటుందన్నారు. చేరిన తర్వాత ఒక సంవత్సరంలోగా ఉత్తీర్ణతా ప్రమాణ పత్రం (పాసైన సర్టిఫికెట్) ఇస్తే చాలన్నారు. నిరభ్యంతరంగా ఒక సంవత్సరం వృథా కావడాన్ని తప్పించుకోవడంతో యానిమేషన్ రంగంలో అత్యంత విలువైన భవి ష్యత్తును రూపొందించుకునే అవకాశం ఉంటుంది. అన్నింటికంటే ముఖ్యంగా నేటి పోటీ ప్రపంచంలో విలువైన ఒక సంవత్సర కాలాన్ని వృథా చేసుకోవడానికి బదులు ఆ కాలాన్ని సద్వినియోగ పరచుకునే మార్గం కళ్ళ ఎదుట ఉండగా ఎందుకు ప్రయత్నం చేయరాదు.




చిరునామా :

**విజ్‌టూన్జ్ కాలేజ్ ఆఫ్ మీడియా అండ్ డిజైన్**

నెం.64, 13వ క్రాస్, 3వ ఫేజ్, జె.పి.నగర్, బెంగుళూరు.

ఇ-మెయిల్ : info@wiztoonz.com, వెబ్‌సైట్ : www.wiztoonz.com

అడ్మిషన్ల కోసం సంప్రదించండి ఫోన్ : **09916645614**

**ADMISSIONS OPEN**

**BSc Animation & Multimedia**

**MSc Animation & Multimedia**

26.4.2013 వరకు.

గురు మౌఢ్యమి : 1-5-2012 మొదలు 29-5-2012 వరకు.

### పుష్కరం

శ్రీ నందన నామ సంవత్సరం వైశాఖ బహుళ ద్వాదశి అనగా 17-5-2012 మధ్యాహ్నం 1.01 గంటలకు గురువు మేషరాశి నుంచి వృషభరాశిలోకి ప్రవేశిస్తాడు. కాబట్టి ఈ సంవత్సరం నర్మదానదికి పుష్కరాలు వస్తాయి. ఆ రోజు నుంచి 12 రోజుల పాటు రేవానదిలో స్నానం, దానధర్మాలు, పితృకార్యాలు చేస్తే విశేష శుభఫలితాలు లభిస్తాయి.

## మేష సంక్రమణం - సంవత్సర ఫలం

శ్రీ నందననామ సంవత్సరం చైత్ర బహుళ అష్టమి ఉత్తరాషాఢ నక్షత్రం 13-4-2012 శుక్రవారం రాత్రి 7.01 గంటలకు నిరయన మేష రాశిలో రవి ప్రవేశిస్తాడు. ఆ సమయానికి నిరయన రాశి చక్రాన్ని పరిశీలించగా తులాలగ్నం అయింది. మిగిలిన గ్రహాల స్థితిగతుల్ని పరిశీలిస్తే 2012 సంవత్సర ఫలితం ఇలా ఉంది.

**ఆర్థిక రంగం జోరు - కుంభకోణాల హోరు** : లగ్నాధిపతి శుక్రుడు అష్టమంలో ఉన్నాడు. బుధ, చంద్రుల శుభదృష్టి ఉన్నప్పటికీ ద్వితీయాధిపతి అయిన కుజుడితో ప్రతికూల దృష్టి ఉన్నది. లగ్నంలో శని ఉచ్ఛస్థానంలో ఉన్నాడు. అయితే రవితో ప్రతికూల దృష్టిలో ఉన్నాడు. ఈ గ్రహస్థితుల్ని గమనిస్తే ఈ ఏడాది ఆర్థికరంగం ఉత్సాహభరితంగా ఉన్నప్పటికీ విపరీతమైన ఒడిదుడుకులకు లోనవుతుంది. రుణాలు అధికంగా చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలు చేపడుతుంది. అయితే ఆ విధానాల అమలుకు ఆటంకాలు ఎదురవుతాయి. ఆర్థిక రంగంలో అనేక కుంభకోణాలు వెలుగుచూస్తాయి. వడ్డీరేట్లు పెరుగుతాయి. సప్తమ స్థానంలో రవి, గురుల సంయోగం కారణంగా న్యాయస్థానాలు కీలకపాత్ర పోషిస్తాయి. ప్రభుత్వ విధానాల పట్ల కోర్టులు కీలకమైన తీర్పులు ఇస్తాయి. ద్వితీయాధిపతి కుజుడు లాభ స్థానంలో ఉన్న కారణంగా షేర్‌మార్కెట్ రంగంలో ఉత్సాహం నెలకొని ఉంటుంది. అయితే లగ్నాధిపతితో కేంద్ర దృష్టి కారణంగా చివరికి పెద్దగా లాభాలు కనిపించవు. బ్యాంకింగ్ రంగంలో గణనీయమైన వృద్ధి కనిపిస్తుంది.

**రాజకీయ అస్థిరత** : చతుర్థ, పంచమాధిపతి అయిన శని లగ్నంలో ఉచ్ఛస్థానంలో ఉన్నాడు. అయితే రవి, చంద్ర, గురులతో ప్రతికూల దృష్టి ఉన్న కారణంగా రాజకీయ రంగంలో తీవ్రమైన సంక్షోభాలు తలెత్తుతాయి. స్వపక్షంలోనే తిరుగుబాట్లు చోటుచేసుకుంటాయి. మిత్రులు సైతం ప్రతికూలంగా వ్యవహరిస్తారు. దశమాధిపతి చంద్రుడు చతుర్థంలో ఉన్న కారణంగా రాజకీయాలు గందరగోళంగా మారతాయి. అధికారం కోసం ప్రాకులాటలు పెరుగుతాయి. ఎవరికీ ప్రశాంతత ఉండదు. ఏప్రిల్ ద్వితీయార్థంలో, అక్టోబర్ మాసాల్లో శని, సూర్యులకు ప్రతికూల దృష్టి ఏర్పడుతున్నది ఫలితంగా ప్రభుత్వం తీవ్ర సంక్షోభంలో పడే ప్రమాదం ఉంది. శని ఉచ్ఛలో ఉండడం, నవమ, ద్వాదశాధిపతి బుధుడు లగ్నాధిపతి శుక్రునితో శుభదృష్టిలో ఉన్న కారణంగా విదేశీ సంబంధాలు మెరుగుపడతాయి.

**రియల్ ఎస్టేట్‌కు కళ** : చతుర్థాధిపతి శని లగ్నంలో, ఉచ్ఛస్థానంలో ఉన్నాడు. ఫలితంగా ఈ ఏడాది రియల్ ఎస్టేట్ రంగంలో ఉత్సాహం నెలకొంటుంది. చతుర్థంలో చంద్రుడు ఉన్న కారణంగా గృహనిర్మాణ రంగం ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**ఐ.టి.రంగంలో ఉత్సాహం** : ఈ ఏడాది ఐ.టి. రంగం మెరుగు పడుతుంది. ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. పరిశ్రమల రంగం కళకళలాడుతుంది.

**కొత్త వైరస్‌ల బెడద** : షష్టమ, అష్టమాధిపతులకు







CanMobile
Carry your Bank Account wherever you go...
Funds Transfer
Mini Statement
Balance Enquiry
All types of mobile handsets can be used
Transactions 24x7
Login
केनरा बैंक Canara Bank
Login for CanMobile
User ID
Options
Exit
Toll Free No: 1800 425 0018
www.canarabank.com
Save Trees. Save Water. Save Environment.
కెనరా బ్యాంక్ Canara Bank
Together We Can

సెల్ : 95810 94208,
90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియనితనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు.......................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**
ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

**పి.ఆర్.ఆర్., వరంగల్**

పేరులో మార్పు సూచించగలరు. నా పేరు పాజిటివ్ వైబ్రేషన్‌లో ఉందో లేదో తెలుపగలరు.

మీరు తెలిపిన వివరాల ప్రకారం మీ పుట్టిన తేదీ వైబ్రేషన్ 2కు సంబంధించినది. మీ విధాన సంఖ్య 2వ వైబ్రేషన్‌కు సంబంధించినదే. ప్రతి పుట్టిన తేదీకి బలమైన సమయం, బలహీన సమయం ఉంటాయి. ఇదే మొదటి కాంబినేషన్.

మీపై పనిచేసే సంఖ్యా స్వరూపాలు 2,6. 2,6 కాంబినేషన్‌లో మీ అభివృద్ధి మందగించడానికి కారణం కంట్రోలింగ్ వైబ్రేషన్ 8 కావడం ప్రధాన కారణం. మీ పుట్టిన తేదీ, నెల, సంవత్సరం కాంబినేషన్‌లో బలం లోపించిన మరో అంశం 6,9 కావడం. మొదట అనలైజేషన్ 2,6,8,9 వీటి ప్రభావంలో మీరు కొంత రెబెల్‌గా ఉండడం ఆశ్చర్యం కలిగించదు. ఈ సంఖ్యలలోని 6వ సంఖ్యా రూపం టెక్స్‌టైల్ ఇంజనీరింగ్‌ను విద్యగా ఇచ్చింది. మరో విశేషం 19 ఏళ్ళకే వివాహం. విదేశాలతో సంబంధం. వెంటనే తిరిగి రావడం. కారణం 2వ సంఖ్య ప్రభావం. ఏ కారణం చేతనైనా మీరు రెండవ సంఖ్యలో వైబ్రేట్ కాకూడదు. కళ్ళపై విపరీత ప్రభావాన్ని చూపే ఈ స్వరూపం పార్షియల్ బ్లైండ్‌నెస్‌కు కారణం అవుతుంది. 28 ఏళ్ళ వయస్సు నుండి 38 ఏళ్ళ వయస్సు వరకు మీరు పిలిపించుకునే పేరు ఖచ్చితంగా ఒకటవ వైబ్రేషన్‌లో ఉండాలి.

మీ పేరు వైబ్రేట్ అయ్యే మొత్తం 29. ఇందులో చివరి అక్షరం 'ఎ'ను తగ్గించి 28 మొత్తంలోకి మార్చుకోవాలి. ఈ మార్చిన పేరును నిర్ణీత కాలంలో అధిక మొత్తంలో వ్రాయడం ద్వారా నెగెటివ్ ఫలితాలను తగ్గించుకోవడమే కాదు కళ్ళకు సంబంధించిన సర్జరీని తగ్గించుకోవచ్చు. మీ వయస్సు రీత్యా మూడేళ్ళలో ఈ సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. వైద్యపరంగా తగిన సలహాను పాటిస్తూ మీరు చలించే వైబ్రేషన్స్ పాజిటివ్‌లోకి మార్చుకోవడం ద్వారా అద్భుత ఫలితాన్ని సాధించవచ్చు. ఇంటిపేరు వాడకండి. వీలైనంతగా తెలుపు దుస్తులు ధరించడం తగ్గించండి. ముత్యం ధరిస్తే తీసివేయండి. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మీకు అనుకూలమైన నెలలు కాదు. శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు భరించవలసి ఉంటుంది.

పైన వివరించిన అన్ని సమస్యలకు పేరే కారణమా అని మీరు అనుకోవచ్చు. పేరే కాదు ఇక్కడ కారణం వైబ్రేషన్స్. 2వ వైబ్రేషన్ ఏమివ్వాలి. మూడవ వైబ్రేషన్ ఏమిస్తుంది. తెలిసినపుడు మాత్రమే వ్యక్తి జీవితాన్ని కనీసం ఊహించగలం. ఇవేవీ లేకుండా చేసే మార్పులు నాకు తెలిసి ఏ మార్పు ఇవ్వవు. ఒక సంఖ్యను అదృష్ట సంఖ్యగా నిర్వచించినపుడు అదే సంఖ్యలో పేరును మార్చుకున్నపుడు ఎందుకు పాజిటివ్ ఫలితాలుండవు అనే ప్రశ్నకు సమాధానమే పై అనలైజేషన్.

**వై.ఆర్., కాకినాడ**

నా పుట్టిన తేదీని బట్టి పాజిటివ్ నెగెటివ్ వైబ్రేషన్స్ తెలుపగలరు. పేరులో మార్పు సూచించగలరు.

1,7 సంఖ్యల కాంబినేషన్‌లో మార్పుకు గురయ్యే వైబ్రేషన్స్ మీవి. ఆందోళన ఎక్కువ. విమర్శించడానికి ఒంటికాలిపై పరిగెడతారు. తెలివైన వారైనప్పటికీ మీ శక్తి నిరూపణ అసాధ్యం. ఈ కాంబినేషన్ ప్రభావంలో అడ్డంకులు ఎక్కువే. ఆర్థిక సంబంధ కష్టాలు ఎక్కువే. కొంత ఉగ్ర స్వభావం. తేలికగా రియాక్ట్ అవ్వడం ఆపై తీరిగ్గా చింతించడం. 6వ సంఖ్య ప్రభావంలో మీరు ఖచ్చితంగా పత్రికారంగంలోను, రచనల్లోను భాసించవచ్చు. తొందరపాటు స్వభావం నష్టాలను ఇస్తుంది. పార్ట్‌నర్స్ విషయంలో అత్యంత జాగ్రత్త అవసరం. మీ పేరు మొత్తం 12. కల్పనాశక్తి ఎక్కువై వాస్తవికత తక్కువైన సంఖ్యలో ఉంది. 7వ సంఖ్య కాంబినేషన్ ఇతరులపై ఆధారపడడంలో, ప్రభావం చూపించడం వలన అప్పుడప్పుడు మోసపోవడం సాధారణమే. 3వ సంఖ్య అన్ని వైబ్రేషన్స్‌తో హార్మొనీలో ఉండగలదు. మీ పేరు 14లో ఉండడం ప్రమాదాలకు దారి తీస్తుంది. 21 మీ పేరుకు సరిపడిన సంఖ్య. 1,7 కాంబినేషన్‌లో హెచ్చు తగ్గులన్నింటినీ ఈ సంఖ్య స్వరూప బలం తగ్గిస్తుంది. ఇంటి పేరు వాడడం మానివేస్తే చాలు. ఇంటి పేరుతో వైబ్రేట్ అయ్యే 20 ఇబ్బంది కలిగిస్తుంది. 23వ సంఖ్య వృత్తిలో ఇబ్బందిని ఇస్తుంది. కాబట్టి 1,7 కాంబినేషన్‌లో 1,3,9 పాజిటివ్ వైబ్రేషన్స్. 6 అద్భుతంగా అదృష్టాన్ని ఇస్తుంది. ధనకారకం 6 కాబట్టి. 4,8,2 నెగెటివ్ వైబ్రేషన్స్. మిగిలినవి తటస్థం.

**సి.ఎ.ఆర్., జనగాం**



పేరును పూర్తిగా మార్చుకోవడం వల్ల ఫలితాలు పూర్తిగా అందుతాయా? అక్షరం మార్పుతో సరిపోతుందా వివరించగలరు.

ఏ రకంగా చూసినా ఎన్ని పద్ధతులలో ఎన్ని అక్షరాలు మార్చినా సాధ్య పడనపుడు పూర్తిగా మార్చుకోవలసిందే. ఈ పద్ధతి అన్ని వయస్సుల వారికీ సాధ్యపడదు. ఏజ్ లిమిట్ ఉంటుంది. పేరు పెట్టే ముందే జాగ్రత్తపడడం అవసరం. ఏ సరస్వతి అనే పేరునో పల్లవిగానో శారదగానో మార్చే ముందు ఆ పేర్లు ఏ రకమైన ప్రభావానికి లోనుచేస్తాయి అనే విచక్షణ న్యూమరాలజిస్ట్‌కు ఉండవలసిందే. ఒక వ్యక్తి జీవితం మీ చేతుల్లో ఉన్నప్పుడు మీ జాగ్రత్త మీకు అవసరం అదేవిధంగా మీ పేరు విషయంలో ప్రాక్టికల్స్ చేయకండి. నష్టం మీకే.

★★★

సంఖ్యాశాస్త్రం పట్ల ఆసక్తి వేరు. అభినివేశము వేరు. పరిణతి వేరు. సంఖ్యాశాస్త్రాన్ని సశాస్త్రీయంగా నేర్చుకోవాలనే ఆసక్తి కలిగి ఉన్నవారికి అన్వయ ఫలితాలతో ఖచ్చితమైన పద్ధతులలో సంఖ్యాశాస్త్రం అందుకోవాలనే వారి కోసం క్లాసెస్ నిర్వహించబడుతున్నాయి. వివరాల కోసం 81255 84837 నంబర్‌లో సంప్రదించగలరు.
Advt




దు.ము: ఉ.8.53-9.37, రా.10.55-11.39,
కౌలవ ఉ.11.12, తైతిల రా.10.42, వజ్ర రా.1.34. రా.కా: మ.3.00-
4.30, సూ.ఉ: 6.40, సూ.అ:సా.5.45.

19 బుధ మార్గశిర శు.సప్తమి రా.10.34, శతభిషం ఉ.7.31, వర్జ్యం: మ.2.12-3.52, అమృత: రా.12.13-1.54, దు.ము: ఉ.11.51-12.35, గరజి ఉ.10.38, వణిజ రా.10.34, సిద్ధి రా.12.20, రా.కా: మ.12.00-1.30, సూ.ఉ: 6.40, సూ.అ: సా.5.46.

20 గురు మార్గశిర శు.అష్టమి రా.11.17, పూ.భాద్ర ఉ.8.17, వర్జ్యం: సా.6.36-8.19, అమృత: తె.4.54-6.38, దు.ము: ఉ.10.23-11.07, మ.2.49-3.33, భద్ర ఉ.10.56, బవ రా.11.17, వ్యతీపాత రా.11.44, రా.కా: మ.1.30-3.00, సూ.ఉ: 6.41, సూ.అ: సా.5.46.

21 శుక్ర మార్గశిర శు.నవమి రా.12.45, ఉ.భాద్ర ఉ.9.51, వర్జ్యం: రా.11.01-12.47, దు.ము: ఉ.8.54-9.39, మ.12.36-1.20, బాలవ మ.12.01, కౌలవ రా.12.45, వరీయాన్ రా.11.41, రా.కా: ఉ.10.30-12.00, సూ.ఉ: 6.41, సూ.అ: సా.5.47.

22 శని మార్గశిర శు.దశమి తె.2.49, రేవతి మ.12.04, అమృత: ఉ.9.27-11.12, దు.ము: 6.42-8.10, తైతిల మ.1.47, గరజి రా. 2.49, పరిఘ రా.12.06, రా.కా: ఉ.9.00 -10.30, సూ.ఉ: 6.42, సూ.అ: సా.5.47.

23 ఆది మార్గశిర శు.ఏకాదశి తె.5.19, అశ్విని మ.2.47, వర్జ్యం: ఉ.10.20-12.06, రా.1.36-3.24, అమృత: ఉ.6.46-8.33, దు.ము: సా.4.19-5.03, వణిజ సా.4.04, భద్ర తె.5.19, శివ రా.12.51, రా.కా: సా.4.30-6.00, సూ.ఉ: 6.42, సూ.అ: సా.5.48.

24 సోమ మార్గశిర శు.ద్వాదశి పూర్తి 8.02, భరణి సా.5.48, అమృత: మ.12.24-2.12, దు.ము: మ.12.38-1.22, మ.2.51-3.35, బవ సా.6.41, సిద్ధ రా.1.47 రా.కా. ఉ.7.30-9.00, సూ.ఉ: 6.43, సూ.అ: సా.5.48.

25 మంగళ మార్గశిర శు.ద్వాదశి ఉ.8.02, కృత్తిక రా.8.57, వర్జ్యం: ఉ.7.22-9.11, అమృత: సా.6.14-8.02, దు.ము: ఉ.8.56-9.41, రా.10.58-11.43, బాలవ ఉ.8.02, కౌలవ రా.9.25, సాధ్య రా.2.47. రా.కా: మ.3.00-4.30, సూ.ఉ: 6.43, సూ.అ:సా.5.49.

26 బుధ మార్గశిర శు.త్రయోదశి ఉ.10.47, రోహిణి రా.12.03, వర్జ్యం: మ.3.01-4.50, తె.6.21 మొ., అమృత: రా.8.26-10.15, దు.ము: ఉ.11.54-12.39, తైతిల ఉ.10.47, గరజి రా.12.06, శుభ తె.3.44, రా.కా: మ.12.00-1.30, సూ.ఉ: 6.44, సూ.అ: సా.5.49.

27 గురు మార్గశిర శు.చతుర్దశి మ.1.25, మృగశిర తె.3.00, వర్జ్యం: 6.21-8.08, అమృత: సా.5.07-6.55, దు.ము: ఉ.10.26-11.10, మ.2.52-3.37, వణిజ మ.1.25, భద్ర రా.2.37, శుక్ల తె.4.32, రా.కా: మ.1.30-3.00, సూ.ఉ: 6.44, సూ.అ: సా.5.50.

28 శుక్ర మార్గశిర పౌర్ణమి మ.3.49, ఆర్ద్ర తె.5.43, వర్జ్యం: మ.12.21-2.08, అమృత: సా.6.35-8.22, దు.ము: ఉ.8.58-9.42, మ.12.40-1.24, బవ మ.3.49, బాలవ తె.4.52, బ్రహ్మ తె.5.08, రా.కా: ఉ.10.30-12.00, సూ.ఉ: 6.44, సూ.అ: సా.5.50.

29 శని మార్గశిర బ.పాడ్యమి సా.5.55, పునర్వసు పూర్తి, వర్జ్యం: సా.6.49-8.34, అమృత: తె.5.19 మొ., దు.ము: ఉ.6.45-8.14, కౌలవ సా.5.55, ఇంద్ర తె.5.29, రా.కా: ఉ.9.00-10.30, సూ.ఉ: 6.45, సూ.అ: సా.5.51.

30 ఆది మార్గశిర బ.విదియ రా.7.40, పునర్వసు ఉ.8.04, వర్జ్యం: సా.4.42-6.26, అమృత: శే. ఉ.7.12, తె. 3.04-4.48, దు.ము: సా.4.23-5.07, తైతిల ఉ.6.48, గరజి రా.7.40, వైధృతి తె.5.34, రా.కా: సా.4.30-6.00, సూ.ఉ: 6.45, సూ.అ: సా.5.51.

31 సోమ మార్గశిర బ.తదియ రా.9.02, పుష్యమి ఉ.10.05, వర్జ్యం: రా.11.42-1.24, దు.ము: మ.12.41-1.25, మ.2.54-3.39, వణిజ ఉ.8.21, భద్ర రా.9.02, వైధృతి 5.34, విష్కుంభ తె.5.20 రా.కా. ఉ.7.30-9.00, సూ.ఉ: 6.46, సూ.అ: సా.5.52.

## జనవరి - 2013

1 మంగళ మార్గశిర బ.చవితి రా.9.58, ఆశ్లేష ఉ.11.43, వర్జ్యం: రా.12.17-1.57, అమృత: ఉ.10.00-11.43, దు.ము: ఉ.8.59-9.44, రా.11.02-11.46, బవ ఉ.9.30, బాలవ రా.9.58, ప్రీతి తె.4.47. రా.కా: మ.3.00-4.30, సూ.ఉ: 6.46, సూ.అ: సా.5.53.

2 బుధ మార్గశిర బ.పంచమి రా.10.27, మఖ మ.12.55, వర్జ్యం: రా.9.09-10.47, అమృత: ఉ.10.24-12.05, దు.ము: ఉ.11.58-12.42, కౌలవ ఉ.10.12, తైతిల రా.10.27, ఆయుష్మాన్ తె.3.52, రా.కా: మ.12.00-1.30, సూ.ఉ: 6.46, సూ.అ: సా.5.53.

3 గురు మార్గశిర బ.షష్ఠి రా.10.26, పుబ్బ మ.1.40, వర్జ్యం: రా.8.55-10.32, అమృత: ఉ.7.04-8.43, దు.ము: ఉ.10.29-11.13, మ.2.56-3.40, గరజి ఉ.10.27, వణిజ రా.10.26, సౌభాగ్య రా.2.34, రా.కా: మ.1.30-3.00, సూ.ఉ: 6.47, సూ.అ:సా.5.54.

4 శుక్ర మార్గశిర బ.సప్తమి రా.9.54, ఉత్తర మ.1.55, వర్జ్యం: రా.10.11-11.45, అమృత: ఉ. 6.47-8.15, దు.ము: ఉ.9.00-9.45, మ.12.43-1.27, భద్ర ఉ.10.10, బవ రా.9.54, శోభన రా.12.50, రా.కా: ఉ.10.30-12.00, సూ.ఉ: 6.47, సూ.అ: సా.5.54.

5 శని మార్గశిర బ.అష్టమి రా.8.48, హస్త మ.1.37, వర్జ్యం: రా.9.19-10.51, అమృత: ఉ.7.42-9.17, తె. 6.33, దు.ము: 6.47-8.16, బాలవ ఉ.9.21, కౌలవ రా.8.48, అతిగండ రా.10.40, రా.కా: ఉ.9.00-10.30, సూ.ఉ: 6.47, సూ.అ: సా.5.55.

6 ఆది మార్గశిర బ.నవమి రా.7.09, చిత్త మ.12.48, వర్జ్యం: రా.6.03-7.33, అమృత: శే. ఉ.8.10, తె. 3.03-4.33, దు.ము: సా.4.27-5.11, తైతిల ఉ.7.58, గరజి రా.7.09, వణిజ తె.6.03, సుకర్మ రా.8.05, రా.కా: సా.4.30-6.00, సూ.ఉ: 6.47, సూ.అ: సా.5.56.

7 సోమ మార్గశిర బ.దశమి సా.4.58, స్వాతి ఉ.11.26, వర్జ్యం: సా.4.34-6.03, అమృత: రా.1.23-2.51, దు.ము: మ.12.44-1.29, మ.2.58-3.43, భద్ర సా.4.58, బవ తె.3.39 వైధృతి సా.5.05, రా.కా. ఉ. 7.30-9.00, సూ.ఉ: 6.48, సూ.అ: సా.5.56.

8 మంగళ మార్గశిర బ.ఏకాదశి మ.2.19, విశాఖ ఉ.9.36, వర్జ్యం: మ.1.13-2.39, అమృత: రా.9.51-11.18, దు.ము: ఉ.9.02-9.46, రా.11.05-11.50, బాలవ మ.2.19, కౌలవ రా.12.49, శూల మ.1.42. రా.కా: మ.3.00-4.30, సూ.ఉ: 6.48, సూ.అ: సా.5.57.

9 బుధ మార్గశిర బ.ద్వాదశి ఉ.11.19, అనూరాధ ఉ.7.23, జ్యేష్ఠ తె.4.46, వర్జ్యం: మ.12.22-1.48, అమృత: రా.8.55-10.21, దు.ము: మ.12.01-12.45, తైతిల ఉ.11.19, గరజి రా.9.40, గండ ఉ.10.01, వృద్ధి తె.6.06, రా.కా: మ.12.00-1.30, సూ.ఉ: 6.48, సూ.అ: సా.5.57.

10 గురు మార్గశిర బ.త్రయోదశి ఉ.8.01, బ.చతుర్దశి తె.4.37, మూల రా.2.10, వర్జ్యం: మ.1.39-2.54, రా.12.55-2.10, అమృత: రా.9.09-10.25, దు.ము: ఉ.10.32-11.16, మ.2.59-3.44, వణిజ ఉ.8.01, భద్ర సా.6.19, శకుని తె.4.37, ధృవ రా.2.04, రా.కా: మ.1.30-3.00, సూ.ఉ: 6.48, సూ.అ: సా.5.58.

11 శుక్ర మార్గశిర అమావాస్య రా.1.14, పూ.షాఢ రా.11.32, వర్జ్యం: ఉ.10.43-12.08, అమృత: రా.7.15-8.41, దు.ము: ఉ.9.03-9.47,మ.12.46-1.31, చతుష్పాత్ సా.4.37, నాగ రా.1.14, వ్యాఘాత రా.10.05, రా.కా: ఉ.10.30-12.00, సూ.ఉ: 6.49, సూ.అ: సా.5.59.

12 శని పుష్య శు.పాడ్యమి రా.10.04, ఉ.షాఢ రా.9.07, వర్జ్యం: ఉ.6.49-8.10, రా. 12.46-2.13,



జ్ఞాపకాలు : 'సంసారం' పుష్పలత

హ్యాపీడేస్ : దర్శకుడు మదన్

కథ : నా ఇల్లెక్కడ?

# ఆదివారం ఆంధ్రజ్యోతి

25 మార్చి 2012



## రాగల 24 గంటల్లో..









షో...

# రామ్‌చరణ్ 'రచ్చ'



'ఆరెంజ్' తరువాత భారీ అంచనాలతో విడుదలవుతున్న రామ్‌చరణ్ చిత్రం 'రచ్చ'. 'గ్యాంగ్‌లీడర్' చిత్రంలోని 'వానా వానా వెల్లువాయెా...' అనే పాటను ఇందులో రీమిక్స్ చేశారు. ఈ పాటలో రామ్ చరణ్ తనకంటే బాగా డ్యాన్స్ చేశాడని చిరంజీవి చెప్పడం... పాట చిత్రీకరణ సమయంలో చరణ్ గాయాలపాలవ్వడం చూస్తుంటే అది వందశాతం నిజం అనిపిస్తోంది. గతంలో 'మగధీర' చిత్రంలో 'బంగారు కోడిపెట్ట'పాటకు స్టెప్పులతో అదరగొట్టిన చరణ్... ఈ పాటలో కూడా తన ప్రత్యేకతను మరో సారి చాటుకోవాలనుకుంటున్నాడు. 'ఏమైంది ఈ వేళ' చిత్రం తరువాత సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న రెండో చిత్రం ఇది. తమన్నా కూడా ఈ చిత్రంపై భారీగానే ఆశలు పెట్టుకుంది. ఇద్దరు కలిసి ఎంత 'రచ్చ' చేస్తారో చూడాలి.



## ఇన్‌డెక్స్


ఫిల్మ్‌నగర్ ............... 7
వెండితెరపై 'ఒక్కడు'

హ్యాపీడేస్ ............... 10
మదన్

సలాడ్ ............... 14
తిర(అ)స్కార్

వంటశాల ............... 22
వెల్లుల్లి కూరలు

ఈ వారం కథ ............... 23
నా ఇల్లెక్కడ?

కేరింత ............... 30
ఒలింపిక్ రాజధాని



కవర్ స్టోరీ ............... 17
రాగల 24 గంటల్లో...



జ్ఞాపకాలు ............... 32
'సంసారం' పుష్పలత


'ఆదివారం అనుబంధం'పై మీ అభిప్రాయాలను శుక్రవారం లోగా అందేలా పంపగలరు. ఆలస్యంగా అందిన ఉత్తరాలు ప్రచురించడం సాధ్యపడదని మనవి. sunday.aj@gmail.comకి మీ ఉత్తరాల్ని మెయిల్ చేయవచ్చు.


# ఆదివారం ఆంధ్రజ్యోతి

25 మార్చి 2012


## ఇన్‌బాక్స్




### కథ మా బాబుకు చెప్పా

ఈ వారం కథలో సిద్ధూ క్యారెక్టర్ బాగుంది. తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలనే అతని పట్టుదల నాకు నచ్చింది. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లల ఇష్టాలను కొంచెం అయినా వారికి వదిలేయాలి. అప్పుడే వాళ్ళు సంతోషంగా ఫీలవుతారు. ఈ కథను మూడో తరగతి చదువుతున్న మా బాబు జిజ్ఞాస్‌కు చెపితే వాడు ఎంతో సంతోషంగా విన్నాడు.

– సుదీర్ఘ, కొత్తగూడెం.

– మల్లికార్జున్, ఇమెయిల్.

### చక్కటి కథ

సున్నితమైన కథాంశంతో సాయి బ్రహ్మానందం గారు 'గలుబె' అనే కథను చాలా చక్కగా రాశారు. తల్లిదండ్రుల ఆశల ఒత్తిడిలో నలిగిపోయే సిద్ధూ లాంటి పిల్లల గురించి ఎంతో బాగా చెప్పారు. పూలు సహజంగా వికసించినట్లు, పిల్లల్ని సహజసిద్ధంగా పెరగనివ్వాలి అనేది రచయిత బాగా తెలియజేశారు. మంచి కథలు ప్రచురిస్తున్న 'ఆంధ్రజ్యోతి' వారికి అభినందనలు.

– మజుందార్ అనూరాధ, అశ్వాపురం.

– వెన్నెల.ఎన్.కె., విజయనగరం.

–పి.వేణుగోపాల్, నాయుడుపేట.

★★★

### 'ఇది మా ఊరు' గొప్పది

'ఇది మా ఊరు' కవర్‌స్టోరీ బాగుంది. డాక్టర్ హెర్మన్ గారు మంచి నిర్ణయం తీసుకొని అనాథ పిల్లలకి ఆశ్రయం కల్పించారు. పదిమందికో ఇల్లు, అమ్మ, ఏ ప్రైవేటు స్కూలుకూ తీసిపోని సౌకర్యాలు చూస్తుంటే చాలా ముచ్చటేసింది. అలాంటి వారు మరి కొందరు ఉంటే బాగుండు.

– చాట్రాతి ఉమామహేశ్వరరెడ్డి, హైదరాబాద్.

–సూర్యదేవర గిరిజాప్రసాద్, తిరుపతి.

– కొత్తపల్లి మణీ త్రినాథరాజు, మోగల్లు.

– వి. ప్రసాదరావు, ఇమెయిల్.

– శరత్, నూజివీడు.

### ఈ వేస్ట్ బాగుంది

ఈ వారం సంథింగ్ స్పెషల్‌లో ఈ వేస్ట్‌తో తయారుచేసిన వివిధ రూపాలని చూసి ఆశ్చర్యపోయాం. ఈ భూమి మీద పనికిరాని వస్తువంటూ ఏమీ ఉండదు అనటానికి చక్కటి ఉదాహరణ ఈ రూపాలు.

– నిమ్మగడ్డ కృష్ణ, ఇమెయిల్.

### సుందర స్వప్నం

'లొంక'లో రామాలయం అందాలను చక్కగా వివరించారు. ఆ ప్రయాణమే ఒక వింత అనుభూతినిచ్చింది. కాశ్మీర్‌లోయను తలపించే పచ్చదనం, వేయిన్నర సంవత్సరాల చరిత్ర, అంతకు మించిన అటవీ సౌందర్యం బహుచక్కగా వుందా ప్రయాణం.

– పచ్చల కోటేశ్వరరావు, పెదగొట్టిపాడు.

★★★

'లొంక'లో రామాలయం అద్భుత సుందర స్వప్నంలా ఉంది. చదువుతుంటే లవకుశ సినిమాలోకి వెళ్ళినట్టుంది. శిల్పాలు, వినాయకుడు బహుసుందరంగా ఉన్నారు.

– రామగిరి లలితాశంకర, నూజివీడు.

### నెత్తుటి నిజం బాగుంది

నటి కుచలకుమారి జ్ఞాపకాలు వహ్వా అనిపించాయి. వివాహం చేసుకోకుండా ఉన్నందుకు బాధ కలిగింది. నెత్తుటినిజం కవిత చదివినపుడు నన్ను నేను ఎక్కడో దాచుకోవాలనిపించింది. ఇంద్రవెల్లి రమేష్ గారికి అభినందనలు.

– పగడాల వేంకటయ్య, పులుకుర్తి.

– సి.హెచ్.ఎ.ఆర్. కృష్ణ, తిరుపతి

– బండారు జనార్ధనరావు, విజయనగరం

– కర్నడ జగత్‌కుమార్, ఇమెయిల్.

### నా బాల్యాన్ని గుర్తు చేసుకున్నా

'హ్యాపీడేస్' శీర్షిక చాలా బాగుంది. పూల రంగడు దర్శకుడు వీరభద్రమ్ గారి బాల్య విశేషాలు చదువుతూ నా బాల్యాన్ని గుర్తు చేసుకున్నా. బాల్యంలో తెలిసీ తెలియక చేసిన పొరపాట్లు ఇప్పుడు తలచుకోవడం ఒక మధురానుభూతి.

– కె. బాలసుబ్రమణ్యం, విజయవాడ

– రవీంద్రనాథ్, తాలంకి

# మిక్చర్ పొట్లం

పాఠకులకు ప్రత్యేకం

బొమ్మలు: ఎస్.రాజశేఖర్‌రెడ్డి



## దొందూ దొందే!



"ఇద్దరు బిచ్చగాళ్లు కలిసినా, ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు కలిసినా మాట్లాడుకునే మొదటి మాట ఏంట్రా?'' అడిగాడు పరంధామం.

"నీది ఏ ప్లాట్ ఫామ్ అని?'' ఠపీమని చెప్పేడు సుందరం.

## ఎవడబ్బ వీధి?



ఇద్దరు బిచ్చగాళ్ల సంభాషణ –

"ఏరా రాజయ్యా ఈ మధ్య మూల వీధిలో కనిపించట్లేదేం?'' అడిగేడు ఎల్లన్న.

"నా మూడో అమ్మాయి మొగుడికి ఆ వీధిని కట్నం కింద రాసిచ్చా'' విచారంగా చెప్పేడు రాజన్న.

## పరువుకంటే ముఖ్యమైంది



తను ఇష్టపడ్డవాడితో వెళ్లిపోయి, మర్రోజే గోడకు కొట్టిన బంతిలా వచ్చిన సుజాతని చూసి –

"గుమ్మం దగ్గరే ఆగు ... మా పరువు తీసి వెళ్లావుగా. ఇంకా ఇక్కడ ఏం మిగిలిందని తీసుకుపోవడానికి వచ్చావు?'' కోపంగా అరిచాడు తండ్రి భుజంగరావు.

"సెల్ చార్జర్ మర్చిపోయా... '' చొరవగా ఇంట్లోకి దూరుతూ, తాపీగా అంది సుజాత.

## నీవు సామాన్యుడివి కాదు

"నిన్న సానియా మీర్జాతో మాట్లాడా తెలుసా?'' గొప్పగా చెప్పాడు భజగోవిందం.



"నిజమా? నీవు సామాన్యుడివి కాదు గురూ ... '' మెచ్చుకోలుగా అని "ఇంతకీ ఏమంది?'' కుతూహలంగా అడిగాడు చెంగల్రావు.

"రాంగ్ నెంబరని ఫోన్ పెట్టేసింది'' చల్లగా చెప్పేడు గోవిందం.

## రక్షించి శిక్షించా!

"నిన్న ఒక చీమ నీటిలో పడి కొట్టుకుంటుంటే జాగ్రత్తగా ఒడ్డుకి చేర్చాను'' గొప్పగా చెప్పేడు విద్యార్థి అఖిలేష్.



"వెరీ గుడ్ ... మనిషికి తోటి ప్రాణులపట్ల ఆ మాత్రం కరుణ ఉండాలి'' మెచ్చుకున్నాడు గురువు గురునాథం.

"కానీ, అది తాగిన నీళ్లు కక్కిద్దామని కడుపు మీద ఒత్తేసరికి చచ్చింది'' అసలు విషయం చెప్పేడు అఖిలేష్.

## దూరాలోచన



"డాక్టరుగారు పూటకి 3 టాబ్లెట్లే వేసుకోమన్నారుగా. మీరు 4 వేసుకుంటున్నారేం?'' అడిగింది సుజాత.

"ఇండియాలో తయారయ్యే ప్రతి 4 టాబ్లెట్లలో ఒకటి పనిచేయదని నిన్న టీవీలో చెప్పేరు'' నీళ్లు గుటకేస్తూ చెప్పేడు హనుమంతు.

## చీపురుతో బదులు చెప్పింది



రాత్రి 12 తర్వాత తలుపు చప్పుడైంది. చూస్తే ఎదురింటి బ్రహ్మానందం బాగా తాగి తూలుతూ కనిపించాడు.

"ఇది మీ ఇల్లు కాదండి. పొరపాటున మా ఇంటికి వచ్చారు'' అంది అలివేలు.

"సారీ సారీ'' అంటూ నాలుక కరుచుకుని వెనుదిరిగాడు బ్రహ్మానందం.

అలివేలు వెనకే వచ్చిన భర్త చిదానందం "ఆ వెధవని చీపురుతో నాలుగు వడ్డించలేకపోయావా?'' కోపంగా అన్నాడు.

"పోనిద్దురూ ... పొరపాటు ఎవరికైనా సహజం. పైగా తాగి ఉన్నాడాయె!'' జాలి చూపించింది అలివేలు.

"మొన్న రాత్రి నేను కూడా పొరపాటుగానే వాళ్లింటి తలుపు తట్టాను ... వాళ్లావిడ చీపురు తీసుకుంది మరి'' తల నిమురుకుంటూ చెప్పేడు చిదానందం.





# హోమియోలైఫ్

# ఉబ్బసం (ASTHAMA)కి హోమియో చికిత్స



Dr.A.M.Reddy, MD

వానాకాలం కొన్ని రకాల తరుణ వ్యాధులను మోసుకొని రావడమే కాకుండా కొన్ని రకాల దీర్ఘకాల వ్యాధులతో బాధపడే వారికి కూడా ఇక్కట్లను తెచ్చిపెడుతుంది. ఈ కాలంలో తీవ్ర స్థాయిని చేరే వ్యాధులలో రైనైటిస్, సైనసైటిస్, అలర్జీలు, ఉబ్బసం, కీళ్లనొప్పులు, ఫంగల్ ఇన్ఫెక్షన్స్, చర్మవ్యాధులు మొదలైనవి. "ఉబ్బసం వ్యాధితో బాధపడే వారికైతే ఈ కాలం చెప్పలేనంత ఇబ్బందికరంగా, ఆయాసకరంగా ఉంటుంది. శ్వాసకోశానికి సంబంధించిన ఈ వ్యాధిని వైద్య పరిభాషలో "బ్రాంకియల్ ఆస్మా" (BRONCHIAL ASTHMA), అని లేదా "ఆస్మా" అని అంటారు.

శ్వాసకోశ వ్యవస్థలో ఉండే బ్రాంకియోల్స్ (BRONCHIOLES) అనే చిన్న చిన్న గొట్టాలు వివిధ కారణాల చేత కుంచించుకోవడం వలన ఆయాసము, దగ్గు, పిల్లికూతలు, (WHEEZE), ఛాతి బరువెక్కినట్టు, బిగదీసినట్టుండడం వంటి లక్షణాలు గమనిస్తాము. ఆయాసము ఇతర శ్వాసకోశ వ్యాధులకు భిన్నంగా ఆకస్మాత్తుగా రావడం, ఎలాంటి శారీరక శ్రమలేకపోయినా రావడం జరుగుతుంది. బ్రాంకైటిస్, బ్రాంకియెక్టాసిస్ వంటి వ్యాధుల్లో వచ్చే మార్పులు దీర్ఘకాలంగా మొదలై శాశ్వత పరిణామాలకు దారితీస్తాయి. అయితే "ఆస్మా" లోమాత్రం ఈ మార్పులు నిర్ణీతకాలంలో "ఆస్మా" అటాక్ (ASTHMA ATTACK), వచ్చినప్పుడు మాత్రమే ఉంటాయి. అందువలన "వీజ్" అనే ఆ సమయంలో మాత్రమే వినిపిస్తుంది. తీవ్రమైన ఉబ్బసంతో బాధపడే వారిలో డాక్టర్లకే కాకుండా రోగికి, చుట్టు ఉన్నవారికి ఈ వీజ్ వినిపిస్తుంది. ఆయాసం తీవ్రంగా రావడం వలన శరీరావయవాలకు ఆక్సిజన్ సరిగ్గా అందకపోవడం వలన కొన్ని రకాల అనర్థాలకు దారితీసే అవకాశం ఉంది. చాలా తీవ్రమైన ఉబ్బసానికి గురైనప్పుడు రోగి ముఖము, గోళ్లు నీలంగా మారి, గుండె వేగంగా కొటుకొటూ, ఛాతిలో నొప్పి మరియు స్పృహ కోల్పోవడం జరుగుంది. ఇలాంటి దశలో రోగికి తప్పనిసరిగా ఆక్సిజన్ అందించాల్సిన అవసరత ఉంటుంది.

సాధారణంగా ఆస్మా జన్యుపరమైన కారణాల వలన మరియు వాతావరణ సంబంధమైన కారణాల వలన వస్తుంది. వాతావరణ కాలుష్యం వలన, పరోక్షంగానైనా పొగపీల్చడం వలన, ఇంట్లో ఉండే దుమ్ము, జంతువుల వెంట్రుకల, మొదలైన బాహ్య సంబంధమైన కారణాల వలన వచ్చే ఆస్మాను ఎక్స్ట్రిన్సిక్ ఆస్మా (EXTRINSIC) అని అంటారు. అయితే వ్యక్తిగత వ్యాధి నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉండుట వలననే వీరు ఇలాంటి పదార్థాల వలన త్వరగా ప్రభావితమవుతారు. దీనినే ఎటోపిక్ ఆస్మా అని కూడా అంటారు. రెండవది జన్యుపరమైన కారణాల వలన వచ్చే ఇన్ట్రిన్సిక్ ఆస్మా (INTRINSIC) ఇది సాధారణంగా తల్లిదండ్రులలో లేదా కుటుంబ సభ్యులలో ఎవరికైనా ఉన్నప్పుడు వస్తుంది. సాధారణంగా చిన్నపిల్లల్లో చూసే ఈ వ్యాధి లింగ భేదం, వయోభేదం లేకుండా ఎవరికైనా రావచ్చును. కుటుంబంలో ఎవరికైనా ఉన్నప్పుడు తర్వాతి తరంలో వచ్చే అవకాశాలు ఎక్కువ కొన్ని రకాల వృత్తులు అనగా ఆపరేటర్లు, ఫేబ్రికేటర్లు, మైనర్లలో తరచుగా ఈ వ్యాధి గుర్తించడం జరుగుతుంది.

సాధారణంగా ఆస్మాకి వాడే మందుల ద్వారా, ఇన్హేలర్ (INHALER) ల ద్వారా రోగికి తాత్కాలికమైన ఉపశయసనం లభిస్తుంది. అయితే వీటిద్వారా వ్యక్తియొక్క రోగనిరోధక వ్యవస్థ మాత్రం బలపడడం జరగదు. అందువలన కాలం గడిచే కొలది ఎక్కువ డోసెస్ అవసరమవవ్వచ్చు. కొన్ని సార్లు ఆ మందులకు కూడా రెసిస్టెన్స్ వచ్చేస్తుంది. అయితే హోమియోపతిలో ఇచ్చే చికిత్స వలన వ్యక్తిలోని రోగనిరోధక వ్యవస్థ చురుకుగా పనిచేస్తూ వివిధ రకాల ఎలర్జెన్స్‌కి ప్రభావితమవకుండా కాపాడుకోవచ్చు. చికిత్స మొదటి దశలో లక్షణాల తీవ్రతను తగ్గించి, ఎటాక్‌కి ఎటాక్‌కి మధ్య వ్యవధిని పొడిగించడం జరుగుతుంది. తర్వాత దశలో పూర్తిగా ఆయాసాన్ని నివారించడం, ఎటాక్స్ రాకుండా, ఎలర్జీన్సీకి రెసిస్టెన్స్ పెంచడం ద్వారా శాశ్వతంగా హోమియో చికిత్స ద్వారా పరిష్కారం లభిస్తుంది.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :** ఎలాంటి పదార్థాల వలన ఆస్మా ఎటాక్ తిరగబెడుంతుందో వాటిని "ట్రిగర్స్" అని అంటారు. ఇవి వ్యక్తి నుండి మరొకరికి వేర్వేరుగా ఉండవచ్చు. అందువలన ఎలాంటి వస్తువుల ప్రభావం వలన వస్తుందో గుర్తించడం చాలా ముఖ్యం.

✦ దుమ్ము ఎక్కువగా ఉండే స్థలాలలో ఇంటా, బయట తప్పనిసరిగా మాస్క్ ధరించాలి అదే విధంగా చల్లగా తగలకుండ జాగ్రత్తపడాలి.

✦ ఇంట్లో పెంపుడు జంతువులు ఉంటే సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచాలి.

✦ కొన్ని రకాల ఆహార పదార్థాలు, పల్ల సలాడ్ల, సూప్స్, నిలువ ఉంచిన వాటి వలన కూడా వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

✦ కొన్ని రకాల స్ప్రేస్, బాడీ పర్ఫ్యూమ్స్, సెంట్ల వలన కూడా ఇబ్బందికలగవచ్చు.

✦ క్రమం తప్పకుండా వ్యాయమం చేయడం వలన, ప్రత్యేకంగా బ్రీతింగ్ ఎక్సర్‌సైజులు చేయడం వలన శ్వాసకోశ వ్యవస్థ చురుకుంగా పనిచేస్తుంది.

✦ యాస్పిరిన్, బ్రూఫిన్ వంటి కొన్ని మందులు కూడా ట్రిగర్స్ అవ్వవచ్చు కనుక వైద్యుల సలహాలేనిదే ఇలాంటివి వాడకూడదు.

✦ హోమియోపతి మందులు క్రమం తప్పకుండా వాడితే కొంతకాలం తర్వాత ఇక మందులు వాడే శ్రమ ఉండదు. ఆస్మా నుండి శాశ్వతంగా విడుదల పొందవచ్చు. హోమియోపతిలో ఆస్మాకు సంబంధించి ఎన్నో మంచి మందులు ఉన్నాయి. వంశపరంపర్యంగా ఉన్నవారికి కూడా చక్కని ఫలితాలు లభిస్తాయి. సాధారణంగా ఆస్మాకు వాడే హోమియోపతి మందులు-కార్బోవెజ్ (CARBOVEG), (ARSENICUM ALBUM) అర్సనికమ్ ఆల్బమ్, ఇపికాక్ (IPECAC), నాట్రమ్ సల్ఫ్ (NATRUM SULPM) తూజా (THUJA), బ్లాటా ఓరియోంటాలిస్ (BLATTA ORIENTALIS), సెనెగా (SENEGA), నక్స్ వామికా (NUX VOMICA), స్పాంజియా (SPONGIA), మొదలైనవి.


సలహాలు, సందేహాల కొరకు ఈక్రింది చిరునామాకు ఉత్తరాల ద్వారా సంప్రదించండి

**పాజిటివ్ హోమియోపతి**

ఫ్లాట్.102, శ్రీ సాయిరామ్స్ స్వర్ణలత ఎస్టేట్, DTDC లేన్ ప్రక్కన, సారథి స్టూడియో, అమీర్‌పేట్, హైదరాబాద్.

help@positivehomeopathy.in, Cell : 92909 01010

బ్లాగోతం

# వ్యవసాయం for Dummies

*పట్టణంలో మీరు చేస్తున్న ఉద్యోగం పైన విరక్తి కలిగిందా? మీరు డిగ్రీ అయిపోయి ఉద్యోగం కోసం చూస్తున్నారా? మీ మనసు పల్లెవైపు పరుగెడుతున్నదా?*

మీలాంటి వారి కోసమే ఈ వ్యవసాయం ఫార్ డమ్మీస్ అనే పుస్తకం. ప్రస్తుత పట్టణ జీవనశైలి నుంచి పల్లె జీవన శైలికి మార్పు చెందడం ఎలాగో ఈ పుస్తకం చదివిన తరువాత మీకు రియల్ ఐడియా వస్తుంది. సన్నకారు వ్యవసాయానికి కావలసిన అన్ని విషయాలకు ఇది ఒక ప్రాక్టికల్ గైడ్. ఇక విషయంలోకి వెళదాం.

## వ్యవసాయం ఒక పరిచయం

● ఈ basics of farming అనే గైడులో నేను మొత్తం వ్యవసాయం అనే సబ్జెక్టు కవర్ చేయబోతున్నాను. నాకు తెలిసినంతగా వ్యవసాయం గూర్చి మరెవరికి తెలిసివుండదు. ఎందుకంటే నేను ఒక తెలుగు పల్లెలో వేసవికాలంలో బావులలో ఈతకొట్టి, దున్నపోతుల పైన సవారి చేసి, పల్లె పిల్లగాల్లతో చెడుగుడు ఆడిన వాడిని. పైగా నన్ను అందరు అప్పుడప్పుడు 'వీడు ఎర్ర బస్సు ఎక్కి వచ్చాడు రా బాబూ' అని అంటూ వుంటారు. మీకు ఈ ఒక్క రుజువు చాలు అనుకుంటా నేను వ్యవసాయంలో ఎంత డొమెయిన్ ఎక్స్‌పర్ట్ అన్నది.

అవును వ్యవసాయం భారతదేశానికి mother board లాంటిదే. ఇప్పటికే మీరు తెలుగుసినిమాలు చూసి వ్యవసాయం అంటే ఏంటో చాలావరకు తెలుసుకొని వుంటారు. హీరో హీరోయిన్లు పాటలు పాడే సమయంలో మిస్ అయిన వ్యవసాయపాఠాలు ఇప్పుడు మీకు చెబుతాను. మనం తినే చిప్స్‌లో ఆలు, బజ్జిలో మిరప, goldflake సిగరెట్ లోని పొగాకు, ఫ్రైడ్ రైస్‌లోని బియ్యం, ఇలా అన్నీ మనకు పల్లె నుంచే వస్తాయి. ఎక్కడో రైతు కష్టపడి పండిస్తే, కేవలం ప్యాక్ మాత్రం చేసి ఈ దళారులు మనకు 30 రూపాయలకు అమ్ముతారు. ఈ వ్యవసాయం అనేది చిన్నపిల్లలకు తరగతి సబ్జెక్టుగా ప్రవేశపెట్టాలని నా డిమాండ్. వీడియోగేమ్స్ అని, ఇంటర్నెట్ అని వాటిలో తలదూర్చి పొద్దున్న ఎండపడగానే wtf అని అనుకునే ఈ తరం వాళ్లకు ఇది ఎంతయినా అవసరం. ఈ పుస్తకం మూల ఉద్దేశం కూడా అదే. వ్యవసాయం అనేది చాలా ముఖ్యమైన సబ్జెక్టు. ఇది భావితరాల వారికోసం మనం భద్రపరచాలి. ఈ పుస్తకం చదివి మీరంతా వ్యవసాయం నేర్చుకోవచ్చు. అయితే మీకు కావలసిన లవ్‌సీన్లు ఇందులో వుండవు. అవి ఎక్స్‌పెక్ట్ చేసి ఈ పుస్తకం చదివితే మాత్రం దిక్కుమాలిన చావు చస్తారు.

## ఇక మీరు కొనవలసినవి

40 కోళ్లు, 3 ఎద్దులు( రెండు చాలు కాని ఎందుకైనా మంచిదని మూడు రాశా), 8 ఆవులు, 8 బర్రెలు, ఒక కుక్క, ఒక కోతి( మనకి పని లేనప్పుడు entertainment కింద వుంటుంది.

## ఇక సాగు గూర్చి

అక్కడ ఇక్కడ విత్తనాలు విసిరితే మొక్కలు మొలుస్తాయి కాని ఒక పద్ధతి ప్రకారం వరుసగా rows తవ్వి కీబోర్డు పొడవు తేడాతో విత్తనాలు నాటాలి. టైం ప్రకారం మనం తినగానే సరిపోదు–మొక్కలకు కూడా ఆకలి వుంటుంది. కాబట్టి వాటికి సరిపోయే నీళ్లు, ఎరువులు వేస్తూ వుండాలి. అవి సరిపోకపోతే మార్నింగ్ routines కొన్ని మనం పొలంలో తీర్చుకుంటే చాలా మంచిది. ఇంకా మంచి ఎరువులు కావాలంటే చీకట్లో లేచి ఊరి వారినందరినీ మన పొలంలోకే పోయేటట్లు చూడాలి. కొన్ని నెలల (కచ్చితంగా నాకూ తెలియదు) తరువాత పంట ఒక మాదిరిగా ఎత్తు పెరుగుతుంది. అప్పుడే మొదలు పెట్టాలి కోతలు.

## ఔత్సాహిక రైతులకు కొన్ని సలహాలు:

బాగా ఎండ వున్న రోజున ఆవును వెనకాల మాత్రం కొట్టొద్దు. results could be very dangerous.

పని బాగా చేయాలంటే పనిముట్లు బాగుండాలి.

కంచె–గుర్రం ఎత్తు వుండాలి. పందులు దూరనంతగా వుండాలి, ఎద్దులను తట్టుకునేదిగా వుండాలి.

తేనెటీగలు ట్రాక్టర్ కంటే వేగంగా వుంటాయి.



బొమ్మ: పినిశెట్టి

పొలంలో నీవు చిన్నగా మాట్లాడినా గాలికి అవి పక్క పొలంలో వినపడే అవకాశాలు వున్నాయి.

ప్రతి దారిలో కొన్ని గుంతలు వుంటాయి.

గొర్రెలమంద నీరు కింద తాగుతుంటే నీవు కాలువకు ఎగువకు వెళ్ళి తాగు.

కోడిని గంప బయటకు వదలడం చాలా ఈజీ–తిరిగి అందులో పెట్టడం మాత్రం చాలా కష్టం.

కోతి ఎంత ముసలిదైతే అంత దాడి చేసే అవకాశం ఎక్కువ. కాబట్టి ముసలి కోతులతో జాగ్రత్తగా వుండు.

జ్ఞానం అంటే టమోటా ఒక ఫలం అని తెలుసుకోవడం. తెలివంటే దానిని ఫ్రూట్‌సలాడ్‌లో వేయకుండా వుండడం.

పల్లెటూరివారికి హెచ్‌బిఓ చూపించొద్దు. నీవు బిబిసి చూసే టైంకి హెచ్‌బిఓ పెట్టమంటారు.

పక్షి ఎప్పుడూ ఒకే రెక్కతో ఎగరలేదు.

కొత్త వలతో పాత పక్షిని పట్టలేవు.

ధనవంతునికి ఎద్దు ఎంత ముఖ్యమో, బీదవానికి గొర్రె అంత ముఖ్యం.

తెలివైన ఎలుకకు ఒకటి కంటే ఎక్కువ కన్నాలు తెలిసివుంటాయి.

కుక్క మొరిగిన ప్రతిసారీ దొంగ వచ్చినట్లు కాదు.

పక్షి ఎంత ఎత్తుకు ఎగిరినా నీటి కోసం కిందికి వస్తుంది.

పాము చచ్చేవరకు దాని పొడవు తెలియదు.

ఆవుపాలు పితికేముందు దానిని కట్టివేయి.

ఆవు మంచిదైతే అది వూర్లోనే అమ్ముడుపోతుంది.

## conclusion

ఈ వ్యవసాయం ఫార్ డమ్మీస్ అనే పుస్తకం మీకు నచ్చిందని ఆశాభావం వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను. ఇప్పటి తరం bit torrents వీడియోగేమ్స్ డౌన్‌లోడ్ చేసుకునే సమయానికి వాళ్ల టేబుల్ పైన భోజనం ఎక్కడినుంచి వస్తుందో, ఎలా వస్తుందో వారికి తెలియాలని నా తాపత్రయం.

(సంక్షిప్తంగా)

devanahariprasadreddy.blogspost.in

# వెండితెరపై 'ఒక్కడు'



హీరో అంటేనే పోరాటం.. చుట్టూ వందల మంది ఉన్నా వాళ్ల చేతుల్లో కత్తులు, తుపాకులు ఉన్నా అతన్ని ఏమీ చేయలేవు. అందర్నీ 'ఒక్కడే' మట్టుబెడతాడు. అందుకే 'ఒక్కడు' పేరుకు అంత క్రేజ్. ఈ టైటిల్‌తో టైటిల్‌తో వచ్చిన దాదాపు అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించాయి. తాజాగా నారా రోహిత్ 'ఒక్కడినే' అంటూ వేసవిలో ప్రేక్షకులను అలరించేం దుకు సిద్ధమవుతున్నాడు. ఈ ట్రెండ్ 1999లో వచ్చిన శంకర్ 'ఒకే ఒక్కడు'తో ప్రారంభమైంది. అప్పటి నుంచి ఏటా ఏదో ఒక సినిమా ఆ పేరుకు దగ్గరగా వస్తూనే ఉంది. రౌడీల భరతం పట్టేందుకు 'ఒక్కడుచాలు' అంటూ హీరో రాజశేఖర్ వస్తే విలన్ చెర నుంచి హీరోయిన్‌ని కాపాడేందుకు హీరో మహేష్ వచ్చి పెద్ద హిట్ అయ్యాడు. తర్వాత మీ ఆటలు కట్టిస్తానంటూ హీరో శ్రీహరి పోలీస్ ఆఫీసర్ పాత్రలో 'ఒక్కడే' విలన్లను చితకబాదుతాడు. ఎంతో అన్యో న్యంగా, సరదాగా ఉండే కుటుంబాన్ని సర్వనాశనం చేసిన సంఘ విద్రోహులపై 'అతనొక్క డే'లో కక్ష తీర్చుకుంటాడు హీరో కల్యాణ్‌రామ్. ఆ తర్వాత వరుసగా గోపీచంద్ 'ఒక్కడు న్నాడు' అంటు వస్తే, 'ఒక్క మగాడు'గా హీరో బాలకృష్ణ... 'వీడొక్కడే' అంటూ సూర్య, 'ఆ ఒక్కడు' అంటూ అజయ్, 'యుగానికి ఒక్కడు' అంటూ కార్తి వెండితెరపై ప్రేక్షకులను అలరిం చినవారే. ఇప్పుడు నారా రోహిత్ తన వంతుగా 'ఒక్కడినే' అంటూ వస్తున్నాడు.

# కామెరూన్ కొత్త సాహసం



'అవతార్'లో గ్రహాంతర వాసులను సృష్టించిన దర్శ కుడు జేమ్స్ కామెరూన్... ఈసారి సముద్రగర్భంలో మరో సాహసం చేయడానికి సిద్ధమవుతు న్నాడు. అయితే సినిమా తీయడానికి కాదు. సముద్ర అగాధాన్ని చూడటానికి. పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలోని అతిలోతైన 'మరియానా ట్రెంచ్' అనే ప్రాంతానికి ఆయన త్వరలో వెళ్లను న్నాడు. ఈ ట్రెంచ్ లోతు 11,034 మీటర్లు. తొంబై లక్షల ఏళ్ల కింద ఏర్పడిన ఈ ట్రెంచ్ ఎన్నో జీవరాసులకు నెలవు. ఇప్పటివరకు అక్క డకు ఇద్దరు మాత్రమే వెళ్ళొచ్చారు. అదీ 52 ఏళ్ల కిందట.

''చంద్రుడిపైకి చాలా మంది వెళ్ళొచ్చారు కానీ ఇప్పటి వరకు ట్రెంచ్‌లోకి వెళ్ళినవారు తక్కువే'' అంటున్నాడు అమెరికా నౌకాదళ కెప్టెన్ డాన్ వాల్స్. ఇతను కూడా అక్కడికి వెళ్ళొచ్చిన వారిలో ఒకరు. ఇప్పుడు కామెరూన్ ఒక్కడే ఆ సాహసయాత్రకు సన్నద్ధమ వుతున్నాడు. ద అబిస్ చిత్రానికి అండర్‌వాటర్ సెట్‌ని రూపొందిం చిన అనుభవం ఆయనకు ఉంది. స్వయంగా డీపీసీ డైవింగ్ చేసే వ్యక్తి. టైటానిక్ శిథిలాలను 'ఘోస్ట్ ఆఫ్ ద అబిస్' పేరుతో డాక్యుమెంటరీ తీయడానికి వెళ్ళిన బృందంలో ఆయనా ఉన్నారు. ఆయనకు సరిపోయే 6 అడుగుల ఒక అంగుళం పొడవైన సబ్‌మర్సిబుల్ ఫ్రేమ్‌ని ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. ఆ ప్రాంతంలో చదరపు అంగుళానికి 7,300 కిలోగ్రామ్‌ల ఒత్తిడి ఉంటుందట. దానిని తట్టుకునేంత గట్టిగా ఈ ఫ్రేమ్‌ని తయారు చేస్తున్నారు.



## ఫిల్మ్‌నగర్

# 'రీమేక్'ల కాలం

ఇది రీమేక్‌ల కాలం. కొత్త కథలు రావడంలేదో లేక ఉన్నవాటినే ఇతర భాషల్లో ఉపయోగించుకుంటే సరిపోతుందనే ఆలోచనా ధోరణో గానీ ఇప్పుడంతా రీమేక్‌ల కాలమే నడుస్తోంది. తెలుగులో విడుదలైన 'గోల్కొండహైస్కూల్'ని రీమేక్ చేయడానికి భారత క్రికెట్టు జట్టు మాజీ కెప్టెన్ సౌరబ్‌గంగూలీ ముందుకొచ్చాడు. అలాగే తెలుగులో విజయవంతమైన 'మర్యాదరామన్న' చిత్రాన్ని 'సన్ ఆఫ్ సర్దార్' పేరుతో, 'విక్రమార్కు డు'ని 'రౌడీరాథోడ్' పేరుతో, 'బొమ్మరిల్లు'ని 'ఇట్స్‌మై లైఫ్' పేరుతో హిందీలో పునర్నిర్మిస్తున్నారు. ఇంకా బాలకృష్ణ 'లక్ష్మీనరసింహ', రవితేజ 'కిక్', 'అమ్మా నాన్న ఓ తమిళమ్మాయి', అల్లు అర్జున్ 'ఆర్య–2', మహేశ్ 'దూకుడు', 'బిజినెస్‌మేన్' రామ్‌చరణ్ 'మగధీర', నితిన్ 'ఇష్క్' సినిమాలు ఉత్తరాదికి వెళ్ళే సినిమాల జాబితాలో ఉన్నాయి. అట్నుంచి వచ్చే వాటి గురించి చెప్పాలంటే సల్మాన్‌ఖాన్ 'దబంగ్' తెలుగులో పవన్‌కల్యాణ్ 'గబ్బర్‌సింగ్'గా మారుతోంది. మాధవన్ నటించిన 'తను వెడ్స్ మను' చిత్రం తెలుగులో సునీల్ చేస్తున్నాడు. దక్షిణాది నుంచి ఉత్తరాదికి వెళ్ళిన చిత్రాలన్నీ అక్కడ సూపర్‌డూపర్ హిట్ అయ్యాయి. కాని అక్కడి నుంచి వచ్చిన చాలా చిత్రాలు దక్షిణాదిన బాక్సాఫీస్ వద్ద బోల్తాపడ్డాయి. 'లగే రహో మున్నాభాయ్'ని 'శంకర్‌దాదా జిందాబాద్'గా, 'బంటీ ఔర్ బబ్లీ'ని 'భలేదొంగలు'గా, 'ఖాకీ'ని 'సత్యమేవ జయతే'గా, 'త్రీ ఇడియట్స్'ని 'స్నేహితులు'గా చూపిస్తే ప్రేక్షకులు ఆదరించకపోవడమే దానికి ఉదాహరణ. అదే దక్షిణాది చిత్రాలకు రీమేకులైన 'బాడీగార్డ్', 'రెడీ', 'గజిని', 'వాంటెడ్', 'సింఘం' చిత్రాలు వందకోట్లకుపైగా వసూలు చేశాయి.

విజయం

**అల్పాహారం, భోజనం, డిన్నర్ ... ఏ సమయమైనా కానీయండి. ఆ హోటల్స్‌లోకి వెళ్లేవాళ్లు దోసెల గురించే ఆరా తీస్తారు. అక్కడ దోసె ఒక వంటకం మాత్రమే కాదు. రకరకాల టేస్ట్‌కు అదొక బ్రాండ్. దాన్ని సృష్టించింది టి. గణపతి. బెంగుళూరు ఆన్‌లైన్ ప్రతినిధి అబ్దుల్ రజాక్ చెబుతున్న ఆ దోసెల ఆకాశం కబుర్లే ఇవి...**



# దోసె..గణపతి..ఆకాశం

మనిషన్నాక ఏదో ఒక నమ్మకం ఉంటుంది. చెన్నయ్ వాసి గణపతికి కూడా అలాంటి ఒక నమ్మకం ఉంది. అతని నమ్మకం విలువైన వస్తువు పట్ల కాదు. సాదా సీదా దోసెనే విలువైనదిగా మార్చవచ్చనే నమ్మకం. అందుకే అతను 104 రకాల దోసెలను కనుగొనగలిగాడు. ఏదైనా ఆవిష్కరిస్తే ఊరుకోవడం ఇప్పటి ట్రెండ్ కాదు కాబట్టి, ఆయన వాటిలో 27 వెరైటీలకు పేటెంట్ కూడా పొందాడు. దోసెప్లాజా హోటల్స్‌ను మొదలెట్టి ప్రపంచ వ్యాప్తంగా 45 శాఖలను ఏర్పాటు చేశాడు. ఈ హోటల్స్ ఇప్పటికే 100 కోట్ల రూపాయల టర్నోవర్‌ను సాధించాయి కూడా. అమ్మ దోసె ఇంత పని చేసిందా? అంటే చేయదూ మరి. గట్టిగా మాట్లాడితే నా గురించి మీకు ఏం తెలుసని ఎదురు ప్రశ్నించగలదు.

## సౌత్ సూపర్‌స్టార్...

దక్షిణాది వారి ఆడపడుచు ఇడ్లీ లాగా దోసె, మినపట్టు, పెసరట్టు, ఉల్లి అట్టు, రవ్వ అట్టు ఇలా ఎన్నో ఉన్నాయి. కర్ణాటకలో మసాలా దోసె, సెట్ దోసె, నీరు దోసె, వెన్నదోసె అని ఏవేవో వచ్చాయి. కేరళకు వెడితే ఊతప్పం నోరూరిస్తుంది. ఇదీ దోసెలాంటిదే. తమిళనాడులో ఇడ్లి, పొంగల్ తర్వాతి స్థానం దోసెదే. ఇంతటి పాపులారిటీ ఉంది దోసెకు. దాన్ని వాడుకోవాలనుకున్నాడు గణపతి.

## దోసెతో దోస్తానం...

ఇండో మెక్సికన్, ఇండో ఇటాలియన్, ఇండో రష్యన్, ఇండో అమెరికన్, ఇండో చైనీస్, ఇండో స్పానిష్, ఇండో మలేషియన్ పేర్లు ఎప్పుడైనా విన్నారా? పాతిక సంవత్సరాల పరిశోధనల అనంతరం దోసె ప్లాజా బ్రాండ్ నిర్వాహకుడు టి.గణపతి వాటిని సిద్ధం చేశారు. పిజ్జా, బర్గర్, పాస్తా ఫ్లేవర్లను మిళితం చేసి నేటి తరం అభిరుచులకు అనుగుణంగా కూడా దోసెలను రూపొందించారు ఆయన. కేవలం రుచులే కాకుండా చక్కటి పౌష్టికాంశాలు కూడా తన దోసెల్లో పుష్కలంగా లభిస్తాయని గణపతి చెబుతుంటారు. ఈ దోసెల తయారీకి అన్ని రకాల కూరగాయలు, ఆకు కూరలు, తగిన మోతాదులో మసాల దినుసులు వినియోగిస్తున్నట్లు చెప్పారాయన. ఏ దోసె రుచి ఆ దోసెకే ఉండడం వీటి ప్రత్యేకతల్లో ఒకటట.

## ప్రస్థానం మొదలు...

కెంటకీ ఫ్రైడ్ చికెన్ (కెఎఫ్‌సి) లాగా రకరకాల పిజ్జా బ్రాండ్‌ల లాగా భారతీయ వంటకానికి కూడా అంతర్జాతీయ గుర్తింపు వస్తే ఎలా ఉంటుందన్న ఓ చిన్న ఆశే గణపతిని ముంబైకు రప్పించింది. 1991లో జేబులో వెయ్యి రూపాయలతో సొంతూరైన చెన్నయ్ నుంచి ముంబై చేరుకున్న ఆయన సహజంగానే చిన్న దోసె స్టాల్ ఏర్పాటు చేసుకున్నారు. అయితే భిన్నమైన దోసె రుచులతో ఆహార ప్రియులను కట్టిపడేశారు. ఫలితంగా 1998 నాటికి దోసె ప్లాజా బ్రాండ్‌ను ఆవిష్కరించే స్థాయికి ఎదిగారు. ఆ తర్వాత అమెరికా, ఇటలీ, చైనా, మలేషియా, సింగపూర్, తదితర దేశాలలో పర్యటించారు. అక్కడ కూడా భారతీయ దోసెకు విదేశీ రుచులు జోడించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అక్కడి రుచులను మేళవించి భారతీయులకు కొత్త దోసెలను అందిస్తున్నారు. అంటే ఇచ్చిపుచ్చుకోవడమనే సంప్రదాయమన్న మాట.

## శాకాహార శాఖలు...

ఇప్పుడు దోసె ప్లాజా శాఖలు ప్రపంచవ్యాప్తంగా 20 నగరాల్లో విస్తరించి ఉన్నాయి. భారతదేశంలో 15 రాష్ట్రాలలో శాఖలు దీని పనిచేస్తున్నాయి. 45వ శాఖను బెంగుళూరులోని జయనగర్‌లో ఇటీవలే

సలాడ్ రోస్ట్ దోసె



మసాలా దోసె



మష్రూం దోసె



# దోసెల ప్రపంచమే నా లక్ష్యం



దోసెను ఎన్ని రకాల రుచులతో తినవచ్చో.. ప్రపంచం మొత్తానికి చాటి చెప్పాలనుకుంటున్నాను. విదేశాలకు భారతీయ దోసెను కొత్త రుచులతో పరిచయం చేసినప్పుడు అక్కడి ఆహార ప్రియులు అమితంగా ఇష్టపడ్డారు. ఆ ఆసక్తిని గమనించే దోసెపై మరిన్ని పరిశోధనలు చేయించాను. ఆ విధంగా కొత్త వెరైటీలను కనుగొనగలిగాము. రానున్న రోజుల్లో ఈ జాబితాలో మరో 13 రకాలను చేర్చబోతున్నాము. భారతదేశంలోని ఉత్తరాది రాష్ట్రాలకు కూడా ఈ తరహా దోసెలను పరిచయం చేయాలని భావిస్తున్నాను. మా దగ్గర రుచికి తగ్గట్టు దోసెల సైజు కూడా పెద్దదిగా ఉంటుంది. దీంతో వినియోగదారులు ఖర్చు గురించి పెద్దగా ఆలోచించరు. దోసెను తనివితీరా ఆస్వాదిస్తుంటారు.

**ఆదాబ్ హైదరాబాద్**

హైదరాబాద్‌లోని మియాపూర్‌లో కూడా మాకు శాఖ ఉంది. త్వరలో మరిన్ని శాఖలను ప్రారంభించే ఆలోచన కూడా ఉంది. నేరుగా బ్రాండు శాఖలతో పాటు ఫ్రాంచైసీలను కూడా ఇస్తున్నాం. వచ్చే ఐదేళ్ళలో దేశ వ్యాప్తంగా కనీసం వంద శాఖలను ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉంది.

– టి. గణపతి, దోసెప్లాజా అధినేత

కేరళ ఊతప్పం



సాదా కారం దోసె



ఏర్పాటు చేశారు.

## దోసె పుస్తకం... మెనూ రికార్డు

మన దేశంలో మొత్తం 500 రుచుల దోసెలు వాడుకలో ఉన్నట్టు గణపతి అంచనా వేస్తున్నారు. వీటన్నిటినీ జోడించి ఓ పుస్తకం తీసుకురావాలని ఆయన భావిస్తున్నారు. అలాగే బహుశా ప్రపంచంలోనే అతి పెద్ద మెను కార్డును బెంగుళూరు దోసె ప్లాజా పరిచయం చేయబోతోంది. 540 రకాల ఐటమ్స్‌తో 60 పేజీలు ఉండే ఈ మెను చదవడానికి దాదాపు అరగంటపైగా పట్టొచ్చు. 104 రకాల దోసెలతోపాటు 7 రకాల ఇడ్లీలు ఈ మెనులో ఉంటాయి. గోబి మంచూరియన్ తరహాలో ఇడ్లి మంచూరియన్‌ను బెంగుళూరు నగర ప్రజలకు తొలిసారి అందజేయనున్నారు.

## మన దోసె రూ.300 దాటదు

దోసె ప్లాజా అమెరికాలో ఒక్కో దోసెను 20 డాలర్లకు అమ్ముతోంది. ఆ దేశాలతో పోలిస్తే ఇక్కడే కారుచౌక అని దోసె ప్లాజా ఫ్రాంచైసీ హక్కులను తీసుకున్న బెంగుళూరు వ్యాపారవేత్త, స్థానిక గ్లోబల్ ఫుడ్స్ అధినేత విజయసింగ్ అంటున్నారు. భారత్‌లోని దోసె ప్లాజా శాఖల్లో 19 రూపాయల సాదా దోసె నుంచి 300 రూపాయల పన్నీరు దోసె వరకు ఉన్నాయంటున్నారు. అతి పొడవైన దోసె, అతి పల్చటి దోసె, కూరగాయల దోసె, ఆకు కూరల దోసె, మష్రూమ్ దోసె, గుమ్మడి దోసె, అల్లం దోసె, ఇలా పేర్లు చెబుతుంటేనే నోరూరుతుందంటున్నారు.

ప్రతిస్పందన

# ఆధునికత వైపు

ఆధునిక ‘కథ’ పంచతంత్ర కథలాగా నీతిని బోధించేది కాదు. సమాజానికి అద్దం పట్టేది. సమాజ గతిశీలతను చిత్రించేది. విశ్లేషించేది. వ్యాఖ్యానించేది మాత్రమే. నీతిని బోధించి సమస్యకు పరిష్కారం చూపేది కాదు. ఎప్పుడైనా ఏ రచయితయినా ఒక్కోసారి పరిష్కారం చూపవచ్చును. ‘లివింగ్ టు గెదర్’ సంస్కృతి మన మెట్రో నగరాల్లో చాలానే ఉందని అందరికీ తెలుసు. అది పాశ్చాత్యం అని తోసిపుచ్చితే ‘సఖీ సంప్రదాయం’ అంటే వివాహిత పురుషులు అవివాహిత స్త్రీలతో ముఖ్యంగా ఉద్యోగినులతో సంబంధం పెట్టుకోవడం పశ్చిమ భారత ప్రాంతం (గుజరాత్, రాజస్థాన్)లో సర్వసామాన్యం. ఇకపోతే దొంగచాటుగా రెండో పెళ్లిళ్ల చేసుకున్న వాళ్ల సంఖ్య తక్కువేం లేదు. ఫ్యామిలీ కోర్టులకు పోతే విడాకుల కోసం వచ్చే వచ్చే దంపతుల సంబంధాల చిట్టాలు బహిరంగంగా చర్చింపబడటం వింటే ఇది మన దేశమేనా అన్న అనుమానం వస్తుంది. సాఫ్ట్‌వేర్ కార్పోరేటు ఉద్యోగులు – ఆడమగ – పుణే, బెంగుళూరు ఆది నగరాల్లో డ్రగ్స్ పార్టీలు చేసుకొని పోలీసులకు పట్టుబడ్డ ఉదంతాలు మనం పత్రికల్లో చదివే ఉన్నాం.



‘ఓపెన్ మ్యారేజు’లు ‘ఓపెన్ లివింగ్’ అనే భావనలు మన దేశంలోకి కూడా ప్రవేశిస్తున్నాయి. అటువంటి ఆధునికత ‘కుటుంబ’ వ్యవస్థలో తెచ్చే మార్పును, ఇంకా వ్యక్తి స్వేచ్ఛ, పని, వ్యక్తిగా సాధించి చూపటం లక్ష్యసాధనలే ప్రధానమైన జీవనశైలినీ – చిత్రించే కథ ‘ఆధునికత వైపు’. అంతేగాని కార్పోరేటుల్లో పని చేసే ఉద్యోగులంతా అట్లా ఉంటారని చెప్పే కథ కాదు. కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తున్న వైపరీత్యాలను గురించి మాట్లాడటం ఆరోగ్యకరం. మన సమాజంలో నీతి సంస్కృతి పేర్లతో ఎన్నో ఆవరణలున్నాయి. రాధాకృష్ణుల సంబంధం ఎటువంటిదో ఆలోచించకుండానే హారతి పడ్తాం. గోపికలతో కృష్ణుని సంబంధాలను భక్తిపారవశ్యంతో గానం చేస్తాం. ఇంకోవైపు లక్ష్మణరేఖను దాటని నీతి మనది అనుకుంటాం. నీతి లక్ష్మణరేఖను దాటితే సహించలేని కోపం, అసహ్యం! కాని ఆధునిక సమాజంలో ఆదిమ సమాజంలో వలెనే స్త్రీ పురుష సంబంధాల్లో సిద్ధాంత రూపంగా వైపరీత్య ధోరణులు చోటు చేసుకుంటున్నాయి. వాటిని గురించి చర్చించటంలో తప్పులేదు. సీతామహాలక్ష్మి గారన్నట్లుగా మెదడు తలుపులు మూసుకొని సమాంతర తెరలు తీసే ధైర్యం లేకపోతే సమాజంలో కొన్ని శకలాలు పురావస్తు నమూనాలుగా మిగిలిపోతాయి. కాలం తెస్తున్న నూతన పరిణామాల పట్ల పిల్లిలా కళ్ళు మూసుకుంటే వచ్చే దుష్పరిణామాలు తెలుసుకోకుండా ఉండటం ఆరోగ్యప్రదం కాదు.

– ముదిగంటి సుజాతారెడ్డి



‘ఈ పాట కోరిన వారు గంభీరావుపేట, గంగపుత్ర కాలనీ నుండి రమ, జ్యోత్స్న, రవి, మురళి, కిరణ్, చందు మొదలైన వారు’ అనే సుదీర్ఘనామ చిత్రంతో సరికొత్త ప్రయోగం చేయబోతున్న యువ దర్శకుడు **మదన్**. మదనపల్లి బి.టి. కాలేజీలో చదివే రోజుల్లో ‘ఒంటి గొర్రె’, ‘పిచ్చి కుక్కలు’ లాంటి వెరైటీ పేర్లతో నాటకాలు రాసి ప్రదర్శించిన అనుభవం ఉంది. ‘ఆ నలుగురు’తో సినీ ప్రవేశం చేసి ‘పెళ్ళైన కొత్తలో’, ‘ప్రవరాఖ్యుడు’, ‘గుండె ఝల్లుమంది’ చిత్రాలకు దర్శకుడై టాలీవుడ్‌లో సెటిలైపోయిన ఆయన కాలేజి రోజులే ఈవారం హ్యాపీ డేస్.

# మధ్యాహ్నం పరీక్ష ఉన్నా మార్నింగ్ షో చూసేవాణ్ణి

మా కాలేజీ రోజులు ఎప్పుడు గుర్తుకొచ్చినా గర్వంతో నా ఛాతీ అరంగుళం మేర వెడల్పవుతూ ఉంటుంది. నిలువెల్లా ఆనందంతో పులకించిపోతాను. ఆ వెంటనే హార్స్‌లీహిల్స్, రిషీవ్యాలీలతో పాటు మహానుభావులు జిడ్డు కృష్ణమూర్తి, రవీంద్రనాథ్ టాగూర్‌లు కళ్లముందు కదలాడతారు. బాల్య, కౌమారాల నుండి యౌవనారంభం వరకూ మదనపల్లి మట్టి పరిమళాలు పీలుస్తూ పెరిగినవాణ్ణి. ఆ రోజుల్ని గుర్తుచేసుకోవడం అంటే ఆయా దశల్లోకి పరకాయప్రవేశం చేయడమన్నమాట.

## కోయడంలో మాత్రమే ఫస్ట్

‘గిరిరావు థియోసాఫికల్’ హైస్కూల్లో పదవ తరగతి పూర్తి చేసి ఇంటర్మీడియట్ కోసం వందేళ్ల చరిత్ర గలిగిన బి.టి. (బిసెంట్ థియొసాఫికల్) కాలేజీలో చేరాను. విశాలమైన క్లాసు రూములతో, పెద్ద పెద్ద ప్లే గ్రౌండ్స్‌తో, ఎత్తైన రాతి కట్టడంతో కోటను తలపించేది అది. టెన్త్ క్లాస్ వరకు తెలుగు మీడియంలో చదివి ఇంటర్లో బైపీసీ ఇంగ్లీషు మీడియం తీసుకున్నాను. ఆహా ఏమి విశేషమనుకుని సంబరపడ్డాను కాని అది త్వరలోనే విషాదమని తెలిపోయింది. ఎందుకంటే పాఠాలు ఒక్క ముక్కకూడా అర్థమయ్యేవి కావు. దిక్కు తోచని పరిస్థితి. ముందే మా ప్రిన్సిపాల్ డి. కోదండపాణిగారు చండశాసనుడు. నా బాధ వర్ణనాతీతం. ఇంట్లో చెప్పలేక, లెక్చరర్స్ ముందు తల ఎత్తుకోలేక భయంతో క్లాసులు ఎగ్గొట్టేవాణ్ణి. నూట పదిమంది స్టూడెంట్స్ ఉండే మా క్లాసులో నేను తరచూ ఆబ్సెంటే. మా బయాలజీ లెక్చరర్ భాగ్యలక్ష్మి గారికి నా తీరు అర్థమయ్యేది కాదు. అయితే ప్రాక్టికల్స్‌కి మాత్రం రెగ్యులర్‌గా వెళ్లేవాడిని.




మాది ‘దివ్యజ్ఞాన సమాజం’ నెలకొల్పిన కళాశాల కాబట్టి అక్కడ కప్పలు, బొద్దింకల్లాంటి జీవులను చంపడం, కోయడం నిషిద్ధం. మా జువాలజీ లాబ్ జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉండేది. ప్రాక్టికల్స్, ల్యాంగ్వేజీల్లో పాసయితే చాలదు కదా... మొదటి సంవత్సరంలో 4 సబ్జెక్టులు బ్రహ్మాండంగా చీదేశాయి.

## హైద్రాబాద్ పారిపోయాను

అంతే! అవమానంతో తల తీసేసినట్టు సిగ్గుపడిపోయాను. ఒక సుముహూర్తం చూసి నా మిత్రుడు జి.వి. రమణతో కలిసి ‘జంప్ జిలానీ’ అంటూ చేతికి దొరికిన డబ్బుల్ని తీసుకుని ‘చలో హైద్రాబాద్’ అని రైలెక్కేశాను. మొదటి రెండ్రోజులు కాచిగూడ రైల్వేస్టేషన్‌లో కాందిశీకుల్లా గడిపాం. తర్వాత జీడిమెట్లలోని ఒక బిస్కట్ కంపెనీలో క్యాజువల్ లేబర్‌ను తీసుకుంటున్నారని తెలిసి అక్కడికి వెళ్లి లైన్లో నిలబడ్డాం. రోజుకు పదిహేను రూపాయలు ఇస్తారట! నెలకు రూ. 450 అవుతాయి గనక, ఇద్దరివీ కలిపితే 900. దాంట్లో రూమ్ రెంట్‌కు పోగా, మిగతా వాటితో ఎలా గడపాలో లెక్కలేసుకుంటుండగానే ‘నో వేకెన్సీ’ బోర్డు పెట్టేశారు. తెల్లమొహాలేసుకుని మళ్లీ రోడ్ల మీద పడి డబ్బులన్నీ అయిపోగానే ఇక్కడ లాభం లేదని, ఈసారి అనంతపురం వెళ్దామని దొంగ రైలెక్కాం. రైలు కదిలీ కదలగానే టి.సి. కంట్లో పడి మిగిలిన పదీ పాతికా అతగాడికి సమర్పించేసి దిగాలుగా కూర్చున్నాం.

## మార్గం చూపిన శ్రేయోభిలాషి

ఆ రైలు సాంకేతిక కారణాల చేత గద్వాల స్టేషన్లో దాదాపు రెండు గంటలు ఆగిపోయింది. ఇప్పటికీ బాగా జ్ఞాపకం ... బయట చిమ్మచీకటి ... మా ముందున్న భవిష్యత్ మాదిరే. దానికి తోడు హోరు గాలి ... వర్షం. మమ్మల్ని హైద్రాబాద్ నుండి గమనిస్తున్న ఒకాయన మెల్లగా మా కూపీ లాగి ‘ చదువు లేకపోతే మీరెందుకూ కొరగారు. మదనపల్లికి వెళ్లి కాలేజీ కంటిన్యూ చేయండి. లోకంలో అమ్మా, నాన్నలకంటే శ్రేయోభిలాషులు ఉండరు. వాళ్లు మిమ్మల్ని ఏమీ తిట్టరు’ అంటూ హితబోధ చేశారు. ఆశ్చర్యంగా ఆ మాటలు మాపై మంత్రించినట్లు పనిచేశాయి. ఆయన చెప్పినట్టుగానే మమ్మల్ని ఇంట్లో వాళ్లు ఏమీ అనలేదు. అప్పటికే అమ్మ దిక్కులు పిక్కటిల్లేలా నాకోసం ఏడుస్తోందని తెలిసింది. రెండు రోజులయ్యాక ప్రాబ్లమ్ ఏంటని బుజ్జగిస్తూ అడిగారు నాన్న. 4 సబ్జెక్టులు పోయిన విషయం చెప్పాను. ఆయన అర్థం చేసుకుని ‘నీవు తెలుగు మీడియం నుండి ఇంగ్లీషు మీడియం

లోకి వెళ్లడం వల్ల జరిగిన నష్టం' అని చెప్పి డిక్షనరీ ఒకటి కొని బేసిక్స్ నుండి నేర్పించారు. దాంతో సెప్టెంబరుకి ఆ 4 సబ్జెక్టులూ ప్యాసై, విజయవంతంగా సెకండియర్ కూడా కంప్లీట్ చేసే శక్తి వచ్చేసింది. ఆ సంవత్సరం మా క్లాసు రిజల్టు కేవలం 30 శాతం మాత్రమే. ఆశ్చర్యం ఏమంటే రెగ్యులర్‌గా కాలేజీకి వెళ్లి బుద్ధిగా చదివిన వాళ్లు ఫెయిలయితే అమావాస్య, పౌర్ణమికి క్లాసులకు వెళ్లిన నేను ప్యాసవడం.

## డాక్టర్ కావాలనుకున్నాను

ఇంటర్ ప్యాసవగానే డాక్టర్ అయిపోవాలని కలలుగని ఎం.సెట్. రాసే ప్రయత్నంలో మునిగిపోయా. కాని నీకు మెడిసిన్‌లో సీటు వచ్చినా డొనేషన్లు కట్టి చదివించే శక్తి మాకు లేదని ఇంట్లో కచ్చితంగా చెప్పేశారు. దాంతో అలక సాగించాను. నా వ్రతం ముగిసేలోగా డిగ్రీ కాలేజీలో కూడా సీట్లన్నీ భర్తీ అయిపోయాయి. చివరికి బి.ఎ. (హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్) తీసుకున్నాను. ఆ గ్రూపు ఇంగ్లీషు మీడియం మొత్తంలో నేనొక్కడినే స్టూడెంట్‌ని. నా ఒక్కడికోసం విడిగా పాఠాలు చెప్పరు కదా, అందరితోపాటు తెలుగులో విని ఇంగ్లీషులో ఆలోచించేవాణ్ణి.


ప్రియమణికి సూచనలిస్తూ...

మా కాలేజీకి దగ్గర్లో ఒక శ్మశానం ఉండేది. అక్కడుండే చింతచెట్లకింద కూర్చుని చదువుకోవడం భలే ఇష్టం నాకు. ఒకసారి ఆ చెట్లకింద చదువుకుంటూ ఉండగా మా మిత్రుడు రవికుమార్ వచ్చి ''ఏరా, కాలేజీ డే వస్తోంది. మనం కనీసం స్పోర్ట్స్‌లో గానీ, ఎన్.సి.సి.లో గానీ లేము. ఎందులోనూ లేకపోతే మనకి వాల్యూ ఉండదు. ఏదైనా నాటకం రాయి. వేద్దాం'' అని సలహా ఇచ్చాడు. అప్పటికే కాస్త సాహిత్య వాసనలు పీలుస్తున్నానేమో ఆలోచించి, చించి 'విద్యార్థులకు రాజకీయాలు అవసరమా?' అనే కాన్సెప్ట్‌తో ఒక డ్రామా తయారుచేశాను. నాటికకీ, నాటకానికీ తేడా తెలీకుండానే 'ఒంటి గొర్రె' అనే డ్రామా రాసేశా. తీరా దాన్ని ప్రదర్శించే సమయానికి ఒక పాత్రధారి రాలేదు. ఏం చేయాల్రా దేవుడా అనుకుంటుండగా దేవుడిలా గోపాల్‌రెడ్డి అనే మిత్రుడు కనిపించాడు. వాడు అప్పటికే 15 రోజుల్నుండి విరేచనాల బాధతో కాలేజీకి సెలవు పెట్టి, కేవలం నా 'ఒంటి గొర్రె'ని వీక్షించడానికే పడుతూ లేస్తూ వచ్చాడట పాపం! వాడిని బతిమాలి అప్పటికప్పుడు సన్నివేశం వివరించి ఆ పాత్రని వేయించాను. డ్రామా విజయవంతంగా అట్టర్ ఫ్లాప్ అయింది. ఊరట ఏంటంటే మా మిలట్రీ ప్రిన్సిపాల్ ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ చేస్తూ గెలుపొందిన నాటకాల వెనక సీనియర్ లెక్చరర్లు ఉన్నారు కానీ 'ఒంటి గొర్రె' వెనక మదన్ ఒక్కడే ఉన్నాడని కితాబివ్వడం.

## మేనల్లుడి కిడ్డీ బ్యాంకు కొల్లగొట్టేవాణ్ణి

నా సినిమా పిచ్చి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. పన్నెండు గంటలకు ఎగ్జామ్ ఉందని తెల్సినా ఉదయం 9గంటల షోకి వెళ్లిపోయేవాణ్ణి. డబ్బులకి మా నాన్న జేబులు తడిమేసేవాణ్ణి లేదంటే మా అక్క కొడుక్కి ఒక కిడ్డీ బ్యాంకు ఉండేది. దానిపై మా అక్క 'పునీత్ బ్యాంకు' అని అందంగా రాసింది కూడా. పాపం పిల్లాడని ఇంటికి వచ్చిన వాళ్లంతా ఆ బొమ్మ బ్యాంకులో 5, 10 నోట్లు వేసేవారు. మనకు కావలసింది కూడా అదే కదా. ఎంచక్కా వాటిని అపహరించి సినిమాలకి చెక్కేసేవాణ్ణి. మా అమ్మ దాచుకునే పోపుల డబ్బాల్లోని చిల్లర మాత్రం ముట్టుకునేవాణ్ణి కాదు. ఎందుకంటే ఆవిడకి ఎక్కడ ఎంత డబ్బు పెట్టింది బాగా గుర్తుండేది. ఒకసారి 'జాకీచాన్' సినిమాకి వెళ్లి వచ్చేసరికి అంతా కూడబలుక్కున్నట్టుగా ఇంటికి తాళం వేసి ఏ పేరంటానికో వెళ్లిపోయారు. నాకేమో కడుపులో ఎలుకలు పరిగెడుతున్నాయి. సినిమా స్టయిల్లో ఇంటి వెనక్కి వెళ్లి పైపులు ఎగబ్రాకి ఇంట్లోకి దూకాను. నా అదృష్టం ఏమంటే మా వంటిల్లు విడిగా ఉండేది. హాయిగా భోజనం చేస్తుండగా మా వాళ్లంతా వచ్చేశారు. నన్ను చూసి ముందు దొంగాడని భయపడ్డా తర్వాత ఔరా! అని నోరు తెరిచి ముక్కున వేలేసుకున్నారనుకోండి. ఆ సినిమా పిచ్చి రాను రాను ముదిరిందే కాని తగ్గలేదని చెప్పక్కర్లేదనుకుంటా.

## 'పిచ్చికుక్కల'ని పిలిచేవారు

'ఒంటి గొర్రె' స్ఫూర్తితో డిగ్రీ ఫైనల్లో ఉండగా 'పిచ్చికుక్కలు' అనే నాటకం రాశాను. అయితే మా కాలేజీలో వేయడానికి కాదు, 'మదనపల్లి నాటక కళా పరిషత్' కోసం. జడ్జీలు మా ఇంగ్లీషు లెక్చరర్ ప్రసిద్ధ సాహితీవేత్త వల్లంపాటి వెంకటసుబ్బయ్య, స్థానిక రిటైర్ జడ్జి జయరాంరెడ్డిగార్లు. రిహార్సల్స్ టైంలో మా టీంలోని స్టూడెంట్స్ హడావిడిగా తిరుగుతుంటే 'పిచ్చికుక్కలు తిరుగుతున్నాయి జాగ్రత్త!' అని అరిచేవాళ్లు మా కోతి మూక.

మా నాటకం ప్రారంభమవగానే భోరున వర్షం మొదలైంది. దాంతో ఎక్కడి వాళ్లక్కడ పలాయనం చిత్తగించారు. మిగిలింది జడ్జిగార్లు, మా పాత్ర ధారులు. వల్లంపాటిగారు 'ఆ పక్కనున్న షెడ్‌లో కంటిన్యూ చేయండి. పరిశీలించి మార్కులు వేస్తాం' అన్నారు. నేను ససేమిరా అన్నాను. 'పిచ్చికుక్కలు పోటీకి కాదని, ప్రేక్షకులు చూడడానికే' అని పట్టుబట్టి మర్రోజు ప్రదర్శించడానికి ఒప్పించాను. డ్రామా సూపర్ సక్సెస్. ఫస్ట్ ప్రైజు రాకపోయినా కన్సలేషన్ బహుమతి వచ్చింది.

## వల్లంపాటిగారి రచనల స్ఫూర్తి

వల్లంపాటిగారు మొదట్లో మా ఇంగ్లీషు లెక్చరర్‌గా మాత్రమే తెలుసు. తర్వాతే తెలిసింది ఆయనెంత మేధావో. వారి కథాశిల్పం, నవలా శిల్పం పుస్తకాలు నన్నెంతో ప్రభావితం చేశాయి. ఆయన నా గురువు కావడం నా అదృష్టం.

మాది కో-ఎడ్యుకేషన్ కాలేజే అయినా అమ్మాయిల జోలికి వెళ్లేవాణ్ణి కాదు. నా ముక్కు కోటేరులా ఉన్నా బక్కగా చామన ఛాయలో ఉండేవాణ్ణి. ప్రేమలూ దోమలూ నా ఒంటికి సరిపడవనే ఆత్మనూన్యత నాలో ఎక్కువగా ఉండేది అప్పట్లో. అదీగాక జిడ్డు కృష్ణమూర్తి నడయాడిన, రవీంద్రుడు 'జనగణమన' జాతీయ గీతాన్ని ఇంగ్లీషులోకి తర్జుమా చేసిన నేలలో విపరీత పోకడలు పోకూడదని నాకు నేను బుద్ధి చెప్పుకునేవాడిని.

'డిగ్రీ' తీసుకున్న తర్వాత హైదరాబాద్ వచ్చేసి, మొదట్లో చిన్నా చితకా పనులు చేస్తూ మెల్లమెల్లగా సినీమా (యా) ప్రపంచంలోకి అడుగుపెట్టాను. ఇప్పటికీ ఎంత చికాకులో ఉన్నా సరే నా మదనపల్లి 'కాలేజీ డేస్' గుర్తొస్తే మనసంతా ఉల్లాసంగా మారి, దూదిపింజెలా తేలిపోతుంది.

madanramigani@gmail.com

– గొరుసు జగదీశ్వరరెడ్డి

# అంకేళి

నిర్వహణ : పి.రాఘవరెడ్డి

**అడ్డం, నిలువులోనే కాకుండా బాక్సులో, క్రాస్‌లో కూడా 1 నుండి 9 అంకెలు ఒకసారే వచ్చేలా నింపాలి. దాదాపు సుడోకు లాంటిదే. కాని రెండు క్రాస్‌లలో కూడా రావడం ఇందులో అదనం.**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 5 | | 2 | 4 | 8 | | |
| 2 | 6 | | | 1 | | | 9 | 7 |
| 7 | | | | | 9 | | | 1 |
| | 7 | 2 | 4 | | 6 | | | |
| 4 | 9 | | | | | | 8 | 5 |
| | | | 5 | | 2 | 7 | 4 | |
| 6 | | | 9 | | | | | 2 |
| 3 | 2 | | | 6 | | | 5 | 4 |
| | | 9 | 2 | 3 | | 6 | | |

## గత సంచిక జవాబులు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 2 | 7 | 9 | 4 | 8 | 5 | 3 | 1 |
| 4 | 3 | 8 | 5 | 2 | 1 | 7 | 6 | 9 |
| 9 | 5 | 1 | 3 | 7 | 6 | 8 | 4 | 2 |
| 7 | 9 | 4 | 8 | 5 | 3 | 1 | 2 | 6 |
| 8 | 6 | 3 | 1 | 9 | 2 | 4 | 5 | 7 |
| 5 | 1 | 2 | 7 | 6 | 4 | 9 | 8 | 3 |
| 3 | 7 | 5 | 6 | 8 | 9 | 2 | 1 | 4 |
| 1 | 4 | 9 | 2 | 3 | 5 | 6 | 7 | 8 |
| 2 | 8 | 6 | 4 | 1 | 7 | 3 | 9 | 5 |

## ఆరు రోజులు ... 15 అంతస్తులు



**15** అంతస్తుల ఈ బిల్డింగ్‌ని చూశారు కదా! ఇదొక హోటల్, చైనాలోని చాంగ్‌షా సిటీలో ఉంది. అతి వేడి లేదా చలి నుంచి, భూకంపాల నుంచి తట్టుకునే విధంగా దీన్ని నిర్మించారు. ప్రీ ఫ్యాబ్రికేటెడ్ మెటీరియల్ వాడారు. ఇందులో మెటీరియల్ వేస్ట్ చాలా తక్కువ అయింది. దీన్ని నిర్మించడానికి ఎంతకాలం పట్టిందనుకుంటున్నారు. ఆర్నెల్లో... సంవత్సరమో... కానేకాదు కేవలం ఆరు రోజులు మాత్రమే.



నరేష్‌ది తీవ్రమైన అభివ్యక్తి. ప్రకృతినీ, పురుషుడినీ; స్త్రీనీ, పురుషుడినీ; ప్రేమ కాముకుడినీ; కాముక ప్రేమికుడినీ – ఎవరినీ అనిశితంగా చూడలేదు. ఎక్కడా విలువల గురించి ఆక్రోశించలేదు. ఒక ప్రేమికుడిగా భాష్యం చెప్పాడు. అది భగ్న ప్రేమ కాదు. ప్రేమ పోవడం కదా భగ్నం అవడమంటే. తన మనోఫలకం మీద అనుమానాస్పదంగానో అభిమానాస్పదంగానో తచ్చాడే ఎవరినీ ప్రేమించకుండా, రమారమించకుండా, మనసుకు పట్టించుకోకుండా లేడు– అది సుభాగ్యమ్మ గాని, నాగనందిని గాని, మామగారు హెబ్బారులవారు గాని,

## నువ్వేం మాయ చేశావో గానీ...



సత్యసాయి గాని. సత్య ప్రేమికులైనా, నిత్య శంకితులైనా– అందర్నీ చదవడంలో ఒకే గాటన కట్టి ఒకే బాటను పట్టించిన జాణ నరేష్. వారి గురించి వారికి మాత్రమే తెలిసినవి, వారు మాత్రమే చెప్పగలిగినవి కూడా నరేష్ చెప్పగలిగాడు అంటే– అది ప్రతిభను మించిన విషయం. మానవాతీతం కాని అద్భుత శక్తేదో వశం చేసుకున్నవాడు అతడు.

నరేష్ లాంటి అద్వితీయ ప్రేమికుడిని దూరం చేసుకున్న భారతిపై జాలితో కూడిన కోపం; అనితర సాధ్యమైన ప్రేమకు పరాకాష్ట (?)గా ఇద్దరూ ఒకటి కాలేనప్పుడు కలిగిన నిరాశ; ప్రేమకోసమై ఇలలో పడిన పాపం పసివాడి కష్టాలకు తన్నుకొచ్చిన దుఃఖం; అన్నీ కలగలిసి – పోనీలే ఇంతలేసి ప్రేమ అపాత్రదానం కాలేదు అన్పించినా, నాకు తెలియకుండా అప్పుడే నాలోంచి తన్నుకొచ్చిన పురుష గోరోజనం ... ఏమి చెప్పుదున్ నా పరేషాన్ నరేషా?

సమకాలికులందరూ చచ్చిన తర్వాత, ఎవరికీ ఏమీ నష్టం లేదు అనుకున్నప్పుడు మాత్రమే రాయగలిగిన ఇలాంటి 'ది'(కవితో, కథో, ప్రోజో, పోయెట్రీయో తెలియడం లేదు కాబట్టి– 'ది' అన్నాను) రాయడం నిజంగా సాహసమే. అంతకు మించి తెంపరితనమే. దానికి మించి అబ్జెక్టివిటి కలక సోకిన మనోనయన వికారమే. A must read. Keep it up Naresh Nunna.

– శ్రీశైల్ రెడ్డి పంజుగుల

**తేరా నామ్ ఏక్ సహారా?!**, నరేష్ నున్నా
పేజీలు : 71, వెల : రూ. 50/–
ప్రతులకు : పాలపిట్ట బుక్స్, హైదరాబాద్–44 సెల్ : 98487 87284

---

## కామెడీ కాలజ్ఞానం

విషాదం పరాకాష్టకు చేరితే పుట్టే వేదాంతమే హాస్యం. వర్తమానంలో జనానికి సామాజికంగా ఎదురవుతున్న విషాదాలను కాలజ్ఞానం కోణంలో చెబుతూ హాస్యం పుట్టించడానికి మోహనరావు దురికి చేసిన ప్రయత్నమే 'కామెడీ కాలజ్ఞానం 2050' పుస్తకం. మన దేశంలో బతకడం ఎంత కష్టమో వివరిస్తూ ఒకానొక సినీ కవి 'చావు కూడా పెళ్లిలాంటిదే' అని అంటే, ప్రస్తుత పరిస్థితిలో ట్రాఫిక్



జామ్ నుంచి క్రెడిట్ కార్డులు వరకు ప్రతీ సమస్యా ఎంత నరకంగా మారిందో మోహనరావు నవ్వులాటగా ఇందులో చెప్పారు. కాలజ్ఞానం మనల్ని నవ్విస్తూనే, ఆలోచింపజేస్తుంది కూడా. బంధాలు నుంచి మాతృభాష వరకు అన్నిట్లోనూ రచయిత కాలజ్ఞానాన్ని కాచి వడపోసి కామెడీ పండించారు. 'ఒలింపిక్స్ 2052–హైదరాబాద్', 'ఆలిండియా అంట్లుతోమే వాళ్ల సంఘం–జిందాబాద్' వంటి వ్యాసాల్లో పాఠకుడ్ని నవ్వించడానికి రచయిత 'అతి' సరిహద్దును దాటే ప్రమాదం ఎదుర్కొన్నప్పటికీ కామెడీ నావను సునాయాసంగానే లాగించారు.

– బల్లెడ

**కామెడీ కాలజ్ఞానం 2050** మోహనరావు దురికి
పేజీలు : 112, వెల : రూ.60, ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్

## పుస్తకాలు

లౌకిక ప్రపంచంలో తిరిగి,తిరిగి, ఆఖరుకు కవి అజ్ఞాతంలోకి వెళ్లవలసివస్తుంది. పాతతుప్పు వదలడానికి అదే సమయం. కొత్త చూపు రూపొందడానికి అదే సమయం. సాహితీ ఆయుధాలు సమకూర్చుకోవడానికి అదే సమయం. భావం, అనుభూతి, అభిప్రాయం, సిద్ధాంతం...ముడి పదార్థాలను కవిత్వంగా మలచడం ఎలాగో తెలుసుకోవడానికి అదే సమయం. జారిపోయేసమయాన్ని కవి చేతుల్లోకి తీసుకోవడానికి అదే సమయం.



### శశికాంత్ శాతకర్ణి 'జ్వాలాపాతం'

''నీ వృత్తేమిటి?'' / ''మాటలకు సాన బెట్టడం'' / ''నీ లక్ష్యం ఏమిటి?'' / ''పాత మాటలకు కొత్త అర్థాలు కూర్చడం కొత్త

# కవి అజ్ఞాతంలోకి వెళ్ళాలి

అర్థాలకు సరికొత్తమాటలు రూపొందించడం'' / ''నీవు ప్రస్తుతం చేస్తున్నపనేమిటి?'' / ''మకిలిపట్టిన మాటలను శుభ్రపరచడం. మొద్దు బారిన మాటలకు పదును పెట్టడం'' / ''ఇంతకీ నీ పేరేమిటి?'' / ''డిలాన్ థామస్''

(డిలాన్ థామస్ కవిత)



ప్రశ్నలను బట్టి ఇది వచనం అనిపించవచ్చు. కానీ బదుల్లను బట్టి ఇది కవిత్వం.

వజ్రాయుధం కవి ఆవంత్స సోమసుందర్ కవిత్వానికీ, ఆయన కొడుకు శశికాంత్ కవిత్వానికీ పోలిక లేదు. అదే ఈ కవి బలం. కవి శివారెడ్డి, ఈసారి ముందుమాటలో పొగడ్తలు తగ్గించి, 'జ్వాలాపాతం' నే పథ్యం గురించి రాయడం బాగుంది. కవి కూడా రాగద్వేషాల పాల బడకుండా కవిత్వం బాధనే తన బాధగా సొంతమాటలో పలికించడం పాఠకులకు ప్రయోజనకరం. ఆ ఇద్దరి విషయంలో ఇలా జరగడానికి వారి మహత్తేమీలేదు. శశికాంత్‌శాతకర్ణి కవిత్వమే వారిని అదుపులో పెట్టింది.

వెల: రూ.100 ప్రతులకు : అన్ని పుస్తకాల షాపులు



### ఆశారాజు 'ఇప్పుడు'

చాలాసార్లు అనుకుంటాను / రెండు నిమిషాలు కూర్చొని / బాధపెడుతున్న గాయాన్ని / మనసారా చూసుకుందామనుకుంటాను / ఈ రణగొణ రద్దీలో / సమయమే దొరకదు ... ... ( 'నా ముఖమే కనిపించదు' నుంచి)

కొన్ని కవితలు బాగున్నాయి. చాలా మూసధోరణిలోనే ఉన్నాయి. 'నా ముఖమే కనిపించదు' ఎంతో బాగా మొదలయింది. ఆ తరువాత మధ్యలో ఎందుకు ఇలా మారిపోయింది-నేను బతికిన బతుకులో చేయవలసినవి చేయకుండా/ చేయవలసినవి చేశానా?/ చేయకూడనివి చేసి/ చేయవలసినవి మరిచానా?/ ఒకసారి తిరిగిచూసుకుందామనుకుంటాను-ఇలా రాయకుండా ఉంటే కవిత్వం మిగిలేదేమో!

కరువు కాటకం, గిరీశం, కొత్త భయం, నువ్వే..!, నీవు ఉండేవుంటావు.. ఇలా ఎన్నైనా చెప్పొచ్చు. అవి పేరుకే కవితలు. మొనాటనీని ఎవరో కాదు కవే బద్దలు కొట్టవలసివుంది. ఆశారాజు నుంచి అలా ఆశిద్దాం

వెల: 90 రూ., ప్రతులకు: అన్ని పుస్తకాల షాపులు

### బివివి ప్రసాద్ 'ఆకాశం'

పుట్టగానే పిల్లలు నవ్వరెందుకని
వాళ్లు ఏ వెలుతురులో ఈదీ వచ్చారు
ఏ ఆనందాలు దాటివచ్చారు
ఏ హద్దుల్లేని దేశాలు ఎగిరివచ్చారు
పుట్టగానే పిల్లలు నవ్వలేరెందుకని
('పుట్టగానే పిల్లలు' నుంచి)

రసాత్మకత, గాఢమైన అనుభూతి, సంక్షిప్తత కవిత్వ రచనకు ముఖ్యం అని నమ్మే బొల్లిన వీర వెంకట ప్రసాద్ కవిత్వాచరణలో అది నిరూపించారు. ఒక తాత్వికుడు వ్యాఖ్యానించినట్లు నిద్ర,అలవాటు, మతం,దైవం, నవ్వు..తదితర అంశాలను అందంగా వ్యాఖ్యానిస్తూ పోయారు. అదే కవిత్వం అయింది. అయితే ఈ పుస్తకానికి సంబంధించి రెండు ఆశ్చర్యాలు. కవి ఏళ్ల కొద్దీ కవిత్వానికి దూరంగా ఉండి, ఆ తరువాత.... కేవలం నాలుగునెలల్లో ఇన్నేసి కవితలు రాయడం ఒక ఆశ్చర్యం. సాహిత్యానికి బద్ధ శత్రువు వ్యాపారంఅనుకుంటాం కదా! అలాంటి వృత్తి లో పాలుపంచుకుంటూ 'మంచి'కవితలు రాయడం రెండో ఆశ్చర్యం.

వెల: 70 రూ., ప్రతులకు: పాలపిట్ట బుక్స్, సలీంనగర్ కాలనీ, మలక్‌పేట, హైదరాబాద్.

**– యింద్రవెల్లి రమేష్**

# కవితా స్వీకారం



**లోలోన...**
రచన : సంగెవేని రవీంద్ర
పేజీలు : 99,
వెల: రూ.60/-

**రేపటి వర్తమానం**
రచన : అడిగోపుల వెంకటరత్నమ్
పేజీలు : 111, వెల: రూ.60/-

**షాలమ్మీతీ! షాలమ్మీతీ!!**
రచన : డా. కె. బి.డేవిడ్ లివింగ్‌స్టన్
పేజీలు : 64, వెల: రూ.100
ప్రతులకు : ప్రముఖ పుస్తక కేంద్రాలు

★★★

**ఊపిరి** (తల్లిపాల రుణం)
సంపాదకులు : పొట్లపల్లి శ్రీనివాసరావు
అనిశెట్టి రజిత
పేజీలు : 344, వెల : రూ. 170
ప్రతులకు : 98492 54078

★★★

**గోరింట పూలు**
తెలుగు : డా. చాగంటి తులసి
పేజీలు : 87, వెల: రూ.60

**కవిగానే కనుమూస్తా**
రచన : కె.జనార్దన మహర్షి
పేజీలు : 175, వెల: రూ.90
ప్రతులకు : 98487 87284

★★★

**పక్షి కాశి**
అనువాదం : మార్కండపురం శ్రీనివాస
పేజీలు : 88, వెల: రూ.90
ప్రతులకు : 080-2226 8729

★★★

**పొద్దు పొడుపు**
రచన : అన్నవరం దేవేందర్
పేజీలు : 77, వెల: రూ.65
ప్రతులకు : శ్రీమతి రాజేశ్వరి, ఫ్లాట్ నెం. 406, మారుతి హెవెన్స్, భగత్‌నగర్, కరీంనగర్-505 001.

★★★

**మెతుకు సీమ**



ప్రధాన సంపాదకులు : డప్పోల్ల రమేష్
పేజీలు : 105,
వెల: రూ.50
ప్రతులకు : 95509 23323

# ఎవరెస్ట్ వీరుడు



ఎవరైనా ఎవరెస్ట్ శిఖరాన్ని ఒకసారి అధిరోహిస్తే చాలు అనుకుంటారు. మహా అయితే రెండోసారి ట్రై చేస్తారు. కానీ ఇతగాడు ఏకంగా 21 సార్లు తాటి చెట్టును ఎక్కినట్లు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాడు. దాంతో అతనికి గిన్నిస్‌బుక్‌లో చోటుదక్కింది. అపా షెర్పా కాట్మండుకి యాభై మైళ్ళ దూరంలో ఉండే సిందుపాల్‌చాక్ జిల్లా వాసి. ఓ సాధారణ రైతు. ఎవరెస్ట్ శిఖరానికి దిగువన ఉన్న ప్రాంతంలో బంగాళాదుంపలను పండిస్తూ జీవనం గడిపేవాడు. అయితే ఏటా మంచు కరగడం వల్ల వచ్చే వరద తాకిడికి ఆరుగాలం పండించిన పంటంతా నీటిపాలయ్యేది. దీంతో జీవనం గడుపుకోవడానికి ప్రత్యామ్నాయం చూసుకోవాలనుకున్నాడు. హిమాలయ పర్వతాలను చూసేందుకు వచ్చే యాత్రికుల లగేజిని మోస్తూ... వారిచ్చిన డబ్బుతో కొంతకాలం పొట్ట పోసుకొనేవాడు. కొద్దికాలం తరువాత గైడ్‌గా పనిచేయడం ప్రారంభించాడు. ఆ రకంగా 1989లో మొదటిసారిగా ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 21సార్లు ఎక్కాడు ఈ 51 ఏళ్ళ అపా షెర్పా.



# తిర(ఆ)స్కార్..

ఆస్కార్ అవార్డు వచ్చిందంటే చాలు ఎవరైనా ఉబ్బితబ్బిబ్బవుతారు. ఒక్కసారిగా వారి కీర్తి ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతుంది. ఆ అవార్డు రావడమే గ్రేట్‌గా ఫీలవుతారు. కానీ కొంతమంది ఆ అవార్డును కూడా గడ్డిపోచలా పక్కన పడేశారంటే మీరు నమ్మగలరా. ఇది నిజం. 1935లో 'ద ఇన్‌ఫార్మర్' అనే చిత్రానికి ఉత్తమ రచయితగా డడ్లీ నికోల్స్‌కి ఆస్కార్ అవార్డు వచ్చింది. కానీ ఆయన ఆ అవార్డును తిరస్కరించాడు. కారణమేమంటే అప్పుడు సినిమా స్టూడియోలకు వ్యతిరేకంగా రైటర్స్ గిల్డ్ బంద్ పాటిస్తోంది. అలాగే 1970లో 'ప్యాటన్' చిత్రానికి గాను ఉత్తమ నటుడిగా జార్జ్ సి.స్కాట్‌ని ఎంపిక చేయగా ఆయన కూడా తిరస్కరించారు. పోటీల్లో పాల్గొనడం తనకు ఇష్టం లేదని చెప్పారు. అలాగే తాను ధరించిన పాత్ర కూడా తనకు నచ్చలేదని ఆయన చెప్పినట్లు వినికిడి. 1972లో 'గాడ్‌ఫాదర్' చిత్రంలో మార్లిన్ బ్రాండో నటనకు గాను ఆస్కార్ ఇవ్వగా ఆయనా ఈ అవార్డును తీసుకోలేదు. ఎందుకంటే హాలీవుడ్ రెడ్ ఇండియన్లను చిన్నచూపు చూస్తోందని. అంతేకాదు రెడ్ ఇండియన్ల హక్కులకోసం పోరాడుతున్న సచీన్ లిటిల్ ఫెదర్ అనే యాక్టివిస్ట్‌ని వేదిక మీదకు పంపి... తాను ఎందుకు ఆస్కార్ అవార్డు స్వీకరించడం లేదో ఆమె ద్వారా చెప్పించారు ఆయన.







# మైక్రోబ్లాగింగ్ గాగా



పాటతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్న అమెరికన్ పాప్ సింగర్ లేడీ గాగా ఇప్పుడు సోషల్ నెట్‌వర్క్ సైట్‌తోనూ కోట్ల మంది అభిమానులను సంపాదించుకుంది. ట్విట్టర్ ఉపయోగించేవారిలో ప్రపంచంలోనే ఆమెది ప్రథమ స్థానం. ప్రస్తుతం ఆమెను ట్విట్టర్‌లో రెండు కోట్ల మంది ఫాలో అవుతున్నారు. మరో హాట్ గాళ్ షకీరా 1.45 కోట్ల మంది ఫాలోవర్స్‌తో నాలుగోస్థానంలో ఉన్నారు. గాగాని ఫేస్‌బుక్‌లో కూడా 4.8 కోట్ల మంది అభిమానులు ఫాలో అవుతున్నారట. గూగుల్ ప్లస్‌లో 8 లక్షల మంది ఆమె సర్కిల్‌లో ఉన్నారు. ఎప్పటికప్పుడు తన అకౌంట్‌ని అప్‌డేట్ చేస్తుంటానని చెబుతోంది ఈ యువ పాప్ గాయని.

# అంకెలతో అదృష్టం

**ఐ.బి. సాహు**
సెల్ : 95810 94208, 90142 48124

పుట్టిన ప్రతి మనిషికీ పేరుంటుంది. పేరొచ్చిన మహానుభావులూ, తృప్తికరమైన జీవితాన్ని అనుభవించే తెలివైన వారిలో 90 మంది పేరు మార్చుకున్నవారే!

ఇందిరాగాంధీ, శ్రీశ్రీ, రజనీకాంత్, బాపూ, ఇళయరాజా ఇలా ఎందరో... వీరంతా పేరు మార్చుకున్నవారే, పేరు మారినవారే! పేరు మారినంత మాత్రాన, పేరులో అక్షరాలు మారినంత మాత్రాన జీవితం మారిపోవడం... ఇదెలా సాధ్యం?

పేరులో వైబ్రేషన్ ఉంటుంది. అది ఆ పేరులోని అక్షరాల్లో నిక్షిప్తమై ఉంటుంది.

అయితే ఆ వైబ్రేషన్ పాజిటివ్ కావచ్చు, నెగెటివ్ కావచ్చు. తెలియని తనంతో పెట్టుకున్న పేరు నెగెటివ్ అయితే మనిషి ఆ వైబ్రేషన్ సుడిగుండంలో కొట్టుకుపోవాల్సిందే!

అందుకే మనిషికి కానీ, కంపెనీలకు కానీ, నామకరణం చేసేటప్పుడే పాజిటివ్ వైబ్రేషన్ పుష్కలంగా ఉండేలా చూసుకోవాలి.

నామకరణం ఏనాడో జరిగిపోయినా ఫర్వాలేదు, ఇప్పుడు పేరు మార్చి కానీ, అక్షరాలు మార్చి కానీ పాజిటివ్ వైబ్రేషన్‌లోకి తెచ్చుకుంటే జీవితం మరి సెలబ్రేషనే!

పాఠకులు ఈ క్రింది వివరాలను వ్రాసి పంపండి.

1. పేరు........................
2. పుట్టిన తేదీ ...........
(తేదీ లేనివారు 1 నుండి 52 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాయండి.)
3. పుట్టిన సమయం .........
(లేకపోయినా ఫర్వాలేదు)
4. పుట్టిన ఊరు ...........
(గ్రామమైన పక్షంలో దగ్గరలో ఉన్న పట్టణం)

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అంకెలతో అదృష్టం**

ఆంధ్రజ్యోతి దినపత్రిక,
ప్లాట్ నెం. 76, అశ్విని లే-అవుట్,
జూబ్లీహిల్స్,
హైదరాబాద్ – 500 033.

**సంఖ్యాశాస్త్రాన్ని సశాస్త్రీయంగా నేర్చుకోవాలనే ఆసక్తి కలిగి ఉన్నవారికి అన్వయ ఫలితాలతో ఖచ్చితమైన పద్ధతులలో సంఖ్యాశాస్త్రం అందుకోవాలనే వారి కోసం క్లాసెస్ నిర్వహించబడుతున్నాయి. వివరాల కోసం 81255 84837 నంబర్‌లో సంప్రదించగలరు.**

★★★

**వి.ఆర్.కె., విశాఖపట్నం**

**నా పేరులో పాజిటివ్, నెగెటివ్ వైబ్రేషన్స్ వివరించండి. పేరులో ఏవిధమైన మార్పు చేసుకుంటే అభివృద్ధి ఉంటుందో వివరించగలరు.**

ఒక వ్యక్తి పేరు పరిశీలించడంలో రెండు పద్ధతులు. ఒకటి పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, పుట్టిన సమయం, పుట్టిన ఊరు. ఈ అంశాలన్నీ ఖచ్చితంగా ఉన్నప్పుడు వైబ్రేషన్ బలాలు ఖచ్చితంగా అంచనా వేయవచ్చు. జీవితంలో జరిగిన సంఘటనలను విప్పి చెప్పవచ్చు. జరిగేవి కాల పరిధిలోనే వివరించవచ్చు. లెక్కించి, గణించి, గుణించి సంఖ్యా రూపంలో మార్పును పేరు ద్వారా ట్రాన్స్‌ఫార్మ్ చేయవచ్చు. ఇది డీటెయిల్‌గా జరిగే ప్రాసెస్. టైమ్ ఎక్కువగా పట్టే ప్రాసెస్. రోజులో మూడు ఛార్ట్‌లు మాత్రమే గణించగలం.

రెండవ పద్ధతి. నేమ్ ఎనాలిసిస్. మీ పేరు అన్ని పద్ధతులలోను లెక్కించడం. పుట్టిన తేదీకి సరిచేయడం. విధాన సంఖ్యకు సరిచేయడం పాజిటివ్ సంఖ్యకు బ్యాలన్స్ చేయడం. ఈ పద్ధతిలో మీ పేరు గురించి సంఖ్యాపరంగా సరిగ్గా ఉందా! లేదా. సరిచేయడము. ఇవి జరుగుతాయి. ఈ పద్ధతికి పుట్టిన తేదీ అవసరం లేదు. పేరులో గ్రాఫ్ ఎలా ఉంది. ఏ సంఖ్య రిపీట్ అవుతుంది. ఏ సంఖ్య మిస్ అయింది. ఇలా ఒక ఛార్ట్ ప్రకారం లెక్కించడం. ఇది సులువైన పద్ధతి ఇందులో ప్రిడిక్షన్ ఉండదు. మీ గతం గురించి అంచనా ఉండదు. మీ భవిష్యత్తు ఎలా ఉంటుంది అనే ప్రశ్నకు సమాధానం... మీ పేరు వ్రాస్తూ ఉండండి అంతా మంచి జరుగుతుంది. ఇంతకంటే ఏమీ తెలియదు ఈ పద్ధతిలో.



రెండవ పద్ధతిలో మీ పేరు వివరణ నేమ్ అనాలిసిస్ ఈ క్రింది విధంగా ఉంటుంది.

మీ పేరులో వైబ్రేట్ అయ్యే సంఖ్యలు వరుసగా 65, 50, 48, 32, 21, 12, 8. ఇవన్నీ మీ పేరు రకరకాలుగా పిలువబడినపుడు, మీరు సంతకం చేసినపుడు వెలువడే సంఖ్యా స్వరూపాలు. బేసిక్‌గా 2,5,3,8 స్థాయిల్లో శక్తి ట్రాన్స్‌ఫార్మేషన్ జరుగుతూ ఉంటుంది. మీ పుట్టిన తేదీ 23. అంటే 5వ సంఖ్య. విధాన సంఖ్య 25. 23/5 మరియు 43/25/16 సంఖ్యా రూపాలలో శక్తి వెలువరించే మీ జన్మ విధాన సంఖ్యలు ఇవే. అన్ని సంఘటనలకూ మూలం ఇవే సంఖ్యలు. ఈ సంఖ్యలు వెలువరించే శక్తి స్థాయిలోనే జీవిత భ్రమణం జరుగుతుంది. ఇక్కడ ఏ సంఖ్యా స్వరూపాన్ని విస్మరించే పొరపాటు చేయలేము.

ఈ సంఖ్యల ప్రభావం వరుసగా ఆరోగ్యంపై, వృత్తిపై, ధన నష్టంపై వివాహ జీవితంలో అనిశ్చితిపై ఉంటుంది. ఈ స్వభావాన్ని ఈ డెస్టినీ ప్రభావాన్ని పూర్తిగా మార్చే శక్తి లేదు. రెమిడీస్ పాటించి పేరులో మార్పు ద్వారా ప్రభావాన్ని తగ్గించుకోవచ్చు. ఈ ప్రభావం తగ్గించడం సంఖ్యాశాస్త్రం ద్వారానే సాధ్యం.

ఇది నేమ్ అనాలసిస్‌లో సాధించగలిగే విశ్లేషణ.

మొదటి పద్ధతిలో విశ్లేషణ.

మీ న్యూమెరికల్ కాంబినేషన్ 11/3, 27/5, 21/8.

మీ ఆర్.వి. ఎనర్జీ 37/41.

మొదటి భ్రమణంలో ప్రభావం చూపే సంఖ్యలు 8,6.

రెండవ భ్రమణంలో ప్రభావం చూపే సంఖ్యలు 1,9.

మూడవ భ్రమణంలో ప్రభావం చూపే సంఖ్యలు 5,7.

మొదటి భ్రమణంలో 8,6 సంఖ్యల ప్రభావం జన్మ విధాన సంఖ్యలకు హార్మొనీలో లేదు. దీని ఫలితం బాల్యంలో కష్టాలు. సరైన విద్య అభ్యసించలేకపోవడం ఫలితం డాక్టర్ కాబోయి ఫీల్డ్ మేనేజర్‌గా అవ్వడం. ఇదే స్థాయిలో తండ్రికి ప్రమాదం. అవమానాలు.

రెండవ భ్రమణంలో 1,9 సంఖ్యల ప్రభావం జన్మ విధాన సంఖ్యలకు నెగెటివ్ దిశలో లేకపోయినా పాజిటివ్ శక్తి స్థాయి 50 శాతం వరకు ఉంటుంది. వివాహం త్వరపడి చేసుకోవడం, వాహనం ద్వారా ప్రమాదం. చేతిదాకా వచ్చిన ఉద్యోగం యుద్ధం చేస్తే తప్ప అందకపోవడం ఇవి ఫలితాలు.

ఇక మూడవ భ్రమణంలో 5,7 సంఖ్యలు అనుకూల వ్యతిరేక ప్రభావాలు చూపిస్తుంటాయి. వారసత్వంగా వచ్చిన ఆస్తి షేర్ల రూపంలో కరిగిపోయే అవకాశం. పొరపాటునైనా ఇన్వెస్ట్‌మెంట్స్ షేర్ల రూపంలో జరగరాదు. ఇక్కడ ఎంత స్థిరంగా ఉండగలిగితే అంత నష్టం తక్కువ.

వీటన్నిటినీ మొత్తంగా గుణించినప్పుడు కంట్రోలింగ్ వైబ్రేషన్ 1వ సంఖ్య. అదే ఆర్.వి. ఎనర్జీలో బలమైన సంఖ్యా స్వరూపం. మీ మొత్తం పేరు 73వ సంఖ్యలో ఉండాలి. 73వ సంఖ్యా రూపంలో ఉన్న 10వ సంఖ్య ధననష్టాన్ని నివారిస్తుంది. ఆపై వచ్చే 1వ సంఖ్యా రూపం పాజిటివ్ శక్తినిస్తుంది. ఈ శక్తి సాధనలో ఇతోధికంగా సహాయపడేది కెంపు. పొరపాట్లు జరగకుండా కాపాడగలిగే శక్తి మీ పేరు 73 సార్లు వ్రాయడం ద్వారా వస్తుంది. ధన నష్ట నివారణ కెంపు ద్వారా జరుగుతుంది. అంతేకాదు మీ మాట చెల్లుబాటు అవుతుంది. పేరులో రెండవ పదంలో 'ఎ' అక్షరం చేర్చుకోవాలి. అన్నిచోట్లా పూర్తి పేరు వాడుకోవాలి. సంతకంలోనూ పూర్తి పేరు చేయడం ద్వారా మరింత పాజిటివ్ ఎనర్జీ సాధించవచ్చు. ఇదే మీ పేరులో అక్షరాలు వెలువరించే సంఖ్యారూపపు అదృష్టం. ఈ సంఖ్యా స్వరూపాలను జాగ్రత్తగా అనుసరిస్తే ఏ స్థాయికైనా పయనం సులభం.

Advt

ఈ వారం కవిత

# వేయి వ్రణాల ఆయుధం

మరణం ఒక శిలాశాసనం
పుట్టగానే ఎక్కడో ఒకచోట పాతిపెట్టబడి ఉంటుంది
శిరసావహించాల్సిందే
అనుక్షణం అడుగు వెనకే పడే మచ్చ మరణం
జీవితం వెనకాల చెరగకుండా వెంటాడుతుంది
ఆకు చివర వేలాడే మంచు బొట్టులా మరణం అంచున
వేలాడే జీవితం
అయినా జీవితం మరణం కంటే గొప్పది
ఆఖరి క్షణం వరకు పోరాడాల్సిందే
శరీరమా! ఏడవకు –
లోపల నీకే తెలీని ఒక నిశ్శబ్ద ఘోర యుద్ధం
చడీ చప్పుడూ లేకుండా కణాల్ని పాకిన వ్రణం
మరణం ఎప్పటి నుంచో గద్దలా కాపు కాసి ఉన్నా
పొద పక్కనే చిరుత పులిలా పొంచి ఉన్నా
జీవితం అగ్నిలా రాజుకోనీ
శరీరమా దుఃఖించకు –
మనసులో ఎగిసిపడే మమకారాల పట్టికకు కన్నీళ్ల మరకలే
మిగల్చకు –
పిచ్చిపట్టినట్లు జీవితం కోసం మానేసి సౌందర్యం కోసం
రోదించేలా చెయ్యకు
అయినా ప్రియతమా ఏదో పిచ్చి దుఃఖం!
రేపు నే నిద్రించిన స్థానే కొత్త శరీరం నిద్రిస్తుందా!
నా నగలు, చీరలు మరో శరీరం అలంకరించుకుంటుందా!
నన్ను చుట్టుముట్టే నీ వెచ్చని చేతుల్లో నా బదులు –
ఎన్నెన్ని చేదు విషపు ముళ్ల ఆలోచనలో నా శరీరం నిండా
వాస్తవం కంటే ఎక్కువగా ఎటు ఒత్తిగిలినా గుచ్చుకుంటూ –
లేదు – లేదు నేను మరణించలేదు –
ప్రాణం కంటే వణికించే వైద్యం భయం
ప్రియతమా! ఏమని చెప్పను నీకు?
నిన్ను ప్రతిరోజూ హత్తుకున్న నా గుండెలు మాయమైనా
నా హృదయం ఇంకా మిగిలే ఉంది
పిల్లలకి మమకారపు పాలు పంచుకున్న చోట
అమ్మ గుండెకి బదులు నాన్న గుండె ప్రతిష్ఠించబడింది
కీమోలు, రేడియేషన్ల పర్వంలో
లోపలేం జరిగినా పైపైని జుట్టు పొట్టె రాలిపోయింది
అయినా నా సౌందర్యం
హృదయంలో నా సౌందర్యం ఎక్కడికీ పోలేదు –
నేనింకా మరణించలేదు –
సౌందర్యం మాట దేవుడెరుగు శరీరం తిప్పికొట్టిన ప్రతీసారీ
పేగుల్ని పైకి తోసే కక్కులొకటి
ప్రియతమా! నన్ను రక్షించు
ఇంకేదైనా సులభ మార్గం చూపించు –
ఎన్నో సార్లు వెనక్కీ ముందుకీ లోలకంలా ఊగుతున్న ఆలోచనలు
దుస్స్వప్నం కంటే బాధించే వాస్తవాలు
సకల కళా నేర్పరులకూ మినహాయింపు లేదా!
నేనే కొరడానై ఝళిపించిన రోజులకు ఇక తావు లేదా!
పైకి కనిపించే కళల వెనుక
కలల్ని దోచేసిన కేన్సరు క్రిమి
ఎక్కడో ఏదో పొరపాటు జరిగింది
పసిదానికి నోరైనా రాలేదే
పెద్దబ్బాయికి ఇంకా పదేళ్లేనే
భగవంతుడా! నా పిల్లల్ని శిక్షించకు –
ముక్కుపచ్చలారని పసిపిల్లలకి అమ్మని దూరం చేయకు –
మరణం కంటే బాధించే జీవితాన్ని ఈ శరీరానికి మిగల్చకు–



బొమ్మ: అక్బర్

లేదు – లేదు –
ఏమీ భయం లేదు –
జీవన పరమ పథ సోపానంలో విరిగిన మెట్లని
సరిచేసుకోపోతే ఎలా?
వ్యధా రోగం పట్టినట్టు నిత్యమూ వృధా రోదిస్తే ఎలా?
జీవించేదెన్ని క్షణాలైనా అనుక్షణమూ మరణిస్తే ఎలా?
శరీరమా!
పుష్పించు –
కణాలలో, కళ్లల్లో ధైర్యవిశ్వాసాల్ని నింపు –
వేయి వ్రణాలైనా లెక్క చేయని ఆయుధమై మొలకెత్తు –
మరణ శాసనాలు దద్దరిల్లేలా జీవన నగరా మోగించు –

*(బ్రెస్ట్ కేన్సరు బాధితులకి)*

– కె. గీత
geetamadhavi@yahoo.co.in

కవర్ స్టోరీ

''చూశావా! రామగుండంలో 40 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది..''

''ఈ సారి వర్షాలు బాగా కురుస్తున్నాయి. తెనాలిలో అయిదు సెంటీమీటర్ల కుంభ వృష్టి కురిసిందట..''

''ఇంత చలి నేనైతే ఎన్నడూ చూడలేదు. విశాఖ మన్యంలోని లంబసింగిలో మైనస్ లలోకి వెళ్లిపోయింది..''

ఇప్పుడు ఇలాంటి మాటలన్నీ మారుమూల పల్లెల్లోని సామాన్యులు సైతం మాట్లాడు కుంటున్నారు. వాతావరణం పట్ల ఇంత చైతన్యం పెరగడానికి వాళ్లేమీ పెద్ద పెద్ద పుస్తకాలు చదవలేదు. పరిశోధనలు చేయలేదు. కేవలం దినపత్రికలు, టీవీఛానళ్లలో వస్తున్న వాతావరణ సూచనల్ని చూస్తున్నారంతే..! ఎక్కడ వానపడినా, ఎక్కడ ఎండలు మండినా.. తుపాన్లొచ్చినా, వరదలు ముంచేసినా.. ఆ సమాచారాన్ని వెంటనే చెబుతుంది 'వాతావరణ కేంద్రం'. 1926లో అబ్జర్వేటరీగా మొదలై.. 1973 నుంచి పూర్తిస్థాయి సేవల్ని అందిస్తున్న హైదరాబాద్ లోని వాతావరణ కేంద్రం గురించే ఈ వారం కవర్‌స్టోరీ..

# రాగల 24 గంటల్లో...

''రాగల 24 గంటల్లో వాతావరణ సూచన. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు పడే అవకాశం ఉంది. కోస్తా తీరంలో ఓ మోస్తరు వర్షం కురవొచ్చు. రాయలసీమ, తెలంగాణలో ప్రధానంగా పొడి వాతావరణం ఉండొచ్చు..'' కొన్నేళ్ల నుంచి ఇలాంటి ప్రకటనలను రేడియో, టీవీల్లో వింటున్నాం. వాతావరణ కేంద్రం చేసే ప్రకటనలను సంపూర్ణంగా నమ్మి జాగ్రత్తలు తీసుకునే వాళ్లున్నారు. మరోవైపు ''వాళ్లు చెప్పేది ఏదీ జరగదు. వానొస్తుందంటే ఎండ కాస్తుంది. ఎండ కాస్తుందంటే వానొస్తుంది'' అంటూ హాస్యోక్తులు విసిరే వాళ్లూ ఉన్నారు. ఆ శాఖ మీద ఎన్ని అపవాదులున్నా.. ఇప్పటికీ కొందరు రైతులు వాతావరణ సూచనలు వచ్చే సమయానికి టీవీల ముందు కూర్చుంటున్నారు. దినపత్రికల్లో కూరగాయలు, బంగారం ధరలను చూసినట్లే.. ఉష్ణోగ్రతలు, వర్షపాతాన్ని చదివి తెలుసుకునే వాళ్ల సంఖ్య పెరిగింది. సామాన్యుల్లో సైతం వాతావరణం పట్ల ఈ మాత్రం చైతన్యం రావడానికి వాతావరణ శాఖే కారణం. పంటలు వేయాలన్నా, కోయాలన్నా, మార్కెట్‌కు తరలించాలన్నా.. ఆ రోజు వాతావరణం ఎలాగుంటుందో తెలుసుకోక తప్పడం లేదు.

★ సండే డెస్క్



ఒక్క వ్యవసాయానికే కాదు. విమాన రాకపోకలు క్షేమంగా జరగాలన్నా, బెస్తలు సముద్రంలో సురక్షితంగా చేపలు పట్టుకోవాలన్నా, తీర ప్రాంతాల్లోని ప్రజలు భద్రంగా జీవించాలన్నా.. వాతావరణ శాఖ మీద ఆధారపడాల్సి వస్తోంది. తుపాన్లు, వరదలు, ఈదురుగాలులు, వడగాలులు, వడగండ్ల వానలు, ఉరుములు, మెరుపులు, కుంభవృష్టి, చలి తీవ్రతలు..ఇలా ప్రకృతితో ముడివడిన ప్రతి విషయాన్నీ ముందే తెలుసుకుంటున్నామంటే అది వాతావరణ శాఖ వల్లే సాధ్యమవుతోంది. వర్షాకాలం, ఎండాకాలం, చలికాలం.. అన్ని కాలాల్లోనూ ప్రతి నిమిషం వాతావరణంలో జరిగే మార్పులను పసిగడుతూ.. ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసే ఈ శాఖ సేవలకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పెరిగింది. ప్రతి రోజూ వాతావరణ శాఖ ప్రకటించే ఈ నాలుగు మాటల్ని తయారు చేసేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 578 కేంద్రాలు అలుపెరుగకుండా పనిచేస్తున్నాయి. మన రాష్ట్రంలో హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న 'వాతావరణ కేంద్రం' (మెటొరొలాజికల్ సెంటర్) నాలుగు దశాబ్దాల నుంచి ఆ బాధ్యతను నిర్వహిస్తోంది.

## ప్రతి నిమిషం నిఘాలో..

భారత వాతావరణ విజ్ఞాన విభాగం కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఈ విభాగం కిందే 'ఇండియా మెటొరొలాజికల్ డిపార్ట్‌మెంట్' (భారత వాతావరణ శాఖ) ఏర్పడింది. దీని పరిధిలోనే అన్ని రాష్ట్రాలలో వాతావరణ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఒక్కో కేంద్రం కింద కొన్ని అబ్జర్వేటరీలుంటాయి. మన రాష్ట్రంలో 34 అబ్జర్వేటరీలు ఉన్నాయి. ఇవన్నీ సిబ్బంది ఉండి నిర్వహించే కేంద్రాలే. వీటిలో వాతావరణ పరిశీలన, నమోదుకు ప్రత్యేక ఉపకరణాలన్నీ ఉంటాయి. ఉష్ణోగ్రతల్ని కొలిచేందుకు థర్మామీటరు, వర్షపాతం నమోదుకు రెయిన్‌గేజ్, గాలి వేగాన్ని తెలుసుకునేందుకు ఎనిమోమీటర్, వాతావరణ పీడనం తెలుసుకునేందుకు బరోమీటర్‌లు ఉంటాయక్కడ. తీరప్రాంతాల్లోని అబ్జర్వేటరీల్లో సముద్ర అలల ఎత్తు, పీడనాన్ని కొలిచే పరికరాలు అదనంగా ఉంటాయి. ఎప్పటికప్పుడు రికార్డు అయ్యే వివరాల్ని అబ్జర్వేటరీ ఉద్యోగి ప్రతిరోజూ మూడు గంటలకు ఒకసారి సేకరిస్తారు. అబ్జర్వేటరీలే కాకుండా- మనిషి అవసరం లేకుండా పనిచేసే 'ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లు' (ఎడబ్ల్యుఎస్) మరో 24 ఉన్నాయి. ఈ కేంద్రాలలో వాతావరణ పరిశీలన పరికరాలన్నీ వాటంతటవే వివరాలను రికార్డు చేసి సమాచారం పంపిస్తాయి. ఉదాహరణకు- రెయిన్‌గేజ్ (చిన్న పాత్ర)లోకి వర్షం పడగానే.. ఆ రోజు ఎంత వర్షం పడిందో అదే కొలుస్తుంది. ఆ సమాచారం ఎలక్ట్రికల్ సిగ్నల్‌గా కన్వర్ట్ అయి వెంటనే శాటిలైట్‌కు సిగ్నల్ రూపంలో వెళుతుంది. అది శాటిలైట్ ద్వారా పుణెలోని సెంట్రల్ సర్వర్‌కు చేరుతుంది. సర్వర్ నుంచి వాతావరణ శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్లిపోతుంది సమాచారం. ఒక్క వర్షపాతమే కాదు, ఉష్ణోగ్రత, పీడనం, గాలిదిశ..ఈ వివరాలన్నీ అప్‌డేట్ అయిపోతాయి. ప్రతి రోజూ జరిగే వాతావరణ విశ్లేషణకు.. ఈ అబ్జర్వేటరీలు, ఎడబ్ల్యుఎస్‌లతో





పాటు శాటిలైట్, డోప్లర్ వెదర్ రాడార్‌లు కూడా ఎంతో ఉపకరిస్తాయి. సముద్ర ఉపరితలంలో జరిగే ప్రతి కదలికను చిత్రాలుగా తీసి పంపిస్తుంటుంది శాటిలైట్. రాడార్‌ల విషయానికొస్తే- రెండు వందల యాభై కిలోమీటర్ల దూరాన ఉన్న మేఘాల స్వభావాన్ని రాడార్ల ద్వారా తెలుసుకోవచ్చు. నూటాయాభై కిలోమీటర్ల పరిధిలో రానున్న రెండు గంటల్లో వర్షం కురుస్తుందో లేదో కూడా చెప్పగలవు అవి. వరద బీభత్సం నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు రాడార్లే కీలకమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైదరాబాద్, విశాఖపట్టణం, మచిలీపట్నంలలో మూడు రాడార్లు పనిచేస్తున్నాయి. త్వరలోనే అనంతపురంలో మరొక రాడార్ ఏర్పాటు కానుంది. ఇలా.. పలు మార్గాల ద్వారా క్రోడీకరించిన మొత్తం సమాచారం రికార్డుల్లో నమోదు అవుతుంది. వాతావరణ శాఖ వెబ్‌సైట్లో కూడా ఈ తాజా సమాచారం చేరిపోతుంది. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే ప్రక్రియ జరుగుతుంది. రాష్ట్రాలు సేకరించిన సమాచారం ముందు రీజనల్ మెటొరొలాజికల్ సెంటర్ (ఆర్ఎంసి)లకు వెళ్లిపోతుంది. ఆర్ఎంసిలు దేశవ్యాప్తంగా ఆరు ఉన్నాయి. నాలుగు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి చెన్నై కేంద్రం. ఆర్ఎంసిలకు చేరిన సమాచారమంతా విశ్లేషణ నిమిత్తం అంతిమంగా పుణె, ఢిల్లీలకు వెళుతుంది.

## వాతావరణ ముఖ 'చిత్రాలు'

ప్రతి రోజూ ఇలా అందిన సమాచారం నుంచి- ఒక ప్రాంతంలో గాలి ఏ దిశలో ప్రయాణం చేస్తోంది? దాని వేగం ఎంత? గాలిలో తేమ శాతం ఎంత? కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలు ఎలా ఉన్నాయి? ఆకాశంలో మేఘాల తీరు ఎలా ఉంది? వర్షపాతం ఎంత నమోదైంది..? సముద్రపు అలల ఎత్తు, వేగం, ఒత్తిడి ఎంత తీవ్రతలో ఉన్నాయి మొదలైన అనేక వివరాలు తెలుస్తాయి. ఒక్కో అంశానికి ఒక్కో ప్రత్యేకమైన చిహ్నం (గాలికి ఒకటి, ఉష్ణోగ్రతకు మరొకటి) ఉంటుంది. ప్రాంతాలవారీగా నమోదైన వాతావరణ సమాచారాన్ని చిహ్నాల రూపంలో భారతదేశ చిత్ర పటం మీద ముద్రించి.. చార్టును తయారు చేస్తారు వాతావరణ శాస్త్రవేత్తలు. ఈ చార్టులను 'న్యూమరికల్ వెదర్ ప్రిడిక్షన్ మోడల్స్' అంటారు. మంచి గణిత పరిజ్ఞానం కలిగిన వాతావరణ శాస్త్రవేత్తలే వీటిని రూపొందించగలరు. వాతావరణ కేంద్రంలో ప్రతి మూడు గంటలకు ఒక చార్టు ముద్రితమవుతుంది. చార్టుల వల్ల కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు ఎటు నుంచి ఎటు గాలి వీస్తున్నదో తెలుసుకోవచ్చు. రాష్ట్రంలో అయితే.. ఆ చివర్న ఉన్న శ్రీకాకుళం నుంచి ఈ చివర్న ఉన్న అనంతపురం వరకు మేఘాలు ఎటు నుంచి ఎటు మళ్లుతున్నాయో కూడా అంచనా వేయవచ్చు. ఏ ప్రాంతంలో వర్షం కురిసిందో చూడవచ్చు. మన దేశం చుట్టుపక్కలున్న బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రాల్లో ఎక్కడ అల్పపీడన ద్రోణి ఏర్పడినా గుర్తించవచ్చు. అల్పపీడనం వాయుగుండంగా మారి తుపానుగా మారే అవకాశం ఉంటే.. అదీ ఈ చార్టులలో తెలుస్తుంది. తీర ప్రాంతాలకు ముప్పు పొంచి ఉందని తెలిసిన వెంటనే తుపాను హెచ్చరికల





ఉష్ణోగ్రతను కొలిచే పరికరం



బారోగ్రాఫ్



నీటి ఆవిరిని కొలిచే పరికరం

కేంద్రాలకు కబురు వెళ్లిపోతుంది. పరిస్థితి తీవ్రతను బట్టి.. తీరప్రాంత వాసులను, సముద్రంలో చేపలు పట్టుకునే బెస్తలను అప్రమత్తం చేస్తుంది ప్రభుత్వం.

## బులెటిన్లతో సేద్యం..

ఒకప్పుడు రైతులందరూ అనుభవంతోనే వాతావరణాన్ని చక్కగా అంచనా వేసేవాళ్లు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా కురుస్తాయా? ఎండలు ఎక్కువగా కాస్తాయా? వంటివన్నీ వాళ్లకు తెలిసేవి. దానికి తగ్గట్టు పంటల్ని సాగు చేసుకునేవారు. అయితే ఇప్పుడు రైతులకున్న ఆ అనుభవం సరిపోవడం లేదు. ఈ ఎండాకాలం మండిపోతుందని, వచ్చే వానా కాలంలో చెరువులు, కుంటలు పొంగిపొర్లుతాయని చెప్పలేని పరిస్థితి. మరోవైపు పంటల సరళి కూడా మారిపోయింది. ప్రకృతి సహజ ధర్మాన్ని కోల్పోయిన ఈ పరిస్థితుల్లో.. వాతావరణ శాఖ విడుదల చేసే బులెటిన్లే రైతులకు ఆధారం అవుతున్నాయి. ప్రతి అయిదు రోజులకు ఒకసారి వాతావరణం ఎలా ఉండబోతోందో చెబుతాయవి. వర్షం సమృద్ధిగా కురిసే అవకాశం ఉందంటే.. మోటారు ఖర్చు మిగులుతుంది. పంటల నూర్పిళ్లను సకాలంలో పూర్తి చేసుకోవచ్చు. రసాయన ఎరువులు వేయాలో వద్దో ఒక నిర్ణయానికి రావచ్చు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక పంటల సాగుకూ ఒక ప్రణాళిక వేసుకోవచ్చు. వాతావరణ సమాచారానికి ఇన్ని ప్రాధాన్యతలు ఉండటంతో.. వీటి పట్ల రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది.

గోదావరి, కృష్ణా నదుల వెంబడి ఉన్న 24 నదీపరీవాహక ప్రాంతాలలో (బేసిన్లు) కూడా వర్షపాత నమోదు వివరాలను సేకరిస్తోంది వాతావరణ శాఖ. నదుల జన్మస్థలం నుంచి సముద్రంలో కలిసే వరకు ప్రవాహాన్ని లెక్కించేందుకు సిడబ్ల్యూసీ (కేంద్ర జల సంఘం) కూడా గేజ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. ఈ రెండు శాఖలు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటాయి. ఈ డేటానే జల వనరుల నిర్వహణ (వాటర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్)కు ఆధారం అవుతోంది. ఏ ప్రాంతంలో ఎంత వర్షపాతం నమోదవుతున్నదో ఒక అంచనాకు వస్తే- ప్రాజెక్టుల్లో ఏ మేరకు నీటిని నిల్వ చేసుకోవాలి? ఎంత నీటిని దిగువకు వదలాలి అనే విషయం తెలుస్తుంది. భూమి పైన పద్దెనిమిది కిలోమీటర్ల వరకు (టోపోస్పియర్) ఏ చిన్న మార్పు జరిగినా వాతావరణ పరికరాలు కనిపెడతాయి. నదీపరీవాహక ప్రాంతాల్లో క్యుములోనింబస్ మేఘాలు (సిబి క్లౌడ్) ఏర్పడితే అందర్నీ అప్రమత్తం చేస్తాయవి. ఈ మేఘాలు మిగతా మేఘాల్లా కాకుండా భూమికి 2500 అడుగుల పైభాగాన ఆకాశంలో నిట్టనిలువునా పద్దెనిమిది కిలోమీటర్ల వరకు ఏర్పడతాయి. ఇవి కురవడం ప్రారంభిస్తే.. కుంభవృష్టి ఖాయం.

నదుల్లో ఉన్నట్లుండి నీటిమట్టం పెరిగేందుకు ఇలాంటి వర్షాలే కారణం. అందుకే, ఈ మేఘాలను వాతావరణ శాఖ ముందే కనిపెట్టి హెచ్చరిస్తుంది. ''భూమధ్య రేఖ (0డిగ్రీ) నుంచి 30 డిగ్రీల అక్షాంశాల వరకు ఉన్న ప్రాంతాలన్నీ ఉష్ణ మండలం కిందికి వస్తాయి. గాలిలో తేమ, ఉష్ణోగ్రత, ఒత్తిడి మూడు ఎక్కువగా ఉన్నపుడు క్యుములోనింబస్ ఏర్పడతాయి. మన రాష్ట్రంలో ఇలాంటి మేఘాలు విశాఖపట్టణం, మచిలీపట్టణం, నిజామాబాద్, ఆదిలాబాద్‌లలో ఎక్కువగా ఏర్పడుతున్నాయి..'' అని చెప్పారు వాతావరణ శాస్త్రవేత్త కె.సీతారాం. ఈ మేఘాలు ఎటు నుంచి ఎటు కదులుతున్నాయి? ఎంత విస్తీర్ణంలో వ్యాపించాయి..? ఎంత వర్షపాతం ఉండొచ్చు? అనే అంశాలను శాస్త్రవేత్తలు విశ్లేషించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తారు. దీంతో వరద ముప్పు నుంచి కొంతైనా తప్పించుకునేందుకు వీలవుతుంది.

## టెంపరేచర్ ఫోర్‌కాస్ట్..

వాతావరణ కేంద్రం అందిస్తున్న సేవల్లో ముఖ్యమైనది టెంపరేచర్ ఫోర్‌కాస్ట్ (ఉష్ణోగ్రతల విశ్లేషణ). ప్రతి రోజూ ఏ ప్రాంతంలో ఎంత ఉష్ణోగ్రతలున్నాయో వెబ్‌సైట్‌లో ఉంచుతుంది. ఆ సమాచారం ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు చేరుతుంది. ఎండలను విశ్లేషిస్తున్న శాస్త్రవేత్తలు.. గన్నవరం, రామగుండం, భద్రాచలం రీజియన్లలో అత్యధిక ఉష్ణగ్రతలు నమోదవుతున్నట్లు గుర్తించారు. ''ఈ ఏడాది ఆగ్నేయ గాలులు ఎక్కువగా వీస్తే ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే ఇప్పుడున్న సమాచారాన్ని బట్టి కచ్చితంగా చెప్పలేం..'' అంటున్నారు శాస్త్రవేత్తలు. గత కొన్నేళ్ల నుంచి ఉష్ణోగ్రతలు పెరిగాయన్నది చాలామంది అభిప్రాయం. అయితే గత పదేళ్ల రికార్డులను బట్టి చూస్తే.. కొన్ని జిల్లాలు మినహా మిగిలిన జిల్లాల్లో ఉష్ణోగ్రతలు తగ్గినట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, తిరుపతిలలో మాత్రం ఒక డిగ్రీ వరకు ఉష్ణోగ్రతలు పెరిగినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ ప్రాంతాల్లో ''అపార్ట్‌మెంట్లు, భారీ కట్టడాలు, రోడ్ల విస్తరణ, చెట్ల నరికివేత, బావులు, కుంటలు ఎండిపోవడం, భూగర్భ జలాలు ఇంకిపోవడం వల్ల.. వేడి పెరుగుతోంది''అంటున్నారు వాళ్లు. ఇప్పటి వరకు నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలన్నీ ఇంచుమించుగా 2003లో నమోదైనవే. భద్రాచలం 42, నిజామాబాద్ 44, రామగుండం 44, హన్మకొండ 41 డిగ్రీలుగా రికార్డులకెక్కింది.

సముద్రతీర ప్రాంతాల్లో వేసవి వస్తే చాలు.. ఉక్కపోతకు



వాతావరణ కేంద్రంలో చార్ట్‌ను విశ్లేషిస్తున్న శాస్త్రవేత్త ఆర్.వి. సుబ్బారావు

ప్రజలు అల్లాడిపోతారు. ఆ ఉక్కపోతను కూడా వాతావరణ కేంద్రం అంచనా వేస్తుంది. ఓపెన్ పాన్ ఎవాపరేటరీ మీటర్ ద్వారా ఏ మేరకు నీరు ఆవిరైపోతుందో గుర్తిస్తుంది. గాలిలో తేమ శాతం ఎంత ఉన్నదో హైగ్రోగ్రాఫ్ ద్వారా తెలుస్తుంది. గాలిలో తేమ, ఉష్ణోగ్రత రెండూ అధికంగా ఉంటే ఉక్కపోత తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్త రామసుబ్రహ్మణ్యం చెప్పారు. విశాఖపట్టణం, మచిలీపట్టణం, కాకినాడ, నర్సాపూర్, కావలి, ఒంగోలులలో ఉక్కపోత ఎక్కువగా నమోదైనట్లు.. అబ్జర్వేటరీల రికార్డులు చెబుతున్నాయి.

ఉష్ణోగ్రతలు ప్రజల ఉపయోగార్థమే కాదు. కంపెనీలు నెలకొల్పేందుకూ ఉపయోగపడతాయి. కొన్ని ఉత్పాదక సంస్థలకు కనీస ఉష్ణోగ్రత ఇంతవరకు ఉండాలనే నిబంధన ఉంది. ఐటీ, ఫార్మా, బయో ఉత్పత్తుల సంస్థల్లో ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం అవసరం. బయట బాగా ఎండలు కాస్తుంటే సెంట్రల్ ఎయిర్ కండీషన్డ్ సదుపాయం ఏర్పాటు చేసుకోవాలి. అలా చేయడం వల్ల విద్యుత్ ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఎండలు తక్కువగా ఉన్న ప్రదేశంలో కంపెనీలు పెడితే ఖర్చు తగ్గుతుంది. ఈ విషయంలో కూడా నిర్ణయం తీసుకునేందుకు.. వాతావరణ కేంద్రం రిపోర్టులు ఉపయోగపడతాయి. ''విశాఖపట్టణంలోని రుషికొండలో ఓ పెద్ద హోటల్‌లో ఏసీ పెట్టాలా వద్దా? అనే సమస్య వచ్చింది. సముద్రం ఒడ్డున చల్లగా ఉంటుంది కదా? ఏసీ ఎందుకు అంటుంది యాజమాన్యం. అయినా సరే ఏసీ పెట్టాల్సిందేనని పట్టుబట్టారు హోటల్ ఉద్యోగులు. పై అధికారులు.. విశాఖలో గత పదేళ్ల ఉష్ణోగ్రతల చార్టును తీసుకురమ్మన్నారని.. ఆ వివరాలు కావాలంటూ హోటల్ ఉద్యోగులు మా దగ్గరికి వచ్చారు'' అని వివరించారు వాతావరణ కేంద్రం ఉద్యోగి. ఉష్ణోగ్రతల వివరాలు విద్యుత్ శాఖ నిర్వహణకూ కీలకం అవుతున్నాయి. ఎండలు తీవ్రంగా ఉంటే.. కరెంటు ఎక్కువగా ఖర్చు అవుతుంది. దానికి సరిపడా ఉత్పత్తి లేకపోతే కొరత ఏర్పడుతుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను బట్టి భవిష్యత్తును ముందే ఊహించి.. విద్యుత్‌శాఖ కోతలను విధిస్తుంది. వాతావరణ శాస్త్రవేత్తలు చేసే విశ్లేషణలు ఇందుకు ఉపకరిస్తున్నాయి.

వ్యవసాయ శాఖ సైతం పంటల సంరక్షణ కోసం ఈ సమాచారాన్ని అమూల్యంగా భావిస్తున్నది. ఎండల తీవ్రతలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి పంటలు సాగు చేయాలో రైతులకు సూచనలు అందిస్తుంది వ్యవసాయ శాఖ.

## విమాన రాకపోకల కోసం...

వాతావరణ సమాచారం లేకుండా విమానాలైతే కదలనే కదలవు. ఆకాశంలో దట్టమైన మేఘాలు వ్యాపించినా, భూమ్మీద పొగమంచు కమ్ముకున్నా, ఉరుములు, మెరుపులొచ్చినా.. వెంటనే వాతావరణ శాఖ ఫైలెట్లను అప్రమత్తం చేస్తుంది. వాతావరణ కేంద్రంలో ఏవియేషన్ మెటొరొలాజికల్ సెంటర్ చేసే పని ఇదే. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) విమానాల రాకపోకలకు సహాయపడే పనిచేస్తున్నప్పటికీ.. వాతావరణ కేంద్రం నివేదికలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నాయి. ''మా దగ్గర డైన్స్ ప్రెజర్ ట్యూబ్ అనే పరికరం ఉంది. అది గాలి ఏ దిశలో ఎంత వేగంలో పోతున్నదో రికార్డు చేస్తుంది. శాటిలైట్, రాడార్లు కొన్ని కిలోమీటర్ల ఎత్తులో వెళ్లే గాలి వేగాన్ని కొలుస్తాయి. ఆ వివరాలతో మేము రూపొందించే చార్టులు చూస్తే.. గాలి దిశ అర్థమైపోతుంది. ఒక వైపున తీవ్రమైన గాలులు వీస్తున్నపుడు.. ఆ గాలులకు విమానం ఎదురెళ్లిందనుకోండి. ఇంజన్ మీద ఒత్తిడి పెరిగి ఇంధనం బాగా ఖర్చవుతుంది. అదే గాలివీచే దిశగా వెళితే.. సమస్యను సులువుగా అధిగమించవచ్చు..'' అన్నారు అసిస్టెంట్ మెటొరాలజిస్ట్ ఆర్.వి.సుబ్బారావు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాలు నిర్మించే ముందే.. 70 ఏళ్లలో వీచిన గాలుల వివరాలను వాతావరణ కేంద్రం నుంచి తీసుకుంటుంది విమానయాన శాఖ. సముద్రం మీదుగా సరుకులను తీసుకెళ్లే కార్గోషిప్పులు కూడా వాతావరణ కేంద్రం మీదే ఆధారపడుతున్నాయి. సముద్రం లోపల, బయట వాతావరణ పరిస్థితులను బట్టే కార్గోషిప్పులు బయలుదేరతాయి.



వాతావరణాన్ని గ్రాఫ్‌లలో ఇలా నమోదు చేస్తారు..

## బీమా రావాలంటే..

ఈ పనులన్నీ చేస్తున్న వాతావరణ కేంద్రానికి బీమా సంస్థల నుంచి కూడా డిమాండ్ ఎక్కువవుతోంది. ఉదాహరణకు– హైదరాబాద్‌లో విపరీతమైన గాలి, వాన వచ్చి ఎవరైనా ఆస్తులు నష్టపోయారనుకుందాం. వారు బీమా సంస్థను ఆశ్రయించి నష్టపరిహారం కోరితే వారి మాట ఒక్కటే సరిపోదు. బాధితుడు నష్టపోయినట్లు చెబుతున్న సమయంలో గాలి తీవ్రత ఎంత ఉంది? వర్షపాతం ఎంత నమోదైందో తెలిపే రికార్డులను సమర్పించమంటుంది బీమా సంస్థ. అది కూడా వాతావరణ శాఖ అందించిన సమాచారమే అయ్యుండాలి. బాధితుడు చెప్పిన నష్టానికి, వాతావరణ శాఖ నమోదు చేసిన వివరాలకు పొంతన కుదిరితేనే ఇన్స్యూరెన్స్ ఇస్తున్నాయి బీమా సంస్థలు. ''ఇక్కడే మాకు చాలా సమస్యలొస్తున్నాయి. మేము అబ్జర్వేటరీల్లో నమోదైన వాతావరణ వివరాలనే ఇస్తున్నాం. ఆస్తులకు నష్టం జరిగిన చోట ఈ పరిస్థితులు ఉండకపోవచ్చు. దాంతో చిక్కులు వస్తున్నాయి. మీరిచ్చే రిపోర్టుల వల్లే మాకు బీమా రావడం లేదని కొందరు బాధితులు కోప్పడుతున్నారు..'' అంటున్నారు వాతావరణ కేంద్రం ఉద్యోగులు. వాతావరణ శాఖ అంటే కేవలం ఎండావానలకే పరిమితం కాదు. నేల నుంచి నింగి వరకు నిత్యం మారిపోయే.. వాతావరణ స్వరూప స్వభావాలను తెలుసుకుని.. జనావళి బాగు కోసం వాచ్ డాగ్ పని చేస్తోంది అది.

ఫోటోలు : సాయి, సికింద్రాబాద్

## త్వరలో తాలూకా స్థాయిలో...



వాతావరణ కేంద్రం చెప్పేవన్నీ నూటికి నూరు శాతం జరగవు. సుమారు 80 శాతం మాత్రమే జరుగుతాయి. వాతావరణ కేంద్రం ఎంత పరిధిలో పనిచేస్తుందో తెలుసుకుంటే ఇది అర్థం అవుతుంది. ఒక్కో అబ్జర్వేటరీ పరిధి పది నుంచి పదిహేను కిలోమీటర్ల వరకే ఉంటుంది. అన్ని అబ్జర్వేటరీల సమాచారం విశ్లేషించి స్థూలంగా ఫోర్‌కాస్ట్ చెబుతాము. అందుకే అబ్జర్వేటరీల సంఖ్య ఎంత పెరిగితే అంత మంచిది. అభివృద్ధి చెందిన దేశాల్లో గ్రామస్థాయిలో కూడా వర్షం వస్తుందో రాదో చెప్పగలిగే వ్యవస్థ ఉంది. మనం ఆ స్థాయికి చేరుకోవడానికి మరికొంత సమయం పడుతుంది. ప్రస్తుతం జిల్లా పరిధిలో వాతావరణ పరిస్థితులను చెప్పగలుగుతున్నాం. రాబోయే రోజుల్లో తాలూకా స్థాయి వరకు చెప్పగలుగుతాం. ఎందుకంటే త్వరలోనే మన రాష్ట్రంలో మరికొన్ని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్ (ఏడబ్ల్యుఎస్) రాబోతున్నాయి.

– **కె.సీతారాం,** డైరెక్టర్, వాతావరణ కేంద్రం

## సండే పజిల్

నిర్వహణ: గొరుసు

**అడ్డం**

1. చిహ్నం (3)
4. ఇది కూడా జబ్బే (3)
6. కసకసమని వినిపించే మసాలా దినుసు (5)
9. తిరగబడ్డ వానరం (2)
11. నగరం కోల్పోయిన 'అలంపురం' (2)
12. మునులకు ఆగ్రహం కలిగితే పెట్టేది (2)
14. వత్తు సవరిస్తే 'సంపద' దక్కుతుంది (2)
15. ఈ రాత తప్పించుకోవడం ఎవరి తరం? (2)
16. ఈ పాత్రలకు చైనా పెట్టింది పేరు (3)
17. పులి విసిరేది (2)
18. కొందరు నిద్ర లేవగానే దీన్ని సేవించకుండా మంచం దిగరు (2)
19. పందిళ్లకు పాతే కర్ర (2)
20. ఆద్యంతాల 'పరోపకారి' (2)
23. ఎద్దు వేసేది (2)
25. ఈ కంటి నక్షత్రం బాపుగారి సీతమ్మ (5)
28. సారక్క అమ్మ (3)
29. తిరగబడ్డ మానవ పరిణామ సిద్ధాంత కర్త

**నిలువు**

1. ఇంగ్లీషు సంవత్సరంలో హిందువుల తొలిపండుగ (3)
2. తిరగబడ్డ భూతకాలం (2)
3. వాడుకలో చోరుడు (2)
4. మద్దెలతో మొరపెట్టుకున్న పరికరం (2)
5. యాదవకులంలో పుట్టిన 'రోకలి' (3)
7. ఈ బియ్యంతో పాయసం చేసుకుంటారు (2)
8. తప్పించుకునేందుకు ఒక 'వంక' (2)
10. 'ఖజానా' పరిరక్షకుడు (5)
11. జీవపదార్థం లేని మనిషి – విఠలాచార్య మార్కు (5)
13. ఈ మధ్యనే వెళ్లిన పర్వదినం (3)
20. ఈ పొట్టుకూర గోదావరి జిల్లాల ప్రత్యేకం (3)
21. నీడ (2)
22. నాన్న నాన్నని పిలవండి (2)
24. ఉత్తర అమెరికాలోని దేశం (3)
25. అదృష్టం వరించాలంటే దీని తోక తొక్కాల్సిందేనా! (2)
26. ఇది నాలుగు విధాల చేటంటారు (2)
27. ఇంగ్లీషులో పరిగెత్తండి (2)

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ● | 3 | ● | 4 | | 5 |
| | ● | 6 | 7 | | 8 | | ● | |
| 9 | 10 | ● | | ● | | ● | 11 | |
| ● | 12 | | ● | 13 | ● | 14 | | ● |
| 15 | | ● | 16 | | | ● | 17 | |
| ● | 18 | | ● | | ● | 19 | | ● |
| 20 | | ● | 21 | ● | 22 | ● | 23 | 24 |
| | ● | 25 | | 26 | | 27 | ● | |
| 28 | | | ● | | ● | 29 | | |

**గత వారం జవాబులు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 నా | రిం | 2 జ | ● | 3 శో | ● | 4 తు | ల | 5 సి |
| గి | ● | 6 గం | 7 గా | భ | 8 వా | ని | ● | తా |
| 9 ని | 10 వ | ● | యం | ● | ణి | ● | 11 గా | ర |
| ● | 12 సం | ఘం | ● | 13 గు | ● | 14 హో | లి | ● |
| 15 దూ | త | ● | 16 అ | ట | క | ● | 17 మే | డే |
| ● | 18 సే | ద్యం | ● | క | ● | 19 జా | డ | ● |
| 20 కో | న | ● | 21 భీ | ● | 22 చె | ● | 23 లు | 24 తే |
| స | ● | 25 కో | తి | 26 కొ | మ్మ | 27 చ్చి | ● | లి |
| 28 ల | క్ష | ణం | ● | వృ | ● | 29 పి | డ | క |

## పూరణం

## సినిమా పజిల్

నిర్వహణ: యజ్ఞమూర్తి

**అడ్డం**

1. వేగేశ్న సతీష్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం (5)
5. 'ఔనంటే కాదనిలే... కాదంటే ఔననిలే' పాట ఈ చిత్రం లోనిదే (3)
6. చిరంజీవి 'లంకేశ్వరుడు'లో నాయిక (2)
8. నటుడిగా ఎల్బీ శ్రీరామ్ వెలుగులోకి వచ్చిన చిత్రం (5)
11. గీతాకృష్ణ 'సంకీర్తన'లో హీరో (4)
12. సురేష్‌కృష్ణ దర్శకత్వంలో సుహాసిని చిత్రం అటు ఇటుగా (2)

**నిలువు**

1. కృష్ణ త్రిపాత్రాభినయం చేసిన చిత్రం (5)
2. మిస్టర్ నూకయ్య (3)
3. మణిరత్నం 'అంజలి' పాత్రధారి తలకిందులైంది(3)
4. తల్లీకొడుకులుగా సుహాసిని, శర్వానంద్ నటించిన చిత్రం (5)
7. భానుప్రియ, మోహన్ జంటగా వంశీ చిత్రం (4)
9. ఎన్టీఆర్, ఎయన్నార్ అన్నదమ్ములుగా నటించిన చిత్రం '... కథ' (3)
10. విఠలాచార్య దర్శకత్వం వహించిన చిత్రం 'కోటలో...' (2)

**గత వారం జవాబులు**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 ఆ | ది | 2 పి | ని | 3 శె | ట్టి | ● |
| ర | ● | సు | ● | ట్టి | ● | 4 ఆ |
| ని | ● | 5 శీ | ను | ● | 6 కా | ర్తీ |
| 7 మం | జు | ల | ● | 8 కో | ● | అ |
| ట | ● | ● | 9 ఇం | టి | దొం | గ |
| లు | ● | 10 బు | ● | గా | ● | ర్వా |
| ● | 11 ఆ | ట | గా | డు | ● | ల్ |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | ● | 4 |
| | ● | | ● | 5 | | |
| | ● | | ● | | ● | |
| 6 | | ● | 7 | ● | ● | |
| | ● | 8 | | | 9 | |
| ● | 10 | ● | | ● | | ● |
| 11 | | | | ● | 12 | |



## కొబ్బరిపాలతో

**కావలసిన పదార్థాలు:** వెల్లుల్లి రేకలు – 20, కొబ్బరి కోరు – 3 టేబుల్ స్పూన్లు, కారం– 1 టీ స్పూను, జీరా, దనియా పొడి– 1 స్పూను, పసుపు– పావు టీ స్పూను, దాల్చినచెక్క– అంగుళం ముక్క, మెంతులు– అర టీ స్పూను, బియ్యం – 1టీ స్పూను, చిన్న టమోటా –1, కరివేపాకు – 4 రెబ్బలు, చిక్కటి కొబ్బరిపాలు – అరకప్పు, ఉప్పు – రుచికి తగినంత.

**తయారుచేసే విధానం:** వెల్లుల్లి రేకల పొట్టు తీసి, ముక్కలుగా తరగాలి. కడాయిలో బియ్యం, కొబ్బరికోరు, దాల్చిన చెక్క, కారం, పసుపు, జీరా, దనియాలపొడులు సన్నని మంటపై (మాడకుండా) వేగించాలి. తర్వాత మిక్సీలో వేసి టమోటాతో పాటు గ్రైండు చేసుకోవాలి. ఈ పేస్టుని వెల్లుల్లి ముక్కలకు పట్టించి కరివేపాకుతో పాటు కప్పు నీరు పోసి ఉడికించాలి. వెల్లుల్లి ముక్కలు మెత్తబడ్డాక కొబ్బరిపాలు, ఉప్పు వేసి రెండు నిమిషాల తర్వాత దించేయాలి. అన్నంతో పాటు చపాతీల్లో కూడా ఈ కూర బాగుంటుంది.

వంటశాల

# వెల్లుల్లి కూరలు



## పులుసు

**కావలసిన పదార్థాలు:** చింతపండు – 75 గ్రా., నూనె – 1 టేబుల్ స్పూను, (పొట్టు తీసిన) వెల్లుల్లి రేకలు – 200గ్రా., మెంతులు – 1 టీ స్పూను, సోంపు – అర టీ స్పూను, కరివేపాకు – 4 రెబ్బలు, (తరిగిన) ఉల్లిపాయలు – 1 కప్పు, (నిలువుగా చీరిన) పచ్చిమిర్చి – 3, కారం – అర టీ స్పూను, పసుపు – పావు టీ స్పూను, (తరిగిన) టమోటాలు – 2, ఎండు మిర్చి – 4, ఉప్పు – సరిపడా.

**తయారుచేసే విధానం:** 2 కప్పుల వేడి నీటిలో చింతపండుని అరగంట నానబెట్టి చిక్కగా గుజ్జు తీసుకోవాలి. కడాయిలో కొద్ది నూనె వేసి 50 గ్రా. వెల్లుల్లి రేకలు, సగం మెంతులు, ఎండుమిర్చి ఒక నిమిషం వేగించి పేస్టు చేసుకోవాలి. మిగతా నూనెలో సోంపు, మెంతులు, ఉల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు ఒకటి తర్వాత ఒకటి వేసి వేగించాలి. పసుపు, కారం, టమోటాలు వేసి 5 నిమిషాలు తర్వాత వెల్లుల్లి రేకలు, పేస్టు, చింతపండు గుజ్జు, ఉప్పు కలిపి సన్న మంటపై 15 నిమిషాలు ఉడికించాలి. వేడి వేడి అన్నంతో ఈ కూర చాలా రుచిగా ఉంటుంది.





## పొడి

**కావలసిన పదార్థాలు:** ఎండు కొబ్బరి తరుగు – 2 కప్పులు, వెల్లుల్లి రేకలు – కప్పు, ఎండుమిర్చి – 10, ఇంగువ – చిటికెడు, ఉప్పు – రుచికి తగినంత.

**తయారుచేసే విధానం:** కడాయిలో ఎండుమిర్చిని మాడిపోకుండా దోరగా వేగించి పొడి చేసి పక్కనుంచాలి. ఇప్పుడు ఎండుకొబ్బరి, వెల్లుల్లి రేకలు, మిర్చిపొడి, ఉప్పు, ఇంగువ మిక్సీలో వేసి కాస్త మొరంగా పొడిచేసి తీసేయాలి. ఈ పొడి వేడి వేడి అన్నంలో (నెయ్యితో కలిపి) తింటే చాలా రుచిగా ఉంటుంది.

## ఈ వారం కథ

ఆ రోజు రాత్రి చలి ఎక్కువగా ఉంది. ఉండుండి చలిగాలి చెవుల్ని చీలుస్తోంది. స్వెట్టర్లున్నా వణుకు పుడుతోంది. తలుపులూ, కిటికీలూ అన్నీ బిడాయించి కూర్చున్నాం.

మా ఇద్దరికీ నచ్చే టీవీ కార్యక్రమాలు చాలా తక్కువగా ఉంటాయి. ఒక ఛానల్లో పాటల పోటీ రసవత్తరంగా సాగుతోంది. పిల్లలందరూ అద్భుతంగా పాడుతున్నారు. మేమిద్దరం అందులో లీనమై భోజనం కూడా మరిచిపోయాం.

★ ముకుంద రామారావు

బొమ్మలు: అక్బర్

# నా ఇల్లెక్కడ?

ఉన్నట్టుండి అదిరిపడేట్టు కాలింగ్ బెల్ మోగింది. ఇంత రాత్రివేళ ఎవరై ఉంటారా? అని ఆశ్చర్యపోయాం. ఒకరి మొహాలొకరం చూసుకున్నాం. ఎవరు లేచి తలుపు తీయాలని కూడా దానర్థం. ఈ వేళప్పుడు మా ఇంటి గేటు తాళం వేసి ఉంటుంది కాబట్టి బయట వాళ్లెవరూ వచ్చే అవకాశం లేదు. బహుశా పై పోర్షను వాళ్లేమో అనుకుంటూ తలుపు తీశాను ... గేటు తెరిచే ఉంది.

ఎదురుగా ఒక నడివయస్కుడు. ఆయన కొడుకులా ఉన్న అబ్బాయి. వారితో బాటు ఒక ముసలాయన.

''రావుగారూ గుర్తున్నానా? మీరు మా ఇంటికి ఒకమారు వచ్చారు'' అన్నాడు నడివయస్కుడు.

వాళ్లింటికి నేను వెళ్లానని చెబుతుంటే గుర్తు రాలేదంటే ఏం బాగుంటుంది? నా ముఖ కవళికలు గమనించి ఇంకొన్ని వివరాలు చెప్పాడు దానితోనైనా నాకు గుర్తొస్తుందేమోనని.

''ఒకసారి మా వీధిలో ఉండే మీ మిత్రుడు శ్రీధర్‌గారు మిమ్మల్ని మా ఇంటికి తీసుకొచ్చారు. మా ఇల్లు మీకు బాగా నచ్చింది కూడా. ఇప్పుడు మీ ఇల్లు చూశాక మీ శ్రీమతిని మా ఇంటికి ఎందుకు తీసుకురావాలనుకున్నారో అర్థమవుతోంది. మా ఆవిడని కూడా మీ ఇంటికి తీసుకురావాలి. ఇద్దరికీ ఇంటీరియర్ డిజైనింగ్ ఇష్టంలా ఉంది. కాలక్షేపం బాగుంటుంది. మీ ఇద్దరితో పాటు మరొకాయన ... ఆయన పేరు గుర్తులేదు. ఫ్రెంచిలో కవితలు రాసి తీసుకొచ్చాడు కదా ... మా ఆవిడకి ఫ్రెంచిలో మంచి ప్రావీణ్యత ఉందని తెలిసి ...'' ఇంకా ఏదో చెప్పాలని ప్రయత్నం చేసే లోగా, నాకే గుర్తొచ్చింది.

''అయ్యో మీరా సూరిగారూ, సారీ, వెంటనే గుర్తుపట్టలేదు. చాన్నాళ్లు అయింది మీ ఇంటికొచ్చి.. అదీ ఒకే ఒక్కమారు కావడంతో మర్చిపోయాను. మరేమీ అనుకోకండి. ఏమిటిలా ఇంత రాత్రప్పుడు వచ్చారు?'' అన్నాను.

ఇంటీరియర్ డిజైనింగ్ ప్రస్తావనతో మా ఆవిడ మొహం వెలిగిపోయింది.

''ముందు వారిని లోనికి రానివ్వండి. తలుపు దగ్గరే ఆపేశారు'' అంటూ ''రండి, రండి ... బయట చలి, దోమలు'' అంటూ లోనికి ఆహ్వానించి తలుపు మూసింది.



అందరం కూర్చున్నాక, ''నాకు తోడుగా మా అబ్బాయిని తీసుకొచ్చాను ... ఈ పెద్దాయన విషయం మాట్లాడాల్సి ఉండి మీ ఇంటికి రావలసి వచ్చింది'' అన్నారు సూరిగారు.

''చెప్పండి ... ఎవరీయన?'' అన్నాను ఆ పెద్దాయన వైపు చూస్తూ.

''దానికే వస్తున్నాను ... అన్నట్టు మీరు ఏదో సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నట్టు చెప్పిన గుర్తు ...''

''అవునండి. కానీ నేను రిటైరై దాదాపు నాలుగేళ్లయిపోయింది ... విషయం ఏమిటి చెప్పండి?''

''ఏమీ లేదు, ఈ పెద్దాయన ఎవరో నాకు కూడా తెలీదు. గంట క్రితం మా ఇంటికొచ్చి తలుపు తట్టాడు. ఎవరు కావాలని అడిగితే 'మా ఇల్లు మా ఇల్లు' అంటున్నారు. ఇది ఆయన ఇల్లు కాదని నచ్చచెప్పి, ఎక్కడుంటారు, ఏమిటి అని ఒక్కొక్కటీ ఆరా తీస్తూ పోతే నాకు అర్థమైందల్లా ఒక్కటి ... ఏవో మందులు కొనుక్కుందామని బయటకొచ్చి, తిరిగి ఇంటికి వెళ్లలేక ఇంటింటికీ తిరుగుతున్నారని. ఎన్ని ఇళ్లు తిరిగారో, ఎప్పట్నుంచి తిరుగుతున్నారో పాపం! కొడుకు సత్యం కంపెనీలో ఏదో పెద్ద ఉద్యోగమే చేస్తున్నాడని, పేరు రామబ్రహ్మం అని మాత్రం చెప్పగలుగుతు

న్నారు. ఆ రామబ్రహ్మం మీకేమైనా తెలుసేమోనని, లేదంటే మీకు దగ్గర్లో సత్యంలో పని చేసే వాళ్లు ఎవరైనా ఉన్నారేమో అని మీ దగ్గరకు తీసుకొచ్చాను.''

విషయం అర్థమైంది. మేమిద్దరం కాసేపు ఏమీ మాట్లాడలేకపోయాం. దారి తప్పిన ఆ ముసలాయన గురించి సూరిగారు పడుతున్న శ్రమ చూస్తే ఆశ్చర్యమనిపించింది.

''మా కారులో వారు చెప్పిన వీధులన్నీ తిరిగాము. ఏదీ కాదంటున్నారు. ఏం చేయాలో తోచలేదు. చివరి ప్రయత్నంగా మీదగ్గరకి రావలసి వచ్చింది. వీరిని ఎలాగైనా వాళ్లింటికి చేర్చగలిగితే బాగుంటుంది'' సూరిగారి మాటలు వింటూ మధ్యమధ్యలో టీవీ వైపు చూస్తున్నాను. నా తీరు నచ్చక మా ఆవిడ వెంటనే టీవీ కట్టేసింది.

''నాకు తెలిసినవాళ్లు, అందులోనూ సత్యంలో పనిచేసే వాళ్లు దగ్గరలో ఎవరూ లేరండి'' అని ఇంకా ఎవరైనా ఉన్నారేమో అని ఆలోచిస్తుండగా మా ఆవిడ గుర్తు చేసింది. వాళ్ల పెద్దనాన్నగారి అబ్బాయి రాజు అందులోనే చాన్నాళ్లుగా పనిచేస్తున్న సంగతి.

రాజు నెంబరు వెదికి ఫోన్ చేస్తే, స్విచ్ఛాఫ్ చేయబడిందని మెసేజ్.

అన్నీ తెలిసిన నాలాంటి వాడే కొంత కాలం మరెక్కడైనా గడిపి తిరిగి వస్తే గుర్తు పట్టలేనట్టుగా నగరం రోజురోజుకూ మారిపోతోంది. అలాంటిది ఈ పెద్దాయన ఇబ్బంది పడడంలో ఆశ్చర్యం లేదనిపించింది.



''ఒకపని చేద్దాం సూరిగారూ. వాళ్లబ్బాయి వివరాలు ఇంకేమైనా రాబట్టే ప్రయత్నం చేద్దాం'' అని, పెద్దాయన వైపు తిరిగి ''మీరు ఇంతకు ముందు ఎక్కడ ఉండేవారండి?'' అన్నాను.

విశాఖపట్నంలో ఒక వీధి పేరు ఇంటినెంబరుతో సహా చెప్పేడు. హమ్మయ్య అనుకున్నాను. ఇప్పుడెవరున్నారు ఆ ఇంట్లో అని అడిగితే, ఇప్పుడెవరూ లేరని సమాధానం.

డీలా పడిపోయాను.

రెండు నిమిషాలు ఆగి, ఎక్కడ ఉద్యోగం చేసేవారని అడిగా. దానికి చాంతాడంత సమాధానంగా కొన్నాళ్లు మిలటరీ అనీ, కొన్నాళ్లు రైల్వే అనీ, కొన్నాళ్లు స్వచ్ఛంద సంస్థలనీ ... పొంతనలేకుండా ఏకధాటిగా ఆంగ్లంలో చెప్పేడాయన.

ఎటూ తేల్చుకోలేక, మీ స్నేహితులు, బంధువులు, ఇక్కడగానీ, దూరంలో గానీ ఉన్నారేమో గుర్తు తెచ్చుకోండంటే ... కొన్ని పేర్లయితే చెప్పారు కానీ వాళ్ల ఫోన్ నెంబర్లు గుర్తులేవన్నాడు. చెప్పిన పేర్లలో మాకు తెలిసిన ఒక పెద్దాయన ఉన్నారు.

ఆ పెద్దాయన నెంబరు కోసం వీళ్లను వాళ్లను అడిగి మొత్తం మీద సంపాదించగలిగాను. ఆయనకి ఫోను చేసి విషయం చెబితే 'మీ ఇంట్లో ఉన్న ఆ పెద్దమనిషి ఎవరో నాకు తెలీదు, పైగా బంగారంలాంటి నిద్ర పాడుచేశార'ని విసుక్కుంటూ టక్కున ఫోను పెట్టేశాడు.

మా ప్రయత్నంలో మేముండగా ''మీరంతా భోజనాలు చేశారో లేదో, కనీసం టీ అన్నా తాగండి, మీకు టీయా కాఫీయా'' అని ఒక్కొక్కర్నీ అడిగింది మా ఆవిడ. ఇప్పుడేమీ వద్దన్నారు ఆ తండ్రీ కొడుకులు. ఆ ముసలాయన ఏమీ చెప్పలేదు.

''మీరు భోజనం చేయండి, ఎప్పుడు తిన్నారో ఏమో. ఇంత చలిలో కనీసం స్వెట్టరైనా లేకుండా తిరుగుతున్నారు'' అంది ముసలాయనతో.

''అబ్బే వొద్దొద్దు. ఇంటికి పోయి తింటాను. మా వాళ్లు నాకోసం తినకుండా ఎదురు చూస్తుంటారు. ఒక పని చేయమ్మా. వేడి పాలు, పంచదార ఎక్కువ వేయకుండా ఇవ్వు'' అన్నాడు ముసలాయన.

మా ఆవిడ ఎంతో సంతోషపడిపోయి ఐదు నిమిషాల్లో పాలు తీసుకొచ్చింది. ఎంతో ఇష్టంగా తాగాడు ముసలాయన.

అప్పటికే సూరిగారి ఇంటినుండి ఎన్ని ఫోన్లో! 'నువ్వేమీ వర్రీ అవ్వొద్దు. నా వెంట మనబ్బాయి ఉన్నాడు కదా! ఈ పెద్దాయన్ని వాళ్లవాళ్లకి అప్పగించి వెంటనే వచ్చేస్తాం. నీకు నిద్రొస్తే పడుకో. మా కోసం ఆలోచిస్తూ ఎదురు చూడొద్దం'టూ సున్నితంగా చెప్పాడు.

చివరికి పోలీసుస్టేషనుకు తీసుకుపోయి అప్పగిద్దాం అనుకుని, వాళ్లు దీన్ని అంత సీరియస్‌గా తీసుకోరేమో అన్న అనుమానం వేసి మళ్లీ వద్దనుకున్నాం. సమయం గడిచేకొద్దీ మాలో ఆందోళన ఎక్కువ కావడం మొదలైంది.

ఇంత జరుగుతున్నా ముసలాయనలో ఏవిధమైన ఆందోళన కనిపించకపోవడం మా అందర్నీ ఆశ్చర్యపరిచింది. మేమింతగా హైరానా పడుతున్నా తనకేమీ పట్టనట్టు నిశ్చింతగా కూర్చున్నాడు. పైగా ముఖంలో చెరగని చిరునవ్వు!

ఈ మధ్యనే పరిచయమైన ఒక పోలీసు ఆఫీసరు సూరిగారికి హఠాత్తుగా గుర్తుకొచ్చి, 'చూద్దాం, ఆయన మంచివాడయితే ఏం చేయాలో కనీసం సలహా అయినా ఇస్తాడు కదా' అని ఫోను చేశాడు.

'తానిప్పుడు సెలవులో ఉన్నానని, అయినా మీరు ఫలానా వారికి కాసేపు పోయాక ఫోను చేయండని, ఈలోగా తాను వారికి విషయం చెప్పి చూస్తానని, ఏ ఇబ్బందీ లేద'ని ఆయన ఇచ్చిన భరోసాతో కొంత ఊపిరి పీల్చుకున్నాం.

ఆయన చెప్పినట్టుగానే పదిహేను నిమిషాలు ఆగి, ఫోను చేస్తే అట్నుంచి వచ్చిన వార్త మమ్మల్ని ఆనందపర్చింది. ఆ ముసలాయన కొడుకు తన తండ్రికోసం అప్పటికే పోలీసుల్ని ఆశ్రయించాడని, మమ్మల్ని ఎక్కడికీ వెళ్లవద్దనీ, వాళ్లంతా మా ఇంటికే వస్తున్నట్టు సమాచారం.

వాళ్లు రాగానే పెద్దాయన కొడుక్కి గట్టిగా క్లాసు తీసుకోవాలని నిర్ణయించుకున్నాను.

ఫోనులో చెప్పిన గుర్తుల ప్రకారం అరగంట తర్వాత పోలీసు వ్యాను, దాని వెనక మరో కారు మా గేటుముందు ఆగాయి.

**''ఒకపని చేద్దాం సూరిగారూ. వాళ్లబ్బాయి వివరాలు ఇంకేమైనా రాబట్టే ప్రయత్నం చేద్దాం'' అని, పెద్దాయన వైపు తిరిగి ''మీరు ఇంతకు ముందు ఎక్కడ ఉండేవారండి?'' అన్నాను. విశాఖపట్నంలో ఒక వీధి పేరు ఇంటినెంబరుతో సహా చెప్పేడు. హమ్మయ్య అనుకున్నాను. ఇప్పుడెవరున్నారు ఆ ఇంట్లో అని అడిగితే, ఇప్పుడెవరూ లేరని సమాధానం. డీలా పడిపోయాను.**

కారులోంచి ఒక యువకుడు దిగి, లోపలున్న ముసలమ్మ దిగడానికి చేయి అందించాడు.

ముసలాయన్ని చూడగానే ఆవిడ గొల్లుమంది. ముసలాయనలో ఏమీ చలనం లేదు. తప్పిపోయిన మాటలురాని చిన్న పిల్లాడిలా కనిపించాడాయన.

ముసలాయన వాళ్ల తాలూకూ మనిషేనని ధృవపరుచుకున్న తర్వాత ఏవో కాగితాల మీద సంతకాలు పెట్టించుకుని, మా పని అయిపోయిందన్నట్టు పోలీసులు వెళ్లిపోయారు.

ఆ తల్లీ కొడుకు ఎంత యాతన అనుభవించారో వాళ్ల మొహాలు చూస్తేనే తెలుస్తోంది.

''మీ అందరికీ ఎలా కృతజ్ఞతలు తెలియచేయాలో తెలియట్లేదు. ఇంత రాత్రి, పైగా చలిలో ఆయన్ని ఇంటికి సురక్షితంగా చేర్చాలనుకున్నందుకు ఎన్ని ధన్యవాదాలు చెప్పినా తక్కువే. మీలాంటి వారి చేతిలో పడటం ఆయన అదృష్టం ... మా అదృష్టం'' అన్నాడు వాళ్లబ్బాయి చెమ్మగిల్లిన కళ్లతో నా చేతులు పట్టుకుంటూ.

''మీరు చెప్పే ధన్యవాదాలన్నీ ఈ సూరిగారికి దక్కాలి. ఎంతో శ్రద్ధగా, విసుక్కోకుండా మీ ఇంటికోసం వెదికింది ఆయనే. అయినా పెద్దాయన్ని ఎలా వదిలేసారో ఏమో మాకు అర్థం కావడం లేదు. కనీసం జేబులో మీ అడ్రసో, ఫోను నెంబరో ఉండేలా చూసుకోవాలి కదా'' కాస్త కోపంగా అన్నాను.

''అయ్యో బాబూ, ఆయన్ని అలా ఎందుకొదిలేస్తాం? కంటికి రెప్పలా చూస్తున్నా ఎలా మాయమైపోతారో మాకే ఆశ్చర్యంగా ఉంటుంది. నాకు మోకాళ్ల బాధ. ఎక్కువ దూరం నడవలేను. వీడేమో ఉదయం వెళ్లి రాత్రి ఎప్పుడు ఇంటికొస్తాడో వాడికే తెలియదు. ఆఫీసు కూడా దగ్గరేమీ కాదు. అలసిపోయి వస్తాడు. ఆఫీసులో ఉన్నా వాడి మనసంతా మా మీదే ఉంటుంది. వీలున్నప్పుడల్లా ఫోను చేస్తూ ఏ ఇబ్బందీ లేదు కదా అని గుచ్చి గుచ్చి అడుగుతూనే ఉంటాడు. మా వాడి మాటలకు ఈయన విసుక్కుంటాడు కూడా. ఏం చేయాలి? అయినా ఇవన్నీ ఈయన కావాలని చేస్తున్నవి కాదు. ఏవీ గుర్తుండవు. ఎన్ని మందులో వాడుతున్నా గుణం కనిపించడం లేదు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఏదో ఒక ఇబ్బందిలో పడేస్తుంటారు మమ్మల్ని.

ఇక మీరన్నట్టుగానే మా వివరాలు రాసిన కాగితాల్ని ఈయన జేబుల్లో పెడుతూనే ఉంటాం. అవన్నీ చించి ఏ చెత్తబుట్టలోనో పడేస్తుంటారు. వీడికి ఫోను చేద్దామంటే వీడొక పట్టాన ఎప్పుడూ దొరకడు. ఏవో మీటింగులని, సెమినార్లని, కస్టమర్లని ... ఏవేవో చెబుతాడు. ఎందుకురా నీకూ, మాకూ ఈ కష్టాలు. పెళ్లి చేసుకుని మమ్మల్ని ఏ వృద్ధాశ్రమంలోనో పడేయ్ అంటే ఆ ఊసెత్తొద్దని కసురుకుంటాడు. అలుగుతాడు. ఏం చేయమంటారు? ఈ వయసులో సుఖం లేకుండాపో యింది'' కన్నీళ్లతో ఆవిడ గొంతు జీరబోయింది. ఇంక ఏమీ చెప్పలేక ఆగింది.

''అమ్మా ... అదే వద్దన్నాను. నాన్న చూడు దర్జాగా ఎలా ఉన్నారో! దొరక్కపోతే ఒక బాధ, దొరికాక ఇంకొకటీనా? అయ్యా మీ అందరికీ మరోమారు కృతజ్ఞతలు. నా ప్రయత్నంగా ఇంట్లో నమ్మకంగా ఉండి మా నాన్నని కనిపెట్టుకుని ఉండేవాళ్లకోసం చూస్తున్నాను. దానితోబాటు నాన్నని ట్రాక్ చేయడానికి 'బాడీ'లో అమర్చే ట్రాన్స్మిటరు రిసీవరు యంత్రాలు ఏ విధంగా పనికొస్తాయో అని కూడా నిపుణుల్నీ, డాక్టర్లనీ సంప్రదిస్తున్నాను..'' ఒకపక్క వాళ్లమ్మని ఓదారుస్తూనే మరోపక్క తాను చేస్తున్న ప్రయత్నాల గురించి మాతో చెప్పేడు.

నాణేనికి మరోవైపు విషయం స్పష్టమైనాక ఎవరైనా ఏమి మాట్లాడగలరు! ఈ కాలంలో కూడా అమ్మానాన్నలపై ఇంత శ్రద్ధ చూపిస్తున్న ఆ అబ్బాయిని చూస్తే గర్వంగా అనిపించింది.

నిద్ర కళ్లతో తూగుతున్న కొడుకుని చూస్తూ ''సరే నేను వెళతాను మరి'' అన్నారు సూరిగారు.

తల్లీ కొడుకుతో పాటు మేమిద్దరం ఆయనకి మనస్ఫూర్తిగా నమస్కరించాం. సూరిగారి మొహంలో ఆనందం కంటే నిండైన తృప్తి కనిపించింది. వెళ్తూ వెళ్తూ పెద్దాయనతో 'మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి' అని చెప్పి వెళ్లేడు.

అవీ ఇవీ మాట్లాడి ఆ ముసలాయన్ని, తల్లీ కొడుకుల్ని సాగనంపి ఇంట్లోకి వచ్చాం.



**''అవునవును. ఒక్కోమారు భుజాల మీద ముళ్లు గీరుకుపోయి ఉండేవి. ఎందుకమ్మా నీకా పూలు, ఇంట్లో ఉన్నాయి కదా, లేదంటే కొని తెస్తానంటే విచిత్రంగా నవ్వేది పోరా వెధవా అన్నట్టు. ఇప్పటికీ ఎవరైనా వయసు మళ్లినవాళ్లు అలా పూలు కోయడం చూస్తే అమ్మే గుర్తుకొస్తుంది''**

ఒక మంచి పనికి మా ఇల్లు వేదికైనందుకు సంతృప్తిగా అనిపించింది. అంతసేపూ చలిగాలిలో ఉన్నామని, దోమలు కుడుతున్నాయని స్పృహే లేదు మాకు.

ఇంతలో మా ఆవిడ ''మీరేమీ అనుకోనంటే ఒక విషయం చెబుతాను'' అంది.

''ఏమిటి?'' అన్నాను.

''ఏమీ అనుకోనంటేనే'' అంది మళ్లీ.

''చెప్పేదేదో చెప్పు ఎందుకిదంతా'' అన్నాను కాస్త విసుక్కుంటూనే.

''ఏమీ లేదు, అత్తయ్య కూడా ఇలాగే ప్రహరీ గోడ బయట నుండి ఇళ్లలోని పూలు కోసుకురావడానికి వీధుల్లోకి వెళ్లేవారు. మీరంతా వెళ్లి వెదికి వెదికి ఆమెని తీసుకొచ్చేవారు ... గుర్తుందా?'' అంది మా ఆవిడ.

''అవునవును. ఒక్కోమారు భుజాల మీద ముళ్లు గీరుకుపోయి ఉండేవి. ఎందుకమ్మా నీకా పూలు, ఇంట్లో ఉన్నాయి కదా, లేదంటే కొని తెస్తానంటే విచిత్రంగా నవ్వేది పోరా వెధవా అన్నట్టు. ఇప్పటికీ ఎవరైనా వయసు మళ్లినవాళ్లు అలా పూలు కోయడం చూస్తే అమ్మే గుర్తుకొస్తుంది'' అన్నాను సాలోచనగా తలూపుతూ.

దాన్ని సాగదీయడం ఇష్టంలేకనో, ఏమో ఆమె ఇంకేమీ మాట్లాడలేదు. కానీ, నేను కూడా కొన్నాళ్లకు అలా అయిపోతానేమోనన్న భయం ఆమె కళ్లలో కనిపించింది నాకు.

........................................................

రచయిత సెల్: **99083 47273**

మాదిగలు సామాజికంగా తక్కువ స్థాయిలో, బీదరికంలో మగ్గుతున్నా, ఏ పనులు చేస్తున్నా వారిలో ఒక ఆధ్యాత్మిక చింతన, అన్వేషణ మొదట్నుండీ ఉందని, తాత్త్విక జిజ్ఞాస, ఆధ్యాత్మిక గమ్యాల గురించిన ఆలోచన కుల మతాలకు అతీతంగా ఉంటుందని, కొత్త మతాలు, ఆచారాలు పుట్టుకొచ్చి ఆ జిజ్ఞాసకు కొన్ని భౌతిక రూపాలనిస్తాయని ఈ పుస్తకం చక్కగా నిరూపిస్తుంది.




మాదిగల పుట్టుపూర్వోత్తరాల గురించి, ఆచార వ్యవహారాల గురించి, ఆధ్యాత్మిక ప్రవృత్తుల గురించి పరిశోధన చేసి 'ఎమ్మా రొషాంబు క్లౌ' రాసిన పుస్తకం 'చెప్పులు కుడుతూ ... కుడుతూ ...' ఆమె 1870–80 ప్రాంతాల్లో మిషనరీ ఫాదర్‌గా పనిచేసే భర్త క్లౌతో పాటు ఒంగోలులో నివసించారు.

ఆ కాలంలో అనేకమంది మాదిగలు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిష్యుల బోధనలతో ప్రభావితులైనట్లు ఈ పుస్తకం వలన తెలుస్తుంది. గురువుల ఉపదేశం పొంది వారు చెప్పిన ఆచారాలు పాటించేవారు. నాజరయ్య అనే గురువు చాలా ప్రసిద్ధుడు. నాజరయ్య

# విలువైన చరిత్ర పుస్తకం

మతం అని అతని పేరుతోనే ఒక మతం ప్రచారంలో ఉండేది, అనేక మంది మాదిగలు ఆ మతాన్ని అనుసరించారు. కాలక్రమేణా వీరబ్రహ్మేంద్రస్వామిని అనుసరించే మాదిగలు ఎక్కువమంది క్రైస్తవమతంలోకి వచ్చారు. వీరబ్రహ్మేంద్రస్వామి చేసిన సామాజిక విమర్శను ఆమోదించినవారికి క్రైస్తవులు చేసిన కొన్ని భారతీయ సామాజిక విమర్శలు కూడా సబబుగా తోచి ఉండవచ్చు. బహుదేవతారాధనను నిరసించి ఏకేశ్వరోపాసనలోకి రావటం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆహార విషయంలో కొన్ని నియమాలు – ఇవీ క్రైస్తవం తొలినాళ్లలో ప్రచారం చేసిన విషయాలు.

ఇదలా ఉంచితే మత మార్పిడి జరిగినప్పుడు వ్యక్తులుగా, కుటుంబాలుగా ఎంత సంక్షోభం అనుభవించాల్సి ఉంటుందో కొన్ని ఆసక్తికరమైన అనుభవాల ద్వారా ఈ పుస్తకం చెప్పింది. అందరూ అనుసరించే మార్గం నుండి మొదటిసారి విడివడి ఒక్కొక్కరుగా నడవటానికి ఎంత బలం కావాలో, వారి కుటుంబ సభ్యులకు అది భరించటం ఎంత కష్టమో, మళ్లీ వారు ప్రధాన మార్గంలోకి రావటమో లేక వీరే ఆ వ్యక్తి కోసం కొత్త మార్గాన్ని అనుసరించటమో జరిగేలోపు కుటుంబ సంబంధాలలో, మానవసంబంధాలలో ఎంత ఘర్షణ, రాపిడి జరుగుతుందో ఈ పుస్తకంలోని వాస్తవ ఘటనలు చదివితే అర్థమవుతుంది. ఇది ఈ పుస్తకంలోని అత్యంత ఆసక్తికరమైన మానవ సంబంధాల కథనం.

ఇక 1876 – 78 సంవత్సరాలలో వచ్చిన అతి భయంకరమైన కరువు సమయంలో మిషనరీలు చేసిన సేవ వల్ల, ఉపాధి కల్పన వల్ల మత మార్పిడులు ఎక్కువగా జరిగాయనే వాదనను అంగీకరించటం సరైందా కాదా అనే ఉప చర్చను కూడా ఈ పుస్తకం రేకెత్తిస్తుంది. ఐతే మతానికి ఆధ్యాత్మిక ప్రపంచంతో, అక్కడి లాభనష్టాలతో ఎంత సంబంధం ఉందో భౌతిక ప్రపంచంతో, అక్కడి లాభనష్టాలతో అంతకంటే ఎక్కువ సంబంధం ఉంది. భౌతిక ప్రపంచం, అందులో లాభనష్టాలు లేకపోతే అసలు మతానికి ఉనికే లేదు. సామాన్య ప్రజలు ఇహలోకంలో తమ జీవితం కోసమే పరలోక ప్రభువుకు ప్రార్థనలు చేస్తారు. ఆ క్రమంలో వారికి ఇహలోకం కంటే పరలోకం మీద ఆసక్తి పెరగవచ్చు. కానీ మతం ఎక్కువమంది జీవితాల్లోకి భౌతిక జీవితావసర కారణాలవల్లే వస్తుంది. అందువల్ల మిషనరీలు మాదిగలకు కల్పించిన సాంఘికస్థాయి వల్ల, చేసిన సేవ వల్ల వారు క్రైస్తవంలోకి మారితే అందులో వింతేమీ లేదు. తప్పుపట్టటానికి కూడా ఏమీ లేదు. అవిద్యలో, అనారోగ్యాలతో ఉన్న వలస దేశాల ప్రజలకు విద్య, ఆరోగ్యం అందించాలనే సేవాభావంతో వచ్చినవారు అవి అందించి ఊరుకోలేదు. తమ విద్య, ఆరోగ్యాలకు కారకునిగా తాము నమ్ముతున్న ప్రభువుని కూడా వారికి అందించాలని తాపత్రయపడ్డారు.

నిజానికి చర్చ జరగాల్సింది ఈ విషయం మీద కాదు. ఈ పుస్తకంలోని వాస్తవ సమాచారం వల్ల మనకు తెలిసిన మాదిగల ఆధ్యాత్మిక జిజ్ఞాస గురించి. దానిని నిరూపించటం, ఆ జిజ్ఞాస క్రమ పరిణామాన్ని గుర్తించటం వల్ల ఇప్పటి వారి సాంఘిక స్థాయికి చేకూరే ప్రయోజనం ఏమైనా ఉంటుందా? వివిధ సాంఘిక స్థాయిలలో, అంతరాలలో ఉన్న భిన్న వర్గాల, వర్ణాల ప్రజల ఆధ్యాత్మిక ఆలోచనను పోల్చి చూసేందుకు ప్రయత్నం జరిగితే ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది.

19 వ శతాబ్దపు తొలి సంవత్సరాలలో మాదిగల భౌతిక, ఆధ్యాత్మిక జీవన పరిస్థితులను డాక్యుమెంట్ చేసిన విలువైన పుస్తకం 'చెప్పులు కుడుతూ ... కుడుతూ...'.

– ఓల్గా

**చెప్పులు కుడుతూ ... కుడుతూ ...**
**ఆంగ్లమూలం:** ఎమ్మా రొషాంబు క్లౌ, **తెలుగు:** వి.వి.న.మూర్తి
**పేజీలు:** 102, **వెల:** రూ. 30/–
**ప్రతులకు:** విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌస్

## తెలుగు జాతి రత్నాల్లో మరికొన్ని...

స్వామినీన ముద్దు నరసింహ నాయుడు– డా. కొల్లు వెంకటేశ్వరరావు; పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య– డా. వెలగా వెంకటప్పయ్య; సి.యస్.యన్. పట్నాయక్– రావెల సాంబశివరావు; బూర్గుల రామకృష్ణారావు– ఆచార్య వెలుదండ నిత్యానందరావు; డా. వై.నాయుడమ్మ– డా.సోమరాజు సుశీల; యేనుగుల వీరాస్వామి– డా. మచ్చ హరిదాసు; శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం (నూటపది సంవత్సరాల చరిత్ర)– దేవులపల్లి ప్రభాకరరావు.

ప్రతులకు : సి.పి.బ్రౌన్ అకాడమీ, 53, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్–82









# అనుగ్రహం

**25-31 మార్చి 2012**

డాక్టర్ పి.ఎ.రామన్



**మేషం:** అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

ఈ వారం ఒత్తిడి తగ్గి మానసిక ప్రశాంతత నెలకొంటుంది. కొత్త వ్యవహారాలపై దృష్టి సారిస్తారు. రోజువారీ ఖర్చులే ఉంటాయి. కుటుంబ సమేతంగా ఒక పుణ్యక్షేత్రం సందర్శిస్తారు. స్త్రీల ఉద్యోగ యత్నం ప్రోత్సాహకరంగా సాగుతుంది. వ్యాపారాల్లో లాభ నష్టాలను సమీక్షించుకుంటారు. కొత్త పనివారల విషయంలో జాగ్రత్త. ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం కూడదు. ఉద్యోగుల ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్ యత్నాలు ఫలించవు.



**వృషభం:** కృత్తిక 2,3,4; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

ధనమూలక సమస్యలు, రుణదాతల ఒత్తిడి అధికం. మీ గౌరవ మర్యాదలకు భంగం కలుగకుండా జాగ్రత్తగా ఉండాలి. దంపతుల మధ్య కలహాలు, చికాకులు తలెత్తుతాయి. ఆది, సోమవారాల్లో ఏ పనీ సక్రమంగా సాగక విసుగు చెందుతారు. ఆత్మీయుల హితవు మీపై మంచి ప్రభావం చూపుతుంది. మీ వ్యాపకాలు తగ్గించుకుని ఇంటి సమస్యలపై దృష్టి సారించండి. స్త్రీలకు ఆరోగ్యభంగం, పనివారలతో చికాకులు తప్పవు.



**మిథునం:** మృగశిర 3,4; ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పాదాలు

మీ యత్నాలకు ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ఒక సమస్య పరిష్కారం కావడంతో మనసు తేలికపడుతుంది. కుటుంబీకుల కోసం ధనం బాగా వ్యయం చేస్తారు. మంగళ, బుధ వారాల్లో హామీలు, అవగాహన లేని విషయాలకు దూరంగా ఉండాలి. వ్యాపారాల్లో నిలదొక్కుకోవడంతో పాటు అనుభవం గడిస్తారు. ప్రయాణం వాయిదా వేసుకోవలసి వస్తుంది. ఉద్యోగస్తులకు ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు అందుతాయి.



**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

శుభకార్యాల్లో బంధువుల ఆదరణ, ఆత్మీయులతో ఉల్లాసంగా గడుపుతారు. ముఖ్యమైన వ్యవహారాలు మీ చేతుల మీదుగానే సాగుతాయి. ఆదాయ వ్యయాలు సంతృప్తికరం. వృత్తి వ్యాపారాల్లో అనుకూల ఫలితాలు సాధిస్తారు. గురు, శుక్రవారాల్లో తొందరపాటు నిర్ణయాలు తగవు. కుటుంబ సభ్యులతో ప్రతి విషయం చర్చించటం క్షేమదాయకం. స్త్రీల ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతుంది. నిరుద్యోగులకు శుభవార్తా శ్రవణం.



**సింహం:** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఉన్నతాశయం, కొత్త ఆలోచనలతో మీ యత్నాలు సాగిస్తారు. ఖర్చులు పెరిగినా ఇబ్బందులుండవు. ప్రముఖులతో పరిచయాలు, కార్యకలాపాలు విస్తరిస్తాయి. లౌక్యంగా మెలిగి మీ పనులు చక్కబెట్టుకుంటారు. శనివారం నాడు చిన్న చిన్న పొరపాట్లు దొర్లే ఆస్కారం ఉంది. మీ శ్రీమతి ఆకస్మిక ప్రయాణం ఇబ్బంది కలిగిస్తుంది. వ్యాపారాల అభివృద్ధికి కొత్త కొత్త పథకాలు, ప్రణాళికలు రూపొందిస్తారు.



**కన్య:** ఉత్తర 2,3,4; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఏ పని తలపెట్టినా మొదటికే వస్తుంది. నిరుత్సాహపడకుండా మీ యత్నాలు సాగించండి.ఊహించని ఖర్చులుంటాయి. ధనం మితంగా వ్యయం చేయాలి. ఆది, సోమవారాల్లో ఏది జరిగినా మంచికేనని భావించండి. ఆస్తి పంపకాల వ్యవహారంలో పెద్దలతో విభేదిస్తారు. మీ శ్రీమతి వ్యాఖ్యలు మనశ్శాంతి లేకుండా చేస్తాయి. వ్యాపారులు గుమస్తాలు, పనివారలతో జాగ్రత్తగా ఉండాలి. భాగస్వామిక ఒప్పందాల్లో ఆచితూచి వ్యవహరించాలి.



**తుల:** చిత్త 3,4; స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక స్థితి గతం కంటె కొంత మెరుగ్గా ఉంటుంది. కుటుంబ విషయాల పట్ల శ్రద్ధ వహిస్తారు. ఆత్మీయుల హితవు మీపై మంచి ప్రభావం చూపుతుంది. అర్థంతరంగా నిలిపివేసిన పనులు పూర్తి చేస్తారు. మంగళ, బుధ వారాల్లో మంచి మాటలతో ఎదుటివారిని ప్రసన్నం చేసుకోవడానికి యత్నించండి. స్త్రీలకు ఆహ్వానాలు, వస్త్రప్రాప్తి, ధనలాభం వంటి ఫలితాలున్నాయి. జాయింట్ వెంచర్లు, నూతన పెట్టుబడులకు అనుకూలం.



**వృశ్చికం:** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

బంధుమిత్రుల నుంచి ఆహ్వానం అందుకుంటారు. ఒక శుభకార్యానికి వెళ్లాలనే ఆలోచన బలపడుతుంది. మీ పనులు, కార్యక్రమాలు అనుకున్న విధంగా సాగుతాయి. ఆది, గురువారాల్లో ఖర్చులు అధికం. మీ అవసరాలకు కావలసిన ధనం సర్దుబాటు కాగలదు. దంపతుల మధ్య ప్రేమానురాగాలు బలపడతాయి. ఆహార, ఆరోగ్య విషయంలో జాగ్రత్త, ఉమ్మడి వ్యవహారాలు, నూతన వ్యాపారాలు సమర్థంగా నిర్వహిస్తారు.



**ధనస్సు:** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

పుణ్యక్షేత్ర సందర్శనలు, ఆకస్మిక ధన, వస్తు లాభం వంటి ఫలితాలున్నాయి. మిమ్మలను వ్యతిరేకించే వారిని సైతం మీ వైపునకు తిప్పుకుంటారు. ఆదాయ వ్యయాలు మీ అంచనాలకు తగ్గట్టుగా ఉంటాయి. మంగళ, శనివారాల్లో చేపట్టిన పనులు పూర్తికాక విసుగు కలిగిస్తాయి. మీ సంతానం విజయం సంతోషపరుస్తుంది. స్త్రీలకు అయిన వారిని చూడాలనే కోరిక స్ఫురిస్తుంది. మీ అలవాట్లు, బలహీనతలు అదుపులో ఉంచుకోవాలి.



**మకరం:** ఉత్తరాషాఢ 2,3,4; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ముఖ్యమైన వ్యవహారాలు మీ చేతుల మీదుగా సాగుతాయి. ఇంట ఒక శుభకార్యం నిశ్చయమవుతుంది. కల్యాణ మంటపాల కోసం యత్నాలు సాగిస్తారు. అప్రయత్నంగా ఒక అవకాశం కలిసి వస్తుంది. ఆదాయ వ్యయాలు మీ అంచనాలకు భిన్నంగా ఉంటాయి. గురు, శుక్ర వారాల్లో పెద్ద మొత్తం నగదుతో ప్రయాణం మంచిది కాదు. తలపెట్టిన పనుల్లో చిన్న చిన్న ఆటంకాలెదురవుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో పురోభివృద్ధి సాధిస్తారు.



**కుంభం:** ధనిష్ఠ 3,4; శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఊహించిన దానికంటె అధికంగా వ్యాపారాలు సాగుతాయి. వ్యాపారాల్లో లాభనష్టాలు సమీక్షించుకుంటారు. మీ తప్పిదాలను సరిదిద్దుకోవడం ఉత్తమం. శనివారం నాడు మీ కార్యక్రమాలు,పనులు మందకొడిగా సాగుతాయి. దంపతుల మధ్య అవగాహన నెలకొంటుంది. ఇతరులను మీ విషయాలకు దూరంగా ఉంచండి. వృత్తి, ఉద్యోగాల్లో ఆశాజనకమైన మార్పులుంటాయి. హామీలు, మధ్యవర్తిత్వాల వల్ల చిక్కుల్లో పడే ఆస్కారం ఉంది.



**మీనం:** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఈ వారం మీ యత్నాలు గుట్టుగా సాగించాలి. ఆర్థిక విషయాల్లో ఎవరినీ అతిగా విశ్వసించడం మంచిది కాదు. కుటుంబ సమేతంగా శుభకార్యాల్లో పాల్గొంటారు. రావలసిన ధనంలో కొంత మొత్తం చేతికందుతుంది. కోర్టు వ్యాజ్యాలు విచారణకు రాగలవు. పెద్దల ఆరోగ్యం క్రమంగా కుదుటపడుతుంది. ప్రముఖులతో సంప్రదింపులకు అనుకూలం. వ్యాపార విస్తరణకు అనుమతులు, వనరులు సమకూర్చుకుంటారు.

# బిట్ బ్యాంక్

నత్త మూడేళ్ళ పాటు నిద్రావస్థలో ఉండగలదు.



వేగంగా స్విమ్మింగ్ చేసే వ్యక్తి అత్యధికంగా గంటకు 6 మైళ్ళ దాకా ఈదగలడు. అదే డాల్ఫిన్ అయితే గంటకు 35 మైళ్ళు ఈదగలదు.



చిరుత గంటకు 76 (46 మైళ్లు) కిలోమీటర్ల వేగంతో పరుగెడుతుంది. మనిషి మహా అయితే గంటకు 30 (18 మైళ్లు) కిలోమీటర్ల వేగం మాత్రమే పరిగెట్టగలడు.



గొరిల్లా డి.ఎన్.ఎ మానవుని డి.ఎన్.ఎ.తో 95% నుంచి 99% సరిపోతుంది.



మహిళలు పురుషుల కంటే రెట్టింపు సార్లు కనురెప్పలు ఆర్పుతారు.

ఎడారిలో నీళ్ళు లేకుండా ఎక్కువకాలం జీవించే జంతువు ఏదంటే... సాధారణంగా ఒంటె అని చెప్పేస్తాం. కానీ ఒంటె కంటే ఎలుకే నీళ్ళు లేకుండా ఎక్కువకాలం ఉండగలదు.





గోల్డ్ ఫిష్‌ను చీకటి గదిలో ఉంచితే అది క్రమంగా తెలుపు రంగులోకి మారుతుంది.

ఎడమచేతివాటం ఉండేవారు ప్రపంచంలో 10 శాతం మంది ఉంటారు.



ఏటా ప్రపంచంలో 5 కోట్ల కొత్తకార్లు రోడ్డు మీదకు వచ్చి చేరుతున్నాయి.

మీ పుట్టినరోజునాడే ప్రపంచంలో మరో 90 లక్షల మంది పుట్టినరోజు జరుపుకొంటుంటారు.



అమెరికాలో రోజుకి సగటున 18 ఎకరాల విస్తీర్ణం గల పిజ్జాలని తింటారు.



ఉష్ట్రపక్షి 75 ఏళ్ళు జీవిస్తుంది. యాభై ఏళ్ళ వరకు సంతానోత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది.

ఇంగ్లీషు మాట్లాడేవారు అమెరికాలో కంటే చైనాలోనే ఎక్కువ.



సూర్యుడు భూమికంటే 3,30,330 రెట్లు పెద్దది.

# రమేశ్చంద్ర మహర్షి

సెల్: 92465 82255
ఫోన్: 040-6522 5554

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలూ, అహంకారం, బుద్ధి, ప్రకృతి, పంచ జ్ఞానేంద్రియాలూ, పంచ కర్మేంద్రియాలూ, మనసూ అనే పదకొండు ఇంద్రియాలూ, శబ్ద, రూప, స్పర్శ, రస గంధాలనే ఇంద్రియ విషయాలూ కోరిక, ద్వేషం, తెలివి, సుఖం, దుఃఖం, ధైర్యం ... వీటి వికారాలూ కలిసి ఏర్పడే క్షేత్రం ... మనిషి! ఆ మనిషికి భవిష్యత్తునే దారి చూపే నేత్రం, జ్యోతిశ్శాస్త్రం!!

★★★

కృతే కార్యే కిం ముహూర్త ప్రశ్నేన?

పని ముగిసిన పిదప ముహూర్తమడగడం, జరగకూడనిది జరిగిపోయాక పరిహారాలు పాటించడం వలన ఏంటి ప్రయోజనం?

భవిష్యత్ ముందే తెలిస్తే ముప్పు నుండి తప్పించుకోవడం లేదా తగ్గించుకోవడం సాధ్యమే!

కాలః క్రీడతి గచ్ఛత్యాయుః

కాలం ఆడుకుంటూ ఉంటుంది. ఆయువు గతించిపోతూ ఉంటుంది. రాబోయే మంచి చెడ్డలు తెలిస్తే ఉన్నంతలోనే ఉన్నతంగా జీవించగలుగుతాం!

వయం భగవంతః స్యామ

మనమందరమూ భాగ్యశాలురమవుదుముగాక!

★★★

పాఠకులు తమ భవిష్యత్తుకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఈ క్రింది వివరాలు రాసి పంపండి.

పేరు ......................................

పుట్టిన తేదీ ..............................

పుట్టిన సమయం ........................

పుట్టిన ఊరు (మండలం) ...........

ప్రశ్న ......................................

పుట్టిన తేదీ వివరాలు లేని వారు 1 నుండి 249 వరకూ ఏదో ఒక సంఖ్య వ్రాసి పంపండి. (ఇది న్యూమరాలజీ కాదు, కృష్ణమూర్తి పద్ధతిలోని 249 సబ్స్).

**మీ ప్రశ్నలు పంపవలసిన చిరునామా**

**అదృష్ట రత్నజ్యోతి,**

ఆంధ్రజ్యోతి దినపత్రిక, ప్లాట్ నెం. 76,
అశ్విని లే-అవుట్, జూబ్లీహిల్స్,
హైదరాబాద్ - 500 033.

# అదృష్ట రత్నజ్యోతి

**ఎ.పి., హైదరాబాద్**

మా అమ్మాయి రత్నధారణ గురించి వివరించగలరు.

మీ అమ్మాయి జన్మకుండలి ప్రకారం ధరించాల్సిన రత్నాలు పచ్చ, వజ్రం విడివిడిగా. పచ్చ ధరిస్తే ఫలితాలు ఉద్యోగంలో ఉన్నతి, ధన యోగం ఇబ్బడి ముబ్బడిగా పనిచేయడం, గొప్ప మిత్రలాభం. వజ్రం ధరిస్తే ఫలితాలు అదృష్టం, సుఖపడడం, వైవాహిక జీవితంలోని సమస్యలు దూరమవ్వడం.

మీ నక్షత్రం రోహిణి అని ముత్యం ధరించకూడదు. ధరిస్తే వైవాహిక జీవితంలో పోరాటాలు ప్రారంభమవుతాయి. నడుస్తున్నది రాహు దశ అని గోమేధికం కూడా ధరించకూడదు. ధరిస్తే కెరీర్ బాగుంటుంది కానీ మనశ్శాంతి ఉండదు.

**ఎన్.ఎన్.ఆర్, నెల్లూరు**

ఎన్నో కష్టాలు, ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదు. ఈ సంవత్సరం నుండి పాడిపశువులు పెట్టి, మిల్క్ డెయిరీ ఫామ్ పెట్టాలనుకుంటున్నాను. ఏ రత్నం ధరిస్తే కలిసి రాగలదు. వివరించండి.

మీ జన్మకుండలి ప్రకారం మీ నక్షత్రం విశాఖ. కనక పుష్యరాగం ధరించాలి. 2010 నుండి 17 సంవత్సరాలు పాటు నడిచే ప్రస్తుత బుధ దశ బిజినెస్‌లో మంచి ఫలితాలనిస్తుంది. రాశి తుల అని వజ్రం ధరించకూడదు.

**జి.ఎస్., కరీంనగర్**

నా సమస్యలకు ఒక రత్నం చెప్పగలరు.

పచ్చ+వజ్రం అలాగే ఒక నీలం ధరించండి.

**ఎమ్.బి.వి.ఆర్., తెనాలి**

కుడి చేతి ఉంగరం వేలికి పగడం ధరిస్తున్నాను.

మీ జన్మకుండలి ప్రకారం పగడం ఎప్పుడు గానీ ధరించకూడదు. ధరిస్తే ఇప్పుడు మీరు వ్రాసిన సమస్యలన్నీ మరింత పెరుగుతాయి. మీ నక్షత్రం మూల అని వైఢూర్యం ధరించకూడదు. వెంటనే ఒక పచ్చ ధరిస్తే మీ సమస్యలు పరిష్కరించబడతాయి. రాహు దశ నడుస్తుందని గోమేధికం, ధనూరాశి అని కనకపుష్యరాగం ధరించకూడదు.

**కె.కె.ఆర్., నెల్లూరు**

మా బాబు జన్మకుండలి ప్రకారం ధరించవలసిన రత్నాలు తెలుపగలరు.

మీ బాబు జన్మకుండలి ప్రకారం ధరించాల్సిన రత్నాలు నీలం+పచ్చ. ఫలితాలు పిజి, విదేశ నివాసం. నక్షత్రం స్వాతి అని గోమేధికం ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు యాక్సిడెంట్స్, ధన నష్టం, అవమానాలు. 2007 జూన్ నుండి 2023 మార్చ్ వరకూ గురు దశ. అప్పటి నుండి 19 సంవత్సరాలు శని దశ. ప్రస్తుతం నడిచేది గురుదశ అని పుష్యరాగం ధరించకూడదు. ధరిస్తే పిజి ఉండదు. అన్నీ అవరోధాలే. పూర్తి స్థాయి విదేశ నివాసం శని దశ నుండి. అప్పటి వరకూ విదేశ యానాలు మాత్రమే ఉంటాయి.

**ఎస్.ఆర్., భైంసా**

నా సమస్యలకి ఏ రత్నం ధరించాలో చెప్పగలరు.

మీ జన్మకుండలి ప్రకారం ధరించాల్సిన రత్నాలు పచ్చ+వజ్రం. ఫలితాలు రుణ విముక్తి. అదృష్టం. అలాగే కెంపు. ఫలితాలు స్థిరచరాస్తులు, సమాజంలో ప్రతిష్ఠ పెరగడం. మీ రాశి ధనుస్సు అని కనకపుష్యరాగం ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు మీ పిలక తీసుకెళ్ళి మీ శత్రువుల చేతుల్లో పెట్టినట్టే. అలాగే ధననష్టం.

**పి.ఎస్.కె., కరీంనగర్**

నేను ధరించాల్సిన రత్నం తెలుపగలరు.

మీ నక్షత్రం ఆరుద్ర. మీరు ధరించాల్సిన రత్నం గోమేధికం.

**ఎన్.జి.టి., తాండూరు**

ఏ రత్నం ధరించాలీ వివరించగలరు.

మీ జన్మకుండలి ప్రకారం 1995 నవంబర్ నుండి బుధ దశ. మీరు ధరించాల్సిన రత్నం పచ్చ. ఫలితం వృత్తిలో స్థిరత్వం.. మీ నక్షత్రం ఉత్తరాభాద్ర అని నీలం ధరించకూడదు.

**ఎం.ఆర్., యలమంచిలి**

నేను ఏ రత్నం ధరించాలో చెప్పగలరు.



మీరు ధరించాల్సిన రత్నాలు పచ్చ+వజ్రం. ఫలితాలు వృత్తిలో వేగం, ఉన్నతి, ధనం, గుర్తింపు, ఆరోగ్యం. మీ నక్షత్రం కృత్తిక, మీకు యోగకారకుడు సూర్యుడు అని కెంపు ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు స్థిరచరాస్తుల వలన సమస్యలు, అశాంతి, ఆయుర్భావం బలహీనమవ్వడం, ధన నష్టం. మరో యోగకారకుడు శని అని నీలం కూడా ధరించకూడదు. ధరిస్తే ఫలితాలు ఇప్పుడు చెప్పుకున్నవే. ప్రస్తుతం నడుస్తున్నది రాహు దశ అని గోమేధికం ధరించకూడదు. 2014 సెప్టెంబర్ నుండి నడిచేది గురు దశ అని అప్పుడు గానీ, ఎప్పుడు గానీ పుష్యరాగం పొరపాటున కూడా ధరించకూడదు.

**టి.బి., గాంధారి, నిజామాబాద్.**

మా అబ్బాయికి ఏ రత్నం ధరించాలి?

మీ అబ్బాయి జన్మకుండలి ప్రకారం ధరించాల్సిన పగడం, కెంపు విడివిడిగా. పగడం ధరిస్తే మీరు చెప్పిన ఆరోగ్య సమస్యల నుండి విముక్తి. కెంపు ధరిస్తే కెరీర్‌లో మంచి ఉన్నతి. అలాగే వైవాహిక జీవితం మీద.... జరగడంతో సహా ప్రభావం చూపిస్తున్న కాలసర్ప దోషానికి గట్టి రెమిడీస్ పాటించాలి. లగ్నాధిపతి నీచపట్టడానికి రెమిడీస్ పాటించాలి. నక్షత్రం జ్యేష్ఠ అని పచ్చ ధరించకూడదు. వృత్తిలో తీవ్రమైన ఆటంకాలేర్పడతాయి. నడుస్తున్నది శుక్ర దశ అని వజ్రం ధరించకూడదు. ధరిస్తే పూర్తి స్థాయిలో భార్య చేతిలో కీలుబొమ్మవడం జరుగుతుంది.

పుస్తక ప్రపంచంలో ఒక మహా ఆవిష్కారం '**అధినేత**'. 1992లో సంచలనం సృష్టించిన రమేశ్చంద్ర మహర్షి విరచిత '**అధినేత**' ఇప్పుడు ఎమెస్కో వారి ద్వారా మార్కెట్లోకి విడుదలయింది. ప్రతులకు: 98499 92892.
Advt

కేరింత

మీకు తెలుసా?

# ఒలింపిక్ రాజధాని



నాలుగేళ్ళకోసారి ఒలింపిక్ గేమ్స్ జరుగుతాయి అని తెలుసు కదా. ఈ ఏడాది అవి లండన్‌లో జరగనున్నాయి. ప్రతిష్ఠాత్మకమైన ఈ క్రీడలకు ఒక రాజధాని ఉంది. ఎల్లప్పుడూ ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండే స్విట్జర్లాండ్‌లోని లాసన్నె అనే బ్యూటిఫుల్ సిటీయే ఒలింపిక్ క్రీడల రాజధాని. 1915 నుంచి అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఇక్కడే సమావేశమవుతోంది. ఆధునిక ఒలింపిక్ క్రీడల వ్యవస్థాపకుడు బారెన్ పియరీ డి కోబర్టిన్ సమాధి కూడా ఇక్కడికి దగ్గర్లోనే ఉంటుంది. స్ప్లెండిడ్ పార్కులో ఒలింపిక్ మ్యూజియం ఒకటుంది. ఇది చిన్నారులకు ఎంతో విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తుంది. ఈ మ్యూజియంలో అనేక రకాల ఒలింపిక్ పసిడి పతకాలు, వివిధ రకాల ఒలింపిక్ క్రీడా జ్యోతులను చూడొచ్చు.

# ఉచితంగా విజ్ఞానం



పిల్లలూ! ఇకపై మొబైల్‌లోనే మీరు సైన్స్ సమాచారం తెలుసుకోవచ్చు. చేతిలో మొబైల్ ఉంటే చాలు క్షణాల్లో సమాచారం మీ చేతిలో ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. విజ్ఞాన్ ప్రసార్, ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారు సంయుక్తంగా ఈ సౌకర్యాన్ని ఉచితంగా కల్పిస్తున్నారు. దీని కోసం science@mobile అనే అప్లికేషన్‌ని ఇటీవల జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవాల్లో ప్రారంభించారు. శాస్త్రవేత్తల గురించిన తాజా సైన్స్ సంగతులను ఎస్ఎంఎస్ రూపంలో చిటికెలో మీకు చేరవేస్తారు. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే... విజ్ఞాన్ ప్రసార్ వెబ్‌సైట్‌ని క్లిక్ చేసి అందులో మీ మొబైల్ నెంబరును రిజిస్టర్ చేసుకోవడమే.

# రంగులు వేయండి



# నా బొమ్మ





పాతిన చిరంజీవి, 10వ తరగతి,
బాలుర పాఠశాల, జింకభద్ర, శ్రీకాకుళం జిల్లా.

## జవాబులు

**చెప్పండి చూద్దాం** 1. 1981లో. 2. చైనాలో క్రీస్తు పూర్వం 2737లో కనుగొన్నారు. 3. 'flutterby' 4. హమ్మింగ్‌బర్డ్. దాని బరువు ఒక ఔన్స్. 5. 1375 గ్రా.(55 ఔన్స్)

**గుర్తుపట్టండి** 1. ఏక్తాకపూర్ (చలనచిత్ర నిర్మాత), 2. చందాకొచ్చార్(ఐసీఐసీఐ బ్యాంక్ ఎండి, సి.ఇ.ఒ.), 3. వినీతా బాలి(బ్రిటానియా ఇండస్ట్రీస్ ఎండి), 4. కిరణ్ ముజుందార్ షా(బయోకాన్ సి.ఇ.ఒ.), 5. మల్లికా శ్రీనివాసన్ (టి.వి.ఎస్.ట్రాక్టర్స్, వ్యవసాయ పరికరాల విభాగం ఛైర్‌పర్సన్)

**పద విన్యాసం** 1. నొసలు, 2. పరులు, 3. దిగులు, 4. గుబులు, 5. బదులు, 6. పగులు, 7. వదులు, 8. ఒడలు, 9. కురులు, 10. చేవ్రాలు



# కేరింత

## గుర్తుపట్టండి

    

ఫోర్బ్స్ పత్రిక ఆసియాలో శక్తివంతమైన మహిళా వ్యాపార దిగ్గజాల జాబితాను మొదటిసారిగా ఇటీవల విడుదల చేసింది. వారిలో కొంతమంది దిగువన ఉన్న ఫోటోల్లో ఉన్నారు. వారి పేర్లను గుర్తుపట్టండి.

## పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో 'లు' చివర గల పదాలను పూరించండి.

| | | | |
|---|---|---|---|
| 1. నుదురు | | | లు |
| 2. ఇతరులు | | | లు |
| 3. విచారం | | | లు |
| 4. ఆందోళన | | | లు |
| 5. అప్పు | | | లు |
| 6. బీట | | | లు |
| 7. బిగువుకాదు | | | లు |
| 8. శరీరము | | | లు |
| 9. కేశలములు | | | లు |
| 10. సంతకం | | | లు |

నిర్వహణ : చేబియ్యం రామారావు

## చాక్లెట్‌తో జాగ్రత్త



అవునా?

చాక్లెట్ తింటే ఎవరైనా బరు వెక్కుతారని తెలుసు. కానీ శున కాలు చాక్లెట్ తింటే చనిపోతా యట. చాక్లెట్ దాని గుండె పైనా, నరాలపైనా వెంటనే ప్రభావం చూపెడుతుందట. దాంతో అవి త్వరగానే చనిపో తాయి. కొద్దిపాటి చాక్లెట్ తింటే చాలు అక్కడికక్కడే ప్రాణా లొదులుతుంది. అందుకే డాగ్ ప్రేమికులూ చాక్లెట్‌తో జాగ్రత్త.

## దారి కనుక్కోండి



## చెప్పండి చూద్దాం



1. మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ కవల పిల్లలు ఏ సంవత్సరంలో జన్మించారు?
2. మనం రోజూ తాగే టీని ఎప్పుడు, ఎక్కడ కనుగొన్నారో తెలుసా?
3. Butterfly ఒరిజినల్ పేరు తెలుసా?
4. ప్రపంచంలో అతిచిన్న పక్షి ఏది? దాని బరువు ఎంత?
5. పురుషుని మెదడు సగటు బరువు ఎంత?

అరవై ఏళ్ల క్రితమే సినిమాల్లో నటించాలనే కోరికతో కడప నుండి మద్రాసు పారిపోయి 'కలనిజమాయెగా ... కోరిక తీరెగా' అంటూ వెండితెరపై అభినయించిన నటి పుష్పలత. కథా నాయికగా అంతగా ప్రాచుర్యం పొందలేకపో యినా 'సంసారం' చిత్రంలో 'మహానటి సావిత్రి' స్థానంలో అక్కినేనికి జోడీగా నటించి అందరి దృష్టిలో పడ్డారు. పెళ్లి చేసిచూడు, చంద్రహారం, ఆడబిడ్డ, చెరపకురా చెడేవు లాంటి మరికొన్ని చిత్రాల్లో నటించారు. కలకాలం నటించాలనే కల నిజం కాకుండానే సంసార సాగరంలో మునిగి 'సంసారం పుష్పలత'గా మిగిలిపో యారు. ఆమె తలపోతలే ఈవారం జ్ఞాపకాలు.



# సావిత్రి స్థానంలో ఎలా వచ్చానో నాకే తెలీదు

మాది ద్రోణాచలం. మా ఇంట్లో మా బంధువులెవ్వరికీ సినిమా వాళ్ళతో పరిచయాలు గానీ, సంబంధాలు గానీ ఏవీ లేవు. మేము రాయలసీమలోని కడపలో ఉండేవాళ్ళం. నాకు చిన్నతనం నుంచీ సిని మాల్లో నటించాలని చాలా కుతూహలంగా ఉండేది. ఆ రోజుల్లో 'బాల రాజు' సినిమాలో అంజలీదేవి నాట్యం చేసిన 'తీయని వెన్నెల రేయి... ఎడబాయని చిన్నెల హాయి' అన్న పాట అంటే నాకు ఎంతో ఇష్టం. ఇంట్లో చీటికి, మాటికి నేను ఆ పాట పాడుతూ డాన్స్ చేస్తుంటే మా వాళ్ళందరూ తిట్టేవాళ్ళు. కాని ఆ పాటే నన్ను మద్రాసు లాక్కెళ్ళింది. నటిగా నాకు ప్రేరణ కూడా ఆ పాటే.

అదెలాగంటే, కడపలో నా స్నేహితురాలొకామె సినిమాల్లో వేషాలు వేస్తుండేది. ఆమె పేరు లీల. నన్ను, నా నృత్యాల్ని గమనించి ఆమె నన్ను కూడా సినిమాల్లో చేరమనేది. ఈ సంగతి మా అమ్మకు చెబితే "ఛీ... ఛీ... మన మరాఠీవాళ్ళు సినిమాల్లో వేషాలెయ్యడం గౌరవం కాదు" అని మందలించింది. సరేనని ఆ ప్రయత్నాన్ని విర మించుకున్నాను (తాత్కాలికంగా).

## నటిస్తానంటే ఒప్పుకోలేదు

ఒకనాడు నా స్నేహితురాలికి తంతి (టెలిగ్రాం) వచ్చింది. ఒక పిక్చరులో నటించడానికి బయలుదేరి మద్రాసు రమ్మని. ఆమె నన్ను కూడా వెంట తీసుకుపోయి సినిమాల్లో చేర్చుతానంది. ఈ సంగతి ఇంట్లో చెప్పేసరికి చాలా గొడవైపోయింది. మా అమ్మ అరచిన అరుపు లకు నాకు జ్వరమొచ్చేసింది. ఒక నెల షూటింగ్ జరిగాక నా స్నేహితు రాలు కడపకు తిరిగి వచ్చింది. మా ఇంట్లో వాళ్ళకు భయపడి ఆమె నన్ను స్వయంగా కలుసుకోకుండా వాళ్ళ పనిమనిషి చేత కబురు పంపుతూ ఉండేది. మేము రహస్యంగా కలుసుకునే వాళ్ళం.

ఒక పౌర్ణమి రోజు మా ఇంట్లో సత్యనారాయణ వ్రతం జరిగింది. మా అమ్మ నన్ను బీరువా సొరుగు లోంచి వెండి సామాను తీయ మంది. నేను ఆ సామానుతో పాటు రెండు వేల రూపాయలు కూడా తీసి రహస్యంగా నా దగ్గరే పెట్టుకున్నాను. ఆ మరుసటి రోజే నా స్నేహితురాలు తిరిగి మద్రాసు వెళుతోంది. నేను మా వాళ్ళకెవరికీ తెలీ కుండా ఆమె వెంట మద్రాసుకొచ్చేశాను. అమ్మో... ఆ సంఘటనను ఇప్పుడు గుర్తుచేసుకున్నా గుండె ఝల్లుమంటుంది. అప్పుడు అదెంత పెద్ద నిర్ణయమో తెలీలేదు.

## తొలి వేషం

నా దగ్గర ఉన్న డబ్బుతో నేనూ, నా స్నేహితురాలూ మంచి మంచి చీరెలూ, అవీ కొన్నాం. ఆ సమయంలో హాస్యనటుడు కస్తూరి శివరావు 'పరమానందయ్య శిష్యులు' (1950) తీస్తున్నారు. నా స్నేహితురాలు నన్ను శివరావుగారి ఆఫీసుకు తీసుకువెళ్ళి, నాకేదైనా వేషం ఇవ్వమని ఆయన్ను అడిగింది. నాకప్పుడు పదమూడేళ్ళు. అంచేత నాకు తగిన వేషం ఏదీ లేదని శివరావు గారు చెప్పారు. కానీ నా స్నేహితురాలు ఏ చిన్న వేషమైనా ఇవ్వమని, డబ్బు కూడా అవసరం లేదని చెప్పింది. 'పరమానందయ్య శిష్యులు'లో ఆ విధంగా అతి చిన్న వేషమొకటి చేశాను. అదే నా మొదటి చిత్రం. ఆ పిక్చరు పూర్తి కాక మునుపే నేను తెచ్చిన డబ్బంతా అయిపోయింది. ఏం చెయ్యాలో తోచక ఇంటికి జాబు రాశాను. జవాబు రాలేదు. టెలిగ్రాం ఇచ్చాను. మా వాళ్ళు ఇంటిల్లిపాదీ మద్రాసు వచ్చి వాలారు. వచ్చేటప్పుడు తల తాకట్టు పెట్టి నాలుగువేల రూపాయలు వెంట తెచ్చారు కూడా.

నేను ప్రపంచ జ్ఞానం లేక బుద్ధిమాలిన పని చేసినప్పటికీ, నాకు సినిమాల పట్ల ఉన్న ఆసక్తిని అర్థం చేసుకుని మా అమ్మ సమాధానప డింది. మా వాళ్ళంతా నాతో పాటే ఉండిపోయారు. 'పరమానందయ్య శిష్యులు' తర్వాత ప్రతిభావారి 'స్వప్నసుందరి'లో ఒక దేవకన్య వేషం

## జ్ఞాపకాలు

# 'సంసారం' పుష్పలత

వేశాను. నామమాత్రపు వేషమే అయినా ఆ నాటికి అదే గొప్పగా అనిపించింది. పైపెచ్చు నన్ను విపరీతంగా ఆకర్షించిన 'తీయని వెన్నెల రేయి' పాట తార అంజలీదేవిని దగ్గరగా చూసే అవకాశం కలిగిందని పరమానంద పడిపోయాను.

## కథానాయికగా తొలి అవకాశం

అప్పుడే అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి హీరోహీరోయిన్లుగా లక్ష్మీరాజ్యంగారు 'సంసారం' సినిమా ప్రారంభించారు. ఎల్.వి. ప్రసాద్ గారు దర్శకులు. అందులో కొంతమంది కాలేజీ అమ్మాయిలలో నన్నూ ఒకరుగా బుక్ చేసుకున్నారు. మేమంతా కథానాయిక సావిత్రితో కలిసి అక్కినేని గారిని టీజ్ చేస్తూ పాడే పాట ఒకటుంది. నేను చేసిన ఆ పాట రషెస్ చూశాక ఎల్.వి. ప్రసాద్‌గారు అప్పుడు అడయార్‌లో ఉంటున్న మాకు కబురు పంపించారు. వెళ్ళాను. కొన్ని డైలాగ్స్ చెప్పించి డాన్స్ చేయమన్నారు. చేశాను. నాగేశ్వరరావు గారితో ప్రేమగా మాట్లాడుతున్నట్టు యాక్షన్ చేయమన్నారు. నాకు సిగ్గు, భయం అన్నీ ఒకేసారి వచ్చేశాయి. చెయ్యలేనని కచ్చితంగా చెప్పేశాను. అయినా లక్ష్మీరాజ్యంగారు ఒప్పించి, బుజ్జగించి మరీ చేయించారు.

## సావిత్రిని కాదని...

ఇంకేముంది? అంతకుముందు సావిత్రి చేస్తున్న కథానాయిక వేషానికి నన్ను, నేను చేస్తున్న కాలేజీ అమ్మాయి పాత్రకు సావిత్రిని మార్చేశారు. అప్పటివరకూ పావడా పరికిణీలో ఉన్న నాకు గబగబా చీర కట్టేశారు. హీరోయిన్‌వి అన్నారు. ఆ తర్వాత అక్కినేని గారిని ఉడికిస్తూ మేమందరం పాడే 'టక్కుటక్కు టమకులబండి...' అన్న పాటను నేను హీరోయిన్‌గా, సావిత్రి కాలేజీ గర్ల్‌గా షూట్ చేశారు.

'సంసారం' బ్రహ్మాండంగా హిట్టయింది. అంతవరకూ జానపద హీరోగా పేరుపొందిన అక్కినేని గారికి అదే తొలి సాంఘిక చిత్రం. అలా అక్కినేనికి మొదటి సోషల్ పిక్చర్ హీరోయిన్ నేను కావడం నా అదృష్టం. ఆ సినిమా ప్రింటు ఎక్కడా లభ్యం కాకపోవడం నా దురదృష్టం. ఆనాటి ప్రేక్షక హృదయాల్లో ఇప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోయింది 'సంసారం'. అదే చిత్రం నా ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. సుసర్ల దక్షిణామూర్తిగారి స్వరసారథ్యంలో జిక్కీ పాడిన 'కల నిజమాయెగా..' అన్న హుషారు పాట నాకు చాలా మంచిపేరు తెచ్చిపెట్టింది.

## 'విజయా'లో...

ఆ చిత్రం తర్వాత ఎల్వీ ప్రసాద్‌గారే నన్ను 'విజయా'లో పర్మనెంటు ఆర్టిస్టుగా చేర్చారు. మూడేళ్ళు అగ్రిమెంటు. ఆ రోజుల్లో రూ. 2500 జీతం. సంవత్సరానికి 250 రూపాయలు ఇంక్రిమెంటు. అలా 'విజయా'లో నేను 'పెళ్ళిచేసి చూడు' (1952), 'చంద్రహారం' (1954) చిత్రాలు చేశాను. 'పెళ్ళిచేసి చూడు' చిత్రంలో మహంకాళి వెంకయ్య సరసన నటించాను. సూర్యకాంతం కూతురు వేషం. నేనంటే చాలా కోపంగా ఉండేది ఆమె.




ఎందుకంటే 'సంసారం' చిత్రంలో నేనేదో సావిత్రిని తీయించేసి, కథానాయిక వేషం పొందానని ఆవిడ అనుకునేది. 'సంసారం' సమయంలోనే ఎల్.వి. ప్రసాద్‌గారితో ఆ విషయంగా పోట్లాడింది కూడా. 'పెళ్ళిచేసి చూడు' లో 'భయమెందుకే చిట్టి భయమెందుకే', 'ఎవడొస్తాడో చూస్తాగా' అన్న రెండు పాటలు బాగా పాపులరై నాకు మంచిపేరు సంపాదించిపెట్టాయి. 'చంద్రహారం' చిత్రంలో ఋష్యేంద్రమణి కూతురుగా, వెర్రిబాగుల దానిగా చేశాను. ఆ క్యారెక్టర్ అంటే నాకు చాలా ఇష్టం. చాలా టిపికల్ రోల్ అది. ఆ తర్వాత 'ఆడబిడ్డ', 'చెరపకురా చెడేవు' (1955) తదితర సినిమాల్లో చేశాను. 'చెరపకురా చెడేవు' చిత్రంలో రేలంగి గారి సరసన నటించాను. అందులో 'ప్రేమో ప్రేమ' అన్న త్రీ స్టేజస్ సాంగ్ బాగా హిట్టయ్యింది. లైలా మజ్ను, పార్వతీ దేవదాసు, అనార్కలి, సలీం... ఈ మూడు జంటల ప్రేమ.. ఆ ఒక్క పాటలోనే వస్తుంది. ఆయా కాస్ట్యూమ్స్‌లోనే నేను, రేలంగి గారు కన్పించినట్టు గుర్తు.

## ఆ ఛాన్స్‌లు అలా పోయాయి...

ఆనాడు ఇన్‌కంటాక్స్ కట్టిన ఆర్టిస్టులలో నేనొకదాన్ని. షావుకారు జానకి, పద్మనాభం, జోగారావు... ఇన్‌కంటాక్స్ కట్టిన మిగతా ఆర్టిస్టులు. 'సంసారం' సినిమాను 'జెమినీ' అధినేత ఎస్.ఎస్. వాసన్‌గారు తమిళ, హిందీ భాషల్లో తీస్తూ నన్ను హీరోయిన్‌గా వెయ్యమని అడిగారు. అప్పటికే విజయాతో అగ్రిమెంట్‌పై సంతకం చేసేశాను. దానితో వాసన్‌గారు చక్రపాణిగారిని అడిగారు. ఆయన ఒప్పుకుని రద్దుకు ఏర్పాట్లు కూడా చేసేశారు. అయితే ఎల్.వి. ప్రసాద్‌గారు మా ఇంటికొచ్చి ''నిన్ను విజయాలో చేర్చింది నేను. ఇప్పుడు అగ్రిమెంట్ రద్దు చేసుకుంటే నా మాట పోతుంది'' అని పేచీ పెట్టడంతో వాసన్‌గారి 'సంసారం' మానుకున్నాను. ఎందుకంటే ఎల్.వి. ప్రసాద్‌గారు నాకు దైవంతో సమానం.

ఆ తర్వాతే 'చంద్రహారం' చేశాను. విజయాలో ఉండగానే హిందుస్థాన్ ఫిస్టన్స్ అధినేత సి.బి. రాజరత్నం గారితో పెళ్ళి అయింది. 'చంద్రహారం' టైమ్‌కి గర్భవతిగా ఉన్నాను. అదే సమయంలో డి.ఎల్. గారి 'దేవదాసు'లో పార్వతి పాత్రకు నన్ను అనుకున్నారు. అయితే ఆ పాత్ర సావిత్రికి దక్కింది. ఆ సినిమాతో సావిత్రి తారాపథంలోకి దూసుకుపోయింది. ఆ తర్వాత మా వారు సినిమాలు వద్దనడంతో మానేసి నిజం సంసారంలో పడిపోయాను. నాకు ముగ్గురమ్మాయిలు, ఒక అబ్బాయి. వాళ్ళని పెంచడమే సరిపోయింది. ఇప్పుడు అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. మనవళ్ళు, మనవరాళ్ళతో చెన్నైలో ప్రశాంతంగా జీవిస్తున్నాను.

## 'నువ్వే స్ఫూర్తి' అన్న సావిత్రి

సావిత్రి మహానటిగా తారాస్థాయిలో ఉండే రోజుల్లో ఓసారి 'విజయా'లో జరిగిన కార్నివాల్‌లో కన్పించి ''నటిగా నువ్వే నాకు స్ఫూర్తి. ఒకప్పుడు నన్ను హీరోయిన్‌గా తీసేసి ఆ స్థానంలో నిన్ను పెట్టడం నాకు ఉక్రోషం తెప్పించింది. ఎన్ని రోజులు ఒంటరిగా ఏడ్చానో నాకే తెలీదు. నీలాగా చలాకీగా ఎందుకుండలేకపోయానని అద్దం ముందు కూర్చుని గంటల తరబడి ప్రాక్టీసు చేశాను'' అంది. సావిత్రిని తలచుకున్నప్పుడల్లా నాకు ఆ విషయం గుర్తుకొస్తూ ఉంటుంది. సావిత్రి చాలా గొప్ప నటి. ఆవిడ స్థానంలో నేనెలా హీరోయిన్‌నయ్యానో నాకే తెలీదు. ఏదైతేనేం 'సంసారం' పుష్పలతగా పేరు దక్కించుకున్నాను.

**– డా. కంపల్లె రవిచంద్రన్, 98487 20478**





## కురుసార్వభౌముడిగా ...

చిన్నతనంనుండి ఎన్.టి.ఆర్. గారు నటించిన ప్రతి సినిమాని చూసేవాడిని. దుర్యోధన పాత్రలో ఆయన చేసిన మయసభ ఘట్టం నేనెప్పటికీ మర్చిపో లేను. వారి స్ఫూర్తితో నెల్లూరు కె.ఎ.సి. ప్రభుత్వ జూనియర్ కాలేజీ (1990) లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర వార్షికోత్సవంలో ఆ వేషం వేసి తోటి స్టూడెంట్స్, లెక్చరర్స్‌తో 'భళా' అనిపించుకు న్నాను. దానికి గాను పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా కాలేజీ యాజమాన్యం ఇచ్చింది. అది మొదలు ఆ వేషం అప్పుడప్పుడూ వేయడం అలవా టుగా మారింది. ఇప్పటికీ మా ఆఫీసులో ఎవరైనా రిటైర్ అయినప్పుడు ఎంప్లాయీస్ యూనియన్ తర పున ఎన్.టి.ఆర్.గారి పాటలకు అనుగుణంగా స్టెప్స్ వేసి ఆనందింప చేస్తుంటాను.

– కచ్చి వెంకటకృష్ణ,
ఎ.సి. నగర్, నెల్లూరు
సెల్: **99850 59029**

## ఇదీ నేనే !

## బంగారు 'సుబ్బిశెట్టి'

నేను ఏలూరు నగరపాలక సంస్థలో శానిటరీ సూపర్ వైజర్ (మేస్త్రీ) గా పని చేస్తున్నాను. చిన్న తనం నుండి సాంస్కృతిక రంగాలపట్ల మక్కువ ఎక్కువ. అవకాశం వచ్చినప్పుడల్లా సుబ్బిశెట్టి వేషం వేస్తూ ఉండేవాడిని. అప్పుడప్పుడు ఇతర ఊర్లలో కూడా ఈ వేషం కట్టి ప్రేక్షకుల్ని నా జోకులతో, నృత్యాలతో కడుపుబ్బ నవ్వించేవాడిని. నిజమైన 'సుబ్బిశెట్టి'కి మల్లేనే ఉంటానని పలువురు ప్రశంసిం చడం ఎంతో గర్వంగా ఉంటుంది. ఒకసారి ఈ వేషంలో ఉన్న నన్ను మా బంగారు నాగన్న రెల్లి వీధి వారు కూడా గుర్తుపట్టలేకపోవడం విశేషం.

– బంగారు వెంకటేశ్వరరావు
ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా
సెల్: **90324 09622**





**ఇదీ నేనే,** ఆంధ్రజ్యోతి ఆదివారం, ప్లాట్ నెం: 76, రోడ్ నెం: 70, అశ్విని లే అవుట్, హుడా హైట్స్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ – 33 చిరునామాకు పోస్టు ద్వారా గాని, sunday.aj@gmail.com కు మెయిల్ ద్వారా గాని పంపవచ్చు.

## సమ్‌థింగ్ స్పెషల్







# అంతిమ సంస్కారాలు

అందమైన భవంతులు... పొడవాటి స్తంభాలు... ఇటుకలు పేర్చినట్టుండే ఇనుప పెట్టెలు... సముద్ర గర్భంలో నిర్మాణాలు... పచ్చటి పచ్చిక బయళ్ల మధ్య అపురూప కట్టడాలు అన్నీ పర్యాటక ప్రదేశాలే. అయితే అక్కడికెళితే మీరు చూసేది ప్రకృతి రమణీయతనో చారిత్రక కట్టడాలనో కాదు వివిధ దేశాల్లో నిర్మించిన సమాధులు. అవి అమెరికా, బొలీవియా, రుమేనియా, ఐర్లాండ్, చైనా, ఇరాక్, ఫిలిప్పైన్స్, అర్జెంటీనా, ఇంగ్లాండ్ దేశాల్లో వారి వారి సంప్రదాయాన్ని బట్టి సమాధులను ఏర్పాటు చేసుకున్నారు. వీటిలో కొన్ని సమాధులను చూస్తుంటే బ్యాంకు లాకర్స్, మరికొన్నిట్ని చూస్తుంటే అపార్ట్‌మెంట్ జీవితం గుర్తురాక మానదు.

















# నగుమోమే కనరాదే!

ఒకే మనిషే, అనేకముఖాలు. ఒకే మనసే, లోపల ఎన్నో పొరలు. అవి చిత్రించడమే తన పని అనుకున్నారు రాయీస్ అహ్మద్. అందుకు ప్రతిభావంతంగా ఉపయోగపడే క్యూబిస్ట్ చిత్రకళను ఒడిసిపట్టారు . తాను పుట్టి పెరిగిన పాత నగర జీవితాన్నే చిత్రిక పట్టారు. ఒకే రంగులో... ఇదిగో చిన్ని గడ్డంతో ప్రశాంతమైన కళ్లతో ఉన్న ఫకీర్‌ను చూడండి. రంగురంగుల్లో... చిమ్నీ వెలుగులో ఆ మహిళల దైన్యాన్ని, నిష్కాపట్యాన్ని చూడండి. బురఖా ధరించిన స్త్రీలు, ధ్యానంలో మునిగిన ఒక ముసలాయన... వీరంతా ఇళ్లలో, బజార్లలో, టీస్టాళ్లలో పాత నగరమంతా కనిపిస్తుంటారు. వాళ్లే 'బేసికల్లీ హైదరాబాదీ'సోలో ఎగ్జిబిషన్‌లో చిత్రకారుడి చేతుల్లో రంగుబొమ్మలుగా దర్శనమిచ్చారు. బొమ్మలన్నీ ఒకేలా కనిపిస్తాయి, తరచి చూస్తే మాత్రం భిన్నకోణాలు మనలను వెంటాడతాయి. కానీ ఆ చిత్రాల్లో మచ్చుకు ఒక నగుమోమైనా కనిపించలేదంటే అది పాతనగర దుర్భరవాస్తవికతకు నిలువుటద్దమే. లక్ష్మాగౌడ్ రంగులు వేసే పద్ధతి తనకు ప్రేరణ అంటారు రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో ఎన్నో అవార్డులు పొందిన ఈ ఆర్టిస్టు.









